Abtab-e-Alam
(Telugu)

ఒయాసిస్సు

సంకలనం

అబుల్ ఇర్ఫాన్

ముందుమాట

ఒయాసిస్సు ఒక చారిత్రక నవలా రూపంలో ఉన్న సమాజ వర్ణన. ఇస్లాంకు ముందు అరబ్బు దేశంలో ఉన్న సాంప్రదాయాలకు అద్దం పడుతూంది. రాక్షస రూపంలో ఉన్న ప్రజలు మంచి మానవులుగ మార్చిన విషయాలను సాదృశ్యంగ తెలియజేసిన పుస్తకం ఇది.

చదువరులకు ఎంతో ఉపయోగపడగలదని ఆశిస్తూ ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నాం.

తేది: 10.2.2008

అబ్బాదుల్లా
డైరెక్టర్
తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

బయాసిస్సు

నల్లని నింగిలో మిలమిల మెరిసే అందాల తారలు కిలకిల నవ్వుతూ త్వరత్వరగా కనుమరుగయిపోతున్నాయి.

ప్రాక్దిగ్మండలం నుండి పైపైకి ఉబికి వస్తున్న ఉషశ్రీ కాంతి బాణాలతో చీకటి తెరలను చీల్చి చెండాడుతుంటే చల్లని మలయ మారుతం మంద హాసం చేస్తూ యావత్ ప్రకృతిని గిలిగింతలు పెడ్తోంది.

నేలపై వందల మైళ్ళ విస్తీర్ణంలో తెల్లని పట్టు పాన్పు పరచబడినట్లు కనిపిస్తున్న ఇసుక రేణువులు విచిత్ర కాంతులీనుతున్నాయి. ఆ ఇసుక రేణువులు తుషార బిందువులతో తడిసి నేల తల్లికి మరింత శోభ చేకూర్చు తున్నాయి.

అది సాధారణ ఇసుక నేల కాదు. ఎటు చూసినా ఓ చెట్టయినా లేకుండా మహా సముద్రంలా కనిపిస్తున్న భయంకర ఎడారి ప్రాంతమది! ఇసుక కెరటాల ఎడారి సముద్రం!! అందులోని పెనుకొండల వంటి ఇసుక తిన్నెల మధ్య కొన్ని ఎడారి ఓడలు చల్లని పిల్ల తెమ్మెరలకు పులకరిస్తూ, చకచకా ముందుకు సాగిపోతున్నాయి.

చీకటి పరదాలు పూర్తిగా తొలగక ముందే ఆ రోజు మక్కా పట్టణం మేల్కొన్నది. పక్షులు రెక్కలు టపటప లాడిస్తూ తమ తమ గూళ్ళ నుంచి బయటికి తరలిపోతున్నాయి. ఆకాశం అంతకంతకు నిర్మలమయిపోతూ బాలభానుడి మార్గాన్ని సుగమం చేయసాగింది. అప్పుడు పట్టణంలో ఎక్క డ్నుంచో సుమధురమయిన ఓ సన్నని వాయిద్య సంగీతం ప్రజల కర్ణపుటాలకు తాకింది. ఆ ధ్వని క్రమంగా అధికమవుతూ వీధి వీధినా వినిపించసాగింది.

ప్రజలు ఆ వాయిద్య ధ్వని విని ఆదరాబాదరాగా కాల కృత్యాలు తీర్చు కొని ఇళ్ళల్లో నుంచి వీధుల్లోకి వచ్చారు. వారు అమితోత్సాహంతో గుంపులు

గుంపులుగా కాబా గృహం వైపుకు దూసుకుపోతున్నారు. స్త్రీలు, పిల్లలు కూడా కొత్తకొత్త బట్టలు ధరించి ఆనంద పారవశ్యంతో ఊగిపోతూ కాబా వైపుకు వడివడిగా నడచిపోతున్నారు. వాయిద్యం ఇంకా మోగుతూనే ఉంది.

కొన్ని క్షణాల్లోనే ఆబాల గోపాలం కాబా గృహానికి చేరుకుంది. అయితే కాబాగృహం తలుపులు ఇంకా మూసే ఉన్నాయి కాబా ధర్మకర్త ఇంకా రాలేదు కాబోలు. దైవ ప్రార్థన కోసం వచ్చిన ప్రజలు అసహనంతో ఆయన కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు తలుపులు తెరుస్తారా, ఎప్పుడు లోపలికి ప్రవేశించి తమ తమ దేవతలను తనివితీరా దర్శించుకొని తరిద్దామా అన్నట్లు భక్తులు దైవ దర్శనం కోసం తహతహలాడిపోతున్నారు.

అంతలో ఓ ఆజానుబాహువుడు రాజఠీవితో నడచి వచ్చి కాబా గృహం ప్రధాన ద్వారం తెరిచాడు. ఆయనే కాబా ధర్మకర్త. ధర్మకర్తే కాదు, మొత్తం మక్కా ప్రజలకే అగ్రనాయకుడు. ఖురైష్ తెగలో అందరికన్నా ఆయనే శ్రేష్ఠుడిగా పరిగణించబడిన నాయకుడు. ఆయన పేరు అబూతాలిబ్. అంతకు ముందు అబ్దుల్ ముత్తలిబ్ కాబా ధర్మకర్తగా ఖురైష్ అగ్రనాయకుడిగా ఉండేవాడు. ఆయన మరణానంతరం ఖురైష్ తెగ ప్రజలు అబూ తాలిబ్‌ని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు.

ఆనాడు అరబ్బుల సంప్రదాయం ప్రకారం గొప్ప రాజనీతి దురంధరుడు, యోధానయోధుడు, గొప్ప కవి, ప్రజ్ఞాశాలి అయిన వ్యక్తికే ఈ నాయకత్వం లభిస్తుంది. ఈ లక్షణాలన్నీ అబూతాలిబ్‌లో ఉన్నాయి. అందుకే ఆయన నాయకుడు కాగలిగారు. ఆయన ఠీవి, దర్పం, గాంభీర్యాలను చూసి ఏ ఒక్కరూ ఆయన ముందు నిల్చొని మాట్లాడేందుకు సాహసించేవారు కాదు. అదీగాక ఆయన కాబా ధర్మకర్త కూడా అయినందున ప్రజలు ఆయన పట్ల అమిత గౌరవ భావంతో ప్రవర్తించేవారు. ఆయన వచ్చి తలుపులు తెరచి కాబా గృహంలో ప్రవేశించనంతవరకూ ఎవరూ అందులో ప్రవేశించేవారు కాదు.

అరేబియాలోని అన్ని తెగల వారు వచ్చిన తరువాత, అబూ తాలిబ్ తన తమ్ముళ్ళు హమ్‌జా, అబ్బాస్‌లను వెంటబెట్టుకొని కాబా ప్రధాన ద్వారం తెరవగానే ముందుగా ఆయనే కాబా మందిరంలో అడుగు పెట్టారు. తరువాత

ఆయన తమ్ముళ్ళు లోనికి ప్రవేశించారు. ఆ తరువాత ఖురైష్ తెగ ప్రజలు ప్రవేశించారు. అబూతాలిబ్ లోపలికి ప్రవేశించి అన్ని తెరవమని ఆజ్ఞాపించారు. ఈ ఆజ్ఞ జారీకాగానే తలుపులన్నీ తెరచుకున్నాయి. ఆ మరుక్షణమే వివిధ తెగలకు చెందిన ప్రజలు నలువైపుల నుంచి బిలబిలా కాబా గృహంలోకి ప్రవేశించారు.

ఆరోజు అరబ్బుల పండుగ. అందుకే ప్రజలు తెల్లవారేటప్పటికీ కాబా గృహానికి చేరుకున్నారు. కాబా గృహం చతురస్రాకారంలో ఉంది. దాని చుట్టూ నాల్గు వైపులా నల్లటి పరదాలు వ్రేలాడ బడి ఉన్నాయి. కప్పుపై భయంకరా కారంలో ఓ పెద్ద నల్లరాతి విగ్రహం ఉంది. దాని పేరు హబల్. ప్రతి తెగ వాళ్ళూ ఈ విగ్రహాన్ని తప్పని సరిగా పూజించవలసి ఉంటుంది.

కొంచెం దూరంలో ఒక చిన్న బావి ఉంది. దీన్ని జమ్‌జమ్ నుయ్యి అంటారు. ఈ నూతికి రెండు ప్రక్కల రెండు పెద్ద విగ్రహాలు ఉన్నాయి. అందులో ఒకటి అత్యంత సౌందర్యవతి అయిన ఓ స్త్రీ విగ్రహం. దాని పేరు నాయలా. అప్పుడే దివి నుంచి దిగి వచ్చిన దేవత కన్య ఎవరో అక్కడనిల్చొని చిరునవ్వులు చిందిస్తున్నట్లు కనిపిస్తోందా విగ్రహం. నూతికి రెండో వైపున కండలు తిరిగిన ఓ పురుషుని విగ్రహం ఉంది. దాని పేరు అసాఫ్. ప్రత్యర్థిని చిత్తుచేసి విజయగర్వంతో వికటాట్టహాసం చేస్తున్న మల్లయోధుడిలా ఉందా విగ్రహం. యావత్తు అరబ్బులు ఈ రెండు విగ్రహా లను కూడా ఎంతో గౌర విస్తారు. ఈ విగ్రహాల దగ్గరికి రాగానే ప్రతి వ్యక్తీ సాష్టాంగపడతాడు.

ఇవిగాక కాబా గృహంలో ఇంకా అనేక విగ్రహాలు ఉన్నాయి. మొత్తం మూడొందల అరవై విగ్రహాలు ఉన్నాయి. ఇవన్నీ వివిధ చోట్ల ప్రతిష్ఠించబడి ఉన్నాయి. చిత్రవిచిత్ర ఆకారాల్లో ఇవి చెక్కబడి ఉన్నాయి. ఒక విగ్రహం పాల రాతితో చెక్కబడి, అందమయిన స్త్రీ ఆకారంలో ఉంది. ఓ అత్యంత సౌందర్య రాసి అప్పుడే స్నానం చేసొచ్చి తన పొడవైన శిరోజాలను ఎండలో ఆరబెట్టుకోవ డానికి, వాటిని భుజాల మీద నుంచి పిరుదుల దాకా పరచుకొని నిల్చున్నట్లు ఉందా విగ్రహం. దాని పేరు సౌర. దాన్ని హుజైల్ తెగ ప్రజలు ఆరాధిస్తారు. ఆ తెగవాళ్ళు కాబాలో ప్రవేశించగానే దాని ముందు సాష్టాంగపడ్డారు.

మరోచోట ఎర్రరాతితో చెక్కబడిన విగ్రహం ఉంది. దాని తల, ముఖం పెద్దపులి ఆకారంలో, మిగతా దేహం మానవాకారంలో ఉన్నాయి. అది ఎత్తయిన ఒక అరుగుపై ప్రతిష్ఠించబడి, మీదికి లంఘించబోతున్నట్లు భయంకరంగా ఉంది. వేరొ విగ్రహం బూడిద రంగు రాతితో చెక్కబడి ఉంది. ఇది పూర్తిగా గుర్రం ఆకారంలో ఉంది. విశాలమయిన ఓ నల్లరాతి అరుగుపై పరుగెత్తడానికి సిద్ధంగా ఉన్న పందెపు గుర్రంలా ఉందీ విగ్రహం. దాని పేరు యావిఖ్. దాన్ని హమ్దాన్ తెగవాళ్ళు పూజిస్తారు.

గాడిద ఆకారంలో మరో విగ్రహం ఉంది. నల్లరాతితో చెక్కబడి, పాలరాతి అరుగుపై ప్రతిష్ఠించబడి ఉన్న ఈ విగ్రహం పొడవైన ముట్టెతో చాలా భయానకంగా ఉంది. పైగా దానికి రాకాసి పక్షికుండేలా పెద్దపెద్ద రెక్కలు కూడా ఉన్నాయి. రెక్కలు విప్పారి ఆకాశంలోకి దూసుకుపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు నిలబడి ఉంది. ఈ విగ్రహం పేరు నసర్. దీన్ని జిల్‌కలా తెగవాళ్ళు పూజిస్తారు. ఇలా ఎన్నో విగ్రహాలు వివిధ ఆకారాల్లో వివిధ చోట్ల ప్రతిష్ఠించబడి ఉన్నాయి.

దాదాపు ప్రతి విగ్రహం రాతి అరుగుపై ప్రతిష్ఠించబడి ఉంది. ప్రతి విగ్రహం ముందూ దాని పూజారి కూర్చొని ఉన్నాడు. ప్రతి తెగవాళ్ళు తమతమ విగ్రహాల దగ్గరకు చేరుకొని, పళ్ళు ఫలహారాలతో నైవేద్యం సమర్పించుకొని, వాటి ముందు ఎంతో భక్తి శ్రద్ధలతో సాగిలపడుతున్నారు. వాయిద్యం ఇంకా మోగుతూనే ఉంది. అందరూ పారవశ్యంతో ఊగిపోతున్నారు.

అబూతాలిబ్, హమ్జా, అబ్బాస్‌లు గర్భగుడిపైకెక్కి అక్కడున్న హుబల్ విగ్రహం ముందు సాష్టాంగపడ్డారు. ఇతర భక్తులు నిశ్శబ్దంగా తమతమ దేవతా విగ్రహాలకు పూజలు చేసుకోవడంలో లీనమయిపోయారు. కాబా గృహం భక్తులతో నిండిపోయింది. ఎటుచూసినా విగ్రహాలే! ఎక్కడ చూసినా పూజా నైవేద్యాలు చేస్తున్న భక్త బృందాలే!!

అప్పటికి సూర్యుడు ఉదయించి బారెడు పైకి వచ్చేశాడు. ఎండ నలు వైపులా వ్యాపించిపోయింది. కాని ఆ ఎండలో ప్రతిరోజూ కన్పించేవాడి, వేడి కనిపించడం లేదు. పైగా ఆ రోజు ఎందుకో సూర్యకాంతి క్షణక్షణానికి మంద

గిస్తూ పోసాగింది. విగ్రహాల ముందు సాగిలబడిన భక్తులు మెల్లిగా పైకిలేచి, చేతులు కట్టుకొని, చూపులు కిందికి దించుకొని మౌనంగా నిలబడ్డారు. వారు విగ్రహాలను అమితమయిన భక్తి శ్రద్ధలతో కొలిచేవారు. ఆ విగ్రహాలకు భయపడి వాటివైపు కళ్ళు పూర్తిగా తెరచి చూడటానిక్కూడా సాహసించేవారు కాదు. పూజారులు వివిధ నమ్మకాలు నూరిపోస్తూ వాళ్ళను మరింత బెదర గొట్టేవారు. అందుకే వారు ఏం చేస్తే ఏం అపచారం జరుగు తుందోనని, దాని వల్ల ఏం కీడు వచ్చి పడుతుందోనని భయపడి పోయి పూజారులు చెప్పే ఏ ఒక్క మాటను కూడా జవదాటేవారు కాదు.

ఇలా ఈ భక్తజనం చూపులు కిందికి దించుకొని ఎంతో భక్తి ప్రపత్తు లతో నిలబడి పూజారులు ఇచ్చే తదుపరి ఆదేశం కోసం ఎదురుచూడ సాగారు. అంతలో రివ్వుమని గాలులు వీచనారంభించాయి. ఈ హఠాత్పరిణా మానికి భక్తులు బిత్తరపోయి, తలలు పైకెత్తి ఆకాశం కేసి చూశారు. ఆకాశం క్రమంగా ఎర్రబారుతోంది. మరి కాస్సేపటికి ఆకాశమంతా రక్తంలా ఎర్రగా మారి పోయింది.

అది చూసి ప్రజలు అదిరిపడ్డారు. ఆశ్చర్యం, ఆందోళనలు మేళవించిన చూపులతో వారు ఆకాశంవైపే తదేకంగా చూస్తున్నారు. అలా చూస్తుండగానే ఆకాశం ఎరుపు రంగు నుంచి నలుపు రంగులోకి మారిపోవడం ప్రారంభిం చింది, దాంతోపాటు నాలుగు దిక్కుల నుంచి చీకట్లు కమ్ముకోసాగాయి సూర్యుడు పూర్తిగా కనుమరుగయి పోయాడు. కొన్ని క్షణాల్లోనే ఆకాశం దట్ట మైన పొగచూరినట్లు నల్లగా మారిపోయింది. వాతావరణం అంతకంతకు భయానకంగా తయారవుతోంది. ఈ దృశ్యం చూసి ప్రజలు తీవ్రంగా భయపడి పోయారు. పూజారులు కూడా పరిస్థితి ఏమిటో అర్థంగాక భయపడిపోయారు. అందరూ ఓసారి అదరుతున్న గుండెలతో తమతమ దేవతల ముందు సాష్టాం గంలో పడిపోయారు.

ఎప్పుడూలేని ఈ వైపరీత్యం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. పూజారులు మంత్రోచ్చారణ చేస్తూ దేవతలను శాంతింపజేయడానికి శత విధాలా ప్రయత్నించసాగారు. కాని వాతావరణంలో ఏ మాత్రం మార్పు కనిపిం

చడం లేదు. సరికదా అది మరింత భయంకరంగా తయారవుతూ పోతుంది. గాలి విపరీతమయిన వేగంతో వీస్తోంది. కారు మబ్బులతో ఆకాశం మరింత నల్లగా మారిపోయింది. ఈ ఆపద నుంచి గట్టెక్కించమని, భక్తులతో దీనంగా విలపిస్తూ దేవతలను వేడుకోవాలని పూజారులు ఆదేశం జారీచేశారు.

ఇదేదో పెద్ద కీడునే సూచిస్తోంది. లేకపోతే పూజారులు ఇలా ఆదేశించరు. అందుకే భక్తజనం ఏడ్పులు, పెడబొబ్బలు పెడ్తూ దేవతలను వేడుకోసాగారు. పూజారులు కూడా ఏడ్వసాగారు. కొందరయితే తమ దేవతా విగ్రహాలను చుట్టేసుకొని, ఈ ఆపద నుండి రక్షించమని ప్రార్థిస్తూ కంటికి మింటికి ఏకధారగా విలపించసాగారు. మరికొందరు హృదయ విదారకంగా గుండెలు బాదుకోసాగారు. తుఫాను గాలి ఈసారి మరింత ఉగ్రరూపం దాల్చి ఉధృతంగా వీచడం మొదలెట్టింది.

ప్రజల్లో తీవ్రమయిన భీతావహం నెలకొన్నది. అరుపులు కేకలతో కాబా మందిరం ప్రతిధ్వనిస్తోంది. గాలి వేగానికి నేల మీద పాదాలు నిలపడం కష్టమయిపోయింది. కొందరు గాలివాటుకు ఎగిరి కింద పడసాగారు. ఆలయంలోని పెద్ద పెద్ద స్తంభాలు, దూలాలు సయితం ఊగిపోతున్నాయి. నలువైపులా దట్టమయిన చీకట్లు అలుముకున్నాయి. ఎవరు ఎక్కడున్నారో కళ్ళుచించుకున్నా కానరావడం లేదు. గాలులు ప్రచండ వేగంతో వీస్తూ ఇసుక రేణువుల్ని కూడా తెచ్చి పడవేస్తున్నాయి. ఈ తుఫాను తాకిడికి ఇక ఎవరూ తట్టుకోలేరన్నట్లు వాతావరణం అతి భయంకరంగా తయారయింది.

గర్భ గుడిపై హుబల్ విగ్రహం ముందు నిల్చున్న అబూతాలిబ్, అతని తమ్ముళ్ళు బలమయిన ఓ గాలి వూపుకు వేదిక పైనుంచి కింద పడిపోయారు. అబూలహబ్ అయితే గర్భగుడి కప్పుపై నుంచి దభీమని నేల మీద పడిపోయారు. ఆ దెబ్బకు అతను, చచ్చాన్రా బాబోయ్! అంటూ ఓ పెద్ద గావుకేక పెట్టాడు. అతని గావుకేక తుఫాను హోరులో ఎవరికీ వినిపించలేదు.

మక్కావాసులపై దేవుని ఆగ్రహం విరుచుకు పడింది. దైవదూతలు దేవుని ఆదేశంతో గాలి తలుపులన్నీ తెరచి పెట్టారు. తుఫాను గాలి ఘడియ ఘడియకూ ఉధృతమవుతూ ఇళ్ళను, గుళ్ళను ఊపేస్తోంది. ఇసుక దుమారం

సుడులు తిరుగుతూ మనుషుల మీద వచ్చి పడుతోంది. పట్టణ మంతటా గాఢాంధకారంతో అలుముకున్నది. స్త్రీలు పిల్లలు, వృద్ధులు కేకలు, పెడబొబ్బలు పెడ్తున్నారు. వారు తమ దేవతల ముందు సాగిలబడి, దీనాతి దీనంగా విలపిస్తూ వేడుకుంటున్నారు.

కాని ఆ దేవతలు వారి మొరలను ఆలకించే సూచనలు కనిపించడం లేదు. అయినా ఆ రాతి విగ్రహాలకు వారి మొరలు ఎలా వినిపిస్తాయి? అవి ఈరోజు తమ భక్తులను ఆదుకునే స్థితిలో లేవు. ఇండ్లలోని పూజా గదుల్లో నిల బెట్టిన విగ్రహాలయితే గాలి తాకిడి వల్ల మాటిమాటికి బోర్లాపడి పోతున్నాయి. కాబా గృహంలో ప్రతిష్ఠించబడిన విగ్రహాలు కళ్ళప్పగించి మౌనంగా చూడటం తప్ప భక్తులకు ఎలాంటి సహాయం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండి పోయాయి. ప్రజలు భయాందోళనలతో వణికిపోతూ ప్రళయం వచ్చి పడిందని చెప్పుకోసాగారు.

ప్రళయం అంటే చిరు ప్రళయం కాదు, మహా ప్రళయం! యావత్తు విశ్వాన్ని ఛిన్నాభిన్నం చేసే భీకర ప్రళయం!! ఇక సర్వనాశనం తప్పదు. మిన్ను విరిగి మీద పడిపోయే సమయం ఆసన్నమయింది. భూమి బ్రద్దలయిపోయే ప్రమాదం ముంచుకొచ్చింది. సముద్రాలు పొంగిపొరలే దుస్థితి దాపురించింది. ఈ ఆలోచన రాగానే ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకొని అటూఇటూ పరుగెత్తసాగారు. వారి గుండెలు వేగంగా కొట్టుకుంటు న్నాయి. దిక్కుతోచని స్థితిలో పడిపోయి హృదయవిదారకంగా పెడబొబ్బలు పెడ్తున్నారు.

ప్రజల దీనావస్థ పట్ల విశ్వప్రభువుకు దయ కలిగింది కాబోలు. కాస్సేపటికి తుఫాను ఉధృతం తగ్గుముఖం పట్టింది. చీకటి తెరలు మెల్ల మెల్లగా విడిపోసాగాయి. మరి కాస్సేపటికి తుఫాను గాలి పూర్తిగా శాంతిం చింది. ఆకాశంలో కారుమేఘాలు తొలగిపోనారంభించాయి. సూర్యుడు మబ్బుల చాటు నుండి బయటపడి మళ్ళీ ప్రకాశించడం ప్రారంభించాడు. అది చూసి ప్రజలు చల్లగా ఊపిరి పీల్చుకున్నారు. వారి భయాందోళనలు దూరమయిపోయాయి.

కాబా గృహంలో భక్తులు లేచి నిలబడ్డారు. మాడిపోయిన వారి ముఖాల్లో ఇప్పుడు కాస్తంత కళ వచ్చింది. అదురుతున్న వారి గుండెలు

మామూలు స్థితికి వచ్చాయి. అయితే వాతావరణం ఇంకా కాస్తంత మసక మసగ్గానే ఉంది. ప్రజలు తుఫాను దెబ్బ నుండి ఇప్పుడిప్పుడే కాస్త తేరుకుంటున్నారు. అంతలో పడమటి దిక్కున తళుక్కుమని విచిత్రమయిన ఓ మెరుపు మెరిసింది. ఆ విచిత్ర మెరుపు చూసి ప్రజలు నిర్ఘాంతపోయారు. ఇదివరకెప్పుడూ వారు అలాంటి మెరుపు చూసి ఉండలేదు. అందుకే వారు మరోసారి ఆశ్చర్యంతోపాటు ఆందోళన వెలిబుచ్చారు.

భక్తులు ఆశ్చర్యం నుంచి ఇంకా తేరుకోకముందే బిగ్గరగా ఓ కంఠధ్వని వినిపించింది. "అరబ్బులారా! మీరొక మెరుపుని చూశారు కదా ఇప్పుడు. రండి, ఆ మెరుపుకు కారణం ఏమిటో చెప్తాను" అన్నాడో వ్యక్తి భక్తజనాన్ని పిలుస్తూ.

ఈ మాటలు వినగానే భక్తులంతా అతని దగ్గరికి చేరుకున్నారు. అతనేం చెప్పబోతున్నాడో అంటూ జనం పరస్పరం గుసగుసలాడుకోసాగారు. ఆ వ్యక్తి ఓ ఎత్తయిన అరుగు మీదికెక్కి "అందరూ నిశ్శబ్దంగా ఉండండి. నా హీన కంఠ స్వరం మీ అందరికీ వినిపించే అంత నిశ్శబ్దంగా ఉండండి" అని అన్నాడు.

జనం గుసగుసలు మానేసి మౌనంగా ఉండిపోయారు. ప్రతి వ్యక్తీ ఆ మనిషి ఏం చెప్పబోతున్నాడోనని కుతూహలంతో అతని వైపే కన్నార్పకుండా చూడసాగారు. అంతలో అబూతాలిబ్, అతని తమ్ముళ్ళు కూడా గర్భగుడి కప్పుపై నుంచి కిందికి దిగి, అక్కడికి చేరుకున్నారు. గర్భగుడిపై నుంచి గాలి తాకిడికి క్రిందపడి, కాళ్ళు విరగ్గొట్టుకున్న అబూలహబ్ కూడా కుంటు కుంటూ అక్కడికి వచ్చేశాడు. జనమంతా ఆ మనిషి చుట్టూమూగి, అతను చెప్పే మాటలు వినడానికి ఊపిరి బిగబట్టి నిలబడ్డారు అంతా నిశ్శబ్దం! చీమ చిటుక్కుమన్నా విని పించేటంత నిశ్శబ్దం రాజ్యమేల సాగింది.

ఆ మనిషి డెబ్భై ఏళ్ళకు బడ్డ ఓ వృద్ధుడు. అతని రూపు రేఖలు చిత్రవిచిత్రంగా ఉన్నాయి. పొడవైన ముఖంతో బుగ్గలు సొట్టబోయి, దవడలు పైకి ఉబికి వచ్చి ఉన్నాయి. కుంచించుకుపోయిన నుదురు, ఆ నుదుటి కింద లోపలికి పీక్కుపోయి ఉన్న చిన్న కళ్ళు. ఆ కళ్ళ కిందనల్లటి అర్ధ చంద్రాకారపు చారలు, ముగ్గుబుట్టలాంటి తెల్లని తల. తైల సంస్కారం లేని ఆ తల వెంట్రుకలు ఉంగరాలు చుట్టుకొని ఎదురు రొమ్ము మీద చిందరవందరగా పడి

వున్నాయి. జనపనారలాంటి తెల్లటి గడ్డం బొడ్డు దాకా పొడవుగా ఉంది. మీసాలు గడ్డపు వెంట్రుకలతో కలసిపోయి ఉన్నాయి. శుష్కించిపోయిన లావాటి పెదాలు గడ్డం, మీసాల మధ్య నుంచి తొంగి చూస్తున్నాయి.

అతని మెడలో ఓ పొడవైన ఎముకల దండవేలాడుతోంది. ఎడమ చేతిలో ఓ మానవ కపాలం ఉంది. కుడిచేతిలో మానవ చేతి ఎముక ఉంది. అతను వేసుకున్న దుస్తులు కూడా విచిత్రంగా ఉన్నాయి. మోకాళ్ళ కిందిదాకా వేలాడుతున్న పొడవైన చొక్కాధరించాడు. చొక్కా కిందిభాగం ఒంటెతోలుతో, నడుంభాగం ఒంటెబొచ్చుతో ఉంది. తలకు చినిగిపోయిన ఓ నల్లకంబళీ పేలిక చుట్టుకొని ఉన్నాడు. కళ్ళు చిన్న నిప్పుకణాల్లా ఎర్రగా మెరిసి పోతున్నాయి.

ఆ వృద్ధుని పేరు అబ్రష్. అతను యావత్తు అరేబియాలో పేరుమోసిన ఓ గొప్ప మాంత్రికుడు. అంతేగాదు, అతను భవిష్యత్తులో జరగబోయే విషయాలు కూడా చెప్తాడని ప్రతీతి. అందువల్ల ప్రజలు అతడ్ని ఎంతగానో గౌరవిస్తూ అతని భవిష్యత్ ప్రకటనలు వినడానికి మహా ఉబలాట పడు తుంటారు. అతని భయంకర రూపం చూసి ఏ ఒక్కరూ అతని మాటలకు ఎదురు చెప్పడానికి సాహసించేవారు కాదు.

అబ్రష్ నిప్పుకణాల్లాంటి ఎర్రటి కళ్ళతో ఓసారి చుట్టూ కలియ జూశాడు. ప్రజలు నిశ్శబ్దంగా నిలబడి కన్నార్పకుండా అతనివైపే చూడసాగారు.

"లాత్, హుబల్ దేవతలను పూజించే ప్రజలారా! బహుశా మీకు గుర్తుండే ఉంటుంది. నేటికి ఖచ్చితంగా నలభై యేళ్లకు పూర్వం కూడా మన పట్టణంలో ఇలాంటి వెలుగే, ఇలాంటి మెరుపే కన్పించింది. ఈ రోజులాగే ఆ రోజుకూడా మీరు దాన్ని చూసి ఆశ్చర్యపోయారు. అదేమిటని మీరు నన్ను అడిగారు. కాని నేనప్పుడు సమాధానం చెప్పకుండా మౌనం వహించాను. ఆరోజు మెరుపుకు కారణం ఏమిటో నాకు తెలిసినప్పటికీ నేను దాన్ని బయట పెట్టదలచుకోలేదు. ఈరోజు కనపడిన మెరుపుకు కారణం ఏమిటో మీరు అడక్కపోయినా నేనే స్వయంగా చెప్పదలచుకున్నాను. జాగ్రత్తగా వినండి" అన్నాడు అబ్రష్.

అప్పుడు జనం మరింత శ్రద్ధతో అతని మాటలు ఆలకించడానికి ఉత్సాహపడ్డారు.

"చూడండి. నా ఎడమ చేతిలో మానవ కపాలం ఉంది. కుడిచేతిలో మణికట్టు ఎముక ఉంది. నాకీ రెండూ బనూబకర్, బనూసాల్ తెగలమధ్య నలభై ఏళ్ళపాటు నిరంతరాయంగా భయంకర యుద్ధం జరిగిన ప్రదేశంలో దొరికాయి. ప్రపంచం దీన్ని అజ్ఞానం, అనాగరికతల కారణంగా జరిగిన యుద్ధం అని భావించవచ్చు. కాని ఈ యుద్ధం అజ్ఞానం, అనాగరికతల పర్యవసానం కాదని, ఆత్మాభిమానం, గౌరవ ప్రతిష్టల కోసం జరిగిన పోరాట మని అరబ్బులకు బాగా తెలుసు. ఆత్మాభిమానం మంటకలిసి పోవడాన్ని ఏ అరబ్బు అయినా సహించగలడా? నా దృష్టిలో మాత్రం పౌరుషం, ఆత్మాభిమానంలేని వాడు అసలు మనిషేకాదు. కనుక అరబ్బులారా! వినండి ఈ కపాలం నాకు భవిష్యత్తులో జరిగే విషయాలను తెలియజేసింది. అతి త్వరలో ప్రపంచంలో ఓ గొప్ప విప్లవం రాబోతున్నది. చిల్లర దేవుళ్ళంతా చిత్తయి పోతారు. ఘోరమైన అపచారం జరగనున్నది. అలాంటి పరిస్థితిలో మీ కర్తవ్యం ఏమిటి? మీరు మీ దేవుళ్ళ పట్ల ఏదైనా అపచారం జరిగితే సహించగలరా?" అన్నాడు అబ్రష్.

"సహించం, ఎన్నటికీ సహించము. ఎట్టి పరిస్థితిలో కూడా సహించము" అన్నారు జనం ముక్తకంఠంతో.

కాలికి దెబ్బ తగిలిన అబూలహబ్ సరిగా నిలబడలేక, హమ్జాభుజం మీద చెయ్యి పెట్టి నిల్చుని "ఎవడు మా దేవుళ్ళ పట్ల అపచారం తలపెట్టే వాడు? మేము వాడి తల చితగ్గొట్టేస్తాం. మేము ప్రాణాలైనా విడుస్తాం కాని మా దేవుళ్ళ పట్ల అపచారాన్నిమటుకు ఎన్నటికీ సహించము" అంటూ గర్జించాడు.

"పౌరుషంగల అరబ్బులంటే ఇలాగే ఉంటారు, ఇలాగే ఉండాలి కూడా! మనం మన తాతముత్తాతలు పూజిస్తూ వస్తున్న ఈ దేవతలకు అపచారం జరిగితే, ఆ అపచారాన్ని సహించే అంతనీచులమా మనం? కాదు. ఎన్నటికీ కాదు. అభిమానంగల అరబ్బులారా! వినండి. ఈ రోజు కనిపించినట్లే నలభై ఏళ్ళ క్రితం కూడా ఓ మెరుపు కనిపించింది. అదొక భయంకరమైన కాళరాత్రి. ఆ రాత్రిన మన మహాదేవుడు హుబల్ బోర్లాపడి పోయాడు. మన

మంతా ఆయన విగ్రహాన్ని లేపి నిలబెట్టడానికి ఎంత ప్రయత్నించినా నిలబడ లేకపోయింది. మళ్ళీ మళ్ళీ కిందపడిపోయేది. ఆ సంఘటన మీకందరికీ గుర్తుండే ఉంటుంది" అన్నాడు అబ్రష్.

"గుర్తుంది, గుర్తుంది. ఇప్పటికీ ఆ దృశ్యం నా కళ్ళముందు మెదలు తోంది. ఆ రోజు రాత్రి ఆకాశంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నో నక్షత్రాలు రాలి పడ్డాయి. కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతి కనిపించింది. ఆ రాత్రి తెల్లవారు జామున మన హుబల్ దేవుడు బోర్లాపడిపోయాడు. మనం ఆయన్ని పైకి లేపి నిలబెడ్తే వణికిపోతూ కిందపడ్డాడు. ఇలా ఒకసారి కాదు, మూడుసార్లు జరిగింది" అన్నాడు అబూలహబ్ గతాన్ని నెమరు వేసుకుంటూ.

"అయితే వినండి. సరిగ్గా ఆ రాత్రే తెల్లవారుజామున మన దేవతలకు అపచారం తలపెట్టే ఓ మానవుడు మన పట్టణంలో జన్మించాడు. ఈ రోజు అతని వయస్సు పూర్తిగా నలభై ఏళ్ళు అయ్యింది. నిన్నటి దాకా అతని పేరు, ఊరు లేని వాడిలా మౌనంగా ఉన్నాడు. ఈ రోజు నుంచి అతను ప్రజల ముందుకు వస్తాడు. విగ్రహాలకు వ్యతిరేకంగా మాట్లాడటం ప్రారంభిస్తాడు. విగ్రహపూజను ఖండిస్తాడు. ఏకేశ్వరుణ్ణే ఆరాధించాలని బోధిస్తాడు. అతను మనల్నుండి మన దేవతలను కూడా దూరం చేస్తాడు. కన్పించని దేవుణ్ణి పూజించాలని ప్రచారం చేస్తాడు. చివరికి యావత్తు అరబ్బులు అతని ప్రచార వలలో పడిపోతారు. ఈ విషయాలన్ని నాకు నాచేతిలో ఉన్న ఈ పుర్రె చెబు తోంది. అయ్యయ్యో! ఎలాంటి వినాశకాలం దాపురించబోతున్నది మనకు!!" అంటూ అబ్రష్ కంట తడిపెట్టాడు.

అతడ్ని చూసి ప్రజలు కూడా కంటతడి పెట్టారు. అందరిపై ఒక విధమైన భయం ఆవరించింది.

"హుబల్ సాక్షి! కన్పించని దేవుడ్ని ముందు సాష్టాంగపడే ప్రతివాడ్ని నేను హతమార్చివేస్తాను." అబూలహబ్ అసహనంతో అరిచాడు.

"నువ్వలా చేయగలిగితే బాగానే ఉంటుంది. కాని నువ్వలా చేయ లేవని ఈ కపాలం అంటోంది. నీవు నీకళ్ళారా మన దేవతల అపచారాన్ని చూడవలసివస్తుంది" అన్నాడు అబ్రష్.

"అయితే ఈ బెడద దూరమయ్యేదారే లేదా?" హమ్జా అడిగాడు.

"లేకేమి, ఉంది. కాని ముందుగా మన తెగలన్నీ పరస్పర విరోధాలు మానివేసి ఏకం కావాలి. అందరూ పాలలో నీరులా కలసిపోవాలి. ఆ తరువాత ఏకేశ్వరుడ్ని ఆరాధించే వ్యక్తి ఎలాంటి వాడైనా, ఏ తెగకు చెందిన వాడైనా సరే, అతడ్ని గట్టిగా వ్యతిరేకిస్తామని, ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాపిస్తామని, అవసరమైతే అతడ్ని చంపివేయడానికైనా వెనకాడమని మీరంతా ప్రతిజ్ఞ చేయాలి" అన్నాడు అబ్రష్.

ఈ మాటలు వినగానే జనంలో రక్తం ఉడికిపోయింది. అందరూ తమ తమ దేవతల పేర్లను ఉచ్చరించి, వాటిని అవమానపరిచే వ్యక్తి ఏ తెగవాడైనా సరే చంపిగాని వదలి పెట్టమని ప్రతిజ్ఞ చేశారు.

"మాంత్రిక మహాశయా! మన దేవతలకు అపచారం తలపెట్టే వ్యక్తి బహుశా బనీహాషిం తెగలో ఉన్నాడని నీ ఉద్దేశం కాబోలు. నిజంగా ఆ వ్యక్తి మా తెగలో గనక ఉంటే, అందరికన్నా ముందుగా నా ఖడ్గమే అతడ్ని చీరేస్తుంది" అన్నాడు అబూలహబ్.

"అది నా ఉద్దేశం కాదు. మన దేవతలకు అపచారం తలపెట్టేవాడు బనీ హాషిం తెగలో ఉన్నాడని ఈ కపాలమే నాకు తెలియజేస్తోంది. కావాలంటే అతని పేరు కూడా చూడండి" అంటూ అబ్రష్ చుట్టూ తిరిగి పుర్రెను అందరికీ చూపించాడు.

పుర్రెమీద నల్లగా మాడిన రంగులో, స్పష్టమైన అక్షరాల్లో "ముహమ్మద్ (సఅసం)" అనే పేరు ప్రత్యక్షమయి ఉంది. అది చూసి అందరూ ఆశ్చర్య చకితులయ్యారు. కాస్సేపటి క్రితం కపాలాన్ని చూసినప్పుడు వారికి దాని మీద ఎలాంటి పేరూ కన్పించలేదు. ఇప్పుడెలా వచ్చిందీపేరు కపాలం మీద! అంటే అబ్రష్ చెబుతున్న జోస్యం నిజమే కావచ్చున్నమాట. అందుకే జనం సంభ్ర మాశ్చర్యాలతో అబ్రష్ని, కపాలాన్ని చూడసాగారు. అబ్రష్ పట్ల వారి గౌరవాభి మానాలు మరింత ఇనుమడించాయి.

కాని కపాలం మీద ప్రత్యక్షమయిన ఈ విచిత్ర రాత చూసిన అబూ తాలిబ్ క్షణంపాటు ఖంగుతిన్నారు. ఆయన ముఖం వివర్ణమయింది. భృకుటి ముడివడింది.

"అబ్రష్! నువ్వు నా తమ్ముడి కొడుకు మీద నిందమోపి ఏదైనా ఉప ద్రవం లేవదీయాలనుకుంటున్నావా? అలా ఎన్నటికీ చేయకు. నేను దాన్ని సహించలేను" అన్నారు కాబా ధర్మకర్త అబూతాలిబ్ కఠిన పదజాలంతో.

"ప్రభూ! నేను మన పవిత్ర దేవత హుబల్ సాక్షిగా చెబుతున్నాను- నా అంతట నేను ఏదీ చెప్పడం లేదు. నాకున్న జ్యోతిష్జ్ఞానం ఈ పుర్రె ద్వారా నాకు తెలియజేస్తున్న విషయాలనే నేను మీకు చెప్తున్నాను" అన్నాడు అబ్రష్ కాస్తంత భయపడుతూ.

"నువ్వార్థి అబద్ధాలరాయుడివి. మా కుటుంబం పట్ల నీకేదో ద్వేష భావం ఉంది; మా మీద ఎందుకో కక్షపెంచుకున్నావు. ఆ కక్షను నువ్విలా జ్యోతిష్యం తెరచాటున తీర్చుకోదలిచావు" అంటూ అబూతాలిబ్ గర్జించారు.

"మహాప్రభో! మన్నించండి. తమరిలాంటి పవిత్రమైన ఉన్నత కుటుం బంపై నిందమోపే దుస్సాహసానికి ఈ అల్పుడు పాల్పడగలడా? పాల్పడి బతికి బయటపడగలడా? ప్రభూ! నేను మీ ఉప్పుతిని మీ చెప్పుకింద అణగి ఉండే అల్పజీవిని. అలాంటిది నేను మీ కుటుంబం మీద కక్షగట్టడమా! దేవ!దేవ! అటువంటి పాడు ఆలోచన నా మనస్సులోకే రాదు. దయచేసి కాస్త ఓపిక పట్టండి. ఈ కపాలం ఏం చెప్తుందో స్వయంగా మీరే చూడండి" అన్నాడు అబ్రష్ దీనంగా వేడుకుంటూ.

దాంతో అబూతాలిబ్ మౌనంగా ఉండిపోయారు. అబ్రష్ ఏదో మంత్రం పఠిస్తూ కపాలం మీద మణికట్టు ఎముకను అయిదారుసార్లు తిప్పాడు. ఆ తరువాత కపాలాన్ని నేలమీద వదలిపెట్టాడు. అది వెంటనే అందరికీ ఆశ్చర్యం గొలుపుతూ గిరగిర తిరగడం మొదలు పెట్టింది. కాస్సేపటికి దానిమీదున్న ఓ వృత్తాకారం పరిధి క్రమంగా కుంచించుకు పోతూ ఒక చిన్న బిందువుగా మారి పోయింది. దాంతోపాటు కపాలం తిరగడం ఆగిపోయింది.

"చూశారా! పుర్రెమీద ఈ వృత్తం ఎలా ఓ చిన్న బిందువుగా మారి పోయిందో!! ఈ బిందువు మన దేవతలను అవమానపరిచే వ్యక్తి పేరును తెలుపుతుంది. అది కూడా చూడండి" అన్నాడు అబ్రష్.

కపాలం మళ్ళీ తిరగడం మొదలెట్టింది. బిందువు క్రమేణా విస్తరిస్తూ పోయింది. అలా విస్తరిస్తూ అక్షర రూపం దాల్చింది. ఆ అక్షరాలు తళతళ

మెరిసిపోతున్నాయి. కపాలం ఆగిపోగానే ప్రేక్షకులు దానివైపు కళ్ళు వుంచుకొని జాగ్రత్తగా చూడసాగారు. కపాలం మీద పెద్ద ఆకారాల్లో స్పష్టంగా "ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం" అనే అక్షరాలు ప్రత్యక్షమయ్యాయి.

"చూడండి, కళ్ళు తెరచి చూడండి. మీ దేవతలకు అపచారం తలపెట్టే వానిపేరును బాగా చూసుకోండి. ఇది తంత్రం కాదూ, కనికట్టూ కాదు. పేరు స్పష్టంగానే కనిపిస్తోంది" అన్నాడు అబ్రష్.

కపాలం మీద ప్రత్యక్షమయిన పేరును ప్రజలు చాలా దగ్గరగా పోయి చూశారు. మళ్ళీమళ్ళీ చూశారు. స్పష్టంగా చూశారు. అదే పేరు. అందులో ఏమాత్రం సందేహం లేదు. అది చూశాక అబూతాలిబ్ కూడా ఇక ఏమీ మాట్లాడ లేకపోయారు.

"పేరును మీరంతా చూశారు గదా! ఇక వినండి. మీరు గనక మీ దేవుళ్ళను ప్రసన్నం చేస్తే జరగబోయే ఈ కీడు తప్పిపోతుంది" అన్నాడు అబ్రష్.

"అయితే దేవుళ్ళను ఏ విధంగా ప్రసన్నం చేయవలసి ఉంటుంది?" అబూలహబ్ అడిగాడు.

"ఈ సంగతి కూడా కపాలమే చెబుతుంది. కాస్త ఇటు చూడండి" అంటూ అబ్రష్ కపాలం మీద మణికట్టు ఎముకతో రెండు మూడు సార్లు తిప్పాడు. కపాలం మళ్ళీ తిరగసాగింది. దానిమీదున్న అక్షరాలు క్రమంగా అదృశ్యమయిపోతూ చివరికి ఓ బిందువు మాత్రమే ఉండిపోయింది. ఆ బిందువు మళ్ళీ మెల్లగా విస్తరిస్తూ పోయింది. ప్రేక్షకులు రెప్పవాల్చకుండా చూడసాగారు. వారలా చూస్తుండగానే ఒకపదం ఏర్పడింది. చక్కగా, చిక్కగా కాంతిమంతమైన అక్షరాలతో కపాలం మీద 'ఖుర్బానీ' అనే పదం ఏర్పడింది.

"చూశారుకదా! ఇక బలి ఇచ్చి మీ దేవతలను ప్రసన్నం చేసుకోండి" అన్నాడు అబ్రష్ విజయగర్వంతో మందహాసం చేస్తూ.

ఆ సమయంలో ప్రజలందరిపై ఒక విధమైన భయాందోళనలు ఆవ రించి ఉన్నాయి. వారు బిత్తర చూపులతో అబ్రష్ వంక చూడసాగారు.

"మీ దేవతలు బలి కోరుతున్నారు. బలి ఇస్తేనే రానున్న కీడు దూరమవు తుంది" అన్నాడు అబ్రష్ నొక్కి చెబుతూ.

"అయితే ఏం బలి ఇవ్వాలి?" ఒకతను అడిగాడు.

"ఆ సంగతి కూడా ఈ కపాలమే చెబుతుంది" అంటూ అబ్రష్ ఏదో మంత్రం చదివి కపాలం మీద చేతి ఎముకను తిప్పాడు.

ప్రజలు మరొకసారి కపాలం మీద దృష్టి కేంద్రీకరించి, ఊపిరి బిగబట్టి ఉత్కంఠతతో చూడటం ప్రారంభించారు.

కపాలం మళ్లీ గిరగిర తిరగడం మొదలెట్టింది. దానిమీద 'ఖుర్బానీ', (బలి) అనే అక్షరాలు క్రమంగా కుంచించుకుపోయి ఒక బిందువుగా మారి పోయింది. కాస్సేపటికి ఆ బిందువు మళ్ళీ వ్యాపిస్తూ పోయింది. అలా వ్యాపిస్తూ చివరికి అక్షర రూపం దాల్చింది.

కపాలం మీద నల్లగా మాడి నిగనిగలాడుతున్న అక్షరాలతో "అందమైన ఓ పదేళ్ళ బాలిక" అనే ఓ పదసముదాయం ఏర్పడింది. ప్రజలు ఈసారి మరింత ఆశ్చర్యపోతూ కపాలం వైపు, అబ్రష్ వైపు మార్చిమార్చి చూడసాగారు.

"మీ ప్రశ్నకు సమాధానం దొరికింది కదా! మీ కళ్ళతోనే దాన్ని చూసు కున్నారు. ఇక ఈ కపాలం తన పని ముగించేస్తోంది" అన్నాడు అబ్రష్.

అబ్రష్ నోట ఈ చివరి వాక్యం వెలువడగానే కపాలం తిరగడం ఆగి పోయింది. దాని మీద ఏర్పడిన అక్షరాలు కూడా మాయమయి పోయాయి. ఆ తరువాత అతను దాన్ని రెండు చేతులతో పైకి తీసుకొని ముద్దెట్టుకున్నాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"నా తంత్రిక విద్య నాకు మరొక విషయం కూడా తెలియజేస్తోంది. దాని ప్రకారం మీలో ఇది వరకే తొమ్మిది మంది కుమార్తెలను సజీవంగా పూడ్చి నటువంటి వ్యక్తి మాత్రమే ఇప్పుడు తన పదో కుమార్తెను బలి ఇవ్వాల్సి ఉంటుంది....."

అరేబియాలో తరతరాల నుంచి స్త్రీ శిశు హత్యా సంప్రదాయం కొన సాగుతూ వస్తోంది. కఠినాత్ములైన తండ్రులు తమ చిన్నారి బాలికలను బ్రతి కుండగానే నిర్దయగా నేలలో పాతి పెట్టేవారు. ఈ రాక్షస కార్యం పట్ల వారు కించిత్తు కూడా సిగ్గుపడరు. పైగా అది తమ కెంతో గర్వకారణమైన ఘన కార్యంగా భావిస్తారు.

సాధారణంగా ఆనాడు అరబ్బులు చాలామంది బాలికలను పుట్టగానే పూడ్చివేయడమో లేదా మరో రకంగా హతమార్చడమో చేస్తారు. అయితే ఒక్కోసారి బాలికను అయిదారేళ్ళ వయస్సు వచ్చేదాకా పెరగనిచ్చి, ముద్దు ముద్దుగా మాట్లాడటం మొదలెట్టిన తరువాత సజీవ సమాధి చేస్తారు. దీన్ని ఓ పెద్ద ఉత్సవంగా పాటిస్తారు. పిల్ల తండ్రి ముందుగానే ఊరి బయట గుంట త్రవ్వి వస్తాడు. ఈలోగా బాలికకు స్నానం చేయించి కొత్తబట్టలతో, నగలతో నూతన వధువులా ఆమెను అందంగా అలంకరిస్తారు. ఆ తరువాత మేళ తాళా లతో అమ్మాయిని తీసుకొని ఊరి వెలుపలికి వెళ్తారు. అక్కడ ఆ చిన్నారి బాలికను ఆమె తండ్రి గుంటలోకి పడదోస్తాడు. బాలిక కేకలు పెట్టి ఏడుస్తున్నా ఆ తండ్రి హృదయం కరగదు. పై పెచ్చు అతను కూతుర్ని మందలిస్తూ ఆమెపై త్వరత్వరగా ఇసుక పోసేస్తాడు. ఆ విధంగా ఆ కఠినాత్ముడు తన కుమార్తెను భూమిలో పూడ్చిపెట్టి చేతులు దులుపుకుంటాడు.

అబ్రహ్ పలుకులు వినగానే ప్రజలు ప్రశ్నార్థకంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు. కొందరు గుసగుసలు చెప్పుకోసాగారు. కాని వారిలో ఏ ఒక్కరు కూడా అబ్రహ్ విధించిన షరతును పూర్తిచేయగలిగే వారున్నట్లు కనిపించడం లేదు కాబోలు, అందరూ మౌనంగా ఉండిపోయారు. అంతలో ఒక వ్యక్తి ముందుకు వచ్చాడు రొమ్ములు విరుచుకుంటూ.

"ఈరోజు మీ ముందు నాకి అర్హత ఉందని చెప్పుకోవడానికి నేను గర్వ పడుతున్నాను. నేను ఇదివరకే నా తొమ్మిది మంది కూతుళ్ళను సజీవంగా పూడ్చి వేశాను. అదృష్టవశాత్తు నాకిప్పుడు మరో కూతురు కూడా ఉంది. దానికి ఎల్లుండికల్లా పదేళ్ళు పూర్తి అవుతాయి. పదేళ్ళ వయస్సుకాగానే దాన్ని కూడా పూడ్చిపెడ్తానని మొక్కుబడి చేసుకున్నాను" అన్నాడా వ్యక్తి.

"ఆ...... ఇలాంటి అమ్మాయే బలికి యోగ్యురాలు. ఖైస్! నిజంగా నీవు చాలా అదృష్టవంతుడివి. నీవు నీ పదేళ్ళ కూతుర్ని సజీవంగా సమాధిచేసి మన దేవతలను తృప్తిపరచబోతున్నావు అంటే, నీకంటే అదృష్టవంతుడు ఈ భూలోకంలోనే లేడనుకో!" అన్నాడు అబ్రహ్ సంతోషంతో ఖైస్ బిన్ ఆసిమ్‌ని అభినందిస్తూ.

ఆ తరువాత ప్రజలు కూడా ఖైస్‌ని ఎంతో గౌరవదృష్టితో చూస్తూ అభినందనల్లో ముంచెత్తారు. ప్రజల అభినందనలతో ఖైస్ ఆనందం పట్టలేక ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు.

"నేను సంతోషంగా ప్రకటిస్తున్నాను. ఎల్లుండి పెద్దల సమక్షంలో నా పదేళ్ళ కూతుర్ని సజీవ సమాధి చేస్తాను" అన్నాడతను.

ఈ ప్రకటన వినగానే ప్రజలు సంతోషంతో చప్పట్లు చరిచారు. మరొక సారి ఖైస్‌ని ఆకాశానికెత్తి అభినందనల పూలహారాలతో ముంచెత్తారు.

"మహోన్నతమైన ఈ బలిదానం చూడటానికి జనమంతా ఎల్లుండి మన పట్టణ శివార్లలోకి చేరుకుంటారని ఆశిస్తున్నాను. ఇక మనకు చుట్టుకో నున్న కీడు ఈ బలిదానంతో దూరమైనట్లే" అన్నాడు అబ్రహ్.

ఈ మాటలు విని ప్రజల హృదయాలు కుదుట పడ్డాయి. అందరూ కృతజ్ఞతా భావంతో మరోసారి తమ తమ ఇష్టదైవాల ముందు భక్తి శ్రద్ధలతో సాగిలపడ్డారు. ఆ తరువాత లేచి ఎవరి ఇండ్లకు వారు వెళ్ళిపోయారు. అబూ లహబ్ కూడా కుంటుకుంటూ ఇంటి ముఖం పట్టాడు.

ఖైస్ బిన్ ఆసిమ్ తన అదృష్టానికి తానే ఎంతో మురిసిపోయాడు. అంతమంది జన సమూహంలో తొమ్మిది మంది కుమార్తెలను సజీవ సమాధి చేసిన వ్యక్తి తాను తప్ప మరెవ్వరూ లేరంటే తానంత అదృష్టవంతుడు ఈ ప్రపంచంలోనే లేడన్నమాట! మరో వైపు ప్రజల నుండి అమితమైన అభి నందనలు, గౌరవాదరణల పరంపర వెల్లువలా వచ్చిపడుతుంది. అందుకే అతను అమితానందంతో ఉక్కిరిబిక్కిరయి పోతున్నాడు. ఆ ఆనందం నుండి అహంకారం కూడా పుట్టుకొచ్చింది. ఆ విధంగా ఖైస్ ఆనందం, అహంకారాల మేళవింపుతో కూడిన సుమధుర అనుభూతితో ఇంటికి తిరిగొచ్చాడు.

ఖైస్‌ని అల్లంత దూరాన చూడగానే ఓ పదేళ్ళ బాలిక తెగ సంబరపడి పోతూ, అతనివైపుకు పరుగెత్తుకొచ్చింది.

"నాన్నా! మా మంచి నాన్నా!! వచ్చేశావా!!! నేను నీ కోసం ఎంత సేప ట్నుంచి ఎదురు చూస్తున్నాననుకున్నావ్!!" అంటూ ఆ పాప తన లేతచేతుల్ని చాపి ముందుకు వచ్చింది.

ఆ బాలికను చూడగానే ఖైస్‌లో అణగారి ఉన్న సహజ పితృ ప్రేమ అప్రయత్నంగా పెల్లుబికింది. అతను కూతుర్ని అమాంతం పైకి ఎత్తుకున్నాడు. ప్రేమగా ఆమె నుదుటిపై ముద్దెట్టుకున్నాడు. బాలిక కూడా ఎనలేని మమ కారంతో తండ్రి భుజాల మీద చేతులు వేసి అతని మెడను చుట్టేసు కుంది.

అమ్మాయి ఎంతో అందంగా ఉంటుంది. చంద్రబింబంలాంటి ముఖం. విశాలమైన ఫాలము. కాంతివంతమైన పెద్దపెద్ద కళ్ళు. మల్లె మొగ్గలాంటి కొనదేరిన ముక్కు. అద్దంలాంటి నున్నటి చెంపలు. చిన్న గడ్డం. మంచుతో తడిసి మెరిసిపోయే లేత గులాబి పువ్వుల్లాంటి పెదవులు. ముత్యా ల్లాంటి పల్ల వరుస. నిగనిగలాడే పొడవైన నల్లటి కురులు. తెలుపు ఎరుపు కలసిన పసిమివన్నె దేహచ్ఛాయ. మొత్తం మీద ఆ పాప ముగ్ధమనోహర సౌంద ర్యంతో అచ్చం ముద్దబంతి పువ్వులా ఉంటుంది.

అలాంటి పాపను చూస్తే సహజంగానే ఏ తండ్రి హృదయమైనా పితృ వాత్సల్యంతో పరవశించి పోతుంది. ఈ అనుభూతితోనే ఖైస్ తన చిన్నారి కుమార్తెను గుండెలకు హత్తుకున్నాడు. గోముగా ఆమె తలనిమిరాడు.

కాని అంతలోనే ఏదో గుర్తొచ్చినవాడిలా తొట్రుపడ్డాడు. మనసులో ఓ మూల తిష్టవేసిన దుష్ట పిశాచం అతనికి కర్తవ్యోపదేశం చేసి పురి ఎక్కించింది. అంతే........ అతను తన మెడకేదో జెర్రిపోతు చుట్టుకున్నట్లు ఉలిక్కిపడి వెంటనే చిన్నారి కూతుర్ని లాగి క్రిందకు విసరి వేశాడు. దాంతో ఆమె కిందపడిపోతూ ఎలాగో నిలద్రొక్కుకో గలిగింది.

ఈ హఠాత్పరిణామానికి ఆ అమ్మాయి బిత్తరపోయి తండ్రి వంక అయో మయంగా చూడసాగింది. అతని కళ్ళు నిప్పు కణాల్లా ఎర్రగా మారిపోయి ఉన్నాయి. పాప భయం భయంతో చూస్తూ, ప్రేమ భరితమైన పలుకులతో ఇలా అంది:

"నాన్నా! మా మంచి నాన్నా!! నా మీద కోపం వచ్చిందా? అలా కోప గించుకోకు నాన్నా! నువ్వు, అమ్మ తప్ప నాకీ ప్రపంచంలో ఇంకెవ రున్నారు.....!!"

ఖైస్ కళ్ళలో నుంచి నిప్పు కణాలు ఇంకా రాల్తూనే ఉన్నాయి.

"జమీలా! నువ్వు నీ అమాయకపు మాటలతో నన్ను మభ్యపెట్టాలను కుంటున్నావా? నీ అమాయకపు మాటలకు కరిగిపోయే అంతటి మూర్ఖుడ్ని కాను నేను- పో అవతలకి" అంటూ గర్జించాడు.

కోపంతో మండి పడుతున్న తండ్రి ఉగ్రావతారం చూసి జమీలా భయపడి క్షణంపాటు మౌనంగా ఉండిపోయింది.

సాధారణంగా పిల్లలు తమను తల్లిదండ్రులు ఉరిమి చూస్తే కాస్సేపు భయపడి దూరంగా ఉంటారు. ఆ తరువాత మళ్ళీ దగ్గరకు వచ్చి వాళ్ళను పెనవేసుకుంటారు. జమీలా కూడా మళ్ళీ దగ్గరకు వచ్చి తండ్రిని పెనవేసు కుంది. ఆమె దీనంగా విలపిస్తూ-

"నాన్నా! నా మీద ఎందుకంత కోపం నీకు? నేనేం తప్పు చేశాను నాన్నా?!" అని అన్నది. కాని ఖైస్ రాతి గుండె కరగలేదు. అతను పాప రెక్కలు పట్టి విదిలించి ఆమెను దూరంగా నెట్టి వేశాడు. ఆపై ఉరిమిచూస్తూ 'పో అవతలకి' అన్నాడు.

పాపం జమీలా భయంతో కంపిస్తూ తండ్రి నుంచి విడిపోయి దూరంగా నిలబడింది. ఆమె ఇదివరకెప్పుడు తన తండ్రిని ఇంతకోపంతో మండిపడటం చూడలేదు. కాని ఈ కోపానికి కారణం ఏమిటో ఎంత ఆలోచించినా ఆ పసి బుర్రకు అర్థం కాలేదు.

ఖైస్ కుమార్తె నుండి విడిపించుకొని ముందుకు సాగాడు. జమీలా అదురుతున్న గుండెలతో అతని వెనకాలే నడిచింది. కూతురు తన వెనకాల నడిచిరావడం చూసి ఖైస్ మరింత మండి పడ్డాడు.

అతను కూతుర్ని ఉరిమి చూస్తూ "జమీలా! నీక్కాదూ చెప్పేది? పో అవతలకి, నా వెంట రాకు" అని కసురుకున్నాడు.

జమీలా ఇక చేసేది లేక ముఖం చిన్నబుచ్చుకొని అక్కడే నిలబడి పోయింది.

ఖైస్ మరో నాలుగ్గజాలు నడిచి ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో అతని భార్య అతని కోసం ఎదురు చూస్తూ కూర్చున్నది. భర్త రావడం చూడగానే ఆమె సంతోషంతో ఎదురేగి చిరునవ్వుతో అతనికి స్వాగతం చెప్పింది.

"ఏమిటీ విశేషం? ఈరోజు శ్రీవారు ఏదో కోపంగా ఉన్నట్లు కనిపిస్తు న్నారు?" అన్నది ఆమె భర్త ముఖం చూస్తూ.

"విశేషం ఏమీ లేదు సల్మా! నీ కూతురి ధోరణే నచ్చలేదు. వచ్చీ రాగానే నన్ను పెనవేసుకుంది. ఇది మంచి పద్ధతంటావా?" అన్నాడు ఖైస్.

"మంచిది కాదనుకోండి. కాని మన జమీలాకు మీరంటే ఎంతో ప్రేమ. మీరు ఇంటినుంచి బయటికి వెళ్ళే మళ్ళీ వచ్చేదాకా మిమ్మల్నే జ్ఞాపకం చేస్తుంది. మీరు కనపడగానే పరుగెత్తుకెళ్ళి మిమ్మల్ని పెనవేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. చిన్న పిల్లకదండి! మీ మీద దాని మమకారం అలాంటిది" అన్నది సల్మా భర్తను సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తూ.

"కాని జమీలా తన అమాయకపు ముఖంతో, ముద్దుల పలుకలతో నన్ను లోబరుచుకోజూస్తోంది. అలా చెయ్యడం మంచిదేనా?"

సల్మా అసలు విషయం ఏమిటో అర్థంకాక భర్త వంక ఓ సారి అను మానాస్పదంగా చూసి "మీరు తండ్రి కదా! మిమ్మల్ని కాకపోతే అది ఇంకా ఎవర్ని ప్రేమిస్తుందండీ?" అన్నది.

కాని ఈ ప్రేమవల్ల లాభం ఏమిటీ?" అన్నాడు ఖైస్.

"లాభనష్టాల సంగతి ఆ పిచ్చిపిల్లకు ఏం తెలుసండీ!" అంటూ సల్మా నచ్చజెప్పడానికి ప్రయత్నించింది.

"సల్మా! అది సరేగాని, ఈ రోజు వచ్చిన తుఫాను, ఆ తుఫాను తరు వాత మెరిసిన అద్భుతమైన మెరుపు, కన్పించిన కాంతి నువ్వు చూశావా?" అన్నాడు ఖైస్ విషయం మార్చివేస్తూ.

"ఆ..... ఆ...... చూశానండీ! ఎంత భయంకరమైన గాలి అది. నేనయితే మన ఇంటికప్పు ఎగిరిపోతుందేమోనని భయపడి పోయాను. ఎలాగో మన దేవతల దయవల్ల తుఫాను ప్రమాదం తప్పిపోయింది. కాని ఆ తరువాత మెరిసిన మెరుపు, కాంతి లాంటివి నేనిదివరకు ఎప్పుడూ చూడలేదు" అన్నది సల్మా తుఫాన్ భయోత్పాతాన్ని తలచుకుంటూ.

"నిజమే. అలాంటి మెరుపు, కాంతుల్ని నీవెప్పుడూ చూసి ఉండవు. కాని దాని వల్ల వచ్చే కీడు సంగతి నీకేమైనా తెలుసా?"

కీడు గురించిన మాటలు వినగానే సల్మా కంగారుపడిపోయింది.

"ఏమండీ! ఏదన్నా జరగరానిది జరగబోతున్నదా?"

"ఔను సల్మా! పెద్ద ప్రమాదమే వచ్చిపడింది. ఒక వ్యక్తి మన దేవతలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాడట" అన్నాడు ఖైస్.

"ఏమిటి! మనదేవతలకు వ్యతిరేకంగా.....!! ఎవరండీ ఆ వ్యక్తి? అతనికి వేరే మరో దేవుడు ఎవరైనా ఉన్నాడా?" అన్నది సల్మా ఆందోళన వెలిబుచ్చుతూ.

"తప్పకుండా ఉంటాడు"

"విచిత్రంగా ఉందే!"

"చాలా విచిత్రం. మహా మాంత్రికుడు అబ్రష్ తన దివ్యజ్ఞానంతో తెలియజేశాడు. మన దేవతలకు వ్యతిరేకంగా గొంతెత్తే ఆ వ్యక్తి అబ్దుల్లా కొడుకు ముహమ్మద్ (సఅసం) అట!"

"ఏమిటీ, ముహమ్మదా (సఅసం) ఆ వ్యక్తి!? కాని ముహమ్మద్ (సఅసం) గురించి నాకు తెలుసు. నాకేకాదు, ఈ పట్నంలో ఆయన్ని గురించి తెలియని వారే లేరు. ఎంతో మంచివాడు, బుద్ధిమంతుడు. చాలా దయార్ద్ర హృదయుడు, నిజాయితీపరుడు. ఆయన ఇలా చేస్తాడంటే నమ్మశక్యం కాకుండా ఉంది. ఆయన తాతముత్తాతలు కూడా మన దేవతలనే ఆరాధిస్తూ వస్తున్నారు కదా?" అన్నది సల్మా ఆశ్చర్యంతో ఓ పట్టాన నమ్మలేక.

"నువ్వు చెప్తున్నది నిజమే. కాని ఆయన మన దేవతల ముందు సాష్టాంగ పడినట్లు ఇంత వరకు ఎవరూ చూడలేదు" అన్నాడు ఖైస్.

"అది నిజమే కావచ్చు. నేను కూడా చూడలేదు. కాని అంత మాత్రాన ఆయన మన దేవతలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాడని ఎలా చెప్పగలం?" అన్నది సల్మా.

"అబ్రష్ ఎన్నటికీ అబద్ధం చెప్పడు. స్వయంగా అతని అధీనంలో ఉన్న ప్రేతాత్మలే ఈ సంగతి అతనికి తెలియజేశాయట" అన్నాడు ఖైస్.

కాని ముహమ్మద్ ఇంటిపట్టాన కూడా ఉండటం లేదే! హిరా గుహలో ఏకాంత జీవితం గడుపుతున్నాడని విన్నాను. అన్నది సల్మా.

"ఔను ఆయన ఈ మధ్య ఇంటి పట్టున ఉండటం లేదు. హిరా గుహ లోనే ఎక్కువ సమయం గడుపుతున్నాడు. బార్లీ పిండి మాత్రమే తింటూ చాలా నిష్ఠగా ఉంటున్నాడు. యౌవ్వనంలో జీవిత మాధుర్యాలను త్యజించి ఇలా తపో నిష్ఠలో గడుపుతున్నాడంటే ఆయన వల్లే ప్రమాదం తప్పకుండా ఉంటుంది."

"కాని ఆయనగారు అసలు జనం మధ్యనే ఉండటం లేదు కదండీ! పైగా ఎంతో నీతిమంతుడు. ఏ ఒక్కరి జోలికి పోయే మనిషి కూడా కాదు. అలాంటి మనిషి వల్ల...."

"సల్మా! నీకు తెలియదు. అబ్రష్ చెప్పిన జోస్యాలలో ఇంత వరకు ఒక్కటీ తప్పలేదు. అది సరేగాని, ఈ రోజు కాబా మందిరంలో వేలాది జనం మధ్య నాకు ఎంత గౌరవ మర్యాదలు లభించాయో తెలుసా?" అన్నాడు ఖైస్ విజయ గర్వంతో చూస్తూ.

"నిజమా అండీ! ఏవిటీ విశేషం?" అన్నది సల్మా సంతోషంతో ముఖం చాటంత చేసుకొని.

"అబ్రష్ రానున్న కీడును దూరం చేయడానికి ఓ మంచి ఉపాయం చెప్పాడు. ఎవరయినా తొమ్మిది మంది కుమార్తెలను సజీవ సమాధి చేసి ఉండి, అతనికిప్పుడు పదో కుమార్తె కూడా ఉండి, ఆమెను మన దేవతల కోసం బలి ఇస్తే ఈ కీడు తప్పుతుందట. అలాంటి వ్యక్తి అంత పెద్ద జన సమూహంలో ఒక్కడు కూడా లేడు. అందరూ సిగ్గుతో తలలు వొంచేసు కున్నారు. అప్పుడు నేను తలెత్తి ముందుకు వచ్చి, అలాంటి వ్యక్తి నేనున్నాను అని చెప్పాను. అప్పుడిక చూస్కో సల్మా! జనమంతా ఆశ్చర్యపోయి నావైపు ఎంతో గౌరవ భావంతో చూడటం మొదలెట్టారు."

"బాలిక బలి ప్రస్తావన రాగానే సల్మా ముఖం ఒక్కసారిగా వివర్ణమయి పోయింది. ఆమె అందాల ముఖారవిందం ముడుచుకుపోయింది. జమీలా అంటే ఆమెకు పంచప్రాణాలు, తను ఎన్నో కష్టనష్టాలకోర్చి, ఎంతో గారాబంగా పెంచి ఇంతగా ప్రేమిస్తున్న తన బిడ్డకు రోజులు దగ్గరపడ్డాయని భర్త మాటల వల్ల ఆమెకు అర్థమయిపోయింది. ఈ ఆలోచన రాగానే ఆమె మాతృ

హృదయం కకావికలమయి పోయింది. కళ్ళు అశ్రుపూరితాలయి పోయాయి. కాని భర్త భయం వల్ల అశ్రుధారాలు చెంపలదాకా వచ్చి ఆగి పోయాయి.

అయితే ఇదేమి గమనించని ఖైస్ తన అదృష్టానికి పరవశించిపోతూ 'సల్మా! ఇది మనకు, మన ఉభయుల కుటుంబాలకు గర్వకారణం కాదా?" అని అడిగాడు.

పాపం సల్మా పుట్టెడు దుఃఖాన్ని బలవంతంగా అణుచుకుంటూ "గర్వ కారణమే కాని........." అని ఆగిపోయింది. మరేమీ మాట్లాడలేక.

ఖైస్ గిర్రున భార్య వైపుకు తిరిగి ఆమె వాడిపోయిన ముఖం, అశ్రు పూరితాలయిన కళ్ళు చూసి ఉగ్రుడయిపోయాడు.

"సల్మా! ఏమిటీ నీ మొహం ఇలా తయారయింది? జమీలా మీద మమకారం నిన్ను వివశురాల్ని చేసిందా? అలాగైతే చాలా సిగ్గుపడాల్సిన విషయమిది. నీ కళ్ళలో నుంచి పార్లి వస్తున్నవి ఆనంద భాష్పాలా, కన్నీటి ధారలా?" అన్నాడు అతను కాల్చుకు తిన్నట్లు చూస్తూ.

భర్త రౌద్రాకారం చూసి సల్మా బెదిరిపోయింది. పార్లుకు వస్తున్న దుః ఖాన్ని లోలోనే దిగమింగి దీనంగా అతనివైపు చూడసాగింది ప్రాధేయపడు తున్నట్లు.

"సల్మా! కాస్త స్పృహలోకి రా, అందమయిన నీ కళ్ళలో ఈ కన్నీటిని నేను చూడలేను. ఒకవేళ నువ్వు నీ హృదయంలో జమీలా ప్రేమకు చోటిచ్చి దాన్ని అంతగా పెరగనిచ్చి ఉంటే, ఇప్పటికైనా మించిపోలేదు, దాన్ని నీ మనసు నుండి తీసి పారెయ్యి" అన్నాడు ఖైస్.

సల్మా ఇప్పటి దాకా ఎలాగో సహిస్తూ వచ్చింది. కాని ఇప్పుడామె ఓపిక నశించింది. ఆమె కాస్తంత ధైర్యం తెచ్చుకొని భర్తకు కొంచెం దగ్గరగా పోయి, ఎంతో దీనంగా అర్థింపు చూపులతో చూస్తూ ఇలా అన్నది.

"ఏమండీ! దయచేసి నన్నీ కఠిన పరీక్ష నుండి తప్పించండి. జమీలా అమాయకపు ముఖం, ఆమె ముద్దులొలికే పలుకులు ఈ దురదృష్టవంతురాల

హృదయంలో తిష్టవేసుకున్నాయి. ఆలోచిస్తుంటే నా జీవితం దాని జీవితంతో ముడిపడి ఉందా అన్పిస్తోంది నాకు. అందుకని కనికరించి నన్ను క్షమించండి. నా కోసం..... కేవలం నా కోసం జమీలాను సజీవంగా...."

ఈ మాటలు వినగానే ఖైస్ తోక తొక్కిన త్రాచుపాములా కస్సున లేచాడు.

"బుద్ధిలేని దానా! కూతురి ప్రేమలో నీకు ఉన్న మతి కూడా పోయి నట్లుంది. జమీలాను సజీవంగా ఉంచి, దానికి పెళ్ళి చేసి నా కోసం అల్లుడ్ని తెచ్చుకోమనా నీ ఉద్దేశం? ఇప్పటి దాకా నేను అల్లుడి పీడలేకపోవడం వల్ల నలుగురి మధ్య గౌరవంగా తలెత్తుకొని తిరగ్గలుగుతున్నాను. ఇక నుంచి అల్లుడి అవమాన భారంతో క్రుంగిపోయి, సిగ్గుతో ముఖం చాటేసుకొని ఇంటి నాలుగ్గోడల మధ్య కూర్చోవాల్నమాట! అసాధ్యం. ఇలా ఎన్నటికీ జరగదు. జరగ నియ్యను" అన్నాడు అతను ఇంటి కప్పు ఎగిరిపోయేలా గాండ్రిస్తూ.

"ఏమండీ! మీరు జమిలా పెళ్ళి చెయ్యకపోతే పోనివ్వండి. అది జీవి తాంతం కన్యగానే ఉండిపోతుంది" అన్నది సల్మా బ్రతిమాలుతున్న ధోరణిలో.

"ఓసీ దయ్యమా! ఇది ఇంకా అవమానకరమయిన విషయం. జమిలా పెళ్ళీపెటాకులు లేకుండా ఇంట్లో కూర్చుండిపోతే జనం ఏమనుకుంటారు? ఖైస్ కూతురిలో ఏం లోపం ఉందో దాన్ని పెళ్ళి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదని లోకం కోడయి కూయదా? ఈ అవమానాన్ని కూడా నేను భరించలేను" అన్నాడు ఖైస్ కోపోద్రేకాలతో ఊగిపోతూ.

"ఏమండీ! చేతులు జోడించి అర్థిస్తున్నాను. జమిలాపై దయ చూపండి, అభం శుభం ఎరగని అమాయకపు జమిలాను కనికరించండి. ఎలా గయినా దాన్ని కాపాడండి" అంటూ సల్మా కన్నీరు మున్నీరుగా దుఃఖించ సాగింది.

"అసాధ్యం. అలా ఎన్నటికీ జరగదు. అదిగో అటు చూడు. జమిలా అక్కడ నిలబడి మన మాటలు వింటోంది. ఎల్లుండి దాన్ని సజీవ సమాధి చేయాల్సి ఉంది. ఈ రోజు నుంచే దాన్ని అలంకరించడం ప్రారంభించు" అని చెప్పి ఖైస్ అక్కడ్నుంచి వెళ్ళి పోయాడు.

ఖైస్ వెళ్ళిపోగానే సల్మా దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. ఆమె పూర్తిగా విచార సముద్రంలో మునిగిపోయి శోకమూర్తిలా తయారయ్యింది.

ఆమెకు పది మంది సంతానం. దురదృష్టవశాత్తు పది మంది కూడా ఆడపిల్లలే. ఆ పది మందిలో తొమ్మిది మందిని ఖైస్ ఎంతో నిర్దాక్షిణ్యంగా, అతి కర్కషంగా సజీవ సమాధి చేశాడు. ఎలాగో ఒక బాలికయినా మిగిలి ఉంది కదా అని ఆమె సహనం వహించి సరిపెట్టుకున్నది. కాని ఇప్పుడా పిల్ల కూడా మృత్యు ఒడిలోకి పోబోతున్నది. భర్త నోట పిడుగు లాంటి ఈ దుర్వార్త విని ఆమె మాతృ హృదయం పగిలి ఎన్ని ముక్కలయిపోయిందో ఆ దేవుడికే ఎరుక.

తండ్రి బయటికి వెళ్ళిపోవడం చూసిన తరువాత జమీలా ఇంట్లో గంభీరమయిన నిశ్శబ్దం రాజ్యమేలసాగింది.

జమీలా వచ్చి రాగానే అంది:

"అమ్మా! నువ్వు మౌనంగా ఎందుకున్నావు? నాన్న ముందు ఎందుకు చేతులు కట్టుకొని నిలబడ్డావు? మాట్లాడవేమమ్మా! ఈ రోజు నాన్నకు ఏమయింది? నన్నెందుకు కోపగించుకున్నాడు."

కూతురి ప్రశ్నల పరంపరకు తల్లి నుండి మౌనమే సమాధానంగా వచ్చింది. ఆమె కుమార్తెను దగ్గరకు తీసుకొని గట్టిగా గుండెలకు హత్తుకుంది. ఆమె ముఖాన్ని ముద్దులతో ముంచెత్తింది. ఆ వెనువెంటనే ఆమె కళ్ళు సెలయేళ్ళులా ప్రవహించసాగాయి.

"అమ్మా ఏడుస్తున్నావా, ఎందుకమ్మా? ఏమయిందమ్మా ఈ రోజు నీకు??" అన్నది జమీలా అమాయకంగా తల్లి ముఖంలోకి చూస్తూ.

"తల్లీ! నా చిట్టి తల్లీ!! ఈ అరేబియాలో- క్రూరత్వానికి, కర్కశత్వానికి నిలయమయిన ఈ అరబ్ భూభాగంలో నువ్వు పుట్టకుండా ఉంటే ఎంత బాగుండేదమ్మా!! నా బంగారు తల్లీ! నా ముద్దుల తారా!! నువ్వికి శాశ్వతంగా మబ్బుల చాటుకు వెళ్ళిపోతున్నావు. నా ఆశాజ్యోతి ఆరిపోబోతున్నది" అంటూ సల్మా వెక్కివెక్కి ఏడ్వనారంభించింది.

తల్లి వాలకం చూసి జమీలా బిత్తరపోయింది. తల్లి అంతగా ఏడ్వడం ఆమె ఇదివరకెప్పుడూ చూడలేదు. కాని విషయం ఏమిటో అర్థంగాక ఆమె క్షణం పాటు తల్లి వంకే అయోమయంగా చూసింది. సల్మా ధారాపాతంగా ఏడుస్తూనే ఉంది.

"ఏడ్వకమ్మా! నువ్వలా ఏడుస్తుంటే నాక్కూడా ఏడ్పొస్తుంది" అన్నది జమిలా తల్లి కన్నీటిని చేత్తో తుడుస్తూ.

జమీలా ఉత్త అమాయకపు పిల్ల. ఆమె ముందు తల్లి అన్నీ చెప్పేసినా ఆమెకు అర్థం కాలేదు. పైగా తల్లి ఏడిస్తే తానూ ఏడుస్తానంటోంది.

జమీలా మాటలతో సల్మా తత్తర పడింది. వెంటనే ఆమె కళ్ళు తుడుచుకొని, వాడిపోయిన మొహానికి బలవంతంగా కాస్తంత చిరునవ్వు పులుముకుంది. కాని ఏళ్ళ మధ్య బిగబట్టిన పుట్టెడు దుఃఖం ముందు ఈ కృత్రిమ చిరునవ్వు వెలవెలపోయింది.

"లేదమ్మా! ఇక నేను ఏడ్వనుగా, నువ్వేమీ బాధపడకు" అంటూ సల్మాను నుదుటిపై ముద్దెట్టుకొని మరొకసారి గాఢంగా గుండెలకు అదుముకుంది.

సల్మా పైకి ఏడ్పు మానేసినప్పటికీ, ఆమె హృదయం ఇంకా రోదిస్తూనే ఉంది. ఈ స్థితిలోనే తల్లికూతుళ్ళు పరస్పరం పెనవేసుకొని కాస్సేపు మౌనంగా కూర్చున్నారు. ఆ తరువాత సల్మా లేచి, ఇంటి పనులు చేసుకోవడంలో లీనమయిపోయింది. జమీలా ఆడుకోవడానికి బయటికెళ్ళింది.

ఆ రోజు సల్మా మనస్సు ఏ పని మీదా సరిగా లగ్నమవడం లేదు. జమీలా సంగతి తలంపుకు వచ్చినప్పుడల్లా ఆమె మనసు మూగగా రోదించేది. ఇక జమీలా ఇంట్లో తిరుగుతుంటే చాలు ఆమెకు కాళ్ళు చేతులు ఆడేవే కావు. కళ్ళ నుండి కన్నీళ్ళు అప్రయత్నంగా బొటబొట కారిపోయేవి. హృదయం మీద ఎవరో సుత్తితో కొడ్తున్నట్లు అపరిమితమయిన బాధతో వంకర్లు తిరిగిపోయేది. ఆ రోజు ఎలాగో గడిచిపోయింది.

కాని మరుసటి రోజయితే సల్మా బాధ వర్ణణాతీతం. కూతురి దురదృష్టాన్ని తలచుకొని ఆమె వలవల ఏడ్చేది. కాని భర్త చూస్తే మండి పడ్తాడేమో.

కూతురు చూస్తే బాధ పడుతుందేమోనని ఆమె లోలోనే హృదయం పగిలి పోయేలా దుఃఖిస్తుండేది.

రేపు తన ఆశాదీపం ఆరిపోతుంది. తన కంటి పాప కనుమరుగయి పోతుంది. తన నోముల పంట తనకు దూరమయిపోతుంది. ఆహ్.....! ఆడదాని బ్రతుకు ఇలా అర్ధాంతరంగా ముగిసిపోవలసిందేనా? కాబా ప్రభూ! నువ్వు నిజంగా మానవ ప్రాణాన్ని బలిగోరుతున్నావా? బలి కోరినా ఆడపిల్లనే ఎందుకు బలిగోరుతున్నావు? దేవా! ఏమిటీ వైపరీత్యం? ఎందుకు మాకీ కఠిన శిక్ష??

ఆ రాత్రంతా సల్మాకు కంటి మీద కునుకే లేదు. తెల్లవారింది. ఆమె కళ్ళు బాగా ఉబ్బిపోయి ఉన్నాయి. చెక్కిళ్ల మీద కన్నీటి చారలు ఏర్పడి ఉన్నాయి, ఏ పని చేయడానికెళ్ళినా ఆమె చేతులు వణుకుతున్నాయి.

ఈ రోజు మృత్యు దేవత తన జమీలాకు స్వాగతమివ్వడానికి వస్తుంది. కాదు, తన జమీలానే మృత్యు దేవతకు స్వాగతమివ్వడానికి వెళ్తుంది. దాని కోసం జమీలాను పెళ్ళి కూతురిలా అలంకరించాలట! తప్పదు మరి!!

సల్మా తన కాళ్ళు-చేతులకు బలవంతంగా పనులు పురమాయించింది. ఒక్క మనస్సు తప్ప మిగతా అవయవాలన్నీ యాంత్రికంగా పనులు చేసుకుపోతున్నాయి. చేతులు కసువు ఊడ్చి ఇంటిని శుభ్రపరచాయి. ఆ తరువాత మిగతా పనులు కూడా చకచకా సాగిపోయాయి.

సూర్యుడిక్కూడా తన జమీలా మీద కోపం వచ్చినట్టుంది. నడినెత్తి మీదికొచ్చి ఉరిమి చూస్తున్నాడు. సల్మా అతని వాడి చూపుల నుంచి తప్పించి కూతురికి తలంటు స్నానం చేయించింది. కొత్త బట్టలు కట్టబెట్టింది. శిరోజాలు తడి ఆరాక ఆమెను ఒళ్ళో కూర్చోబెట్టుకొని తల దువ్వసాగింది.

ఆ రోజు ఏదో పండుగని భావించి జమీలా సంతోషంతో పొంగి పోతున్నది. ఆమె పెదవుల మీద అనిర్వచనీయమయిన చిరునవ్వు నాట్య మాడుతున్నది. పాపం! పిచ్చి జమీలాకు కొన్ని గంటల్లో తాను అమ్మ ఒడిలో నుంచి మృత్యు ఒడిలోకి పోబోతున్న సంగతి తెలియదు. ఆమె నిజంగా వట్టి అమాయకపు పిల్ల! ఆ అమాయకపు పిల్లనే లాత్, ఉజ్జా దేవతలు మనసారా కోరుకున్నారట!!

ఆరోజు జమీలా ఇల్లు కళకళలాడసాగింది. అనేక మంది స్త్రీలు ఆమె ఇంట్లో గుమికూడారు. అందరూ గొప్ప శుభకార్యంగా భావించి ఆమెను అలంకరించడంలో నిమగ్నులయిపోయారు. ప్రతి ఒక్కరూ సల్మాను అభినందిస్తూ తలా ఒక పని చేపట్టి చకచకా చేసుకుపోతున్నారు. స్త్రీలంతా తెగ సంతోష పడిపోతున్నారు. సంతోషపడని స్త్రీ ఎవరయినా ఉందంటే ఆమె సల్మా మాత్రమే. సల్మా ఎలా సంతోషిస్తుంది? ఎంతో గారాబంతో పెంచిపోషించిన తన చిన్నారి పొన్నారి చిట్టి తల్లి తన కళ్ళ ఎదుటే మృత్యుకోరల్లోకి పోబోతుంటే ఆమె ఎలా సంతోషిస్తుంది??

సల్మా లోలోన కుమిలిపోతూనే జమీలాకు జడవేసింది. నగలు కూడా పెట్టింది.

జమీలా సహజంగానే అందమైన పిల్ల. దానికి తోడు బంగారు ఆభరణాలు, ఖరీదైన కొత్త బట్టలలో ఆమె మరింత అందంగా కనిపించ సాగింది. ఆమె ముగ్ధ మనోహర సౌందర్యం చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంది.

జమీలా ఇప్పుడు పెళ్ళి పీటల మీదికెళ్తున్న నూతన వధువులా ఎంతో అందంగా ముస్తాబయి పోయింది. తన చిట్టి తల్లి నిజంగానే పెళ్ళి కూతురయి పోయింది అనుకున్నది సల్మా. అయితే ఈ పిల్ల ఇప్పుడు ఎవర్ని వరించబోతోంది? మృత్యు దేవతనా??

ఈ ఆలోచన రాగానే సల్మా హృదయం మరోసారి పగిలిపోయింది. ఆమె శరీరంలో వణుకు పుట్టుకొచ్చింది. అమితమయిన దిగులు, విచారం ఆమె ముఖాకృతినే మార్చివేశాయి. కళ్ళు బాగా లోపలికి పీక్కుపోయాయి. అయితే ఆ కళ్ళలో నుంచి కన్నీళ్ళు పొర్లిపోతూనే ఉన్నాయి.

శుభకార్యం సుతారం చూట్టానికి వచ్చిన అమ్మలక్కలు ఇదేమీ పట్టించుకోకుండా ఆనందోత్సాహాలతో ఊగిపోతూ అటూఇటూ తిరుగుతున్నారు. మరికొందరు మహిళలు చిల్లరమల్లర పనులు గబగబా ముగించేసి, జమీలా చుట్టూ చేరి కూర్చున్నారు.

కాస్సేపటికి ఖైస్ బిన్ ఆసిమ్ పట్టణ పెద్దలు, ఇతర పుర ప్రముఖులు అనేక మందిని వెంటబెట్టుకొని ఇంటికి వచ్చాడు. వారిలో అబూలహబ్, వలీద్

బిన్ ముగైరా, ఆస్ బిన్ వాయెల్, ఉత్బా బిన్ రబియా, అబూజహల్, అబూ సుఫియాన్ వంటి ఖురైష్ నాయకులు కూడా చాలా మంది ఉన్నారు. వారితో పాటు మాంత్రికుడు అబ్రష్ కూడా ఉన్నాడు.

నేరుగా వీరు జమిలా దగ్గరికి వచ్చారు. జమిలా చుట్టు కూర్చున్న స్త్రీలు వారిని చూసి ఓ పక్కకు తప్పుకున్నారు. అబ్రష్ ముందుకు వచ్చి జమిలాను చూశాడు.

జమిలా యావత్ ప్రకృతి సౌందర్యాన్ని పుణికి పుచ్చుకుందా అన్నంత అందంగా, అప్పుడే తెంచిన లేత గులాబి పువ్వులా ఉంది.

వృద్ధ మాంత్రికుడు అబ్రష్ ఆమె అందాన్ని చూసి ఆశ్చర్యచకితుడయి పోయాడు. కాస్సేపు అలా అతను చూస్తూ నిలబడ్డాడు. జమిలా సిగ్గుతో తలవంచుకుంది. అబ్రష్ చూపు మరల్చుకుని ఖైస్ వైపుకు తిరిగాడు.

"ఖైస్! ఇలాంటి అమ్మాయే బలి అర్పించడానికి కావలసింది. నిజంగా నువ్వు చాలా అదృష్టవంతుడివి, హుబల్ దేవత నీపై అపార శుభాలు వర్షింప జేయుగాక!" అన్నాడు అబ్రష్.

ఖైస్ సంతోషంతో పొంగిపోయి తనంత గొప్పవాడు లేడని గర్వపడ్డాడు.

అబ్రష్ జమిలాను సమీపించి ఆమె తల మీద చేతిని ఉంచి "పాపా! నువ్వు చాలా అదృష్టవంతురాలివమ్మా! నీ బలి మా ఆపదలను దూరం చేస్తుంది" అని అన్నాడు.

అబ్రష్ మాటల అంతరార్థం అమాయకురాలయిన చిన్నారి జమిలాకు అర్థం కాలేదు. ఆమె చక్రాల్లా కళ్ళు తిప్పుతూ అబ్రష్‌ని బేలగా చూడ సాగింది.

ఆ తరువాత అబ్రష్ ఖైస్‌ని సంబోధిస్తూ, "ఖైస్! ఇక ఈమెను తీసుకొని పద" అన్నాడు.

ఖైస్ జమిలా దగ్గరికొచ్చి, "జమిలా! ఇక పదమ్మా!!" అన్నాడు. జమిలాకు అప్పటికీ విషయం అర్థంగాక తండ్రి వైపు అమాయకంగా చూస్తూ "ఎక్కడికి నాన్న?" అన్నది. "మా వెంట పదమ్మా!" అన్నాడు ఖైస్.

జమీలా లేచి నిలబడింది. అబ్రష్‌తో సహా పురుషులంతా ముందుకు కదిలారు. జమీలా వాళ్ళను అనుసరించింది. ఆమె వెనుక స్త్రీలు నడిచారు. ఇలా పురుషులు స్త్రీలు, వృద్ధులు ఆబాలగోపాలమంతా ఖైస్ ఇంటి నుంచి బయటికి వచ్చారు. సల్మా మాత్రం ఇంటి గుమ్మం దాకా వచ్చి నిలబడింది.

ఖైస్ ఇంటి ముందు వందలాది జనం గుమికూడారు. ప్రతి తెగకు చెందిన స్త్రీలు, పురుషులు ఆ గుంపులో ఉన్నారు. స్త్రీలు డప్పులు తీసుకొని నిలబడ్డారు. పురుషుల్లో కొందరు శంఖాలు, మరికొందరు గంటలు పట్టుకొని నిల్చున్నారు.

వారంతా జమీలాను చూసి హుబల్ దేవతకు జై! అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. ఆ వెనువెంటనే శంఖారావం మార్మోగింది. ఆ తరువాత స్త్రీలు డప్పులు వాయించడం ప్రారంభించారు. యువతులు పాటలు పాడసాగారు. యువకులు గంతులు వేయడం మొదలెట్టారు. ఇలా కొంతసేపు సాగింది.

ఆ తరువాత ఈ గుంపు ఓ పెద్ద ఊరేగింపుగా మారి బయలుదేరింది. మాంత్రికుడు అబ్రష్ ఊరేగింపుకు ముందు నిలబడి సారథ్యం వహించాడు. అతను ఎడమ చేతిలో మానవ కపాలం, కుడిచేతిలో ఓ పొడుగాటి ఎముక పట్టుకొని, మెడలో ఎముకల దండ ధరించి తైల సంస్కారం లేక జడలు కట్టిన తల వెంట్రుకలను వెనుకా ముందూ వ్రేలాడదీసి, రొమ్ము విరుచుకొని ఠీవిగా నడవసాగాడు.

అతని వెనుక ఇతర మాంత్రికులు, సన్యాసులు, సాధువుల సమూహం బయలుదేరింది. వీరంతా జడలు కట్టిన పొడుగాటి తల వెంట్రుకలతో, చేతుల్లో రకరకాల మానవ అస్థికలతో, భుజాల మీద వ్రేలాడుతున్న జంతు చర్మాలతో ఎంతో భయంకరంగా ఉన్నారు. వారి వెనుక పూజారులు తాళాలు, గంటలు మోగిస్తూ నడుస్తున్నారు.

పూజారుల వెనుక స్త్రీలు ఉన్నారు. స్త్రీల మధ్య చిన్నారి జమీలా ఊరేగింపును చూసి తెగ సంబరపడిపోతూ నడవసాగింది. మహిళల వెనుక పురుషులు నడుస్తున్నారు. పురుషుల్లో ఖైస్ బిన్ ఆసిమ్, ఖురైష్ అగ్రనాయ

కులు, ఇతర పురప్రముఖులు ఉన్నారు. వారి వెనుక సామాన్య ప్రజానీకం వివిధ దేవతల పేర్లను ప్రస్తావించి జైజై నినాదాలు చేస్తూ నడవసాగింది.

● ● ●

పాపం, సల్మా మాత్రం ఊరేగింపు కనుమరుగై పోయేదాకా ఇంటి గుమ్మం దగ్గరే శిలా ప్రతిమలా నిలబడింది. జనమంతా వెళ్ళిపోయాక ఆమె "ఆ...ఆ... ఆ....హ్" అంటూ అక్కడే కుప్పకూలిపోయింది. తనను తాను సంబాళించుకోవడానికి ఎంతో ప్రయత్నించింది. కాని కళ్ళు తిరిగి పడిపోయింది.

సల్మా కాళ్ళ కింద భూమి బ్రద్దలయిపోయింది. ఆమె చుట్టూ చీకట్లు ముసురుకున్నాయి. అసలు మొత్తం లోకమే అంధకారమయమయి పోయింది. కాస్తంత స్పృహ వచ్చాక ఎలాగో పడుతూ లేస్తు ఇంట్లోకి వెళ్ళి పోయింది.

ఇల్లు పూర్తిగా కళావిహీనమయి పాడుబడిన కొంపలా మారింది. దానికి తోడు అక్కడ భయంకరమయిన నిశ్శబ్దం రాజ్యమేలసాగింది. సల్మా తనను తాను సంబాళించుకోవడానికి వృథా ప్రయాస చేస్తూ "జమీలా...!!" అంటూ మరొకసారి స్పృహ తప్పిపడిపోయింది.

● ● ●

ఊరేగింపు పట్టణ ప్రధాన వీధుల గుండా నడిచి కాబా మందిరానికి చేరుకుంది. అక్కడ జమ్‌జమ్ బావికి రెండు వైపులా ఉన్న నాయిలా, అసాఫ్ అనే విగ్రహాల ముందు అందరూ సాష్టాంగపడ్డారు.

ఆ తరువాత వారు పట్టణం వెలుపలికి వెళ్ళారు. అక్కడికి చేరుకునే టప్పటికీ జన సమూహం మరింత పెరిగిపోయింది. కొత్తగా వచ్చి చేరిన వారిలో అనేక మంది బడులలో పాలు తాగే పసిపిల్లలు కూడా ఉన్నారు.

ఈ ఊరేగింపులు మేళతాళాలతో జైజై నినాదాలతో విశాలమయిన ఇసుక మైదానం గుండా ముందుకు సాగిపోతోంది.

సూర్యుడు పడమటి దిక్కుకు వాలి చాలా సేపయినప్పటికీ ఎండ తీక్షణత ఇంకా తగ్గలేదు. నేలమీది ఇసుక బాగా వేడెక్కిపోయి పాదాలను

చుర్రున కాల్చి వేస్తోంది. సూర్యుని వాడి కిరణాలు ఒంటికి సూది మొనల్లా గుచ్చుకుంటున్నాయి.

ఈ విధంగా ఊరేగింపు సాగిపోతుంటే కొద్ది దూరంలో దాదాపు నలభై ఏళ్ళ ఒక వ్యక్తి ఎదురుగా రావడం కనిపించింది.

అతను ఎంతో అందంగా ఉన్నాడు. పైగా అతని వ్యక్తిత్వంలో ఒక విధ మయిన హుందాతనం ఉట్టిపడుతుంది. నడకలో రాజ ఠీవి కనిపిస్తోంది. ముఖం చాలా గంభీరంగా ఉంది. కళ్ళు తేజోవంతంగా ఉన్నాయి.

ఆ సమయంలో అతను చెమటలో పూర్తిగా తడిసిపోయి ఉన్నాడు. అయితే అతనివైపు ఎవరూ సూటిగా చూడలేనంత రౌద్రత, గాంభీర్యతలు అతని ముఖ వర్చస్సు నుంచి తొంగిచూస్తున్నాయి.

ఆ వ్యక్తి జన సమూహానికి దగ్గరగా వచ్చాడు. అప్పుడు అబ్రహ్ అతని వైపు ఓరగా చూశాడు. కాని ఆ విచిత్ర మనిషి ముఖంలోని రౌద్రత, గాంభీర్య తల ధాటికి తాళలేక చూపులు మరల్చుకున్నాడు." ఆ వ్యక్తి ముందుకు సాగిపోతూ అబూతాలిబ్ సమీపానికి వచ్చాడు.

"నాయనా ముహమ్మద్ (సఅసం)! ఇంత తీవ్రమయిన ఎండలో ఎక్కడికెళ్ళి వస్తున్నావు బాబూ?" అన్నారు అబూతాలిబ్ ఎంతో అప్యాయంగా పలకరిస్తూ.

"హిరా గుహ నుంచి వస్తున్నాను బాబాయీ!"అన్నాడు ముహమ్మద్ (సఅసం).

"ఎందుకు నాయనా అంత శ్రమపడుతున్నావు? నీకు నీ ఆరోగ్యం సంగతి కూడా పట్టినట్లు లేదు. సరె వెళ్ళు. ఏదయినా చెట్టు నీడ చూసుకొని కాస్త విశ్రాంతి అయినా తీసుకో" అన్నారు అబూతాలిబ్.

మహనీయ ముహమ్మద్ (సఅసం) పినతండ్రికి సలాం చేసి వెళ్ళి పోయారు. అయితే ఆయన ఈ ఊరేగింపు ఎక్కడికి వెళ్తుంది. ఎందుకు వెళ్తుంది అనే విషయం గురించి విచారించనైనా విచారించలేదు. కనీసం ఊరే గింపు వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

ఆయన వెళ్ళిపోయిన తరువాత అబ్రష్ జనంతో మాట్లాడుతూ "ఎంత రూపవంతుడు! ఎంత సచ్ఛీలుడు!! ఎంత గాంభీర్యం, హుందాతనాలు ఉట్టి పడుతున్నాయి అతనిలో!!!" అని అన్నాడు.

అబ్రష్ వెనుక నిలబడి ఉన్న ఒక వృద్ధుడు ఈ మాటలకు ప్రతిస్పందిస్తూ 'తౌరాత్, జబూర్, ఇంజీల్ వాళ్ళు ఆయన్ని శిక్షించగలిగితే స్వయంగా వారే శిక్షిస్తారు; మనకెందుకు విచారం?" అని అన్నాడు.

"నీవు చెబుతున్నది నిజమే వరఖా! కాని వారాయన్ని బహుశా శిక్షించ లేరేమో!!" అన్నాడు అబ్రష్ నిరాశగా.

"మరి వారు శిక్షించలేకపోతే ఇక దేవుళ్ళేమిటి?" అన్నాడు వరఖా బిన్ నౌఫిల్ వెంటనే.

"ఏవిటీ నువ్వంటున్నది! నువ్వు కూడా మతభ్రష్టుడయిపోయావా?" అన్నాడు అబ్రష్ ఆశ్చర్యం వెలిబుచ్చుతూ.

"అలాంటిదేమీ లేదు. నాకు అరబీ భాష వచ్చనీ, తౌరాత్, ఇంజీల్ శాస్త్రాల్లో గొప్ప పండితుణ్ణని మక్కాలో అందరికీ తెలుసు. నేను నా మతం మీద స్థిరంగా ఉన్నాను. అయితే దేవుళ్ళనే వారికి కనీసం తమను తిరస్క రించే వాళ్ళను శిక్షించగలిగే, తమను ఆరాధించే వారికి వరాలు ప్రసాదించ గలిగే శక్తి అయినా ఉండాలి కదా?" అన్నాడు వరఖా తార్కిక దృష్టితో.

"అది నిజమే. కాని అలా జరగడం లేదు" అంటూ అబ్రష్ నీళ్ళు నమిలాడు.

ఇలా ఈ జన సమూహం నెమ్మదిగా ముందుకు సాగిపోతోంది. చివరికి ఈ గుంపు మక్కా నుండి ఒక మైలు దూరం నడిచి ఓ పెద్ద ఇసుక తిన్నె దగ్గరకు చేరుకుంది. అప్పటికి ఎండ తీక్షణ చాలా వరకు తగ్గిపోయింది. కాని నేల మాత్రం ఇసుక వల్ల ఇంకా మండిపోతూనే ఉంది. అక్కడికి చేరుకోగానే పూజారులు శంఖాలు, బాకాలు, గంటలు, తాళాలు బిగ్గరగా మోగించడం ప్రారంభించారు.

కాస్సేపటికి ఒకతను ముందుకు వచ్చి "పౌరుషంగల అరబ్బులారా! వినండి, నేను నా కుటుంబ గౌరవాన్ని ఔన్నత్యాన్ని నిలబెట్టేందుకు ఇదిగో నాయీ కుమార్తెను సజీవ సమాధి చేయబోతున్నాను" బిగ్గరగా చాటి చెప్పాడు.

అతని ఒళ్ళో ఓ మూడేళ్ళ పసిపిల్ల ఉంది. అతను ఆ బాలికను కిందికి దించి నేల మీద కూర్చోబెట్టాడు. తరువాత అతను రెండు చేతులతో ఇసుక తీసివేస్తూ గుంట త్రవ్వడం ప్రారంభించాడు.

అయితే ఇసుక నేల కాలిపోతుండటంతో ఆ పసిపాప వేడి భరించలేక ఏడ్పు లంకించుకుంది. తండ్రి కోపంతో ఆమెవైపు ఉరిమి చూశాడు. కాని అతను ఉరిమి చూసినంత మాత్రాన మూడేళ్ళ పసిపాప అంత వేడిని ఎలా భరించగల్గుతుంది?

ఆ పాప ఏడుస్తూనే ఉంది. కాస్సేపట్లోనే ఆమె లేత కాళ్ళు బొబ్బ లెక్కాయి. పాప మరింత బిగ్గరగా ఏడ్వడం మొదలెట్టింది. "హూఁ ఏడ్వకు.. నోర్మూస్కో...." అంటూ ఆమె తండ్రి మందలించసాగాడు.

కాని ఆ పాప ఈ వేడిని ఎలా భరించగలుగుతుంది? ఆమె కాళ్ళు పాదాల నుంచి పిరుదల దాకా పూర్తిగా కందిపోయి బొబ్బలెక్కాయి. దాంతో ఆ పాప వేడి నుంచి తప్పించుకోవడానికి లేచి తండ్రి మోకాళ్ళను చుట్టుకుంది. కాని ఆ రాక్షసుడు ఆమెను లాగి పక్కకు నెట్టేశాడు.

పాపం ఆ పిల్ల ఇసుకలో పడిపోయి విలవిలలాడిపోయింది. మరోసారి లేచి తండ్రి మోకాళ్ళను పెనవేసుకుంది. కాని ఆ పాషాణ హృదయుడు మళ్ళీ లాగి ఆమెను ప్రక్కకు నెట్టేశాడు కసురుకుంటూ.

పాపం ఆ పిల్ల ఇసుకలో పడిపోయి విలవిల్లాడిపోయింది. మరోసారి లేచి తండ్రి మోకాళ్ళను పెనవేసుకుంది. కాని ఆ పాషాణ హృదయుడు మళ్ళీ లాగి ఆమెను పక్కకు నెట్టేశాడు కసురుకుంటూ.

పాప కింద పడిపోయి హృదయ విదారకంగా ఏడుస్తోంది. గుండెలను పిండిచేయడానికి ఇదొక్క దృశ్యం చాలు. కాని మత సంప్రదాయం పేర అక్కడ చేరిన మానవ గుంపుకు మాత్రం చీమ కుట్టినట్లయినా అనిపించలేదు. వారిలో ఒక్కడికీ మానవత్వం లేదు. అందరూ పాషాణ హృదయులే. అది పేరుకు మాత్రమే మానవ సమూహం.

గుంట త్రవ్వడం పూర్తి కాగానే కఠినాత్ముడయిన ఆ తండ్రి పాపను పట్టుకొని గుంటలో పడదోశాడు. ఆ వెనువెంటనే గబగబా ఇసుకనెట్టి

పోయడం ప్రారంభించాడు. బాలిక గుంటలో బోర్లాపడిపోయి పెడబొబ్బలు పెట్టసాగింది.

గుండెలను కరిగించివేసే ఈ భయానక దృశ్యం చూసి విశ్వంలోని అణువణువూ కంపించిపోయింది. కంపించని హృదయమంటూ ఉంటే అది ఒక్క మానవ హృదయమే. ఆ నరరూప రాక్షసులు దీనొక్క తమాషాగా భావించి ఉత్సాహంగా చూస్తున్నారు.

బాలిక హృదయ విదారకంగా ఏడుస్తూ పైకి లేవడానికి శతవిధాలా ప్రయత్నించింది. కాని తండ్రి ఆమెను పైకి లేవకుండా ఒక చేత్తో అదిమి పట్టి, మరో చేత్తో ఇసుక కుమ్మరిస్తూ పోయాడు. దాంతో పాటే పాప ఏడ్పులు, పెడ బొబ్బల ధ్వని క్రమేణా తగ్గిపోయింది.

ఈ విధంగా ఆ దుర్మార్గుడు గుంటను పూర్తిగా పూడ్చివేసి, ఏ పాప మెరుగని ఓ పసి పాపను అతిక్రూరంగా హతమార్చాడు.

అదే విధంగా ఆడ శిశువుల్ని తీసుకు వచ్చిన ఇతరులు కూడా తమ తమ చిన్నారి పాపలను గుంటలు తవ్వి సజీవ సమాధి చేశారు.

ఆ తరువాత ఈ రాతిగుండెల రాక్షస గుంపు ఆనందోత్సాహాలతో ఊగిపోతూ ఓ ప్రత్యేక స్థలంలో ఒక పెద్ద గుంట తవ్వడం మొదలుపెట్టింది. ఆ తమాషా చూడటానికి ఆబాలగోపాలం అక్కడికి చేరుకుంది.

మేళతాళాలు మరోసారి మిన్నుముట్టాయి. బాకాలు దిక్కులు పిక్క టిల్లేలా మోగసాగాయి. సాధులు, సంతులు మంత్రోచ్చారణ చేస్తూ జనంలో వీరావేశాన్ని రేకెత్తిస్తున్నారు. ఈ విధంగా కాస్సేపటికి గుంట త్రవ్వకం ముగి సింది.

ఖైస్ తన చిన్నారి జమీలాను తీసుకొని ఆ గుంట వైపుకు నడిచాడు. కొందరు మాంత్రికులు, పురప్రముఖులు అతడ్ని అనుసరించారు. ఖైస్ కుమార్తెను తీసుకొని గుంట ఒడ్డు మీద వెళ్ళి నిల్చున్నాడు.

జమీలా తొలిసారిగా గుంటవైపు భయం భయంగా చూడటం ప్రారం భించింది. ఆమె ఇంతకు ముందే ఆడపిల్లల ఏడ్పులు, పెడబొబ్బలు విన్నది.

వాళ్ళను గుంటలలో సజీవంగా పూడ్చిన భయానక దృశ్యాలను కూడా దూరం నుంచి చూసింది.

ఇప్పుడు జమీలాకు పరిస్థితి పూర్తిగా అర్థమయి పోయింది. తను ఏ గుంట ఒడ్డు మీద నిలబడిందో ఆ గుంటలో తనను కూడా పూడ్చి పెడ్తారని ఆమె అనుకున్నది. ఈ ఆలోచన మనసులో మెదలగానే ఆమె ఒక్కసారిగా నిలువునా కంపించిపోయింది. గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. దుఃఖం పొర్లుకొచ్చింది.

"నాన్నా! ఈ గుంటలో.... నువ్వు నన్నీ గుంటలో పూడ్చిపెట్టడానికి తీసుకొచ్చావా నాన్నా?" అన్నది జమీలా తడబడుతున్న కంఠంతో తండ్రి వైపు దీనంగా చూస్తూ.

"అవునమ్మా! నువ్వు సరిగ్గా అర్థం చేసుకున్నావు, మన ఆచారం ప్రకారం అరేబియాలో ఆడపిల్లలు జీవించి ఉండటానికి వీల్లేదమ్మా!" అన్నాడు ఖైస్ తన సహజ ధోరణిలో.

ఈ మాటలు వినగానే జమీలా గుండెలు ఝల్లుమన్నాయి. కాళ్ళ కింద నేల ఒక్కసారిగా కుంగిపోయినట్లు అన్పించింది.

"కాని... నాన్నా! నేను చేసిన తప్పేమిటి? నన్నెందుకు పూడ్చి పెట్టాలనుకుంటున్నావు నాన్నా?" అన్నది చిన్నారి జమీలా అమాయకంగా చూస్తూ.

"మన సంప్రదాయం, మన వంశాభిమానం అలా చేయిస్తున్నాయమ్మా! అలా చేస్తేనే మన కుటుంబ గౌరవం నిలబడుతుంది" అన్నాడు ఖైస్.

"వద్దు నాన్నా! అలా చెయ్యకు. నన్ను కనికరించు నాన్నా! నువ్వు నాకు కూడు, గుడ్డ ఇవ్వలేకపోతే పోనీ నేను ఆకలితో బాధపడుతూ దిగంబరంగానే ఉంటా నాన్నా!" అన్నది జమీలా వేటగాడ్ని చూసిన భీతహరిణిలా బిత్తర చూపులు చూస్తూ.

"తప్పదు జమిలా! ఇది మన సంప్రదాయం, మన కుటుంబ మర్యాదకు సంబంధించిన విషయం."

"వద్దు నాన్నా! నన్నప్పుడే పూడ్చిపెట్టకు. నీకు దణ్ణం పెడ్తా. నీకు దణ్ణం పెడ్తా నాన్నా!" అంటూ జమీలా తండ్రి నడుంను చుట్టేసుకొని హృదయ విదారకంగా ఏడ్వటం మొదలెట్టింది.

కాని నెమలి కన్నీరు వేటగాడికి జాలి కలిగించదు కదా! జమీలా కన్నీరు కూడా అంతే.

"ఇప్పుడు కాకపోతే మరెప్పుడు పూడ్చాలి? పెళ్లీడు వచ్చే దాకా నిన్ను బతకనివ్వాలా? నీకు పెళ్ళి చేసి, నేను అల్లుడ్ని తెచ్చుకొని యావత్తు అరబ్బుల ముందు అవమాన భారంతో కుంగిపోవాలంటావా? ఇది ఎన్నటికీ సాధ్యం కాదు" ఖైస్ ఒక్కసారిగా కస్సురుమన్నాడు కూతురి రెక్కపట్టి పక్కకు లాగివేస్తూ.

"నాన్నా! నన్ను రక్షించు. నీ కాళ్ళు పట్టుకుంటా. నీకు బానిసనయి ఉంటా నాన్నా!" అంటూ జమీలా తండ్రి కాళ్ళు పెనవేసుకొని భోరున విల పించింది.

కాని ఆ కసాయి తండ్రి గుండె కాస్తయినా కరగలేదు. సరికదా, ఆ క్రూరుడు చిన్నారి జమీలాను కాలితో విదిలించివేశాడు. దాంతో ఆ బాలిక రెండు గజాల దూరంపోయి పడింది.

"నాన్నా! నన్నప్పుడే సంపకు, నీకు పుణ్యముంటుంది. నన్ను రక్షించు నాన్న!" అన్నది జమీలా పైకి లేస్తూ.

జమీలా పైకి లేవగానే ఖైస్ క్రూర మృగంలా లంఘించి ఆమెను పొదివి పట్టుకున్నాడు. వెంటనే ఆమెను అమాంతం పైకి ఎత్తి గుంటలోకి విసిరాడు.

'వామ్మో! నే చచ్చా!!" అంటూ జమిలా గావుకేక పెట్టింది బోర్లాపడి పోతూ.

ఖైస్ ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా తొందర తొందరగా గుంటలోకి ఇసుకనెట్టి పోయడం ప్రారంభించాడు.

జమీలా పెడబొబ్బలు పెడ్తూనే లేవడానికి ప్రయత్నించింది. కాని ఇసుక అతివేగంగా వచ్చి మీద పడుతున్నందువల్ల ఆమె పైకి లేవలేక పోయింది.

అన్నెం పున్నెం ఎరుగని ఆ పసి బాలిక పెడ్తున్న ఏడ్పులకు, పెడబొబ్బలకు ఆకాశం దద్దరిల్లింది. భూమి బీటలు వారింది. రాళ్ళుద్రవించిపోయాయి. విశ్వంలోని ప్రతి అణువూ వణికిపోయింది. కాని ఆ నరరూప రాక్షసుల రాతిగుండెలే కరగలేదు. కనీసం అవి చలించనైనా చలించలేదు.

"నాన్నా! నన్ను రచ్చించు. నీకు దణ్ణం పెడ్తా నాన్నా! నా మీద ఇసుక పోయకు నాన్నా!" అంటూ జమీలా చేతులు జోడించి కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది.

అయితే కసాయి తండ్రి చేతుల్లో నుంచి ఇసుకరేణువులు వడగండ్లలా అతి వేగంగా వచ్చిపడుతూనే ఉన్నాయి.

"నాన్నా! నీ కాల్మొక్కుతా.....నాన్నా! నన్ను రచ్చించు."

జమీలా ఆక్రందన అరణ్యరోదనే అయ్యింది.

ప్రాణాపాయంలో మనిషి కటిక నిరాశా చీకట్లో సయితం కళ్ళు చించుకొని చూడటానికి విశ్వప్రయత్నం చేస్తాడు. గుంటలో పడిపోయిన జమీలా పైనుంచి నిరంతరాయంగా ఇసుకవచ్చి పడుతున్నా నిరాశా చెందకుండా మరోసారి లేవడానికి ప్రయత్నించింది. శక్తినంతా కూడదీసుకొని లేవడానికి గట్టిగా ప్రయత్నించింది. చివరికి లేచి నిలబడగలిగింది.

కళ్ళలో బాగా ఇసుక పడిపోవడం వల్ల ఆమె కళ్ళు తెరవలేకపోయింది. రోదిస్తూనే మరోసారి రెండు చేతులు జోడించి-

"నాన్నా! నీ కాల్మొక్కుతా. నన్ను చంపకు నాన్నా! నీకు పుణ్యముంటది నన్ను రచ్చించు నాన్నా!" అని అన్నది.

గుండెలను పిండే ఈ పలుకులు వింటే - తండ్రి కాదు, తోబుట్టువూ కాదు, కనీసం ముఖ పరిచయమైనా లేని దారినపోయే దానయ్య సయితం ద్రవించిపోతాడు. కరిగిపోతాడు. వెంటనే కనికరిస్తాడు.

కాని ఖైస్‌లో జాలి అనేది ఏ కోశానా లేదు. పైగా అతను కూతురి మీద మండిపడ్డాడు. ఆమెను ఒక్క త్రోపు తోసి కింద పడవేశాడు. ఆ వెనువెంటనే గుంటలోకి గబగబా ఇసుక కుమ్మరించడం ప్రారంభించాడు.

జమీలా గుండెలు పగిలేలా పెడబొబ్బలు పెడ్తూనే ఉంది. కాని ఆ పెడబొబ్బలు విని ఆమెను ఆదుకునే వారు అక్కడ ఒక్కరూ లేకపొయ్యారు. అక్కడున్న వారందరూ నరరూప రాక్షసులే! అందరూ కనికరంలేని క్రూర మృగాలే!

జమీలా కంఠ ధ్వని క్రమంగా తగ్గిపోయింది. ఆ పసికూన మీద ఇసుక పొరలు వేగంగా ఏర్పడసాగాయి. చూస్తుండగానే గుంట పూర్తిగా పడి పోయింది. ఇసుక మూపురంలా నేల మట్టానికి పైకి వచ్చింది.

జమీలా! జమీలా!! జమీలా....!!!

జమీలా నేలలో పూడిపోయింది! దయలేని ఈ ప్రపంచం నుండి కనుమరుగయిపోయింది!!

దాంతోపాటే గంటల రణగొణాలు మార్మోగాయి. విజయ శంఖారవం నలువైపులా ప్రతిధ్వనించింది. రాక్షస భక్తుల హర్షధ్వానాలు మిన్నుముట్టాయి.

ఖైస్‌లో విజయగర్వం తొంగి చూసింది. పెద్ద ఘనకార్యం చేసినట్లు, మహా పుణ్యకార్యం వెలగబెట్టినట్లు అతను తెగసంబరపడిపోయాడు.

అప్పటికి సూర్యాస్తమయమయి పోయింది. రేజీకటులు మెల్లిగా ముసురుకుంటూ పాషాణ హృదయాల పాపకార్యాలను తమలో ఇముడ్చుకున్నాయి. వచ్చిన జనమంతా తృప్తితో డప్పులు వాయించుకుంటూ ఇళ్ళకు తిరుగుముఖం పట్టారు.

• • •

"అమ్మా జమీలా ....ఆ ......ఆ. ....ఆ...!!" అంటూ అటు సల్మా గావుకేక పెట్టి మరోసారి స్పృహ తప్పిపడిపోయింది.

మొత్తం ప్రపంచమే అంధకారమయమయిపోయింది. జాలిలేని ఈ జగత్తులో సల్మా ఒంటరిదయి పోయింది. ఆమె ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోయింది. కాళ్ళు చేతులు ఢీలా పడిపోయి పీనుగలా తయారయిపోయింది.

ఆమె నోముల పంటను దుర్మార్గులు దోచుకుపొయ్యారు. ఆమె ఆశాజ్యోతిని అహంకారులు ఆర్పివేశారు. ఆమె కడుపు కోతను క్రూరులు కోసుకుతిన్నారు.

సల్మాకు సానుభూతి చూపేవారు ఆ పట్నంలో ఒక్కరంటే ఒక్కరు కూడా లేకపోయారు.

బోసిపోయిన ఇంటిలో ఆమె బావురుమని విలపిస్తుంటే అడిగే నాధుడే లేకపోయాడు. స్త్రీ హృదయం ఎరిగి, స్వాంతన పలుకులు పలికే సాటి స్త్రీలు కూడా ఆమెకు కనుకరువయిపోయారు.

సల్మా అలా సొమ్మసిల్లిపడి పోయి ఎంత సేపయిందో ఆమెకే తెలియదు. తిరిగి స్పృహ వచ్చి చూస్తే పొద్దుగుంకిపోయి, చీకట్లు ముసురుకొస్తున్నట్లు అన్పించింది.

ఆమె కళ్ళు తెరచి ఓసారి చుట్టూ కలియజూసింది. ఇల్లు దయ్యాల కొంపలా కనిపించింది. గంభీరమైన నిశ్శబ్దం ఆవరించి శ్మశాన ప్రశాంతతను తలపింపజేస్తోంది.

సల్మా మెల్లిగా లేచి కూర్చున్నది. ఆలోచిస్తే క్రమేణా అన్ని విషయాలు గుర్తుకు రాసాగాయి. మధ్యాహ్నం జమీలాకు తన చేతులతో జడవేసింది. తన చేతులతో కొత్తబట్టలు తొడిగించి పెళ్ళికూతురిలా తయారుచేసింది. ఆ తరువాత ఆమెను సజీవ సమాధి చేయడానికి కసాయి తండ్రి కబంధహస్తాలకు అందజేసింది.

ఈ ఆలోచన రాగానే సల్మా నిలువునా వణికిపోయింది. ఆమె గుండెలు మండిపోయాయి. మరోసారి కన్నీరుమున్నీరుగా విలపించసాగింది.

తన ముద్దుల కూతుర్ని ముష్కరులు పొట్టన పెట్టుకున్నారు! తన చిన్నారి జమీలాను రాకాసి గద్దలు తన్నుకు పోయాయి!! తన ముద్దుల జమీలా అమాయకపు ముఖాన్ని తాను ఎన్నటికీ మరువజాలదు.

అదిగో! తన చిన్నారి జమీలా వచ్చేస్తుంది!! తన ముద్దుల జమీలా వచ్చేస్తోంది!!!

"జమీలా! రామ్మా!! నన్నొదిలి ఎక్కడికి పోయావు తల్లీ!! నీ కోసం నేను ఎంతసేపట్నుంచి ఎదురు చూస్తున్నాననుకున్నావు. రామ్మా! నా వళ్ళోకొచ్చి కూర్చో" అంటూ సల్మా రెండు చేతులు ముందుకు జాపింది.

కాని జమీలా అక్కడ ఉంటే గదా!

"ఏవిటీ, నా జమీలా రాలేదా? నాదంతా భ్రమేనా?? అమ్మా జమీలా..!" సల్మా మరోసారి బావురుమన్నది.

ఎంత ప్రయత్నించినా ఆమె అంతరంగం నిజాన్ని ఓ పట్టాన అంగీకరించలేకపోతోంది.

కాని వాస్తవం వాస్తవమేగదా, పైగా తన జమీలా భౌతికంగా తన దగ్గర లేదిప్పుడు. ఉంటే తను పిలువగానే పరుగెత్తకు వచ్చి తన వళ్ళో వాలిపోయేది. కనీసం 'వస్తున్నానమ్మా!'అనయినా జవాబిచ్చేది. అదేమీ లేదు. అందుకే సల్మా తనకిష్టం లేకపోయినా నిజాన్ని బలవంతంగానయినా నమ్మవలసి వచ్చింది.

నిజమేనని ఒప్పుకోగానే నయనాలు మళ్ళీ కుండపోతలా వర్షించడం మొదలెట్టాయి. కన్నీటితో నిండిన ఆమె కళ్ళ ముందు మసక వెల్తురులో మళ్ళీ జమీలా అమాయకపు ముఖం ప్రత్యక్షమయింది!

'ఉహూ! నా జమీలా చావలేదు. నా కంటిపాప బతికే ఉంది. అదిగో నా జమీలా వచ్చేస్తోంది! రామ్మా జమీలా! రా!! ఎక్కడికి పోయావమ్మా నన్నొదలి? నా మీద కోపం వచ్చిందా? నిన్ను చూడకుండా ఒక్క క్షణం కూడా నేను ఉండలేనమ్మా! జమీలా రామ్మా! నిన్ను నా గుండెల్లో దాచుకుంటా రామ్మా!!"

కాని జమిలా రాలేదు. వచ్చే సూచనలు కూడా కనిపించడం లేదు.

మసక వెల్తురులో చూచాయిగా కన్పించిన జమిలా అమాయకపు ముఖం మెల్లిగా అదృశ్యమయిపోయింది.

"జమిలా....! జమిలా......! అమ్మా జమిలా....!!!" సల్మా హృదయం మండిపోతోంది. ఆమె గుండెలు తరుక్కుపోతున్నాయి. ఆమె కడుపు ఉడికి పోతోంది. కళ్ళు ధారాపాతంగా వర్షిస్తూనే ఉన్నాయి.

సల్మా అరబ్ మహిళ! అజ్ఞాన కాలపు అరబ్ మహిళ! బానిస కన్నా నీచ మయిన మహిళ!! అక్కడ ఆమెకు ఏ హక్కూ లేదు. కన్నపిల్లను కాపాడుకునే హక్కూ లేదు, చివరికి సాటి స్త్రీ ముందు మనసారా ఏడ్చుకునే హక్కు కూడా లేదు.

ఈ పురుషాధిక్యత సమాజంలో ఆడదానికి ఏ అండా లేదు. ఆడది అంటే అటు కన్నవాళ్ళకీ అలుసే, ఇటు కట్టుకున్న వాడికి అలుసే. అరబ్ మహిళలంటే సంతలో సరుకు కన్నా హీనం! గొడ్డు చాకిరి చేసే బానిసకన్నా నికృష్టం! బతికే హక్కు కూడా లేని దీనాతిదీనురాలు ఆమె.

అరబ్ స్త్రీ పురుషుని చేతిలో ఆటబొమ్మ. అతని కబంధ హస్తాల్లో అనుక్షణం నలిగిపోయే అబల.

ఏమిటీ ఈ అన్యాయం? ఎంత కాలం ఈ దారుణాలు??

'దయలేని ఓ పురుషుల్లారా! మీ హృదయాలు ఎంత కఠినమయినవి!! ఓ రాతిగుండెల రాక్షసులారా! మీరెంత దుర్మార్గులు!! మీరు మనుషులు కాదు, మనుషుల రూపాల్లో ఉన్న క్రూరమృగాలు మీరు."

"మీరు కన్న కుమార్తెలనే మీ చేతులతో సజీవ సమాధి చేస్తారా? వారి తల్లుల హృదయాలు ఎంత తల్లడిల్లిపోతాయో మీకు తెలియదా? ఇంకా మీకెప్పుడు బుద్ధొస్తుంది??" సల్మా హృదయం పురుష జాతి పట్ల తీవ్రమైన విద్వేషంతో కుతకుతలాడిపోయింది.

ఆమె తనను తాను సంబాళించుకోవడానికి ఎంతో ప్రయత్నించింది. మాటిమాటికీ పొర్లుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోవడానికి కృషి చేసింది.

కాస్సేపటికి ఆమె పరిస్థితి కాస్తంత మెరుగయ్యింది. ఆమె గోడ పట్టు కొని మెల్లగా పైకి వచ్చింది.

"ఈ ఇల్లు తగలబడిపోను! ఇక్కడిక ఒక్కనిమిషం కూడా ఉండకూడదు. వెళతాను. నా చిన్నారి జమీలా ఎక్కడికెళ్ళిందో అక్కడికే వెళతాను. ఆమెను చూడకుండా ఒక్క క్షణం కూడా ఉండలేను. నేను నా జమీలా దగ్గరికి వెళ్ళాలి. వెళ్ళి తీరాలి" అంటూ సల్మా తిరుగులేని నిర్ణయం తీసుకుంది.

నిర్ణయం తీసుకోవడమే కాదు, తక్షణమే ఇంటి నుంచి బయలు దేరింది.

అది చీకటి రాత్రి. ఆకాశంలో నక్షత్రాలు చీకటి లోయలోని మిణుగురు పురుగుల్లా మినుకుమినుకు మంటున్నాయి. మక్కా వీధులు నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉన్నాయి.

ఆ చీకటిలో సల్మా గబగబా అడుగులు వేస్తూ, పడుతూలేస్తూ ముందుకు సాగిపోతోంది. వెనక్కి తిరిగయినా చూడకుండా ముందుకు సాగిపోతోంది.

కళ్ళు చించుకున్నా కానరాని కటిక చీకటిలో సల్మా గబగబా తడబడు తున్న అడుగులతో నడచిపోతున్నది. ఇరుకు సందులలో అక్కడక్కడ పోసి ఉన్న కసువు కుప్పల మీదుగా తూలుతూ ముందుకుసాగిపోతున్నది.

అలా నడిచి కాస్సేపటికి ఆమె కాబా మందిరానికి చేరుకుంది. అక్కడ జమ్‌జమ్ బావి దగ్గర ఆమెకు అసాఫ్, నాయిలా విగ్రహాలు దర్శనమిచ్చాయి. ఆ దేవతా విగ్రహాలను చూడగానే ఆమె అప్రయత్నంగా వాటిముందు సాగిల పడింది.

"నా ఇష్టదేవతలారా! నాపై దయచూపండి. కష్టాల్లో చిక్కుకున్న ఈ అశక్తురాలిపై కనికరం చూపండి. నా చిన్నారి జమీలాను కఠినాత్ములు నానుంచి దూరం చేశారు. ఆమె లేకుండా నేను బతకలేను. నన్ను కరుణించి

నా కూతుర్ని నాకు ఇప్పించండి. నా జమీలా నా ప్రాణం. ఆహ్.... జమీలా!" అంటూ సల్మా కన్నీరు మున్నీరుగా రోదిస్తూ విగ్రహాలను వేడుకోసాగింది.

కష్టాలలో ఉన్న స్త్రీకి చీటికి మాటికి కన్నీళ్ళు రావడం సహజం. అందులో కడగండ్ల కొండలు విరుచుకుపడిన సల్మా సంగతి చెప్పనవసరమే లేదు. ఆమె దేవతా విగ్రహాల ముందు సాష్టాంగపడి హృదయవిదారకంగా విలపిస్తూ మొరపెట్టుకొంటోంది.

అలా చాలా సేపటిదాకా వేడుకొని పైకిలేచింది. మనస్సు కాస్త తేలి కయినట్లు అనిపించింది. చీరచెంగుతో కళ్ళు వత్తుకొని అక్కడ్నుంచి మళ్ళీ బయలుదేరింది.

సల్మా గుండెలు మండిపోతున్నాయి. ఆమె కడుపు తరుక్కుపోతోంది. కాళ్ళు వణికిపోతున్నాయి. అలా ఆమె ఆ చీకటిలోనే పడుతూ, లేస్తూ పట్నం వెలుపలికి వెళ్ళింది.

సరిగ్గా అదే సమయంలో ఆడపిల్లలను సజీవ సమాధి చేయడానికి పట్నం శివార్లలోకి పోయిన వాళ్ళు తిరిగి వచ్చేస్తున్నారు. దిక్కులు పిక్కటిల్లే శంఖారావంతో సహా డప్పులు, గంటల రణగొణధ్వనులు సల్మాకు మరోసారి కర్ణకఠోరంగా విన్పించసాగాయి.

ఈ మేళతాళాలే తన జమీలా జీవితానికి చరమగీతం పాడాయి. ఆ వైనం తలపుకు వస్తేనే గుండె చెరువయిపోతోంది. పొర్లుకొస్తున్న దుఃఖాన్ని సల్మా బలవంతంగా దిగమింగింది. గుండెను దిటవుచేసుకొని దారికి ఓ పక్కగా చెట్లు, గుట్టల చాటున మెల్లిగా నడవసాగింది.

జన సమూహం మేళతాళాలతో పట్నంలో ప్రవేశించింది. సల్మా ఆ సమూహం తననుదాటి దూరంగా పట్నంలోకి ప్రవేశించేదాకా ఓ గుట్టచాటున నక్కి అది కనుమరుగైపోగానే అక్కడ్నుంచి ముందుకుసాగింది. కొంచెం దూరం పోయిన తరువాత విశాలమైన ఓ నిర్జన ఇసుక మైదానం వచ్చింది. ఇక్కడ మక్కా వీధుల్లో ఉన్నంత గాఢాంధకారం లేదు. నక్షత్రాల జిలుగు వెలుగులో ఇసుకరేణువులు తెల్లగా మెరిసిపోతున్నాయి.

సల్మా మరికొంచెం దూరం నడిచి ఆడపిల్లల హత్యా స్థలానికి చేరుకుంది. అక్కడ ఎత్తయిన కొండలు చీకటిలో నల్లగా, భయంకరంగా కన్పిస్తున్నాయి.

సల్మా అక్కడ ఓ చోట నిల్చుని - "జమీలా.... ఆ.....ఆ....!!" అంటూ బిగ్గరగా అరిచింది.

ఆమె హృదయ లోతుల్లోనుంచి వెలువడగిన ఈ బాధాపూరితమైన కేక కొండలకు ఢీకొని జమీలా... జమీలా అంటూ ప్రతిధ్వనించింది.

సల్మా ఉలిక్కిపడింది.

"ఏమిటీ! నేనేగాక మరో దురదృష్టవంతురాలు కూడా తన జమీలాను జ్ఞాపకం చేసుకుంటోందా?" అంటూ ఆమె ఓసారి చుట్టూ కలియజూసింది.

కాని అక్కడ తను తప్ప మరే అభాగ్యురాలు ఉన్నట్లు కనపడలేదు. అది తన భ్రమేమోననుకొని ఆమె మళ్ళీ ముందుకు సాగింది.

సల్మా మరోధ్యాస లేకుండా కూతుర్నే తలచుకుంటూ, కాళ్ళలో సత్తువలేకున్నా మొండిగా ముందుకు నడచిపోతుంది. అలా ఆమె కొంచెం దూరం నడిచిన తరువాత-

"ఆగు.... ఎవరు నువ్వు?" అంటూ ఓ పురుష కంఠం గర్జించింది.

కూతురి ప్రేమతో వివశురాలయి పోయిన సల్మా ఈ గర్జనకు ఏమాత్రం బెదరకుండా ముందుకు అడుగులు వేస్తూనేపోయింది. కొన్ని అడుగులు ముందుకు నడిచిచూస్తే కొంచెం దూరంలో మనిషి కూర్చొని నేల త్రవ్వుతూ కనిపించాడు.

అతని పొడవైన తలవెంట్రుకలు తైల సంస్కారంలేక జడలుకట్టి భుజాల మీద చిందరవందరగా పడివున్నాయి. ముఖాకృతి భయానకంగా ఉంది. కళ్ళు అగ్ని కణాల్లా భీకరంగా ఉన్నాయి.

"నేను కష్టాల్లో పడిపోయిన ఓ దీనురాలిని" అన్నది సల్మా ఎలాంటి భయం, సంకోచం లేకుండా.

ఆమె మాటలు వినగానే ఆ వ్యక్తి లేచి నిలబడ్డాడు.

"ఏమిటీ! ఒక ఆడది ఇంత రాత్రివేళలోనా? ఇలాంటి భయంకరమైన ప్రదేశానికి రావడానికి కారణం?" అడిగాడు ఆ వ్యక్తి.

"నిస్సహాయురాలైన ఒక తల్లిని ఆమె కూతురి మమకారం ఎలాంటి భయంకర ప్రదేశానికైనా లాక్కొస్తుంది" అన్నది సల్మా పొర్లుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

"ఇంతకూ ఎవరు నీవు?" ఆ వ్యక్తి మళ్ళీ అడిగాడు.

"అమాయకురాలైన జమీలా తల్లిని" అన్నది సల్మా.

"నువ్వు సల్మావు కూదు? ఏమిటీ ఇలా పీనుగలా తయారయ్యావు! నీ శరీరంలో రక్తం ఒక్క బొట్టుకూడా ఉన్నట్లు కన్పించడం లేదే!!" అన్నాడు ఆ వ్యక్తి సల్మావైపు నఖశిఖపర్యంతం పరీక్షగా చూస్తూ.

"పదేళ్ళ బాలిక సజీవ సమాధి చేయబడితే, ఇక ఆమె తల్లి శరీరంలో రక్తం అనేది ఉంటుందా? అసలామె ఇప్పటిదాకా ఎలా బ్రతికి ఉందీ అని ఆశ్చర్యపోవాలి నువ్వు" అన్నది సల్మా.

ఆ వెనువెంటనే ఆమె "ఆహ్... జమీలా! .. ఎక్కడికి పోయా వమ్మా....!!" అన్నది బిగ్గరగా ఎంతో బాధాతప్త హృదయంతో.

గుండెను పిండివేసే ఈ బాధాపూరితమైన అరుపుకు ఆ వ్యక్తి కంపించి పోయాడు.

"సల్మా! బాధాపూరితమైన నీ కంఠధ్వని భూమ్యాకాశాలను దద్దరిల్ల జేసేదిగా ఉంది. నా గుండెలు ఝల్లుమన్నాయి. పదా నా వెంట, నీ కూతుర్ని చూపిస్తాను" అన్నాడతను.

"ఏదీ? ఎక్కడుంది నా జమీలా? నాముద్దుల కూతురు, నా కంటి పాపను చూయించి పుణ్యంకట్టుకో బాబూ!" అన్నది సల్మా ఎంతో ఆతురతతో.

"ఇక్కడే, దగ్గర్లోనే ఉంది జమీలా" అన్నాడు ఆ వ్యక్తి.

"నువ్వెవరోకాని చాలా దయార్ద్ర హృదయుడివిలా కన్పిస్తున్నావు. ఎవరు నువ్వు? ఎక్కడుంటావు??" అంటూ సల్మా అప్రయత్నంగా ఆ వ్యక్తి భుజాలమీద వాలిపోయింది.

సల్మా మాటలకు ఆ వ్యక్తి ఎంతో ప్రభావితుడయిపోసాగాడు.

"సల్మా! నేను నువ్వనుకున్నట్లు దయార్ద్రహృదయుడ్ని కాను. నేనొక నిర్దయుడయిన మనిషిని. ఏమాత్రం జాలిలేని క్రూర మృగాన్ని. ప్రజలు తమ చిన్నారి బాలికలను సజీవంగా పూడ్చిపెట్టి వెళ్ళిపోయాక, నేను రాత్రివేళల్లో వాళ్ళను బయటికి తీసి, వారి నగలను వలిచి తీసుకుంటాను. ఏ పాపయినా ఇంకా బతికే ఉంటే నేనామె గొంతు పిసికి చంపేస్తాను" అన్నాడు ఆ వ్యక్తి తనను గురంచి వివరంగా తెలియజేస్తూ.

అతని మాటలు విని సల్మా ఉలిక్కిపడి క్షణంపాటు బిత్తరచూపులు చూసింది.

"నువ్వు.....నువ్వు..." ఆమె నోటి నుంచి అంతకంటే ఎక్కువ మాటలు పెగల్లేదే.

"సల్మా! నన్ను నిందించకు. ఇప్పుడు నీ దయనీయ స్థితి చూసి నా మనస్సు కరిగిపోయింది. నీ మాటలు విని చలించిపోయాను. అయ్యో! నేనెంత పాషాణ హృదయుడ్ని...!!"

"కాని సల్మా! కాస్త నువ్వే ఆలోచించు. అభం శుభం ఎరుగని ఈ అమాయక బాలికలను సజీవంగా పూడ్చిపెడ్తున్న వారికంటే నేనెక్కువ నిర్ద యుణ్ణా? కన్న కూతుళ్ళనే తమ చేజేతులా కడతేర్చేవారి కన్నా నేనెక్కువ క్రూరుణ్ణా?? సల్మా నేనిప్పుడు మానవత్వం ఉన్న మనిషిగా మారిపోయాను. నన్ను నిందించకు. నా అంతరాత్మే నన్ను నిందిస్తోంది" అన్నాడు ఆ వ్యక్తి.

"అయితే నువ్విప్పుడు....?"

"నేనిప్పుడు పూర్తిగా మారిపోయాను. ఓహ్...! ఈ బాలికల తల్లులు ఎంత దురదృష్టవంతురాళ్ళు!! ఏ తల్లుల ఒడులలో నుంచయితే వారి పసిపాప

లను లాక్కెళ్ళి సజీవంగా పాతిపెట్టడం జరుగుతుందో ఆ తల్లుల పరిస్థితి ఎలా ఉంటుందో కదా!!" అన్నాడతను. కాస్త నా పరిస్థితి చూడు అన్నది సల్మా.

"నీ పరిస్థితి చూసి నా హృదయం పగిలిపోయింది. సల్మా! నువ్వదృష్ట వంతురాలివి. జమీలా బతికే ఉంది. జనమంతా పోయాక నేను ముందుగా ఆ పిల్లను గుంటలో నుంచి ఇసుక తొలగించి బయటికి తీశాను. చూస్తే ఆమె శ్వాస ఆడుతూ ఉన్నట్లు అన్పించింది. మొదట్లో నేను జమీలాను చంపా లనుకున్నాను. కాని ఇతర అమ్మాయిలను కూడా బయటికి తీసి వారి నగలను తీసుకొని, తరువాత జమీలా నగలను వలిచి ఆమెను చంపేద్దామన్న ఆలోచన వచ్చింది. ఈ ఆలోచన రావడంతో ఆమె బతికిపోయింది" అన్నాడు ఆ వ్యక్తి.

"ఆమె ఎక్కడుందీ ఇప్పుడు?" సల్మా వెంటనే అడిగింది.

"పద నా వెంట, చూపిస్తాను" అంటూ ఆ వ్యక్తి ముందుకు నడిచాడు.

సల్మా అతని వెనకాల నడిచింది. అతను కొంచెం దూరం వెళ్ళి ఓ గోతి వడ్డు మీద నిల్చొని "ఇదిగో చూడు" అన్నాడు.

గోతి వడ్డుమీద ఓ చిన్న శవం లాంటి మానవదేహం చలనరహితంగా పడివుంది.

ఆ వ్యక్తి సల్మాను పడిపోకుండా పొదివిపట్టుకున్నాడు. ఆమె కళ్ళు కుండపోతలా వర్షించసాగాయి.

'సల్మా! ధైర్యంగా ఉండు. జమీలా దొరికింది. ఇప్పుడు నువ్వు సంతో షించాలి" అన్నాడు ఆ వ్యక్తి.

నక్షత్రాల జిలుగువెలుగులో జమీలా ముఖం సరిగా కన్పించడం లేదు. పైగా ఆమె శరీరమ్మీద చాలా చోట్ల ఇసుక అంటుకొని వుంది. సల్మా కళ్ళు చించుకొని చూస్తూ నేలమీద కూలబడింది. ఆమెను వెంటనే ఆమె ఇసుక అంటుకొని ఉన్న జమీలా ముఖాన్ని అనేకసార్లు ముద్దు పెట్టుకున్నది.

ఆ వ్యక్తి జమీలా చుట్టూ అంటుకొని ఉన్న ఇసుకని తొలగించాడు.

సల్మా కూతుర్ని వళ్ళోకి తీసుకొని గుండెలకు హత్తుకున్నది. జమీలా వంటినిండా ఇసుక అంటుకొని ఉంది. అనేక గంటలపాటు ఇసుకలో పూడ్చి

ఉంచబడటం వల్ల ఆమెకు శ్వాసకూడా సరిగా ఆడటం లేదు. ఎంతో కష్టంగా ఊపిరిపీల్చుకుంటోంది. సల్మా అదేమీ ఆలోచించకుండా ఆమె నుదుటిపై మాటిమాటికీ ముద్దెట్టుకుంటోంది.

ఆ వ్యక్తి జమీలా దేహానికి అంటుకొని ఉన్న ఇసుకను ఒక చేత్తో తుడుచివేస్తూ మరో చేత్తో తన అంగవస్త్రం పట్టుకొని గాలివిసరసాగాడు.

సల్మా కూతుర్ని తనివితీరా ముద్దుపెట్టుకున్న తరువాత "జమీలా! కళ్ళు తెరువమ్మా! నేను దురదృష్టవంతురాలైన నీ అమ్మను తల్లీ!" అని అన్నది.

జమీలా స్పృహ తప్పి వుంది. ఆమె ఎలాంటి చలనం లేకుండా తల్లి ఒడిలో నిస్తేజంగా పడివుంది.

"సల్మా! అమ్మాయికి ఇంకా స్పృహ రాలేదు. ముందు ఆమెకు స్పృహ రానీ, తరువాత మాట్లాడుతావు గాని" అన్నాడు ఆ వ్యక్తి.

జమీలాకు స్పృహ తెప్పించటానికి సల్మా కూడా తన పయటతో గాలి విసరడం ప్రారంభించింది. చాలా సేపటిదాకా వారిద్దరు గాలి విసురుతూ కూర్చున్నారు. కాని జమీలాకు స్పృహ రాలేదు. దాంతో సల్మాకు దిగులు కలిగింది.

"అన్నా! జమీలా నన్ను దుఃఖ సముద్రంలోకి నెట్టి వెళ్ళిపోతుందా?" అన్నది ఆమె ఆందోళన వెలిబుచ్చుతూ.

"నిరాశపడకమ్మా! మన దేవతలను వేడుకో. వాళ్ళే మన జమీలాను సల్లగా సూడాలి."

సల్మా ఈ మాటలు విని జమీలా బ్రతికే ఆశలు లేవని అనుకున్నది. ఈ ఆలోచనరాగానే ఆమె మరింత ఆందోళన చెందింది. ఆమె కళ్ళు మరోసారి నీటి ఊటలయి పారడం మొదలెట్టాయి.

సల్మాకు ఆ వ్యక్తి ఎవరో తెలియదు. అసలతని పేరేమిటో కూడా ఆమె ఎరుగదు. అతను సల్మాకు పూర్తిగా అపరిచితుడు. అయినప్పటికీ అతను ఈ ఆపద సమయంలో ఎంతో సానుభూతి వెలిబుచ్చాడు.

ఏ స్త్రీ పట్లయినా ఒక వ్యక్తి సానుభూతి చూపితే ఆ స్త్రీలో అతని యెడల సహజంగానే గౌరవాభిమానాలు జనిస్తాయి. సల్మా హృదయంలో కూడా ఇప్పుడు ఆ అపరిచిత వ్యక్తిపట్ల గౌరవాభిమానాలు జనించాయి. దాంతో సల్మా అతడ్ని తన అన్నగా భావించసాగింది.

ఆ భావంతో ఆమె అతని భుజాలపై వాలిపోయి "కాపాడండి, నా జమీలాను కాపాడండి. ఆమె లేకుండా నేను జీవించలేను. నా కంటిపాపను ఎలాగైనా కాపాడండి" అంటూ చంటి పిల్లలా ఏడ్వడం ప్రారంభించింది.

సల్మా దయనీయ పరిస్థితి చూసి ఆ వ్యక్తి మరింత చలించిపోయాడు. తీవ్రమయిన బాధతప్త హృదయంలో నుండి వెలువడిన ఆమె మాటలకు అతను ఎంతో ప్రభావితుడయ్యాడు.

"సల్మా! నిరాశ చెందకు. కాస్త ఓర్చుకో. జమీలా చాలా సేపటిదాకా ఇసుక కింద పడి ఉండటం వల్ల స్పృహ తప్పింది. గాలి బాగా వీచడంతో ఆమె మీద పోయబడిన ఇసుక చాలా వరకు తొలగిపోయింది. లేకపోతే ఆమె ఎప్పుడో చచ్చిపోయి ఉండేది. ఇప్పుడు జమీలాకు ప్రాణాపాయం తప్పినట్లే. ఎక్కడయినా కొంచెం నీళ్ళు దొరికితే బాగుంటుంది. ముఖం మీద నీళ్ళు చిలికితే ఆమె త్వరగా స్పృహలోకి వస్తుంది" అన్నాడు ఆ వ్యక్తి.

"అయ్యో! ఈ ఎడారి ప్రదేశంలో నీళ్ళు ఎక్కడ దొరుకుతాయి? నీళ్ళు మక్కాలోనే దొరుకుతాయి" అన్నది సల్మా నిరుత్సాహంతో.

"కాని మక్కాకు నేను వెళ్ళలేను. అక్కడ నాకు చాలా మంది శత్రువులు ఉన్నారు. వారిలో ఎవరయినా నన్ను చూస్తే ప్రాణాలతో వదలి పెట్టడు."

"అయితే నువ్విక్కడే జమీలా దగ్గర ఉండు, నేను మక్కా వెళ్ళి నీళ్ళు తీసుకొస్తా" అన్నది సల్మా వెంటనే.

'కాని నీ పరిస్థితి సరిగాలేదు. నిన్ను నీవు అదుపులో ఉంచుకునే స్థితిలో లేవు. మక్కాపట్నం ఇక్కడ్నుంచి చాలా దూరం ఉంది. పైగా కటిక రాత్రివేళ. ఈ గాడాంధకారంలో నువ్వు దారి తప్పే ప్రమాదం కూడా ఉంది" అన్నాడా వ్యక్తి.

"ఒక పని చేద్దాం. నేను జమీలాను భుజం మీద ఎత్తుకొని నడిచి మక్కాపట్నం వెలుపల దించుతాను. అక్కడ్నుంచి నువ్వు జమీలాను తీసుకొని వెళ్ళు" అన్నాడు ఆ వ్యక్తి.

"ఏమిటీ, నేను మక్కా తిరిగి వెళ్ళిపోగలనా? జమీలా తండ్రి నన్ను ఇంట్లోకి రానిస్తాడా??" అంటూ సల్మా అనుమానం వెలిబుచ్చింది.

"ఇంట్లోకి రానివ్వడం కష్టమే."

"కష్టం కాదు, అసాధ్యం, మరేం చేద్దాం?" అన్నాడు ఆ వ్యక్తి ఏమీ పాలుపోక.

"నన్ను, జమీలాను ఇక్కడే వదిలేసి నీ దారిన నీవు వెళ్ళిపో. నేనీ ఎడారి ప్రదేశంలో నా కూతుర్ని తీసుకొని ఎలాగో అలా కాలం కొంచెం వెళ్ళ బుచ్చుతాను" అన్నది సల్మా లేనిపోని ధైర్యాన్ని కూడదీసుకోవడానికి ప్రయత్నిస్తూ.

"ఇక్కడ ఎలాంటి పరిస్థితులకు గురికావలసి వస్తుందో తెలుసా నీకు? పగటి వేళ ఎండ నిప్పులు కురుస్తుంది, చెంపలు పగిలిపోయేలా తీవ్రమయిన వడగాడ్పులు వీస్తాయి. ఇసుక రేణువులు అగ్ని కణాల్లా మండిపోతుంటాయి. ఇలాంటి ప్రదేశంలో ఎలా ఉంటావమ్మా?" అన్నాడా వ్యక్తి.

"ఉండలేకపోతే నేను, నా కూతురు ఇద్దరం మాడిపోయి ఒకేసారి చస్తాం" అన్నది సల్మా నిర్ణయాత్మక భావంతో.

"అంటే నువ్విక నీ భర్త ఇంటికి తిరిగి వెళ్ళిపోనని గట్టిగా నిర్ణయించుకున్నావన్నమాట."

"ఎలా వెళ్ళగలను? నా బిడ్డకు స్పృహ వచ్చి, నేనీమెను తీసుకొని మక్కా వెళ్తే ఖైస్ నన్ను, నా జమీలాను ఇంట్లో అడుగుపెట్టనిస్తాడా?" అన్నది సల్మా.

"అడుగు పెట్టనివ్వడు."

"మరి నేను ఇంటికి ఏ విధంగా వెళ్ళిపోగలను?"

"సరే నా వెంట పద. నేను నీకు ఆశ్రయం కల్పించడానికి ప్రయత్నిస్తాను" అన్నాడు ఆ వ్యక్తి.

"అన్నా నువ్వు నా మీద ఇంత దయ చూపినందుకు నేను నీకెంతో రుణపడి ఉన్నాను. కాని నేనంత భారం నీ మీద ఎలా మోపగలను?" అన్నది సల్మా కృతజ్ఞతాభావంతో అతనివైపు చూస్తూ.

"ఇందులో దయాదాక్షిణ్యాల మాట ఏమీ లేదు. మానవ సానుభూతి మాత్రమే. సల్మా! నేను ఓ గంట ముందు వరకు ఎంతో పాషాణ హృదయుడ్ని. నాలో దయ, జాలి అనేవి ఏ కోశానా ఉండేవి కావు. నేను ఎందరో అమాయక బాలికలను నిర్దాక్షిణ్యంగా పీకలు నులిమి చంపేశాను. ఆ తరువాత నువ్వు నన్ను మానవుడిగా మార్చావు. నా మనసులో దయాదాక్షిణ్యాలు కలిగించావు. నేను నిన్ను నా చెల్లెలిగా, జమీలాను నా చెల్లెలి బిడ్డగా భావించి పోషిస్తాను" అన్నాడు ఆ వ్యక్తి సల్మాకు ధైర్యం కలిగిస్తూ.

"నీకు నేను ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. అన్నా, ఇంతకూ నువ్వు ఎక్కడ ఉంటావు? నీ పేరేమిటి??" అన్నది సల్మా.

"తాయెఫ్‌కు పోయే దారిలో నఖ్‌లా అనే ఓ ఊరు ఉంది. దానికి ఈ వల కొంచెం దూరంలో ఒక ఒయాసిస్సు ఉంది. అక్కడ మా తెగవాళ్ళు గుడారాలు చేసుకొని ఉన్నారు" అన్నాడు ఆ వ్యక్తి.

"ఇక్కడ్నుంచి ఎంత దూరం ఉంటుంది?"

"ఏడెనిమిది మైళ్ళు ఉండవచ్చు."

"అంత దూరం జమీలాను ఎవరు మోసుకెళతారు?" అన్నది సల్మా.

"నేను మోసుకెళతాను. అయినా ఈ పాప ఎంత బరువుందని....?"

"అన్నా! నీ మేలును నేను ఎన్నటికీ మరచిపోలేను. ఇంతకూ నీ పేరేమిటో చెప్పలేదు" అన్నది సల్మా కృతజ్ఞతా చూపులతో అతడ్ని చూస్తూ.

"నా పేరు అసద్. అసలు పేరు మరుగున పడిపోయి అసద్ అనే పేరే స్థిరపడిపోయింది. నా అసలు పేరు హారిస."

"మరి అసద్ అనే పేరు ఎలా వచ్చింది?" అడిగింది సల్మా కుతూహలంతో.

"మా తెగలో నాకంటే గొప్ప పరాక్రమవంతుడు ఎవరూ లేరు. మా తెగ బనీ బకర్ తెగకు చెందిన ఒక శాఖ. ఖాతాన్ తెగవాళ్ళు మాకు ప్రత్యర్థులు. ఒకసారి ఆ తెగవాళ్ళు మాపై దాడి చేశారు. ఆ యుద్ధంలో నేను ఒకడ్నే ఇరవై మంది శత్రువుల్ని చంపేశాను. ఆ రోజు నుంచి నా పేరు అసద్ (పులి)గా ఖ్యాతి చెందింది" అన్నాడు హారిస తన పేరును గురించి వివరంగా తెలుపుతూ.

"కాని బనీబకర్ దేశ దిమ్మరి తెగ కదా?" అన్నది సల్మా.

ఔను బనీబకర్ దేశ దిమ్మరి తెగే. మేము కూడా ఏ ఒక్క చోటా స్థిరంగా ఉండము. దేశ దిమ్మరి జీవితం నీకిష్టమయితేనే నా వెంట వచ్చేయి" అన్నాడు హారిస.

"తప్పకుండా వస్తాను. నాకిష్టమే. సరే, జమీలాను ఎత్తుకో" అన్నది సల్మా.

హారిస లేచి స్పృహ కోల్పోయి ఉన్న జమీలాను భుజం మీదికి ఎత్తుకున్నాడు. సల్మా కూడా లేచి అతని వెంట బయలుదేరింది. ఇద్దరూ తాయెఫ్ వెళ్ళే దారి పట్టారు.

హారిస ఎంతో బలిష్ఠుడు. అతనికి జమీలా బరువు ఓ పూల గుత్తిలా మాత్రమే అన్పించింది. అందువల్ల అతను ఆ బాలికను సునాయాసంగా మోసుకొని నడవసాగాడు. సల్మా అతని వెనకాల నడుస్తోంది.

అది అర్ధరాత్రివేళ. నలువైపులా గాడాంధకారం వుంది. అయితే నక్షత్రాల జిలుగువెలుగులో ఇసుక రేణువులు తెల్లగా మెరిసిపోతూ దారి స్పష్టంగా కనిపిస్తోంది. తెల్లటి ఇసుక మేటల శ్రేణి ఒకవైపు నూర్, గార్ కొండలదాకా చేరి అంతమయిపోయింది. రెండవ వైపు కనుచూపు మేర దాకా విస్తరించి ఉంది. పగలల్లా మండుతూ ఉండిన ఇసుక ఇప్పుడు అతి చల్లగా మారిపోయింది.

సల్మా హారిస నాలుగైదు మైళ్ళు నడిచారో లేదో దూరం నుంచి పశువుల అరుపులు వినిపించసాగాయి.

"సల్మా! ఏదో వర్తక బిడారం వస్తున్నట్లుంది" అన్నాడు హారిస.

"ఇవి ఒంటెల అరుపులు బహుశా ఈ వర్తక బిడారం మక్కా వెళు తుందనుకుంటాను" అన్నది సల్మా.

"అలాగే అన్పిస్తోంది. బహుశా ఈ వర్తక బిడారం సిరియా నుంచి వస్తు న్నట్లున్నది" అన్నాడు హారిస.

"నిజం. నువ్వు సరిగ్గా అర్థం చేసుకున్నావ్. ఈ వాణిజ్య బృందం తిరిగి వచ్చేస్తోందన్న వార్త మక్కాలో అనేక రోజుల నుంచి వినిపిస్తోంది. ఇది ఖురైషీయుల వాణిజ్య బృందం" అన్నది సల్మా.

"పద, మనం దారి నుంచి ఒక వైపుకు తొలిగిపోదాం. మన మీద వాళ్ళ దృష్టి పడితే మనల్ని నిలదీస్తారు. అనవసరంగా మనం చిక్కులో పడిపోతాం" అన్నాడు హారిస.

"నిజమే వాళ్ళు నన్ను తిరిగి మక్కాకు లాక్కెళ్ళే ప్రయత్నం కూడా చేయవచ్చు."

"ఇటురా. అదుగో, ఆ కన్పిస్తున్న ఇసుక తిన్నె చాటుకు వెళ్ళి దాక్కుందాం. బిడారం మనల్ని దాటివెళ్ళిపోయాక మళ్ళీ ప్రయాణం సాగిద్దాం" అన్నాడు హారిస.

ఆ తరువాత వాళ్ళిద్దరూ వడివడిగా నడిచి, కొండలాంటి ఓ పెద్ద ఇసుక తిన్నె చాటుకు వెళ్ళి దాక్కున్నారు. హారిసా, జమీలాను దించి ఇసుక మీద పరుండబెట్టాడు. జమీలాకు ఇంకా స్పృహ రాలేదు.

కాస్సేపటికి వర్తక బిడారు రాసాగింది. అనేక ఒంటెలు ఒకదాని వెనుక ఒకటి ఓ పెద్ద వరుసలో నడుస్తున్నాయి. వాటి మీద వ్యాపార సామగ్రి ఉంది. వర్తకులలో కొందరు ఒంటెల మీద కూర్చుని ఉన్నారు. మరికొందరు గుర్రాల మీద కూర్చున్నారు. ఇంకొందరు కాలినడకన వస్తున్నారు. ఒంటెలు మెల్లగా నెమరువేస్తూ ఓ ప్రత్యేకమయిన వేగంతో నడుస్తున్నాయి.

బిడారు ఎంతో పొడవుగా ఉన్నందున చివరి ఒంటె రావడానికి చాలా సేపు పట్టింది. వర్తక బృందం ఆ ప్రదేశం దాటి చాలా దూరం పోయిన తరువాత హారిస లేచి జమీలాను భుజం మీదికి ఎత్తుకున్నాడు.

సల్మా హారిస మళ్ళీ ప్రయాణం సాగించారు. అలా వాళ్ళిద్దరూ ఆ రాత్రంతా నడిచి ఉషోదయానికల్లా ఒక ఒయాసిస్సు దగ్గరికి చేరుకున్నారు. అది చాలా పెద్ద ఒయాసిస్సు. చుట్టూ దట్టమయిన ఖర్జూర చెట్లతో అది ఎంతో మనోహరంగా ఉంది. ఉషోదయపు చల్లటి పిల్ల తెమ్మెరలు మనసును గిలిగింతలు పెడ్తున్నాయి. ఖర్జూరపు చెట్ల మధ్య చెరువు ఒడ్డున అనేక తోలు గుడారాలు ఉన్నాయి. ఆ గుడారాల ముందు జనం కంబళ్ళు కప్పుకొని పడుకొని ఉన్నారు. అది తెల్లవారు సమయం కనుక ప్రతి వస్తువూ స్పష్టంగా కన్పించసాగింది.

సల్మా, హారిస ఇద్దరూ ఓ గుడారం దగ్గరికి చేరుకున్నారు. హారిస, జమీలాను దించి గుడారం ముందు పచ్చిక మీద పడుకోబెట్టాడు. తరువాత అతను గుడారంలోకి ప్రవేశించి ఓ కంబళి తీసుకొని బయటికి వచ్చాడు. ఆ కంబళిని నేల మీద పరచి, దాని మీద జమిలాను పండబెట్టాడు.

మళ్ళీ అతను గుడారంలోకి వెళ్ళి, ఓ చెక్క చెంబుతో నీళ్ళు పట్టుకొచ్చి జమీలా ముఖం మీద చిలకరించాడు. అలా రెండు మూడుసార్లు నీళ్ళు చిలకరించిన తరువాత జమీలాకు స్పృహ రాసాగింది.

ఆమె మెల్లిగా కళ్ళు తెరుస్తూ "అబ్బా! నాన్నా!!" అన్నది.

సల్మా ఆమె మీదికి వంగి చూస్తూ "కఠినాత్ముడయిన మీ నాన్న పేరు ఎత్తకు జమీలా!" అన్నది భర్తను లోలోన అసహ్యించుకుంటూ.

జమీలాకు ఇప్పుడు పూర్తిగా స్పృహ వచ్చింది. ఆమె తన తల్లిని పరిశీలనగా చూస్తూ ఆమెను గుర్తించడానికి ప్రయత్నించింది. చివరికి ఆమె తన తల్లేనని గ్రహించగలిగింది.

జమీలా తన లేత హస్తాలను సల్మా భుజాల మీద ఉంచుతూ "అమ్మా!" అన్నది.

"అమ్మా జమీలా!" అంటూ సల్మా కూతుర్ని ఎత్తి అప్రయత్నంగా గుండెలకు హత్తుకుంది. జమీలా కూడా తల్లిని పెనవేసుకుంది.

హారిస తల్లీ కూతుళ్ళను ఏకాంతంగా వదలి ఓ పక్కకు తప్పుకున్నాడు.

సల్మా కూతుర్ని అనేకసార్లు గుండెలకు హత్తుకున్నది. తనివితీరా ముద్దాడింది. పోయిందనుకున్న తన పెన్నిధి తిరిగి లభించినప్పటికీ ఆమె హృదయం మరొకసారి గతంలోకి తొంగిచూసింది- తన ఆశల హరివిల్లును కారు మేఘాలు కప్పివేశాయి. తన కంటి పాపను తన నుండి దూరం చేశారు. తన ముద్దుల కూతుర్ని సజీవ సమాధి చేశారు. తన గుండెల్లో మంటలను రేపారు.

ఈ ఆలోచన రాగానే సల్మా కళ్ళు మరోసారి జలపాతాలయి అశ్రుధారలు పొంగిపొర్లాయి. అవి ఆమె చెక్కిళ్ళ మీదుగా కారి జమీలా నుదుటిపై పడ్డాయి.

"ఎందుకమ్మా నువ్వు ఏడుస్తున్నావు? ఇప్పుడేమయింది?" అన్నది జమీలా తల్లివైపు అమాయకంగా చూస్తూ.

"లేదమ్మా! ఏమీ కాలేదు" అన్నది సల్మా మరోసారి కుమార్తెను గాఢంగా హృదయానికి హత్తుకుంటూ.

"మరెందుకు ఏడుస్తున్నావు?" జమీలా మళ్ళీ అదే అమాయకపు చూపులతో చూస్తూ అన్నది.

"లేదమ్మా! నేనిక ఏడ్వనుగా" అన్నది సల్మా చిరునవ్వు నవ్వడానికి విశ్వప్రయత్నం చేస్తూ.

తను ఏడిస్తే కూతురు ఎంతో బాధపడిపోతుందని సల్మాకు తెలుసు. అందుకే ఆమె వెంటనే ఏడ్వడం మానేసి కొంగుతో కళ్ళొత్తుకున్నది. ఆ తరువాత ఆమె జమీలా వంటికి, అంటుకొని ఉన్న ఇసుకను చేతులతో మెల్లిగా తుడిచి వేసింది. ఆమె బట్టలను కూడా విదిలించింది.

"అమ్మా! నాన్నగారు ఎక్కడున్నారమ్మా?" అన్నది జమీలా తండ్రిని మరోసారి జ్ఞాపకం చేస్తూ.

"జమీలా! నువ్వు మాటిమాటికి ఆ కఠినాత్ముడ్ని గురించి ఎందుకు అడుగుతావు?" అన్నది సల్మా లోలోన భర్త మీద మండిపడుతూ.

"ఆయన మా నాన్నగారు కదమ్మా!"

"ఔను, మీ నాన్నే, దయాదాక్షిణ్యాలు లేని నాన్న! నిన్ను సజీవంగా నేలలో పూడ్చిపెట్టిన నాన్న!!" అన్నది సల్మా కోపాన్ని బలవంతంగా దిగ మింగుతూ.

"ఆయన నన్నెందుకు గుంటలో తోసినట్టు? నా మీద ఆయనకు ప్రేమ లేదా అమ్మా?" అన్నది జమీలా అమాయకంగా ప్రశ్నిస్తూ.

"అమ్మా! అరేబియా చాలా పెద్ద దేశమమ్మా! ఇక్కడ అమ్మాయిలను సజీవంగా పూడ్చిపెట్టే సంప్రదాయం సాగుతోంది. చాలా తక్కువ మంది బాలికలే ఈ సంప్రదాయం నుంచి బయటపడతారు.

హా....

"ఈ దుష్ట సంప్రదాయానికి ప్రతి ఏడూ ఎంత మంది బాలికలు బలయి పోతున్నారో! అరేబియా నుండి ఇది ఎప్పుడు అంతమయిపోతుందో!!" అన్నది సల్మా.

"కాని అమ్మా! నేను మాత్రం నాన్న దగ్గరికే పోతానమ్మా!" అన్నది జమీలా తండ్రి మీద చావని మమకారంతో.

సహజంగా ఆడపిల్లలకు తల్లి మీదకన్నా తండ్రి మీదే ఎక్కువ ప్రేమ ఉంటుంది. అంతేకాదు, తండ్రి ఎంత దుర్మార్గుడయినాసరే తల్లిపైకన్నా తండ్రి పైన్నే ఎక్కువ మమకారాన్ని పెంచుకొని ఉంటారు. జమిలా పరిస్థితి కూడా అంతే. ఈ ధోరణి సల్మాకు ఆశ్చర్యం కలిగించింది.

"జమీలా! నాన్న అంటే నీకు ఇప్పటికీ ఇష్టమేనమ్మా?" అన్నది ఆమె.

"ఔనమ్మా! నాన్న అంటే నాకు ఎంతో ఇష్టం. నాన్న దగ్గరికి వెల్దాం అమ్మా! ఆయన నన్ను ఒక్కసారి చూశారంటే చాలు, సంతోషపడిపోతారు" అన్నది జమీలా.

"సంతోషిస్తారో లేక నిన్ను, నన్ను నరికి పోగులుపెడతారో!! పిచ్చిపిల్లా! నీకు విషయం ఓ పట్టాన అర్థం కాదు. నా ఖర్మ! సరే అలాగే వెళదాంలే" అన్నది సల్మా అమాయకపు కూతుర్ని తృప్తి పరచటానికే.

"సరేలే అలాగే వెళదాం. కాని ఇప్పుడు మాత్రం కాదు" అన్నది సల్మా మళ్ళీ కూతురి తృప్తి కోసం.

"మరెప్పుడు ఎల్దాం?" అన్నది జమిలా అమాయకంగా తల్లివైపు చూస్తూ.

"మీ నాన్నగారు మనల్ని తీసికెళ్ళడానికి వచ్చినప్పుడు" అన్నది సల్మా.

"అమ్మా! మనం ఇప్పుడు ఎక్కడికి వచ్చాం? ఇది మన పట్నం కాదే! ఇదేదో తోటలాగుంది" అన్నది జమిలా కొత్త పరిసరాల వైపు చూసి ఆశ్చర్య పోతూ.

"ఔనమ్మా! ఇది తోటే. మన పట్నంకాదు. మీ నాన్న నిన్ను గుంటలో పడదోసి, మీద ఇసుక పోసి వెళ్ళిపోయాడు. ఆ రోజు రాత్రి నేను పుట్టెడు దుః ఖంతో కుమిలిపోతూ నిన్ను పూడ్చిన గుంట దగ్గరికి వచ్చాను. అప్పుడు ఒక దయామయుడు నిన్ను గుంటలో నుంచి బయటికి తీశాడు. తరువాత మన ల్నిద్దర్నీ ఇక్కడకు తీసుకువచ్చాడు. తరువాత మనల్నిద్దర్నీ ఇక్కడకు తీసుకు వచ్చాడు. ఇప్పుడు మనం అతని అతిథులం" అన్నది సల్మా వివరంగా చెబుతూ.

"అమ్మా! మరి ఆ దయామయుడు ఏడి? ఎక్కడున్నాడు?? అడిగింది జమిలా.

అంతలో హారిసా అక్కడికి వచ్చేశాడు.

"ఇతనేనమ్మా! ఆ దయామయుడు" అన్నది సల్మా వ్రేలితో హారిసా వైపు చూపుతూ.

"పాపా! మీ అమ్మ అన్నట్లు నేనసలు దయామయుణ్ణే కానమ్మా!! నేనో క్రూర మృగాన్ని, పచ్చి స్వార్థపరుడ్ని, పరమ దుర్మార్గుణ్ణి. ఏ మాత్రం జాలిలేని నరహంతకుడ్ని. అయితే మీ అమ్మ నన్ను కొన్ని క్షణాల్లో మానవత్వం ఉన్న మంచి మనిషిగా మార్చివేసింది. ఆమెకు నేనెంతో రుణపడి ఉన్నాను" అన్నాడు హారిసా.

దానిపై సల్మా ఏదో చెప్పబోయింది. కాని వెంటనే హారిసా ఆమె నోటి మీద చేయి పెడ్తూ ఇలా అన్నాడు:

"నన్నింకా చెప్పనివ్వు సల్మా! చేసిన పాపాలను చెప్పుకుంటే మనస్సుకు కాస్తంత శాంతి లభిస్తుంది. నాకు తెలుసు. నువ్వు నన్ను పొగడాలను కుంటు న్నావు. కాని నేనసలు ఎలాంటి పొగడ్తలకు అర్హుడ్ని కాను. నేను పరమ కిరాత కుడ్ని. నా యీ కబంధహస్తాలు ఎంత మంది అమాయక బాలికల గొంతులు నులిమేశాయో! ఇలాంటి పాషాణ హృదయుడు పొగడ్తలకు ఎలా అర్హుడవు తాడు? ఎన్నటికీ కాడు. నిజానికి నువ్వే ఎంతో శీలవతివి, పుణ్యాత్ము రాలివి. నువ్వే నాకు సచ్ఛీలం, సాధుస్వభావాలను గురించి బోధించావు. ఇప్పుడిక నేను తప్పకుండా మంచివాడిగా మనుగడ సాగించడానికి ప్రయత్నిస్తాను.

సల్మా! ఇక లేచి జమీలాకు స్నానం చేయించు. ఈ రోజు నుంచి జమీలా నా పెంపుడు కూతురు. ఆమె సుఖసంతోషాల కోసం నేను నా సర్వ స్వాన్ని ధారపోయడానికి సిద్ధంగా ఉన్నాను."

ఈ మాటలు చెప్పి హారిసా నీళ్ళు తీసుకురావడానికి వెళ్ళిపోయాడు. సల్మా హారిసా మాటలు విని ఆనందభరితురాలయ్యింది. ఆమె హృదయం హారిసా పట్ల కృతజ్ఞతా భావోద్రేకాలతో నిండిపోయింది.

సల్మా సంతోషంతో పరవశించిపోతూ జమీలా జడవిప్పింది. హారిసా నీళ్ళ కడవ తీసుకొచ్చి ఆమె దగ్గర పెట్టి వెళ్ళిపోయాడు. సల్మా గుబురుగా ఉన్న ఖర్జూర చెట్ల మధ్యకు జమీలాను తీసికెళ్ళి స్నానం చేయించింది. ఆ తరువాత ఆమెకు ఉతికిన బట్టలు తొడిగించింది.

అప్పటికి పొద్దు పొడిచింది.

ఉదయభానుడి బంగారు కిరణాలతో ఇసుక రేణువులు మెరిసి పోసాగాయి. పక్షులు తమ రెక్కలను టపటపలాడిస్తూ ఎగిరిపోవడానికి ఆయత్తపడుతున్నాయి. గుడారాలలో నిద్రపోతున్న జనం లేచి కాలకృత్యాలు తీర్చుకోవడంలో నిమగ్నులయిపోయారు. వారిలో స్త్రీలు, పురుషులు, పిల్లలు అంతా ఉన్నారు.

వీరంతా ఒకే తెగకు చెందినవాళ్ళు. ఈ తెగ ఏనాడూ ఒక్క ప్రదేశంలో స్థిరంగా ఉండదు. దేశతిమ్మరి జీవితమంటేనే వారికి ఇష్టం. పట్నాల్లో నివసించడాన్నయితే వారు పెద్ద తప్పుగా భావిస్తారు. సంచార జీవనం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రతీకగా తలుస్తారు. అందువల్ల వారు తాము కోరుకున్న చోట తమకిష్టమయినంత కాలం ఉంటారు. ఇక చాలనుకోగానే మరో చోటికి తరలి వెళతారు.

అరేబియాలో అనేక తెగలు ఇలాంటి సంచార జీవితాన్నే గడుపుతుంటాయి. దీనివల్ల వారిలో సహజంగానే ధైర్యపరాక్రమాలు జనిస్తాయి. ఈ తెగ స్త్రీలు కూడా ధైర్య సాహసాల్లో పురుషులతో పోటీపడుతుంటారు. పురుషులు జీవితావసర వస్తువులు కొనడానికి ఏదైనా జనావాసంలోకి వెళ్ళినప్పుడు స్త్రీలు నిర్జన ఎడారి ప్రదేశాల్లోని తమ గుడారాలలో ఎలాంటి భయము, భీతి లేకుండా నిశ్చింతగా ఉంటారు.

హారిసా తెగ ప్రజలు కాలకృత్యాలు తీర్చుకొని అందరూ కలసి ఓ ప్రత్యేక గుడారానికి చేరుకున్నారు. ఆ గుడారం లోపల ఓ పెద్ద విగ్రహం ఉంద ;న మంతా ఎంతో భక్తి శ్రద్ధలతో ఆ విగ్రహం ముందు సాష్టాంగపడ్డారు. తరువాత లేచి తమతమ స్థానాలకు, పనులకు వెళ్ళిపోయారు.

ఈ తెగ ప్రజలకు ఒక నాయకుడు ఉన్నాడు. అతడ్ని వీరు ఎంతో గౌరవిస్తారు. అతని ఆదేశం దైవ శాసనంగా చెలామణి అవుతుంది. ఆ నాయకుడు వృద్ధుడు. తల గడ్డం పూర్తిగా నెరసిపోయి ఉన్నాయి. అయితే అతను చాలా బలిష్ఠంగా ఉన్నాడు అతని పేరు అద్దీ.

సూర్యుడు రెండు చారలు పైకి వచ్చి గుడ్లు మిటకరిస్తూ చూస్తున్నాడు.

ప్రజలు తమ నాయకుని చుట్టూ మూగి అతని ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. హారిసా కూడా అద్దీ దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. కాస్సేపటికి అతను జమీలా, సల్మాల వృత్తాంతమంతా అద్దీకి వినిపించాడు. అద్దీ చుట్టూ కూర్చున్న వాళ్ళు కూడా ఆ వృత్తాంతం విన్నారు.

హారిసా మాటలు విని అద్దీ క్షణంపాటు మౌనంగా ఉండిపోయాడు. నాయకుడు దీనిపై ఏం చెబుతాడో విందామని ప్రజలు ఉత్కంఠతతో ఎదురు చూడసాగారు.

"హారిసా నువ్వు చేసింది మంచి పని కాదోయ్! ఈ సంగతి మక్కా వాసులు వింటే మన మీదికి దాడి చేయడానికొస్తారు. మనమూ వారిని ఎదిరించే స్థితిలో లేము" అన్నాడు వృద్ధ నాయకుడు.

"అది నిజమే. కాని నేను వీరిద్దరికీ ఆశ్రయం ఇస్తానని మాటిచ్చాను" అన్నాడు హారిసా.

"మాటిచ్చావా? అలాగయితే ఇక దానిపై మరో మాటకు అవకాశమే లేదు. నువ్వు వాళ్ళిద్దర్నీ నీ రక్షణలోకి తీసుకొని, వారికి ఆశ్రయం కల్పిస్తానని వాగ్దానం చేశావు. కనుక మేమంతా కూడా వారికి ఆశ్రయం ఇస్తున్నాం. ఇప్పుడు మనకు, మన తెగవాళ్ళకు మక్కావాసుల వల్లగాని, లేదా మరెవరి వల్లగాని ఏదయినా ప్రమాదం సంభవిస్తే మనమంతా చివరి రక్తపు బొట్టు చిందేవరకు పోరాడుతూ, సల్మాను, ఆమె కూతుర్ని రక్షిద్దాం" అన్నాడు అద్దీ దృఢ సంకల్పంతో.

"ప్రజలారా! చెప్పండి, మీరంతా సల్మాను, ఆమె కూతురు జమీలాను రక్షిస్తారా?" అన్నాడు అతను తన తెగ వాళ్ళను ఉద్దేశించి.

"తప్పకుండా రక్షిస్తాము. మా సోదరుడు ఒకతను వారికి ఆశ్రయం ఇచ్చాడు గనక, మేమంతా వాళ్ళిద్దర్నీ రక్షిస్తాము. తుదిశ్వాస వరకూ మేము వాళ్ళను కాపాడుతూ ఉంటాము" అన్నారు ప్రజలంతా ముక్త కంఠంతో.

"హారిసా! ఇక వెళ్ళు. వెళ్ళి సల్మాకు ఈ శుభవార్త వినిపించు. వాళ్ళిద్దరి పోషణ ఖర్చులు నేను భరిస్తాను" అన్నాడు అద్దీ.

ఈ మాటలు వినగానే హారిసా హృదయం నాయకుని పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. అతను అప్రయత్నంగా లేచి గౌరవ సూచకంగా అద్దీ ముందు చేతులు కట్టుకొని ఒకింత తలవంచాడు.

"ప్రభూ! చాలా చాలా కృతజ్ఞతలు. ఏలినవారు అనుమతిస్తే మరొక్క మాట."

"ఏమిటో చెప్పు" అన్నాడు అద్దీ.

"తమరు ఒప్పుకుంటే వాళ్ళిద్దరి పోషణ బాధ్యతను నేను తీసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు హారిసా ఎంతో వినయ విధేయతలతో.

"కాని హారిసా! ఇది నా హోదాను చులకన చేసేదిగా ఉంది. ఇతర తెగలవాళ్ళు వింటే ఏమనుకుంటారు?" అన్నాడు అద్దీ.

"ఏమనుకుంటారు, తమర్ని ఎంతో పొగడ్తారు. ఒక అల్పుడి విన్నపాన్ని అతని తెగనాయకుడు ఒప్పుకున్నాడని అంటారు" అన్నాడు హారిసా.

"సరే మంచిది. ఇది నాకు సమ్మతమే" అన్నాడు అద్దీ చిరునవ్వుతో.

హారిసా సంతోషంతో పొంగిపోతూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. అతను తన నాయకునితో జరిపిన చర్చల వివరాలన్నీ సల్మాకు వినిపించాడు. దాని వల్ల సల్మాకు మరింత సంతోషం కలిగింది.

బయటి వారికి ఆశ్రయం ఇచ్చే విషయంలో ఆనాటి అరేబియాలో ఒక పద్ధతి ఉండేది. ఎవరినైనా తమ రక్షణలోకి తీసుకోవడం జరిగితే, ఆ వ్యక్తిని కాపాడటం తమ విద్యుక్త ధర్మం అని భావించే వారు ఆనాటి అరబ్బులు. ఆ భావనతో వారు అంతిమ శ్వాసదాకా అతడ్ని రక్షిస్తుంటారు. ఆ వ్యక్తిని తీసుకోవడానికి ప్రత్యర్థి తెగవాళ్ళు ఎంత తీవ్రమయిన దాడి చేసినా సరే వారు చివరి దాకా ప్రతిఘటిస్తుంటారు.

సల్మా, జమీలాలు హారిసా దగ్గర నివసించసాగారు, హారిసా భార్య కూడా ఉంది. ఆమె సల్మాకు జమీలాకు సంతోషంగా స్వాగతం చెప్పింది. వారిద్దరి పట్ల ఎంతో దయ, సానుభూతులతో మెలగసాగింది.

హారిసా ఉన్ని వ్యాపారం కూడా చేస్తుంటాడు. అతని దగ్గర అనేక మేకలు, గొర్రెలు ఉన్నాయి. అతని భార్య ఈ మేకల, గొర్రెల, మందలను కాయడమేగాక, వాటి నుంచి ఉన్ని తీసి దారాలను వడుకుతుంది.

సల్మా పనిపాటా లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ హారిసా ఇంట్లో అతిథిగా ఉండటం తప్పుగా భావించింది. అందువల్ల ఆమె మరుసటి రోజు నుంచే ఉన్ని దారం వడకే పని మొదలెట్టింది. హారిసా భార్య సాది ఎంత వారించినా సల్మా వినలేదు. హారిసా భార్యకు ఇప్పుడు మేకలు కాసే పని మాత్రమే మిగిలిపోయింది.

కొన్నాళ్ళకు సల్మా తన కుమార్తెను సాదీ వెంట మేకలు కాయడానికి పంపడం ప్రారంభించింది. జమీలా ప్రతిరోజూ ఎంతో ఆసక్తిగా సాదీ వెంట మేకలు కాయడానికి వెళుతుండేది. మేకలను కాసేపని బాగా నేర్చుకున్నాక ఆమె సాదీని ఇంట్లో వదలి ఒంటరిగానే మేకలను గొర్రెలను తోలుకెళ్ళి మేపడం మొదలుపెట్టింది. అప్పటి నుంచి సాదీ ఇంటిపట్టునే ఉండి వంట పనులు చూసుకునేది.

జమీలాకు కాస్తంత యుక్త వయస్సురాగానే హారిసా ఆమెకు విలు విద్య, కత్తిసాము మొదలయిన యుద్ధ కళలను నేర్పసాగాడు. కొన్నాళ్ళ లోనే జమీలా యుద్ధ కళలో ఆరితేరింది. ఈ తెగ స్త్రీలేగాక, యావత్ అరబ్ తెగలకు చెందిన స్త్రీలంతా విలువిద్య, కత్తిసాము తప్పనిసరిగా నేర్చుకునే వారు. ఆత్మ రక్షణ కోసం అరేబియాలో స్త్రీలు కూడా యుద్ధకళ నేర్చుకోవడం ఆనాడు అనివార్యమయింది.

జమీలా ప్రతిరోజూ ఉదయాన్నే విల్లు, బాణాలు తీసుకొని మేకల మందను తోలుకొని వెళ్తుంది. పగలల్లా ఆ ఎడారి ప్రదేశంలో మేకలను మేపు కుంటూ తిరుగుతుంటుంది. అక్కడ ఎటు చూసినా కనుచూపు మేరలో ఇసుక సముద్రాలు లేదా కొండల్లాంటి ఇసుక తిన్నెలు తప్ప మరేమీ కన్పించేవి కాదు. పేరుకు ఒక పచ్చని చెట్టు కూడా ఉండదు.

మేకలు, గొర్రెలు ఒయాసిస్సు దరిదాపుల్లో ఉండే పచ్చిక, ఆకులు తింటాయేమోగాని ఆ భయంకర ఎడారి ప్రదేశంలో ఇసుక రేణువులు తప్ప వాటికి తినడానికి మరేమీ లభించదు. వాటితోనే అవి కడుపు నింపుకొని, సాయంత్రం వేళ ఒయాసిస్సుకు తిరిగొచ్చి మంచి నీళ్ళు తాగుతాయి.

ఎడారి ప్రదేశంలో అప్పుడప్పుడు హఠాత్తుగా సుడిగాలులు కూడా వీస్తాయి. మధ్యాహ్నం వేళ నుంచి ఇసుక రేణువులు నిప్పుకణాల్లా మండి పోతుంటాయి. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జమీలా మేకలను ఇసుక తిన్నెల దాపుల్లోకి తోలుకొచ్చి కూర్చుంటుంది.

ఈ మేకలు, గొర్రెలు హారిసా దగ్గరే కాదు, దాదాపు తెగవాళ్ళందరి దగ్గరగా ఉన్నాయి. అందరికన్నా ఎక్కువగా అద్దీ దగ్గర ఉన్నాయి. అతని కూతురు రుఖియా కూడా మేకలను కాస్తుంది. అయితే మేకలను కాసే వాళ్ళంతా వేర్వేరుగా తమతమ మేకలను తోలుకెళ్ళి కాస్తుంటారు. సాయంత్రం చీకటి పడకముందే ఇళ్ళకు చేరుకుంటారు.

కొంతకాలానికి రుఖియా, జమీలాల మధ్య స్నేహం కుదిరింది. అప్పటి నుంచి వాళ్ళిద్దరూ కలసి మేకలను కాయడానికి వెళ్ళడం ప్రారంభిం చారు. ఈ విధంగా జమీలా జీవితం మూడేళ్ళు మేకలను కాయడంలోనే గడచి పోయాయి.

ఓరోజు తెగలోని పురుషులంతా జీవితావసర వస్తువులు కొని తెచ్చు కోవడానికి ఉదయాన్నే బయలుదేరి వెళ్ళిపోయారు. యువతులు కూడా మేకల మందలను తోలుకొని బయటికి వెళ్ళిపోయారు. డేరాల్లో స్త్రీలు, పిల్లలు మాత్రమే ఉండిపోయారు.

జమీలా, రుఖియా ఆ రోజు మేకలను తోలుకొని ఒయాసిస్సుకు తూర్పుదిశగా ఒక మైలు దూరం వరకు వెళ్ళారు. అక్కడ మేకలను వదలి పెట్టి వాళ్ళిద్దరు ఒక ఎత్తయిన ఇసుక తిన్నె మీదికి ఎక్కారు. అది కొండలాంటి ఎంతో ఎత్తయిన ఇసుక గుట్ట. దాని మీదికి ఎక్కడం చాలా కష్టం. ఏ మాత్రం కాలు జారినా ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయినట్లే. అయితే జమీలా రుఖియాలు మాత్రం కబుర్లు చెప్పుకుంటూ దాన్ని సునాయాసంగా ఎక్కగలిగారు.

ఆ ఎడారి ప్రదేశంలో వాళ్ళిద్దరికి మేకలు, గొర్రెలే స్నేహితులు. తమ కాపరుల పట్ల వాటికీ అభిమానమే. ఈ నోరులేని జీవాలు వాళ్ళిద్దరు ఎటువెళ్తే

అటు వాళ్ళ వెనకాలగా తిరుగుతుంటాయి. వాళ్ళతోపాటు ఇప్పుడు ఇవి కూడా ఇసుక కొండపైకెక్కాయి.

సూర్యుడు బారెడు పైకి ఎదిగి వచ్చాడు. అయితే ఎండ ఇంకా తీక్ష ణంగా మారలేదు పిల్లతెమ్మెరలు మెల్లిగా వీస్తున్నాయి. వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది జమీలా, రుఖియాలు ఒక చోట కంబళి పరచు కొని కూర్చున్నారు.

జమీలా ఇప్పుడు చిన్నపిల్ల కాదు. నిండు యవ్వనంలో అడుగుపెట్టిన పడుచు పిల్ల. ఆమె హృదయ సాగరంలో యౌవ్వనపు కెరటాలు పరవళ్ళు తొక్కసాగాయి. యవ్వనంలోని వంపుసొంపులు ఆమె సౌందర్యాన్ని ద్విగుణీ కృతం చేశాయి. విశాలమయిన ఆమె కళ్ళు అసాధారణమయిన కాంతులు వెదజల్లుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే తోటి యువతులు సయితం అసూయ చెందేటంత సౌందర్యరాసిగా ఆమె పరిణతి చెందింది.

రుఖియా కూడా అందమయిన అమ్మాయే. కాని జమీలా అంత అందగత్తెమటుకు కాదు. ఇద్దరూ కబుర్లు చెప్పుకోవడంలో మునిగిపోయారు.

సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చి తన వాడి కిరణాలతో నేలను దహింప జేయనారంభించాడు. స్నేహితురాళ్ళిద్దరూ లేచి అటూ ఇటూ చూడసాగారు.

కాస్సేపటికి పడమటి దిశగా దుమ్ము లేపడం కనిపించింది. ఇద్దరూ సంభ్రమాశ్చర్యాలతో అటువైపే చూడసాగారు. ఆ ధూళి క్రమంగా ఉధృతం కాసాగింది.

"జమీలా! పద, మన తెగపై దాడి చేయడానికి ఏదో తెగ వస్తున్న ట్లుంది. ఇక్కడ్నుంచి మనం తొందరగా వెళ్ళిపోవాలి" అన్నది రుఖియా కొంచెం ఆందోళన వెలిబుచ్చుతూ.

"ఆగు రుఖియా ఆందోళన పడకు, బహుశా అది ఏదైనా వర్తక బిడారు అయి ఉండొచ్చు" అన్నది జమీలా.

"కాదు, కాదు. వర్తక బిడారం అయితే ఇంత వేగంగా దూసుకు రాదు. చూడు, ఆ ధూళి అంతకంతకు ఎలా ఎక్కువైపోతున్నదో" అన్నది రుఖియా.

జమీలా, రొఖియా ఇద్దరూ ఇసుక గుట్టపై నుంచి త్వరత్వరగా దిగడం ప్రారంభించారు. ఈ గుట్ట కొండలా ఎంతో ఎత్తుగా ఉంది. దాన్ని ఎక్కడం ఎంత కష్టమో దిగడం కూడా అంతే కష్టం. దిగేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్త వహించినా జారి క్రిందికి దొర్లిపడిపోయే ప్రమాదం ఉంది.

అందువల్ల వాళ్ళిద్దరూ మెల్లిగా క్రిందికి దిగసాగారు. అలా సగం దూరం క్రిందికి దిగారు. అంతలో దూరాన కన్పించిన ధూళి విడిపోయి రౌతులు అతివేగంగా రావడం కనిపించింది. ఆ తరువాత కొన్ని క్షణాల్లోనే వారు ఒయాసిస్సు దిశగా స్నేహితురాంద్రు ఇద్దరూ తీవ్ర ఆందోళన చెందారు.

"జమీలా! వాళ్ళు మన గుడారాలవైపుకే దౌడు తీస్తున్నారు. తొందరగా నడు" అంటూ రొఖియా వేగంగా దిగడం ప్రారంభించింది.

"మరీ అంత వేగంగా నడవకు రొఖియా జారి పడ్తావు" అన్నది జమీలా.

కాని జమీలా మాటలను ఖాతరు చేయులేదు రొఖియా. ఆమె వడివడిగా అడుగులు వేస్తూనే దిగుతోంది. అలా ఓ పది పన్నెండు గజాలు నడిచిందో లేదో 'దభీమని' జారిపడింది. జమీలా వంగి ఆమె రెక్క పట్టుకోవడానికి ప్రయత్నించింది. కాని దానికి ముందే రొఖియా క్రిందికి దొర్లింది.

అలా రొఖియా దొర్లుతూ పోతుంటే జమీలా ఏమీ చేయలేక బాధపడుతూ చూడసాగింది. ఆమె యథాప్రకారం మెల్లిగానే దిగుతోంది.

పాపం! రొఖియా అంత ఎత్తు నుంచి జారడం వల్ల పల్టీలు కొడ్తూ అతి వేగంగా దొర్లసాగింది. ఆమె ఎన్నోసార్లు సంబాళించుకొని లేవడానికి ప్రయత్నించింది. కాని అలా ప్రయత్నించిన ప్రతిసారీ శరీరం కింది ఇసుక జారి ఆమె మరింత క్రిందికే దొర్లుతూ పోయింది. ఆ విధంగా దొర్లుకుంటూ ఆమె ఏ గోతిలో పడిపోతుందోనని జమీలా భయపడిపోతూ నిదానంగా దిగుతోంది.

జమీలా వెనకాల ఆమె మేకలు, రొఖియా మేకలు, కూడా క్రిందికి దిగుతున్నాయి. రొఖియా మేకలు, రొఖియా జారి క్రిందికి దొర్లిపోతూ ఉండటాన్ని గమనించాయి. వెంటనే వాటిలో కొన్ని మేకలు శరవేగంతో రొఖియా వైపుకు పరుగెత్తాయి.

ఈ మూగ జీవాలకు తన యజమానురాలిపై ఎంత భక్తి భావమో కాని, వాటి పరుగులో ఆమెను కాపాడాలన్న తపన స్పష్టంగా గోచరిస్తోంది. ఓ లావు పాటి మేకయితే మరింత వేగంగా పరుగెత్తి ఆమెను చేరుకుంది.

వెంటనే రొఖియా దాని చెవి పట్టుకోగలిగింది. యజమానురాలు తన చెవిని పట్టుకోగానే ఆ మేక తన ముంగాళ్ళను ఇసుకలోకి దూర్చి స్థిరంగా నిలబడింది.

ఆ మరుక్షణమే రొఖియా రెండో చేత్తో మేక మెడ పట్టుకొని మెల్లిగా పైకి లేచింది. చాలా దూరం దొర్లడం వల్ల ఆమె బట్టలు, శిరోజాలు ఇసుకతో నిండిపోయాయి.

రొఖియా లేచి నిలబడగానే మేక వీపును ప్రేమగా నిమిరింది. మేక కూడా తన యజమానురాలి ప్రాణాన్ని కాపాడగలిగానన్న సంతృప్తి భావంతో ఆమెవైపు మొహమెత్తి సంతోషంగా చూడసాగింది.

జమీలా జాగ్రత్తగా నడుస్తూ కాస్సేపటికి రొఖియాను చేరుకుంది.

"నా మాట విన్నావు కాదుగా! తొందరపాటు పర్యవసానం ఇట్లాగే ఉంటుంది" అన్నది ఆమె స్నేహితురాలిని మృదువుగా మందలిస్తూ.

"ఎట్లాగో బతికి బయటపడ్డా. నా ముద్దుల మేక నన్ను రక్షించింది" అన్నది రొఖియా చిరునవ్వుతో.

"ఆపద సమయంలో ఈ నోరు లేని పశువు నీకు ఎంతో సహాయ పడింది. ఒకవేళ అది రాకపోయినా నీకొచ్చే పెద్ద ప్రమాదం ఏముందని? కాకపోతే మరి కొంచెం దూరం దొర్లుతూపోతావు, అంతేగా!" అన్నది జమీలా పరిహాసంగా.

"కాని, నాకు చాలా భయమేసిందే. కాస్త ఇసుక తిన్నె వైపు చూడు ఎంత ఎత్తుగా ఉందో కొండలా. అంత ఎత్తు నుంచి క్రిందికి దొర్లితే శరీరం ఒడుసుకు పోదూ? మొత్తానికి మన దేవతలు నన్ను రచ్చించారు" అన్నది రొఖియా.

"నిజమే, హుబల్ (దేవుడు) మనల్ని కనికరించాడు. లేకపోతే ఎంత ఘోరం జరిగిపోయేదో! అంత ఎత్తు నుంచి దొర్లిపడే మనిషి ప్రాణంతో బయట పడటం చాలా కష్టం" అన్నది జమీలా ఇసుక తిన్నెవైపు చూస్తూ.

"అంతా మన హుబల్ దయ" అన్నది రొఖియా బట్టలకు అంటు కున్న ఇసుక రేణువుల్ని విదిలించుకుంటూ.

"తొందరగా కానియ్యవే! అవతల కొంపలంటుకుంటున్నాయి" అంటూ జమీలా కూడా ఆమె బట్టలకంటుకున్న ఇసుకను దులుపసాగింది. అలా దులుపుతూనే ఆమె తన వ్రేళ్ళతో రొఖియా పక్కలో మృదువుగా పొడిచింది.

రొఖియా గిలిగింతలతో ఎగిరిపడింది.

"జమీలా! నువ్వు మరీ పెంకి దానివిగా తయారవుతున్నావు" అన్నది రొఖియా చిరునవ్వుతో.

"ఏమిటీ! ఏమయింది!?" అన్నది జమీలా తానేమీ ఎరగనట్లు అమాయకంగా చూస్తూ.

అలా అంటూనే ఆమె మరొ సారి రొఖియా పక్కలో మెల్లిగా గిల్లింది.

రొఖియా 'అబ్బ' అంటూ మరోసారి ఎగిరిపడింది.

"ఓహో! అదా సంగతీ! ఉండు నీ పనిపడ్తా' అన్నది రొఖియా.

"ఏమిటే, ఏమయింది నీకు ఇలా ఎగిరెగిరి పడ్తావు? ఇప్పటిదాకా బాగానే ఉన్నావుగా!!" అన్నది జమీలా అమాయకంగా ముఖం పెట్టుకొని.

"ఏవిటా సంగతీ? అసలు ఏం జరిగిందే?" అన్నది జమీలా యధా ప్రకారం సీరియస్‌గానే.

"ఎంత సంగనాచి తుంగ బుర్రవు! అసలు నువ్వు ఇవన్నీ ఈ ఎడారి ప్రాంతంలో ఉండి ఎట్లా నేర్చుకున్నావే?

"నువ్వెట్లా నేర్చుకున్నావో అట్లాగే నేర్చుకున్నాగాని, కాస్తా అటు చూడు ఆ బందిపోటు ముఠా ఒయాసిస్సు వైపు ఎట్లా దౌడుతీస్తుందో" అన్నది జమీలా.

"ఔనౌను. మర్చేపోయాం మనం. తొందరగా నడు. ఆ దుర్మార్గులు మన గుడారాలకు చాలా దగ్గరగా చేరుకున్నారు" అన్నది రొఖియా వేగంగా అడుగులు వేస్తూ.

ఇద్దరూ ఇసుక కొండమీది నుంచి దిగి ఒయాసిస్సు వైపు బయలు దేరారు. మేకలు కూడా వారిని అనుసరించాయి.

"అయ్యయ్యో! గుడారాల్లో ఒక్క మగవాడు కూడా లేడే. అంతా ఆడ వాళ్ళు, పిల్లలే ఉన్నారు ఇప్పుడెట్లా?" అన్నది జమీలా ఆందోళన వెలి బుచ్చుతూ.

"ఇప్పుడు మనం ఆడవాళ్ళమే ఆ దుర్మార్గుల్ని ఎదుర్కోవాలి."

"ఆ... అట్లాగే చేద్దాం.... కాని మన బరిసెలు ఏవి?" వాటిని మనం ఇసుక తిన్నె మీదే వదిలేసి వచ్చేశామే!" అన్నది జమీలా.

"పెద్ద పొరపాటు జరిగిపోయింది. ఇప్పుడేం చేద్దాం?" అంటూ రొఖియా అయోమయంగా జమీలా వైపు చూడసాగింది.

"ఆయుధాలు లేకుండా ఉత్తచేతులతో వెళ్ళడం మంచిదికాదు. నువ్వి క్కడే ఉండు నేనెళ్ళి తీసుకు వస్తా" అన్నది జమీలా.

"నేను కూడా వస్తా పద" అన్నది రొఖియా.

అలా ఇద్దరూ వెనక్కి వెళ్ళి ఇసుక తిన్న మీదికి ఎక్కారు మళ్ళీ. అక్కడ వదిలేసిన ఈటెలను తీసుకొని జాగ్రత్తగా అడుగులు వేస్తూ తొందర తొందరగా దిగడం ప్రారంభించారు. మేకలు కూడా వారితోపాటు ఇసుక కొండ పైకి ఎక్కి, కిందికి దిగసాగాయి.

"రొఖియా! అటు చూడు దుండగులు ఒయాసిస్సులోకి జొరబడ్డారు. తొందరగా నడు" అన్నది జమీలా.

ఆ... అంటూ రొఖియా వడివడిగా నడవడం మొదలుపెట్టింది. మేకలు కూడా వేగంగా వాళ్ళిద్దరి వెంట నడవసాగాయి.

స్నేహితురాండ్రు ఇద్దరూ ఒయాసిస్సు సమీపానికి చేరుకునేటప్పటికి గుడారాల్లో స్త్రీల, పిల్లల హాహాకారాలు మిన్నుమిట్టాయి. ఈ ఏడ్పులు, పెడ బొబ్బలు విని వారి గుండెలు గుభేలు మన్నాయి.

సూర్యుడు తన వాడి కిరణాలతో ఇసుక నేలను మాడ్చివేస్తున్నాడు. జమీలా, రుఖియాల వాడిన ముఖాలు చెమటల కక్కుతున్నాయి. వాళ్ళిద్దరు ఒయాసిస్సులోని తమ గుడారాలకు చేరుకునేటప్పటికీ జరగవలసిన ఘోర మంతా జరిగిపోయింది.

గుడారాల్లో ఉన్న స్త్రీలు తమ శాయశక్తులా శత్రువులతో పోరాడారు. కాని వారు ఎంత పెనుగులాడినా మగ శత్రువుల ముందు అబలలు అబలలే. ఈ యుద్ధంలో కొందరు స్త్రీలు, వీరోచితంగా పోరాడి నేల కొరిగారు. మరి కొందరు తీవ్రంగా గాయపడి శత్రువులకు లొంగిపోయారు.

దుర్మార్గులు చాలా మంది స్త్రీల చేతుల్ని తాళ్ళతో కట్టివేశారు. కొందరు స్త్రీలు, పిల్లలు చనిపోయినవాళ్ళను చుట్టుకొని హృదయ విదారకంగా ఏడ్వ సాగారు. మరికొందరు ఆడవాళ్ళు నిల్చొని నిస్సహాయంగా చూస్తూ వెక్కివెక్కి ఏడుస్తున్నారు. ఏ మాత్రం కనికరం లేని శత్రువులు పసిపిల్లలను సయితం బంధించడానికి పూనుకున్నారు.

ఈ దృశ్యం చూడగానే జమీలా, రొఖియాలకు దుఃఖంతోపాటు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వారి పౌరుషం పరవళ్ళు తొక్కింది. రక్తం ఉడికి పోయింది. ఉద్రేకం ఉప్పెనలా పొంగింది.

అపరిమితమయిన కోపోద్రేకాలు మనిషిని అనాలోచితం చేస్తాయి. వెనకా ముందూ ఆలోచించడానికి ఏ మాత్రం వ్యవధినివ్వవు.

జమీలా, రొఖియాలు కోపోద్రేకాలతో ఊగిపోతూ బందిపోటుల ముందుకు వచ్చి నిల్చున్నారు. అందం, అమాయకత్వాలతో కూడిన వారి ముఖారవిందాలను చూసి బందిపోటులు క్షణంపాటు మంత్ర ముగ్ధులయి పోయారు. బాలికల కలువ నేత్రాల నుండి రాలుతున్న అగ్ని కణాలు కూడా వారికి అందమయిన అరుణ కాంతుల్లా గోచరించసాగాయి.

"దుర్మార్గులారా! ఈ అమాయక స్త్రీలను, పిల్లలను, వెంటనే వదలి పెట్టండి" గర్జించింది జమీలా.

ఖైదీ అయిన మహిళల్లో సల్మా కూడా ఉంది. ఆమె జమీలాను చూడ గానే "జమీలా! వచ్చావా నా చిట్టితల్లి! నువ్వీ సమయంలో రాకుండా ఉంటే ఎంత బాగుండేది!" అని అన్నది.

జమీలా రౌద్ర ముఖంలోని విచిత్ర సౌందర్యాన్ని చూసి, ఆమె గర్జన లోని వీణానాదం వంటి మధుర కంఠస్వరం విని బందిపోటులు ఆశ్చర్య పోయారు.

"అమ్మాయిలూ! ఈటెలు కింద పడేయండి, మేము మీ పట్ల మర్యాదగా ప్రవర్తిస్తాము" అన్నాడు వారిలో ఒక వృద్ధుడు.

"మర్యాద.....! జాలి, కనికరం లేని రాతి గుండెలు మీవి. మీరు మాపట్ల మర్యాదగా కూడా ప్రవర్తిస్తారా!? మీరు మర్యాదస్తులయితే అన్నెం పున్నెం ఎరుగని ఈ అమాయక స్త్రీలను, పిల్లలను తక్షణమే వదలిపెట్టండి. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది" అన్నది రుఖియా కారాలు మిరియాలు నూరుతూ.

"అహ్హాహ్హాహా! మీరు బెదరగొట్టినంత మాత్రాన మేము బెదిరిపోతా మనుకున్నారా? పిచ్చిపిచ్చిగా ప్రవర్తించకండి. మర్యాదగా ఈటెలు కింద పడే యండి; మిమ్మల్ని మేము సగౌరవంగా బంధించి తీసుకెళతాం" అన్నాడు మరొ దుర్మార్గుడు వెటకారంగా నవ్వుతూ.

"క్రూరమృగాల్లారా! అహంకారంతో విర్రవీగకండి. బనూబక్ర్ తెగ స్త్రీలు మీకు భయపడి ఆయుధాలు కిందపడవేసే అంతటి పిరికిపందలనుకున్నారా?

అసంభవం. అలా ఎన్నటికీ జరగదు" అన్నది జమీలా తోకతొక్కిన త్రాచు పాములా కస్సుమంటూ.

ఈ మాటలు వినగానే ఒకడికి ఒళ్ళు మండిపోయింది. వాడు వరలో నుంచి చఱ్ఱున ఖడ్గం తీసి జమిలా వైపునకు అతివేగంగా నడిచాడు. అదే సమయంలో అటువైపునుంచి రొఖియా చేతిలోని బరిశె మిరుమిట్లు గొలుపుతూ పిడుగు వేగంతో గాలిలోకి దూసుకుపోయింది. ఖడ్గం కూడా గాలిలోకి లేచింది. కాని దానికి ముందే బరిశె ఆ దుర్మార్గుడి పక్కలో దిగి పోయింది. వాడు ఓ గావుకేక పెట్టి మొదలు నరికిన కాండంలా నేలకొరిగాడు.

ఈ హఠాత్పరిణామంతో బందిపోటులు మరింత మండిపడ్డారు. వెంటనే వారిలో ఒకడు రొఖియా మీద, మరొకడు జమీలా మీద లంఘించారు.

పరిస్థితిని ఎదుర్కోవడానికి ముందే సిద్ధంగా ఉన్న జమీలా, ఏమాత్రం ఆలస్యం చేయకుండా చేతిలోని ఈటెను బలంగా విసిరింది. అది నేరుగా పోయి శత్రువు గుండెలో దిగబడింది. అంతే, వాడు కూడా నేలకొరిగి రక్తపు మడుగులో గిలగిల కొట్టుకోసాగాడు.

రెండోవాడు తన కరవాలంతో రొఖియా ఈటె మీద లాగికొట్టాడు. ఆ దెబ్బకు ఈటెకున్న కత్తి విరిగి దూరంగా పడిపోయింది. తక్షణమే రొఖియా తన చేతిలో మిగిలిపోయిన బరువైన పొడుగాటి పిడినే రెండు చేతులతో పైకెత్తి ప్రత్యర్థి తలమీద విసరికొట్టింది.

ప్రత్యర్థి కూడా అజాగ్రత్తగా లేడు. అతను పైకి ఎగిరి ఎంతో చాకచక్యంత పిడి దెబ్బనుంచి తప్పించుకున్నాడు. కాని ఆ మరుక్షణమే జమీలా చేతిలోని బరిశె మెరుపువేగంతో అతని డొక్కలో నుంచి దూసుకుపోయింది. వాడు దిక్కులు పిక్కటిల్లేలా ఓ పొలికేకపెట్టి నేలమీద దభీమని పడిపోయాడు.

ఈ ఓటమి శత్రువులను ఇంకా రెచ్చగొట్టింది. వారు ఆగ్రహోదగ్రులయి పోయారు. వారిలోని క్రూరత్వం పడగవిప్పింది. వెంటనే వారు ఆ బాలికల పైకి

నలువైపుల నుంచి విరుచుకుపడ్డారు. దుర్మార్గుల బారినుంచి తప్పించుకోవడానికి బాలికలు శత విధాలా పోరాడారు. కాని అంతమంది క్రూరులతో వీళ్ళిద్దరు ఎంతసేపని పెనుగులాడగలరు. చివరికి వారు శత్రువు లకు లొంగిపోయారు. వెంటనే ఆ దుర్మార్గులు జమీలా, రొఖియాలను కూడా తాళ్ళతో బంధించారు.

ఆ తరువాత వారు చకచకా గుడారాలను పీకివేశారు. ఒంటెలను స్వాధీనం చేసుకొని వాటిమీద దోపిడీ వస్తు సామగ్రిని, ఖైదీలను ఎక్కించారు. వాటితో పాటు ఒయాసిస్సులోని మేకలను, గొర్రెలను కూడా దోచుకొని అక్కడ్నుంచి ఉడాయించారు.

గంటముందు వరకు స్త్రీలు, పిల్లలు, పశువులు, డేరాలతో ఎంతో కళకళలాడుతూ ఉండిన ఆ ప్రాంతం ఇప్పుడు బోసిపోయి ఉంది.

ఒక్క డేరా కూడా లేదు. విరిగిపోయి పనికిరాని కొంత సామగ్రి మాత్రం అక్కడక్కడ చిందరవందరగా పడివుంది. కత్తివ్రేటులతో వికృతంగా మారి నేల మీద పడివున్న కొన్ని శవాలు ఈ వినాశాన్ని మరింత తలపింపజేస్తున్నాయి. దానికి తోడు గాయపడిన కొందరు స్త్రీల మూలుగులు హృదయవిదారకంగా వినిపిస్తున్నాయి.

ఆ రాత్రంతా అదే స్థితిలో గడచిపోయింది. సరకులకోసం జనవాస ప్రాంతాలకు వెళ్ళిన పురుషులు ఇంకా తిరిగి రాలేదు. తెల్లవారింది. చీకటి తెరలను చీల్చుకుంటూ ఉదయభానుడు ప్రాక్దిగ్మండలపైకి వచ్చేశాడు. వాతావరణం కాస్తంత ఆహ్లాదకరంగా ఉంది. కానీ ఆ ఆహ్లాదం ఎంతోసేపు ఉండలేదు.

గాయాల బాధతో రాత్రంతా నిద్రపట్టక సతమతమయి, చివరి ఘడియల్లో ఏదో మైకంతో కళ్ళు కొంచెం మూతలుపడ్డాయి ఆ స్త్రీలకు. ఆ తరువాత కళ్ళు తెరిచి చూస్తే సూర్యుడు రెండు బారలు పైకి ఎగబ్రాకి గుడ్లు మిటకరిస్తూ వాళ్ళ వైపు చూడసాగాడు.

అతనివాడి చూపులకు ఇసుక నేల మాడిపోవడం ప్రారంభించింది. క్రమేణా వాతావరణం వేడెక్కిపోయింది. గాయపడిన మహిళల శరీరాల నుండి రక్తం ఇంకా స్రవిస్తూనే ఉంది. పైగా పుండుమీద కారం జల్లినట్లు తీవ్రంగా వీస్తున్న వడగాలుల వల్ల వారి గాయాలు మరింత మంటెత్తిపోతున్నాయి.

ఒకవైపు గాయాల బాధతో, మరోవైపు ఎండవేడిమితో ఆ అభాగినులు విలవిల్లాడిపోతున్నారు. దాహంతో వారి నాలుకలు పిడచకట్టుకుపోతున్నాయి. కాని పైకి లేచే శక్తి లేదు. వారి దగ్గరకు వచ్చి గుక్కెడు నీళ్ళు తాగించే వాళ్ళు కూడా ఆ దరిదాపుల్లో ఎవరూ లేరు. అసలు వాళ్ళను గురించి పట్టించుకునే నాధుడే లేడక్కడ. కాస్సేపటికి దయలేని సూర్యుడు తన ప్రతాపమంతా ఆ క్షతగాత్రుల మీదే చూపి, అలసటతో పడమటి దిశకు వాలిపోయాడు.

దాంతో ఎండ తీవ్రత కొంచెం తగ్గిపోయింది. వడగాలుల వాడి కూడా తగ్గిపోయింది. ఆ తరువాత కాస్సేపటికి హఠాత్తుగా తూర్పు దిక్కున ధూలి పైకి లేచింది. అది నెమ్మదిగా ఒయాసిస్సు వైపుకు రాసాగింది. క్షతగాత్ర మహిళలు ఆశగా ఆ ధూళివైపు చూస్తూ, తమ వాళ్ళు వచ్చేస్తున్నట్లుందని అనుకున్నారు. ఈ భావనతో వాడిపోయిన వారి ముఖాల మీద కాస్తంత కళవచ్చింది.

ధూళి గుమ్మటం అంతకంతకు అధికమవుతూపోతోంది. ఆ ధూళిలో అప్పుడప్పుడు సాయంకాలపు సువర్ణ కాంతికి ఇసుక రేణువులు మెరిసిపోతున్నాయి. మరి కాస్సేపటికి ధూళి విడిపోయి, దాని మధ్య ఒంటెల పంక్తి కనపడింది. ఒంటెలు ఒకదానివెనుక మరొకటి వరుసగా నడుస్తూ మెల్లగా వస్తున్నాయి. ఒంటెలతోపాటు కొన్ని గుర్రాలు కూడా ఉన్నాయి. వాటిపై మనుషులు కూర్చొని ఉన్నారు. వాళ్ళు తమ వాళ్ళేనని స్త్రీలు గ్రహించారు. కొంచెం కుదుటపడిన మనస్సుతో ఆ స్త్రీలు వాళ్ళ కోసం అసహనంగా ఎదురుచూడసాగారు.

వాళ్ళు ఒయాసిస్సుకు చాలా సమీపంగా వచ్చారు. చెట్లచాటు నుంచి ఒయాసిస్సు లోపలి భాగం ఇప్పుడు వారికి స్పష్టంగా కానవచ్చింది. అందువల్ల వాళ్ళు ఒకింత ఆందోళనతో ఒంటెలను అదిలించి వేగంగా రాసాగారు.

స్త్రీలు గాయాలతో రక్తసిక్తమయి, ఆకలి దప్పులతో నీరసించి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. ఆశానిరాశల మధ్య ఊగిసలాడుతున్నారు. నలువైపుల నుంచి క్షణక్షణానికి అంధకారం అలుముకుంటున్నట్లు వాళ్ళు మైకంలో పడిపోతున్నారు.

అంతలో ఎడారి ఓడలు వచ్చేశాయి. వాటిపై ఎక్కిన పురుషులు తొందరతొందరగా దిగి ఒయాసిస్సులోకి పరుగెత్తారు. అంతే, అక్కడ వినాశం చూసి వారి గుండెలు ఝల్లుమన్నాయి. అందరూ తీవ్ర ఆందోళన చెంద సాగారు.

అందరికన్నా హారిసా ఎక్కువ ఆందోళన చెందసాగాడు. ఆందోళనతో పాటు ఆగ్రహంతో అతని పిడికిలి బిగుసుకుపోయింది.

"ఎవరో దుర్మార్గులు మనతెగపై దాడిచేశారు. మన డేరాలు, వన వృక్షాలను నాశనం చేశారు" అన్నాడు అతను.

"ఇదగో ఇక్కడ చూడండి, నెత్తుటి మరకలు ఎలా పడ్డాయో" అన్నాడు ఒకతను.

"అంటే, మన వీరనారీమణులు మన తెగ గౌరవాన్ని నిలబెట్టేందుకు శత్రువులతో తప్పకుండా పోరాడి ఉంటారు. లేకపోతే ఈ రక్తం ఇక్కడెందు కొస్తుంది? శత్రువులు మనం లేకపోవడం చూసి ఆడవాళ్ళమీద, పిల్లల మీద దాడిచేసి సామానంతా దోచుకుపోయారు. తుచ్ఛులు! పిరికిపందలు!!" అన్నాడు హారిసా పళ్ళు నూరుతూ.

"ఎంత ఘోరం జరిగింది! మనం సర్వనాశనమయ్యాం!!" అన్నాడు తెగ నాయకుడు అద్దీ తలబాదుకుంటూ.

"నాయకా! మనం నిజంగానే సర్వనాశనమయ్యాం. దుర్మార్గులు మన స్త్రీలను, పిల్లలను, సామగ్రిని అంతా దోచుకుపోయారు. అయ్యో! నా ముద్దుల బిడ్డ జమీలా... నా కంటిపాప జమీలా..... " అంటూ హారిసా ఎంతో బాధపడి పోయాడు.

"హారిసా! కాస్త అటు చూడు, గాయాలతో ఆ స్త్రీలు ఎలా జీవచ్ఛవాల్లా పడివున్నారో" అన్నాడు అద్దీ.

ఈ మాటవినగానే అందరూ గాయపడిన స్త్రీల దగ్గరకి పరుగెత్తారు. అప్పటికే ఆ స్త్రీలు చాలా రక్తం పోయి ఢీలాపడిపోయారు. తీవ్రమైన దప్పికవల్ల వారి నాలుకలు బయటికి వచ్చేశాయి.

"నీళ్ళు తీసుకురండి. వీళ్ళు చావలేదు, ఇంకా బతికే ఉన్నారు. తొందరగా నీళ్ళు తీసుకురండి. వీళ్ళు స్పృహ కోల్పోయి ఉన్నారు. స్పృహ వస్తే గాని ఏ తెగవాళ్ళో, ఏ పిరికిపందలు దాడిచేశారో తెలియదు" అన్నాడు హారిసా.

వెంటనే కొందరు నీళ్ళు తీసుకురావడానికి పరుగెత్తారు. అప్పటికి సూర్యాస్తమయం అయ్యింది మనుషులతోపాటు ఒంటెలు, గుర్రాలు కూడా విచార వదనాలతో ఈ బీభత్సాన్ని చూడసాగాయి.

మంచినీళ్ళు తీసుకురావడానికి వెళ్ళినవారు వచ్చేశారు. హారిసా తొందర తొందరగా వాళ్ళ దగ్గర్నుంచి నీళ్ళ తిత్తి తీసుకొని స్త్రీల ముఖాల మీద కొంచెం నీళ్ళు చిలికించాడు. వారి నోళ్ళలో కూడా కొన్ని చుక్కలు పోశాడు.

చల్లని నీటితో కాస్త ముఖం, గొంతు తడవగానే స్త్రీలు మెల్లిగా కళ్ళు తెరిచారు. బలహీనత, మైకం కొంచెం తగ్గినట్లు అనిపించింది. దాంతో వాళ్ళు లేచి కూర్చున్నారు. కాని వారి ముఖాలు బాగా పాలిపోయాయి.

"అమ్మా! మన తెగమీద దౌర్జన్యం చేసిన దుండగులు ఎవరు? ఏ పిరికి పందలు మనతెగను నాశనం చేశారు?" అని అడిగాడు తెగనాయకుడు అద్దీ.

"ఖహ్‌తాన్ తెగ వాళ్ళు మాపై దౌర్జన్యం చేశారు" అన్నది ఒక స్త్రీ.

"ఆ నీచులేనా! నేను కూడా అదే అనుకున్నాను. పిరికిపందలు! మేము లేకపోవడం చూసి మన తెగమీద దాడిచేశారు. తుచ్ఛులు! వెధవలు!! మా ఎదుటికి వచ్చి ఉంటే ఒక్కడు కూడా బతికి బయటపడి ఉండేవాడు కాదు" అన్నాడు అద్దీ ఉద్రేకంతో ఊగిపోతూ.

"నాయకా! మేము వాళ్ళ దాడిని ఊహించనైనా ఊహించలేదు. వాళ్ళు అకస్మాత్తుగా మాపైకి వచ్చేశారు. ఆయుధాలు తీసుకునే అవకాశం కూడా మాకు దొరకలేదు. అయినప్పటికీ మేము ఎలాగో పోరాడాము. మాలో చాలా మందిని దుర్మార్గులు నిర్దాక్షిణ్యంగా హతమార్చారు" అన్నదది మరొక మహిళ.

"దేవతల సాక్షి! మేము తప్పకుండా ఆ నీచుల మీద ప్రతీకారం తీర్చు కుంటాము. కాని మన తెగ ఆడవాళ్ళు అనేకమంది చనిపోయినప్పటికీ ఖహ్తాన్ తెగలో ఒక మగాడు కూడా చావకపోవడం ఎంతో విచారకరం" అన్నాడు అద్దీ ప్రతీకారేచ్ఛతో లోలోన ఉడికిపోతూ.

"మన దేవతల దయవల్ల అలా జరగలేదు. జమీలా, రొఖియాలు ధైర్యంగా ఎదురుదాడి చేసి ఖహ్తాన్ తెగలో ఇద్దర్ని చంపేశారు. ఆ విధంగా ఆ ఇద్దరు యువతులు మన తెగ గౌరవాన్ని కాపాడారు" అన్నది ఇంకొక మహిళ.

"అట్లాగానా! అయితే మనం అవమానం, అపకీర్తి నుంచి బయట పడ్డాము" అన్నాడు అద్దీ సంతోషంతో.

"మరి జమీలా, రొఖియాలు కూడా దాడిలో గాయపడ్డారా? వెంటనే హారిసా అడిగాడు.

"వాళ్ళిద్దరిలో ఎవరూ గాయపడలేదనుకుంటా. కాని పిరికిపందలు ఒక్కొక్కళ్ళుగా ఎదుర్కోలేక అందరూ చుట్టుముట్టి ఆ అమ్మాయిలను బంధించి తీసుకెళ్ళారు" అన్నది మొదటి మహిళ.

"అట్లా చేశారా ఆడంగి వెధవలు! మీరు విచారించకండి, వాళ్ళ పని మేముపడతాం" అన్నాడు అద్దీ.

"వాళ్ళ శవాలు అదిగో ఆ మూలపడి ఉన్నాయి చూడండి" అన్నారు మహిళలు.

వెంటనే అద్దీ, హారిసా, మరి కొందరు పురుషులు శవాల దగ్గరికి పరు గెత్తారు. ఆ శవాలను చూసివారు కోపోద్రేకాలతో మరింత ఉడికిపోయారు.

తక్షణమే వారు వరల్లోనుంచి కత్తులు బయటికి తీసి శవాలను కసి తీరా నరికి వేశారు. ముక్కలు కోసి కళ్ళు పెరికివేశారు. ప్రతి అవయవాన్ని ముక్కలు ముక్కలుగా నరికివేశారు.

ఆ తరువాత అద్దీ, శవఖండాలను తీసికెళ్ళి ఒయాసిస్సు బయట విసిరి పారేయండని ఆజ్ఞాపించాడు. అతని ఆజ్ఞ ప్రకారం కొందరు అనుచరులు శవఖండాలను ఒయాసిస్సు నుంచి చాలా దూరాన ఒక ఇసుకగుట్ట పైకి తీసికెళ్ళి పారేశారు.

తరువాత వాళ్ళు తమ తెగకు చెందిన స్త్రీల భౌతిక కాయాలను ఒయాసిస్సు బయటికి తీసికెళ్ళి ఒక గొయ్యి త్రవ్వి అందులో పూడ్చివేశారు.

గాయపడిన స్త్రీలు కొంచెం బలం పుంజుకొని లేచి తిరగడం ప్రారంభించారు. తమ తెగ సంప్రదాయం ప్రకారం వీరు చనిపోయిన తమ వారి సమాధుల దగ్గరికి వెళ్ళారు. అక్కడ బట్టలు చింపుకొని, వెంట్రుకలు విరబోసుకొని, గుండెలను బాదుకుంటూ ఏడ్వడం ప్రారంభించారు. ఈ విధంగా వాళ్ళు తమ దుఃఖభారాన్ని దించుకున్నారు.

ఈ విచారం, దుఃఖంతోనే స్త్రీలు ఆ రాత్రి భోజనం వండారు. కడుపులో వున్న పుట్టెడు దుఃఖం వల్ల అన్నం సహించకపోయినా రోజువారీ పనులు చేసుకోవడానికి కాస్తయినా తినకతప్పదు. అందువల్ల అందరూ బలవంతంగా రెండేసి ముద్దలు నోట్లో పెట్టుకున్నారు.

ఆ రాత్రి ఎలాగో నిద్రపోయి సూర్యోదయం తరువాత లేచారు. నీరసంగా, నిరాసక్తతో కాలకృత్యాలు తీర్చుకున్నారు. తరువాత తెగనాయకుడు అద్దీ అందర్నీ సమావేశపరచి ఇలా అన్నాడు:

“సోదరులారా! బనీ ఖహ్తాన్ ఈనాడు చాలా శక్తిమంతమైన తెగగా తయారయిందన్న సంగతి మీకందరికీ తెలుసు. అలాంటి తెగను మనం అంత సులభంగా ఎదుర్కొని విజయం సాధించలేము. కాని ఆ తెగమీద ప్రతీకారం తీర్చుకోకపోతే, హతమార్చబడిన మన స్త్రీలు దయ్యాలుగా మారి మనల్ని

చుట్టుకుంటారు. రకరకాలుగా వేధిస్తారు. అదీగాక యావత్తు తెగల్లో మన పరువు ప్రతిష్ఠలు మంటగలిసిపోతాయి. కాబట్టి ఖహ్‌తాన్ తెగమీద మనం తప్పకుండా ప్రతీకారం తీర్చుకోవాలి. ఆలోచించండి. ఈ పనికోసం మనం ఏం చెయ్యాలి? ఏ తెగ దగ్గరకి వెళ్ళి సహాయాన్ని అర్థించాలి?"

అద్దీ ప్రసంగం తరువాత క్షణం పాటు నిశ్శబ్దం రాజ్యమేలింది.

"తాయఫ్ వెళ్దాం. అక్కడ ఉమైర్ తెగను సహాయం చెయ్యమని అడిగి చూద్దాం" అన్నాడు హారిసా.

"మొత్తం తెగల్లోకెల్లా ఉమైర్ తెగకు మంచి పలుకుబడి, గొప్ప శక్తి సామర్థ్యాలు ఉన్న సంగతి నిజమే. కాని ఆ తెగకు ప్రస్తుతం అబ్దెమాలైల్, మస్ఊద్, హబీబ్‌లు నాయకత్వం వహిస్తున్నారు. వీళ్ళు ముగ్గురూ పచ్చి మోసగాళ్ళు, జిత్తులమారి గుంటనక్కలు, మనకు ఎన్నటికీ సహాయం చేయరు" అన్నాడు అద్దీ.

ఈ ప్రతిపాదనను త్రోసిపుచ్చుతూ.

"మరి మీరు ఏ తెగ మనకు సహాయపడుతుందని భావిస్తున్నారు?" అడిగాడు హారిసా.

"మనం హుమ్రా వెళ్ళి ఇజాజా తెగను సహాయం చేయ్యమని అడుగుదాం. ఆ తెగ మనల్ని తప్పకుండా ఆదుకుంటుందని నాకు పూర్తి నమ్మకం ఉంది" అన్నాడు అద్దీ.

"సరే అలాగే చేద్దాం. మీ ఆలోచన సమంజసంగా ఉంది" అన్నాడు హారిసా.

ఈ నిర్ణయం తీసుకున్నాక వెంటనే అందరూ ప్రయాణ సన్నాహాలు చేసుకున్నారు. అదే రోజు మధ్యాహ్నం అద్దీ, అతని తెగవాళ్ళు హుమ్రాకు బయలుదేరారు.

బనీఖహ్‌తాన్, బనీ బకర్ తెగల మధ్య ఎన్నో ఏళ్ళ నుంచి శత్రుత్వం సాగుతూవస్తోంది. ఈ కారణంగానే బనీ ఖహ్‌తాన్ తెగ అవకాశం చూసి అద్దీ తెగమీద దౌర్జన్యం చేసింది. కాని ఖహ్‌తాన్ మీద ప్రతీకారం తీర్చుకుందా మంటే అద్దీ (బనీబకర్‌కు చెందిన) తెగ అంతగా బలమైనది కాదు. అందువల్ల అద్దీ అతని తెగవాళ్ళు మరో తెగ సహాయం కోసం బయలుదేరారు.

అదీగాక ఖహ్‌తాన్ తెగ ఇప్పటికీ బనుబకర్ తెగ మీద కారాలు, మిరి యాలు నూరుతుంది. రాత్రివేళ ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నాసరే ఆ తెగ బనీబకర్ తెగ మనుషుల మీద మెరుపుదాడిచేసే ప్రమాదం ఉంది. అందువల్ల అద్దీ తిన్నగా పోయే అసలు మార్గం తప్పించి చాలా మందికి తెలియని మరో మార్గాన ప్రయాణం చేయడానికి నిర్ణయించుకున్నాడు. దాని ప్రకారం అంతా బయలుదేరారు.

ఈ దారి చాలా ప్రమాదాలతో కూడివుంది. జనసంచారం మచ్చుకైనా లేదు. ఎటుచూసినా ఎత్తయిన, పొడవైన ఇసుక గుట్టలే కనిపిస్తాయి. తెల్లటి ఇసుక రేణువులు సూర్యకిరణాలతో మెరిసిపోతూ కళ్ళను చెదరగొడ్తుంటాయి. పైగా నిప్పులు చెరిగే ఎండ, తీవ్రమైన వడగాల్పుల మధ్య ప్రయాణం సాగిం చడం ఎంతో కష్టం. రాత్రి వేళల్లో ప్రయాణం చేద్దామంటే కళ్ళు చించుకున్నా దారి సరిగా కనిపించదు.

అందువల్ల అద్దీ, అతని తెగవాళ్ళు తెల్లవారగానే ప్రయాణం ప్రారం భించేవారు. అలా సూర్యుడు నాలుగైదు బారలు పైకి వచ్చేదాకా నడచి, సూర్య కిరణాలు నిలువుగా పడడం ప్రారంభించగానే ఏదైనా ఇసుక తిన్నె చాటున ఆగి విడిది చేసేవారు. మరుసటి రోజు ఉదయం మళ్ళీ బయలు దేరేవారు. ఈ విధంగా వారు అనేక రోజులు ప్రయాణం సాగించారు.

యధాప్రకారం ఒకరోజు వారు మధ్యాహ్నం దాకా ప్రయాణం సాగించి ఓ పెద్ద ఇసుక గుట్టనీడలో విడిది చేశారు. కాస్సేపటికి ఆ నీడ కూడా లేకుండా పోయింది. సూర్యుని వాడి కిరణాలు నేలపై నిటారుగా పడుతున్నాయి. ఎండ

పెటపెటలాడుతోంది. ఇసుక నేల భగభగమండి పోతోంది. దీనికితోడు వడ గాల్పులు కూడా మెల్లిగా వీచడం మొదలయింది.

యావత్ ప్రకృతి రౌద్రాకారం దాల్చిందా అన్నట్లు వాతావరణం భయం కరంగా మారింది. కాళ్ళు కాలిపోతున్నాయి. ముఖాలు మాడిపోతున్నాయి. గూబలు పగిలిపోతున్నాయి. పెదాలు ఎండిపోతున్నాయి. ఎన్ని నీళ్ళు తాగినా ఎప్పటికప్పుడు చెమట రూపంలో బయటికి పోతున్నాయి.

భయంకరమైన ఆ ఎడారి ప్రదేశంలో నీళ్ళుకూడా పెద్ద సమస్యే. అందుకని నీళ్ళు ఎక్కడ అయిపోతాయోనని భయపడుతూ వారు కొంచెం కొంచెమే తాగుతూ పెదాలు తడుపుకోసాగారు.

కాస్సేపటికి ఎండవేడిమి పరాకాష్టనందుకుంది. వడగాల్పులు తీవ్ర మయ్యాయి. తీవ్రమైన గాలులు వీచడం ప్రారంభించాయి. దాంతోపాటు నేల మీది ఇసుకరేణువులు గాలిలో విన్యాసాలు చేయడం మొదలెట్టాయి. ఇసుక తుఫాన్ ముంచు కొచ్చింది ఈ పరిస్థితి చూసి ప్రయాణీకులు భయపడ్డారు. వారి గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

"సోదరులారా! పరిస్థితి మనకు వ్యతిరేకంగా మారుతున్నట్లు కనిపి స్తోంది. ముందే మనం కష్టాల్లో పడినతమతమవుతున్నాం. వీటికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్లు ఈ తుఫాన్ మనల్ని మరింత ఆపదలో పడవేయబోతున్నట్లు అనిపిస్తోంది. గాలివేగం ఇట్లాగే సాగితే ఇసుక గుట్టలు గాలిలో ఎగిరి మన మీద కూడా పడిపోయే ప్రమాదం ఉంది. కాస్త జాగ్రత్తగా ఉండండి" అన్నాడు తెగ నాయకుడు అద్దీ జనాన్ని హెచ్చరిస్తూ.

"తమరు చెప్పింది నిజమే. నాకు కూడా అట్లాగే అనిపిస్తోంది. కొండ ల్లాంటి ఈ ఇసుక గుట్టలు గాల్లోకి లేచి మనల్ని ఎక్కడ కప్పివేస్తాయో!" అన్నాడు హారిసా భయాందోళనలు వెలిబుచ్చుతూ.

"అయ్ బాబోయ్! అప్పుడే ఆ గుట్ట మీది ఇసుక పైకిలేచి ఎలా సుడులు తిరుగుతోందో చూడండి" అన్నాడు ఒకడు గుండెలు బాదుకుంటూ.

ఆ తరువాత రెండు క్షణాలకే ఇసుక రేణువులు 'రయ్ మంటూ వాళ్ళ మీదికి వచ్చిపడటం మొదలెట్టింది.

"చచ్చాంరా నాయనోయ్! రచ్చించండి దేవతల్లారా! మమ్మల్ని ఈ తుఫాను బారి నుండి రచ్చించండి!!" అన్నాడు మరొకడు గావుకేక పెడ్తూ.

"లాత్, హుబల్ భక్తులారా! ఈ ఆపద నుండి మనల్ని గట్టెక్కించమని మీ ఇష్టదేవతను వేడుకోండి. దేవతలను వేడుకునే సమయం ఇదే. లేవండి. కన్నీటితో దేవతలను ప్రార్థించండి' అన్నాడు అర్ధీ.

నాయకుని ఆజ్ఞ విని అందరూ లేచి నిల్చున్నారు. అందరూ తలలు వంచి ఎంతో భక్తి శ్రద్ధలతో దీనాతిదీనంగా వేడుకోసాగారు. లాత్, ఉజ్జా, హుబల్ తదితర దేవతల పేర్లు పెట్టి పిలుస్తూ మరీ కన్నీటితో మొరపెట్టు కోవడం మొదలుపెట్టారు.

భయంకరమైన ఆ ఎడారిలో భక్తుల రోదనలతో ఇసుక తిన్నెలు ప్రతి ధ్వనించాయి.

కాని దేవతలకు దయకలగలేదు. వాయువేగం తగ్గకపోగా మరింత తీవ్రమయిపోయింది. ఇసుక రేణువులు సుడులు తిరుగుతూ వారి మీద వచ్చి పడుతున్నాయి. దానికి తోడు సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. భయంకర వాయుశక్తితో మేరు పర్వతాల్లాంటి ఇసుక గుట్టలు కూడా మంచు కొండల్లా కరిగిపోతూ, ధూళిని ఎగరెగరవేయసాగాయి. ఇసుక రేణువులు దూసుకువస్తూ శరాఘాతాల్లా శరీరాలకు తూట్లు వేస్తున్నాయి. కళ్ళు, తలలు, బట్టలు ఇసుకతో నిండిపోతున్నాయి.

ఈ పరిస్థితి చూసి జనం మరింత భయపడిపోయారు. ప్రళయం ఈ రోజే విరుచుకుపడనున్నదా అన్నంత భయానకంగా వాతావరణం క్షణక్షణానికి మారిపోతోంది.

"సోదరులారా! పరిస్థితి క్రమంగా విషమిస్తూపోతోంది. మనం గనక ఇంకాసేపు ఇక్కడే నిలబడితే ఇసుక కింద అణగిపోక తప్పదు. పదండి మనం

అదిగో, ఆ ఇసుక గుట్టపై కెక్కుదాం" అన్నాడు అద్దీ వాతావరణ పరిస్థితిని గమనిస్తూ.

"నాయకా! మీరు తీసుకున్న నిర్ణయం ఎంతో బాగుంది. ఇసుక ఎంత మేరకు ఎగిరిపోతే మనం అంతమేరకు కిందికి దిగుతుంటాము. ఒకవేళ మొత్తం ఇసుక గుట్టని గాలి ఎగరేసుకుపోయినా మనం ఇసుక కిందపడి అణగిపోయే ప్రమాదం లేదు" అన్నాడు హారిసా.

"కాని కళ్ళు తెరవడానికే వీలులేకుండా ఇసుక వచ్చిపడుతోందే, ఎలా ఆ గుట్టపైకి చేరుకోవడం? ఇప్పటికే బట్టలనిండా పడి శరీరం మంటెక్కి పోతోంది" అన్నాడు ఓ నడికారు వ్యక్తి తన బాధను వెలిబుచ్చుకుంటూ.

"ఎలాగైనా చేరుకోవడానికి ప్రయత్నించాలి. బ్రతుకుమీద ఆశ ఉంటే సంఘర్షణ తప్పదు మనకు. ఇంకాసేపు ఇక్కడే ఉండిపోతే మనం ఇసుకలో సమాధికావడం ఖాయం" అన్నాడు అద్దీ దూరదృష్టితో.

ప్రచండ వేగంతో వీస్తున్న గాలికి ఇసుక రేణువులు ఆకాశంలో స్వైర విహారం చేస్తూ మొత్తం ఎడారి ప్రదేశం అల్లకల్లోలమయిపోయింది. వడ గాల్పులకు చెంపలు పగిలిపోతున్నాయి. వేడెక్కిన ఇసుక రేణువులు సూదుల్లా గుచ్చుకుంటున్నాయి. మరొకవైపు తీవ్రమైన గాలి వత్తిడికి ఇసుక రేణువులు పరస్పరం ఢీకొంటూ మరణమృదంగంలా భీకరశబ్దం చేస్తున్నాయి.

అలాంటి పరిస్థితిలోనే అందరూ ఒకరి చేతులు మరొకరు పట్టుకొని ఓ ఎత్తయిన గుట్టవైపుకు నడిచారు. కళ్ళు తెరవడానికి వీలులేకుండా ఇసుక రేణువులు నిరంతరాయంగా వచ్చి మీదపడుతున్నాయి. జనం ఇసుకను విదిలిస్తూ, కళ్ళు నులుపుకుంటూ భారంగా అడుగులు వేస్తున్నారు. ప్రచండ వేగంగా వీస్తున్న గాలి వారిని వెనక్కినెట్టివేస్తోంది. అయినా వారు బలమంతా కూడగట్టుకొని ముందుకు నడుస్తున్నారు.

వాతావరణమంతా ఇసుక ధూళితో నిండిపోయింది. ఏ ఒక్క వస్తువు సరిగా కనిపించడంలేదు. జనం ఒకరినొకరు పట్టుకొని తచ్చాడుతూ, కళ్ళలో

ఇసుక పడకుండా చేతులు అడ్డం పెట్టుకొని నడుస్తున్నారు. గాలి జోరు ఏమాత్రం తగ్గే సూచనలు కానరావడం లేదు. పైపెచ్చు అది ఘడియ ఘడియకు ఉధృతమయిపోతూ ప్రళయాన్ని తలపింపజేసే భీతావహాన్ని సృష్టిస్తోంది.

ఈ పరిస్థితి చూసి జనం గగ్గోలు పెట్టారు. మృత్యుదూత నలువైపుల నుంచి చుట్టుముట్టి తమను మట్టుపెడ్తుందా అన్న ఆలోచనతో వారు తీవ్రంగా ఆందోళన చెందసాగారు.

"అయ్యయ్యో! ఏమిటీ ప్రళయం!! ఈ ఆపదనుండి మనం గట్టెక్క లేమా? మన దేవతలు మనల్ని రక్షించరా? మన శత్రువుల మీద మనం పగసాధించమా?" అన్నాడు తెగ నాయకుడు అద్దీ ఎంతో విచారంతో.

"కాదు, కాదు. మనం అప్పుడే చనిపోము. చనిపోయిన మన బంధు మిత్రుల ఆత్మలను సంతృప్తపరచడానికి మనం శత్రువుల మీద ప్రతీకారం తీర్చుకున్నాకే చనిపోతాం. తొందరగా నడవండి. అదిగో ఇసుక కొండ వచ్చేసింది. ఎక్కండి" అన్నాడు హారిసా ఉద్రేకంతో.

ఇసుక కొండ వారికి చాలా దగ్గర్లోనే ఉంది. కాని ఇసుక ధూళి వాతావరణంలో దట్టంగా వ్యాపించి పోవడం వల్ల వారికి ఆ కొండ సరిగా కన్పించ లేదు. దానికితోడు ఎంతో ఉధృతంగా వీస్తున్న గాలి వాళ్ళను అటుఇటూ ఊపుతూ పైకి లేపుకుపోతుందా అన్నంత భయంకరంగా మారిపోయింది.

ఇసుక అతి వేగంగా వచ్చిమీదపడుతోంది. అద్దీ, అతని తెగవాళ్ళు గుట్ట ఎక్కడానికి వృధా ప్రయాసపడుతున్నారు. అప్పటికే చాలామంది మోకాళ్ళదాకా ఇసుకలో కూరుకుపోయారు.

"ఊ.... తొందరగా నడవండి. ఆలస్యం చేస్తే ఇసుక మనల్ని పూర్తిగా కప్పివేస్తుంది" అన్నాడు అద్దీ ముందుకు అడుగువేస్తూ.

"ఎలానడవాలి? నా కాళ్ళు పూర్తిగా ఇసుకలో కూరుకుపోయాయి" అన్నాడు ఒకతను బాధగా.

"నాకాళ్ళు కూడా ఇసుకలో కూరుకుపోయాయి. కళ్ళు కూడా ఇసుక పడిపోయి కన్పించడం లేదు" అన్నాడు మరొకతను కూరుకుపోయిన కాళ్ళను బయటికి లాక్కోవడానికి పెనుగులాడుతూ.

"ఎలాగైనా మనం ఇక్కడ్నుంచి బయటపడాలి. రండి, పట్టండి. బయటికి లాగండి" అంటూ అద్దీ ఒక వ్యక్తి రెక్కపట్టుకొని పైకి లాగడానికి ప్రయత్నించాడు.

హారిసా కూడా మరికొందరితో కలసి ఇసుకలో కూరుకుపోయిన వాళ్ళను బయటికి లాగడానికి తమ బలమంతా ప్రయోగించారు. దానివల్ల కొందరు మాత్రమే బయటికి రాగలిగారు. కాని అంతలో ఉధృతమైన గాలి తాకిడికి ఇసుక తెరలు తెరలుగా అతివేగంగా వచ్చిపడటంతో అందరూ మళ్ళీ ఇసుకలో నడుములదాకా కూరుకుపోయారు.

ఈసారి అద్దీ, హారిసాలు కూడా ఇసుకలో లోతుగా కూరుకుపోయారు. ఇలా అందరూ కూరుకుపోయారు. గాలి ఉధృతికి ఇసుక అతివేగంగా వచ్చి పడుతూనే ఉంది. అద్దీ హారిసాలు తమ బలాన్నంతా కూడదీసుకొని ఎంత ప్రయత్నించినా బయటకు రాలేకపోయారు. దాంతో వాళ్ళు జీవితం పట్ల నిరాశచెందారు.

"సోదరులారా! ఇక లాభం లేదు. మన దేవతలు మనల్ని కరుణించ లేదు. మనం ఎంత గింజుకున్నా బయటపడే ఆశలు కన్పించడం లేదు. మృత్యుదేవత మన తలలపై తాండవమాడుతోంది. ఇక మనం ఇసుకలో అణగిపోయి సమాధికాక తప్పేటట్లులేదు" అన్నాడు హారిసా ఢీలాపడిపోయి.

"మరీ అంతగా నిరాశపడకూడదు. మరోసారి పూర్తిగా బలం ఉపయో గించి ప్రయత్నించండి. దేవతలను మొరపెట్టుకోండి..... ఉ......ఉ.... దేవత ల్లారా! రచ్చిం....."

అద్దీ మాటలు పూర్తి కాకముందే గాలి ఉధృతికి దగ్గర్లో ఉన్న ఇసుక తిన్నెపై నుంచి పెద్ద ఎత్తున ఇసుకధూళి ఎగిరొచ్చి వాళ్ళమీదపడింది. దాంతో

ఒక్కసారిగా అందరూ గావుకేకలు పెట్టారు. వారిలో కొందరు ఏడుపులు, పెడబొబ్బలు పెట్టసాగారు.

వాతావరణం ఇసుక రేణువులతో బూడిదరంగులోకి మారిపోయింది. ఏది ఎక్కడుందో కళ్ళు చించుకున్నా కనిపించడం లేదు. అంతా అల్లకల్లోలంతో భయానకంగా ఉంది.

అయితే ఉధృతంగా వీస్తున్న తుఫాను గాలికి, ఇసుక ధూళి ఎగిరెగిరి వచ్చి మేటలు మేటలుగా పడుతోంది. ఇసుకలో కూరుకుపోయిన వారి గావు కేకలు, ఏడ్పులు, పెడబొబ్బలు క్రమంగా తగ్గిపోయాయి.

ఇసుక ధూళిని ఎగరవేస్తూ ప్రచండ వేగంతో వీస్తున్న భయంకర గాలి రొద మాత్రమే ఇప్పుడు వినిపిస్తోంది. పాపం అద్దీ, అతని తెగవాళ్ళు ఇసుకలో కూరుకుపోయి, దాహంతో గొంతులు ఆరిపోయి, ఢీలాపడిపోయారు.

ఈ ఆపద సమయంలో ఏడ్పులు, పెడబొబ్బలతో ఎంత మొరపెట్టుకున్నా వారి ఇష్టదైవాలు వారిని ఆదుకోలేకపోయాయి. ప్రకృతి ఆగ్రహానికి ఏ దేవతా అడ్డుకట్టవేయలేకపోయింది.

కాస్సేపటికి తుఫాను హోరు తగ్గుముఖం పట్టింది. ఇసుకతో ఏర్పడిన ధూళిమేఘాలు క్రమంగా విడిపోవడం ప్రారంభించాయి. ధూళి మరుగునపడిపోయిన సూర్యుడు మెల్లిగా బయటికి రాసాగాడు. అయితే సూర్యకిరణాల్లో ఇప్పుడంత తీవ్రతలేదు. వాతావరణంలో వేడి కూడా చాలా వరకు తగ్గిపోయింది.

అద్దీ, అతని అనుచరులు ఇసుకలో నడుములదాకా కూరుకుపోవడమే గాకుండా, స్పృహ కూడా తప్పి జీవచ్ఛవాల్లా తయారయ్యారు. కాస్సేపటి తరువాత ముందుగా హారిసాకు స్పృహ వచ్చింది. అప్పటికి గాలి హోరు పూర్తిగా తగ్గిపోయింది. ఎండలో ప్రతి వస్తువూ స్పష్టంగా కనపడసాగింది.

హారిసా దాహంతో తపించిపోతూ "నీళ్ళు, నీళ్ళు" అన్నాడు. కాని ఆ నిర్జన ఎడారిలో అతనికి నీళ్ళు అందించేవాళ్ళు ఎవరున్నారు? దప్పికతో అతని

నాలుక పిడచకట్టుకుపోయింది. తల, కళ్ళలో పడిన ఇసుకను విదిలించుకొని అతను మరోసారి "నీళ్ళు, నీళ్ళు" అని గట్టిగా అరిచాడు.

కాని అతని అరుపుకు ఎలాంటి జవాబు రాలేదు. ఆ భయంకర ఎడారిలో ఇప్పుడు నిశ్శబ్దం రాజ్యమేలసాగింది. కనుచూపు మేరలో ఎలాంటి మానవాకారం కనిపించడం లేదు.

హారిసా ఇసుక నుండి బయటపడేందుకు మరొకసారి పెనుగులాడుతూ విఫలప్రయత్నం చేశాడు. తీవ్రమైన దప్పికతో అతని కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. "నీళ్ళు, నీళ్ళు" అని ఎంత అరిచి గీపెట్టినా అతని నోట్లో ఒక్కచుక్క నీళ్ళు పోసేవాళ్ళు ఎవరూ కన్పించలేదు.

వేడి ఇసుకలో కూరుకుపోవడం వల్ల ఇంతకు ముందే అతనిలో సగం శక్తి ఉడిగిపోయింది. ఇప్పుడు తీవ్రమైన దాహం వల్ల మిగిలిన శక్తి కూడా క్రమంగా తగ్గిపోసాగింది. అయినా అతను నీటికోసం కేకలు పెడుతూనే ఉన్నాడు. దప్పికతో గొంతు ఎండిపోయి ప్రాణాలు పోతుంటే కేకలు పెట్టకుండా ఎలా ఉండగలడు? దప్పిక బాధే అలాంటిది. అతను ఇంకొకసారి తన శక్తి నంతా కూడదీసుకొని "నీళ్ళు! నీళ్ళు!!" అంటూ బిగ్గరగా అరిచాడు.

విధివశాత్తు అప్పుడే కాకతాళీయంగా అటువైపు ఒంటెల మీద బాటసారుల బృందం ఒకటి మెల్లిగా రాసాగింది. హారిసా పెట్టిన కేకలు వారి చెవుల్లో పడ్డాయి. ఎలాగో ఒక బాటసారి దృష్టి హారిసా మీద పడింది.

వెంటనే అతను ఒంటె పగ్గాన్ని లాగుతూ "ఆగండి, కాస్త అటు చూడండి, ఎవరో మనిషి ఇసుకలో కొట్టుమిట్టాడుతున్నట్లుంది" అని అన్నాడు.

వెంటనే ఒంటెల బిడారం ఆగిపోయింది.

"బహుశా ఆ వ్యక్తి దాహంతో బాధపడుతున్నాడనుకుంటా. అతనితో పాటు అక్కడ మరికొందరు కూడా ఉండొచ్చు. పదండి. నీళ్ళు తీసుకొని నడవండి" అన్నాడు ఆ వ్యక్తే మళ్ళీ.

అందరూ ఒంటెలను కూర్చోబెట్టి క్రిందికి దిగారు. ఒంటెల మీద వ్రేలాడదీసిన నీళ్ళ తిత్తులను తీసుకొని అటువైపు పరుగెత్తారు.

అప్పటిదాకా మృత్యువుతో పోరాడుతున్న హారిసా బక్కచిక్కి వ్రేలాడపడి పోయాడు. నీళ్ళకోసం అరిచి అరిచి అతని గొంతుపూడుకు పోయింది. మరొకసారి అతను బలాన్నంతా కూడగట్టుకొని "నీళ్ళు... నీళ్ళు...." అంటూ అరిచాడు. ఆ తరువాత అతని తల ఇసుకమీద నిస్సత్తుగా వాలిపోయింది. ఆ వెను వెంటనే అతను మళ్ళీ స్పృహ కోల్పోయాడు.

ఈలోగా బాటసారులు పరుగెత్తుకుంటూ అక్కడికి చేరుకున్నారు. చూస్తే హారిసాతోపాటు మరికొందరు జనం ఇసుకలో కూరుకుపోయి జీవచ్ఛవాల్లా పడివుండటం కనిపించింది వారికి.

తక్షణమే వాళ్ళు నీటి తిత్తులను క్రిందికి దించి గబగబా ఇసుకను తొలగించడం ప్రారంభించారు. ఒక వృద్ధుడు హారిసా దగ్గరికి వచ్చి అతని ముఖం మీద నీళ్ళు చిలికించాడు. చల్లని నీళ్ళు ముఖానికి తగలగానే హారిసాకు మెల్లిగా స్పృహ వచ్చింది. నీళ్ళు చల్లడం వల్ల అతని నుదురు, కనురెప్పల మీద అంటుకున్న ఇసుక కూడా కొట్టుకు పోయింది. దాంతో అతను కళ్ళు తెరచిన హీన స్వరంతో 'నీళ్ళు, నీళ్ళు' అన్నాడు.

వృద్ధుడు హారిసా శిరస్సును పైకెత్తి తన ఒడిలో పెట్టుకున్నాడు. తోలు తిత్తిలో నుంచి చేతిలోకి కొంచెం నీళ్ళు తీసుకొని అతని నోటిలోపోశాడు. దాంతో హారిసాకు ప్రాణం లేచివచ్చినట్లనిపించింది.

కాని తీవ్రమైన దప్పికతో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తికి ఈ పిడికెడు నీళ్ళు ఏ మూలకు వస్తాయి? నీళ్ళ తిత్తిని అమాంతం పైకెత్త మొత్తం నీళ్ళను ఒకేసారి తన నోటిలో కుమ్మరిస్తే బాగుండు అన్పించింది అతనికి.

అయితే వృద్ధుడు అలా చేయలేదు. బాగా దప్పికగొన్న మనిషికి ఒక్కసారిగా అన్ని నీళ్ళు తాగిస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లవచ్చు. అంచేత అతను మాటిమాటికీ చేతిలో నీళ్ళు తీసుకొని హారిసా గొంతులో మెల్లిగా పోయసాగాడు.

హారిసా పరిస్థితి క్రమంగా మెరుగుపడసాగింది. కాస్సేపటికి అతను లేచి కూర్చోగలిగాడు. కాని అతను తన దప్పిక తీర్చుకోవడంలో పడిపోయి ఇతరుల పరిస్థితి మరచిపోయాడు.

అయితే మరికొందరు బాటసారులు ఇసుకలో కూరుకుపోయిన ఇతర వ్యక్తులను కూడా బయటికి తీసి వాళ్ళ ముఖాలపై కూడా నీళ్ళు చిలికించి గొంతులు తడపనారంభించారు. అంచేత వాళ్ళు కూడా క్రమేణా స్పృహలోకి వస్తున్నారు.

బాటసారులు, తెగనాయకుడు అద్దీని కూడా ఇసుకలోనుంచి బయటికి లాగారు. అతని ముఖంపై కూడా నీళ్ళు చిలికించి స్పృహలోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. కాని అద్దీకి స్పృహ రాలేదు. వచ్చే సూచనలు కూడా కన్పించలేదు. మిగిలిన వాళ్ళంతా లేచి కూర్చోవడమే కాకుండా, నిలబడి నడవగలిగే స్థితికి కూడా రాగలిగారు. కాని అద్దీకి మాత్రమే ఎంత ప్రయత్నించినా స్పృహ రాలేదు. అతని ఉచ్ఛ్వాస నిస్వాసలు ఆగి పోయాయి, శరీరం చల్లబడిపోయింది.

"అయ్యయ్యో! ఈ మనిషి కళ్ళు తేలేశాడు. ఇతని జీవనజ్యోతి ఆరిపోయింది" అన్నాడు వృద్ధబాటసారి, అద్దీ చేయిపట్టుకొని చూస్తూ.

ఆ వృద్ధబాటసారి ఎవరోకాదు బాటసారుల బృంద నాయకుడే. అతని మాటలు వినగానే అద్దీ అనుచరులంతా ఆందోళనపడుతూ అతని భౌతిక కాయం చుట్టూ చేరారు. తమ నాయకుడు చనిపోవడం పట్ల వారు బరువెక్కిన హృదయాలతో తీవ్ర సంతాపం వ్యక్తపరిచారు. కొందరయితే అమితమైన దుఃఖంతో భోరున విలపించసాగారు.

సమయానికి వచ్చి వాళ్ళ ప్రాణాలు కాపాడిన బాటసారుల బృందం నాయకుడు వారిని ఓదార్చాడు. దాంతో అందరూ దుఃఖాన్ని దిగమింగి సహనం పాటించారు. తరువాత ఒక పెద్ద గుంట తీసి అందులో అద్దీ భౌతికకాయాన్ని సమాధిచేశారు. ఎలాగో ఈ ఆపదనుండి బ్రతికి బయటపడ్డామని తృప్తిపడితే,

ఆ తృప్తిని తుంచివేస్తూ నాయకుని మరణం వారికి విషాదమే మిగిల్చింది. వారు అద్దీ శవాన్ని సమాధిచేసి తదుపరి కర్తవ్యమేమిటో అర్థంగాక అయోమయంలోపడి పోయారు. తుఫాను గాలి, వడగాల్పుల వల్ల శరీరాలు బొబ్బలెక్కి పచ్చిపుండ్లుగా మారిపోయాయి. ఈ స్థితిలో తాము ఎక్కడికి పోవాలో, ఎలా ప్రయాణం చేయాలో వారికి అర్థంకావడం లేదు. అయితే వారిపై నిప్పులు కక్కిన సూర్యుడు మాత్రం తన విధి నెరవేరిందంటూ పడమటి కనుమల్లోకి వాలిపోయాడు.

"ఈ పరిస్థితిలో మీరు ఎక్కడకని వెళ్తారు? అదీగాక ఇప్పుడు మీరు ప్రయాణం చేసే స్థితిలో కూడా లేరు. కొంతకాలం మాతోపాటు గడపండి. మీకోసం మేము ఇక్కడే కొన్నాళ్ళు ఉండిపోతాం" అన్నాడు బాటసారుల బృందం నాయకుడు హుమైర్ వాళ్ళ దుస్థితి చూసి జాలిపడుతూ.

హారిసా అతని తెగవాళ్ళు కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ మౌనంగా అతడ్ని అనుసరించారు.

బాటసారులు తమ వెంట తెచ్చుకున్న సామగ్రితో ఆ ప్రదేశంలోనే గుడారాలు వేసుకున్నారు.

తుఫాను తాకిడికి తీవ్రంగా దెబ్బతిన్న హారిసా, అతని సహచరులు ఆ రోజు రాత్రి మళ్ళీ స్పృహకోల్పోయారు. బాటసారులు ఎంతో సానుభూతితో వారికి చికిత్సాసేవలు అందజేయడం ప్రారంభించారు. రెండోరోజు వారికి స్పృహ వచ్చింది. అయితే వారి శరీరాలపై ఏర్పడిన బొబ్బలు పగిలి పుండ్లుగా మారి పోయాయి.

బాటసారులు తమ శాయశక్తుల వారి గాయాలను నయం చేయసాగారు. ఇలా అనేక రోజులు వారికి సేవ చేశారు. కాని అన్ని రోజులు సేవ, చికిత్సలు చేసినా వారి పరిస్థితి మెరుగుపడలేదు. అందువల్ల వారు హారిసా,

అతని సహచరులను తీసుకొని అక్కడ్నుంచి వేరే చోటికి బయలుదేరారు. మూడు రోజులు ప్రయాణం చేసి ఒయాసిస్సు వున్న ఒక ప్రదేశానికి చేరు కున్నారు. అక్కడ గుడారాలు వేసుకొని ప్రశాంతంగా వారికి చికిత్సాసేవలు చేయడంలో నిమగ్నులయిపోయారు.

అరబ్బులు సాధారణంగా స్వేచ్ఛాప్రియులు. వారు ఇతరుల నాయ కత్వాన్ని, పాలనాధికారాన్ని సహించలేరు. వారు ఎల్లప్పుడూ స్వేచ్ఛగానే ఉండా లని కోరుకుంటారు.

వారిలో దేశ దిమ్మరులైన తెగలయితే పట్టణాలలో, గ్రామాల్లో పక్కా ఇండ్లు నిర్మించుకొని, శాశ్వతంగా ఒకచోట ఉండటానిక్కూడా ఇష్టపడరు. అలా సామూహిక పౌరజీవితం గడపటంలో కూడా వారికి బానిసత్వపు ఛాయలు కనిపిస్తాయి. అందువల్ల వారు ఏ ఒక్క ప్రదేశంలో కూడా దీర్ఘకాలం నిలకడగా ఉండకుండా తరచుగా ఒకచోటి నుంచి మరో చోటికి సంచారం చేస్తూ ఉంటారు.

సంచార జీవితంలో ఎన్నో కష్టాలను అనుభవించవలసి వస్తుంది. నిప్పులు కురిసే ఎండలను సహించవలసి వస్తుంది. ఇసుక తుఫానుల ధాటిని ఎదుర్కోవలసి వస్తుంది. ఒక్కొక్కసారి ప్రయాణంలో దారితప్పిపోతే తీవ్రమైన ఆకలి దప్పులను కూడా చవిచూడవలసి వస్తుంది.

కాని స్వేచ్ఛాజీవితం కోసం వారు ఈ బాధలన్నీ సంతోషంగా భరిస్తారు. అంతేగాని ఇతరులకు బానిసలయి ఉండటాన్ని మాత్రం ససేమిరా సహించరు. ఇతరులకు లొంగి ఉండి బానిస జీవితం గడపడం కన్నా మృత్యువు మేలని భావించేవారు.

ఈ బాటసారులు కూడా సంచార జీవితం గడిపే తెగలకు చెందినవారే. హారిసా, అతని సహచరుల గాయాలు కాస్త మాని వారు కోలుకోగానే వీరు మరో ప్రాంతానికి వెళ్ళిపోవాలని భావించారు. కాని వారి గాయాలు తొందరగా మానడం లేదు. దాంతో బాటసారుల బృందం గత్యంతరం లేక ఆ ప్రదేశంలోనే నాలుగు సంవత్సరాల దాకా ఉండిపోవలసి వచ్చింది.

ఈ దేశ దిమ్మరులు ఎంత అనాగరికులయినప్పటికీ అతిథి సత్కారంలో తమకుతామే సాటి అనిపించుకునేవారు. ఆతిథ్యమివ్వడంలో వీరు శత్రువులు, మిత్రులు అని కూడా విచక్షణ చేయరు. హారిసా, అతని సహచరులు బనూబకర్ తెగలకు చెందినవారు. కాగా ఇప్పుడు వారికీ ఆపదలో ఆదుకొని ఆతిథ్యమిస్తున్న బాటసారుల బృందం బనూసాలబ్ తెగకు చెందినవారు.

ఈ రెండు తెగలమధ్య గతంలో నలభయేళ్ళపాటు భీకరయుద్ధాలు జరిగాయి. ఒక తెగ మరొక తెగను తుదముట్టించడానికి ప్రయత్నిస్తూ ప్రతీకారంతో దహించుకుపోతుండేది. ఇప్పటికీ ఈ తెగల మధ్య పరస్పర ద్వేషం, విరోధం ఉన్నాయి.

అయితే హారిసా, అతని సహచరులపై విరుచుకుపడిన కడగండ్లను చూసి వారు విద్వేషం, విరోధభావాలను తాత్కాలికంగా తమ హృదయాల నుండి తీసివేశారు. శత్రువుకైనా అతిథి సత్కార చేయాలన్న అరబ్ సంప్రదాయాన్ని పాటిస్తూ వారు హారిసా, అతని సహచరులకు సేవా, చికిత్సలు చేస్తున్నారు. ఆహారపానీయాలు, ఇతర వసతుల విషయంలో వారివల్ల ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నా హుమైర్ అతని అనుయాయులు ఏమాత్రం విసుగు చెందేవారుకాదు.

అంతేకాదు ఒక్కొక్కసారి ఆహార పదార్థాలు తక్కువగా ఉంటే వారు స్వయంగా పస్తులుండి హారిసా సహచరులకు కడుపునిండా అన్నం పెట్టేవారు.

హారిసా, అతని సహచరుల శరీరాలపై ఏర్పడిన బొబ్బలు పచ్చి పుండ్లుగా మారిపోయాయి. ఈ పుండ్లు కాస్త నయమవుతున్నట్లు సూచనలు కనిపించగానే వారు లేచి - అటూ ఇటూ తిరగేవారు ఈ విధంగా చేస్తే ప్రయాణం చేయగల స్థితికి చేరుకోవచ్చని, ఆ తరువాత తమకు ఆతిథ్యమిచ్చిన వారికి కృతజ్ఞతలు చెప్పి జమీలా, రుఖియా, ఇతర స్త్రీలు, పిల్లల అన్వేషణ కోసం బయలుదేరవచ్చని వారు భావించారు. కాని పడకల మీద నుంచి లేచి అటు ఇటు తిరగ్గానే పుండ్లు మళ్ళీ పచ్చిగా మారిపోయి బాధ పెట్టేవి. దాంతో

వారు గత్యంతరం లేక తిరిగి పడలకమీదనే ఉండి విశ్రాంతి తీసుకోవలసి వచ్చేది.

ఇలా వారు అనేకసార్లు తొందరపడటం వల్ల వ్యాది తిరగబెట్టేది. చివరికి వారు పుండ్లు పూర్తిగా నయమయి పరిపూర్ణ ఆరోగ్యవంతులు కానంత వరకు ఎటు కదలకుండా విశ్రాంతి తీసుకోవాలని నిశ్చయించు కున్నారు.

దాని ప్రకారం అందరూ పడకల మీదికి చేరి విశ్రాంతి తీసుకోవడం ప్రారంభించారు. ఈ విధంగా వారంతా నిరంతరాయంగా ఆర్నెల్లపాటు పడకల మీదే గడిపారు. దాంతో పుండ్లు మానిపోయి వారికి పూర్తి స్వస్థత చేకూరింది. ఇప్పుడు హాయిగా అటుఇటు తిరగ కలుగుతున్నారు. ప్రయాణం చేయగల బలం పుంజుకున్నారు.

ఒకరోజు హారిసా, బాటసారుల బృందం నాయకుడు హుమైర్‌ని కలుసు కోవడానికి అతను ఉంటున్న గుడారం దగ్గరికి వెళ్ళాడు.

ఆ సమయంలో హుమైర్ గుడారం లోపల ఒక కంబళి నేల మీద పరచుకొని కూర్చొనివున్నాడు. అతనికి ఎదురుగా ఓ కొత్త వ్యక్తి కూర్చొని మాట్లాడుతున్నాడు. అతని తల, గడ్డం, కాళ్ళు, బట్టలు ధూళితో నిండిపోయి చాలా దూరం నుంచి ప్రయాణం చేసి వచ్చినట్లు కనిపించాడు. హారిసా వచ్చి ఓ ప్రక్క చతికిలబడ్డాడు.

"హారిసా! నువ్వు సమయానికి రావడం మంచిదయింది. స్వయంగానే నేనే నిన్ను పిలిపిద్దామనుకుంటున్నాను. కాస్త ఈ వ్యక్తి చెబుతున్న మాటలు విను" అన్నాడు హుమైర్.

హారిసా కొత్త వ్యక్తిని చూస్తూ అతను బహుశా ఖహ్‌తాన్ తెగ వారి దగ్గర్నుంచి వచ్చి ఉంటాడని, జమిలా, రుఖియాలను గురించి ఏదైనా వార్త తెచ్చి ఉండవచ్చని భావించాడు.

"ఏమంటున్నాడు ఈయన?"

"ఇతను మక్కా నుంచి వచ్చాడు. ఏదో చిత్ర విచిత్రమైన వార్తలు వినిపిస్తున్నాడు" అన్నాడు హుమైర్.

హారిసా మళ్ళీ ఆలోచనలో పడిపోయి బహుశా జమీలా సంగతి అతని తండ్రి ఖైస్‌కు తెలిసిపోయి ఉంటుందని, అందువల్ల అతను జమీలా, సల్మాలను వెతుకుతూ తిరుగుతూ ఉండవచ్చని అనుకున్నాడు.

జమిలా గనక దొరికిపోతే ఆమెను ఖైస్ చంపేయడం ఖాయం. సల్మాను కూడా సజీవంగా వదలిపెట్టడం ఆ తరువాత వాళ్ళిద్దర్ని కాపాడిన వాళ్ళమీద కూడా దాడిచేయవచ్చు. ఖైస్ 'తమీమ్' తెగకు చెందినవాడు. ఈ తెగ ఎంతో శక్తిమంతమయినది. దాన్ని ఎదుర్కొనే శక్తి హారిసాలోనూ లేదు, హారిసాకు ఆతిథ్యమిచ్చిన హుమైర్ అనుచరుల్లోనూ లేదు. అందువల్ల హారిసా మక్కా నుండి వచ్చిన వ్యక్తిని చూసి లోలోన భయపడసాగాడు.

"ఏమిటావార్తలు?" అన్నాడు హారిసా కాస్తంత బెరుగ్గా.

"మక్కాలో ఒకాయన తాను దైవప్రవక్తనని ప్రకటించుకున్నాడట! దేవుడు ఒక్కడేనని, అరేబియాలో ఉన్న వేలాది విగ్రహాలు దేవుళ్ళు కాజాలరని అతను వాదిస్తున్నాడట!! మానవులంతా తమను సృష్టించిన ఏకైక దేవుడ్ని మాత్రమే ఆరాధించాలని, ఆయన ఎంతో శక్తిమంతుడని, జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయని అతను ప్రచారం చేస్తున్నాడట!!

"అంతేకాదు. అతను ఇలా కొత్త ధర్మాన్ని ప్రచారం చేస్తూ మక్కా ప్రజల్లో చీలికలు తెచ్చాడట! చాలా మంది తమ తాతముత్తాతల మతాన్ని వదిలేసి అతని మతంలో చేరిపోయారట. అతను గొప్ప వాక్చతురుడని, అతనితో ఎవరైనా ఒక్కసారి మాట్లాడితే చాలు ఇక అతనికి వశమయిపోతాడని ఈయన చెబుతున్నాడు. అతనికి వశమయిపోయిన వాళ్ళు ఎన్ని ఆపదలు వచ్చినా, ఎలాంటి వేధింపులకు గురయినా సహనం వహిస్తారేగాని, అతని మతాన్ని వదలి పెట్టరట. ఇవన్నీ విచిత్రమైన వార్తలు కావా?" అన్నాడు హుమైర్.

ఈ మాటలు వినగానే హారిసా భయాందోళనలు ఒక్కసారిగా పటా పంచలయిపోయి అతని మనస్సు కుదుటపడింది. అతను చల్లగా ఊపిరి పీల్చుకుంటూ "నిజంగా ఇది చాలా విచిత్రమైన సంగతి. ఇంతకూ ఆ విచిత్ర వ్యక్తి ఎవరట?" అని అడిగాడు.

"అతను ఎంతో గౌరవప్రదమైన కుటుంబానికి చెందిన వ్యక్తి. హాషిం సంతతికి చెందిన మనిషి. అబ్దుల్ ముత్తలిబ్ మనవడట. పేరు ముహమ్మద్ (సఅసం)" చెప్పాడు హుమైర్.

"అయితే మక్కా పౌరులంతా అతని మతంలోకి చేరిపోయారా?" మళ్ళీ అడిగాడు హారిసా.

"ఇంకా అందరూ చేరలేదు. కొందరు మాత్రమే చేరారు. కాని మరి కొంతకాలానికి చాలామంది చేరవచ్చు. ప్రస్తుతం కొత్త మతాన్ని స్వీకరించిన వాళ్ళు కొద్దిమందే అయివుండటం వల్ల ఖురైషీయులు పెట్టే బాధలు భరించ లేక మక్కా వదలిపెట్టి వేరే ప్రాంతానికి వెళ్తున్నారట.

"అయితే అక్కడ పరిస్థితి చాలా మారిపోయిందన్నమాట."

"ఈ మనిషి సంగతి కూడా వినూ. ఇతని పేరు అబ్దుల్ ఉజ్జా. ఇతను కూడా కొత్త ధర్మం స్వీకరించి స్వస్థలం వదలిపెట్టి వలస (హిజ్రత్) పోతున్నా డట!"

"అంతా ఆశ్చర్యంగా ఉందే! ఇతను తన పూర్వీకుల మతాన్ని ఎలా వదలిపెట్టాడు?" అన్నాడు హారిసా ఆశ్చర్యపోయి అతనివైపు చూస్తూ.

దానికి సమాధానంగా కొత్త వ్యక్తి పెదవులపై ఓ క్షణం చిరునవ్వు నాట్య మాడింది.

"నాక్కూడా అదే అర్థం కావడం లేదు. కొత్త ధర్మాన్ని అవలంబించిన వాళ్ళు మన ప్రాచీన దేవతలను పూజించడాన్ని ఖండిస్తున్నారట. అరబ్బులు తమ దేవతలకు వ్యతిరేకంగా ఒక్క మాటను కూడా సహించలేరు.

"ఈ కొత్త మతస్థులు తమ మతంలోని మంచి లక్షణాలను గురించి మన మతంలో చెడును గురించి చెబుతున్న విషయాలను ఇతని నోట

విన్నప్పుడు ఆ రక్తం ఉడికిపోయింది. ఇతని మెడ నరికేద్దామా అన్నంతకోపం వచ్చింది. కాని హుమైర్ తన అతిథిని హతమార్చాడన్న అపవాదు వస్తుందన్న ఆలోచనలో ఇతడ్ని వదిలేశాను. హారిసా! నేను కూడా మక్కా వెళ్దామను కుంటున్నాను" అన్నాడు హుమైర్.

"ఎందుకు? అక్కడికిపోయి ఏం చేస్తారు?" అడిగాడు వెంటనే హారిసా.

"ఎందుకేంటి? ఈ ఉపద్రవాన్ని శాశ్వతంగా అంతమొందిస్తాను. మన పూర్వీకుల మతాన్ని తూలనాడుతున్న ముహమ్మద్ (సఅసం)ను హతమార్చా లని నిర్ణయించుకున్నాను" అన్నాడు హుమైర్.

"చాల మంచి నిర్ణయం తీసుకున్నారు. ఎన్నో శతాబ్దాల నుంచి వస్తున్న సనాతన మతాన్ని తూలనాడుతుంటే మనం ఎలా సహించగలం? మీరు తప్పకుండా మక్కా వెళ్ళండి. పోతే మా శత్రువులను వెతికి పగతీర్చుకోవడానికి నాకు నా అనుచరులకు అనుమతి ఇవ్వండి. మా తెగ నాయకుని ప్రేతాత్మ విరోధి రక్తంకోసం తహతహలాడుతోంది. ప్రేతాత్మ శాంతికోసం ఖహ్తాన్ తెగ మీద ప్రతీకారం తీర్చుకోవడం చాలా అవసరం" అన్నాడు హారిసా.

"ఈ పని కూడా చాలా ముఖ్యమైనదే. నేనసలు నిన్ను మక్కా తీసికెళ్దా మనుకున్నాను. కాని నువ్వు ఖహ్తాన్ తెగమీద ప్రతీకారం తీర్చుకోకపోతే యావత్తు తెగల్లో అప్రతిష్ఠపాలవుతావు. అందుకని నిన్ను మక్కా రమ్మని బల వంతం పెట్టలేను. అంతా మీ ఇష్టం మీరు కోరిన చోటికి వెళ్ళవచ్చు. మీకు అతిథిసత్కారం చేయడంలో మావల్ల ఏదైనా లోపం జరిగితే నేను మా తెగ తరపున క్షమాపణ చెబుతున్నాను" అన్నాడు హుమైర్.

"లేదు లేదు మీరు మాకు ఆతిథ్యమివ్వడంలో ఎలాంటి లోపం రానివ్వలేదు. ఒకటి కాదు, రెండుకాదు, అయిదు సంవత్సరాలపాటు మీరు మాకు ఎంతో బాగా ఆదరించి ఆతిథ్యమిచ్చారు. అందుకు మేము మీకెంతో రుణపడి ఉన్నాము. అసలు మీ రుణాన్ని మేము ఎన్నటికీ తీర్చుకోలేము" అన్నాడు హారిసా కృతజ్ఞతాభావంతో.

"సరే, మరో విషయం. నువ్వు బనూబకర్ తెగకు చెందినవాడవు. మీ తెగ, మా తెగ మధ్య ఎన్నో ఏళ్ళ నుంచి శత్రుత్వం ఉంది. కాని మా గుడారాల్లో ఉన్నంతకాలం మీరు మాకు అతిధులయినందున మా విద్యుక్తధర్మంగా భావించి మీకు సేవచేశాము. ఇప్పుడు మేము మీనుండి విడిపోతున్నాము. ఇక ముందు ఎప్పుడైనా మనం కలుసుకోవలసి వస్తే మిత్రుల్లా గాకుండా శత్రువుల్లా కలుసుకోవలసి ఉంటుంది" అన్నాడు హుమైర్ పాతకక్షలను గుర్తుచేస్తూ.

"నాకు తెలుసు, ఎంతోకాలం నుంచి మన మధ్య ఉన్న శత్రుత్వం అంత సులభంగా తొలగిపోదు. అందుకే మేము వీలైనంత తొందరగా మీ గుడారాలు వదలిపోదామని అనేకసార్లు ప్రయత్నించాము. కాని మా ఈ తొందరపాటే మా అనారోగ్యానికి సాగదీసింది.

"మా గాయాలు నయమవడం మొదలు పెట్టగానే మేము లేచి తిరగడానికి ప్రయత్నించాము. అది కాస్తా బెడిసి కొట్టింది. మేము విధిలేక మరికొంత కాలం మీ దగ్గరే ఉండిపోవలసి వచ్చింది. ఇప్పుడు మేము పూర్తిగా కోలుకున్నాం. ఎలాంటి బాధాలేదు. కనుక మేము మీనుండి వీడ్కోలు తీసుకొని వెళ్ళిపోతాము.

"భవిష్యత్తులో ఎప్పుడైనా మనం కలుసుకుంటే మిత్రుల్లాగా గాకుండా శత్రువుల్లా కలుసుకుందాం. అయితే మీకేదయినా ఆపద వచ్చి పడితే మాత్రం ఆదుకోవడానికి నేను, నా తెగ వాళ్ళు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాము" అంటూ హారిసా లేచి నిలబడ్డాడు.

అతను హుమైర్ గుడారం నుంచి బయటికి వచ్చి తన అనుచరుల దగ్గరికి చేరుకున్నాడు. అతని అనుచరులు మూటలు, ముల్లెలు సర్దుకొని ప్రయాణానికి సిద్ధమయి ఉన్నారు. హారిసా రాగానే అందరూ లేచి ఒంటెల మీదకెక్కి కూర్చున్నారు. హారిసా కూడా ఒక ఒంటెపైకి ఎక్కి దాన్ని అదిలించాడు. ఒంటె బయలుదేరింది భారంగా అడుగులు వేస్తూ ముందుకు. మిగతా ఒంటెలు దాన్ని అనుసరించాయి.

హారిసా, అతని అనుచరులు వెళ్ళిన కాస్సేపటికి హుమైర్, అతని అనుచరులు కూడా గుడారాలు పీకేసి ఒంటెలపై వేసుకున్నారు. మిగిలిన

సామానుకూడా సంచుల్లోవేసి ఒంటెల వీపుమీద రెండు వైపులా వ్రేలాడదీశారు. ఆ తరువాత వాటి మీద ఎక్కి కూర్చుని బయలుదేరారు.

అందరికన్నా చివర్లో ఇస్లాం స్వీకరించిన అబ్దుల్ ఉజ్జా అనే కొత్త వ్యక్తి బయలుదేరాడు. అతను ఖురైషీయులు పెట్టే బాధలు భరించలేక మక్కా వదలి వచ్చాడు. హారిసా, హుమైర్, వారి తెగల వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత ఒంటె ఎక్కి ఉత్తర దిక్కుకు ప్రయాణమయ్యాడు.

ముగ్గురూ మూడు దారులు పయనమ్యారు. అబ్దుల్ ఉజ్జా నూతన ధర్మం వెలిగించిన విశ్వాస జ్యోతితో ఉత్తేజితుడయి మదీనా దారి పడ్తే, హుమైర్ ఇస్లాం వ్యతిరేక భావంతో ఆపాదమస్తకం మండిపోతూ మక్కాదారి పట్టాడు. కాని హారిసా పట్టిన దారికి గమ్యం లేదు. ప్రతీకారం తీర్చుకోవడానికి పగవాడ్ని వెతుక్కుంటూ అతను, అతని అనుచరులు ఓ దిశగా ప్రయాణం చేయసాగారు.

హారిసా, అతని అనుయాయులు భయంకరమైన ఇసుక సముద్రంలో గుట్టలు, మిట్టలు దాటుకుంటూ ప్రయాణం చేయసాగారు. ఆ ఎడారిలో ఎటు చూసినా ఇసుకమయమే. ఒక చెట్టుగాని, ఒక మొక్కగాని మచ్చుకైనా కనిపించదు. జనసంచారం అంతకన్నా లేదు.

ఇక్కడ ఎడారి వాతావరణాన్ని బట్టి ప్రయాణం చేయవలసివస్తుంది. పూర్తి పగలుగాని, పూర్తి రాత్రిగాని నిర్విరామంగా ప్రయాణం చేయడం ఎంతో ప్రమాదంతో కూడిన పని. మధ్యాహ్నం నుంచి ఎండ పెటపెటలాడుతుంది. నేల పొయ్యి మీది పెనంలా కాలిపోతుంటుంది. చెంపలు పగలిపోయేలా తీవ్రమైన వడగాల్పులు వీస్తుంటాయి.

అందువల్ల హారిసా, అతని అనుచరులు ఉదయం నుండి మిట్ట మధ్యాహ్నానికి కొంచెం ముందు వరకు ప్రయాణం సాగించి ఎండతీవ్రం కాగానే ఒక చోట ఆగిపోయేవారు. అక్కడే గుడారాలు వేసుకొని విశ్రాంతి తీసు కుంటారు. ఒంటెలను వదలిపెడ్తారు. అవి ఎండలో మాడిపోతూ నిల్చొని నెమరేస్తూ ఉంటాయి.

సూర్యుడు పడమర దిక్కువైపుకు బాగా వాలి, ఎండ తీవ్రత తగ్గి వాతా వరణం కాస్త చల్లబడిన తరువాత వాళ్ళు గుడారాలను పీకి ఒంటెల మీద

వేసుకొని మళ్ళీ బయలుదేరుతారు. ఇలా సాయంకాలం నుండి నడిరేయి వరకు ప్రయాణం చేస్తారు.

అర్ధరాత్రి గడచిన తరువాత మళ్ళీ ఆగి, ఇసుక నేలమీద దుప్పట్లు కప్పుకొని నీలాకాశం క్రింద హాయిగా నిద్రపోతారు. అలా సూర్యోదయం దాకా పడుకుంటారు. ఆ తరువాత మేల్కొని కాలకృత్యాలు తీర్చుకొని తిరిగి ప్రయాణం కొనసాగిస్తారు.

ఈ విధంగా హారిసా, అతని అనుచరులు ఆగుతూ, నడుస్తూ అనేక రోజులు ప్రయాణం చేశారు. హుమైర్ నుండి వీడ్కోలు తీసుకొని బయలుదేరే టప్పుడు వారి దగ్గర ఆహార పదార్థాలు చాలా తక్కువగా ఉండేవి. కొన్ని సంచుల ఖర్జూర పండ్లు మాత్రమే ఉండేవి. అందువల్ల వాటిని ఎంతో పొదుపుగా వాడుకుంటూ ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పుడా ఖర్జూర పండ్లు కాస్తా అయిపోవచ్చాయి.

వారు ప్రయాణం చేస్తున్న ప్రాంతం కొత్తకొత్తగా కనిపించింది. ఇది వరకెప్పుడూ వారు ఈ ప్రాంతాన్ని చూసి ఉండలేదు. అందువల్ల వారు ఎటు వైపు వెళ్తున్నారో, ఎటు నుంచి బయలుదేరారో వారికే అర్థం కాలేదు. దేవతల మీద భారం వేసి ప్రయాణం సాగిస్తున్నారు.

ఆ ప్రాంతంలో ఎటుచూసినా మేరు పర్వతాల్లాంటి ఇసుకతిన్నెలు, ఎత్త యిన మేటలు, పెద్దపెద్ద లోయలే తప్ప కనువిందుచేసి ఆహ్లాదపరిచే ఒయాసిస్సులు వారికి ఎక్కడా కనిపించలేదు. కాకపోతే కొన్ని చోట్ల మాత్రం ఎండ వేడికి బోసిపోయినా చెట్లు మాత్రం కొన్ని కనిపించాయి.

అక్కడక్కడ కొన్ని ఒయాసిస్సులు కూడా కనిపించాయి. గాని వాటి చుట్టు పక్కలున్న చెట్లు పూర్తిగా ఎండిపోయి ఉన్నాయి. ఎండకు వాడిపోయి రంగు వెలసిన ఆకులతో కూడిన ఖర్జూరచెట్లు తమ ఉనికిని చాటుకోలేక నానా అవస్థలు పడుతున్నాయి. ఒయాసిస్సులు అన్న పేరేగాని వాటిలో అసలు నీళ్ళే లేవు. నేలలు బీటలువారి అక్కడి దైన్యానికి అద్దంపడుతున్నాయి.

హారిసా, అతని అనుచరులు నీటికి, మేతకు కటకటలాడిపోయేవారు. నోరు లేని ఒంటెలు బారెడు నాలుకలు జాపిరొప్పుతుంటే వాళ్ళ గుండెలు తరుక్కుపోయేవి.

ఒక్కొక్కసారి కొన్ని చోట్ల హఠాత్తుగా వారికి ఒకటి రెండు నీటి కుంటలు కనిపించేవి. అదే మహాభాగ్యమనుకుంటూ వారు తమ తోలు తిత్తుల్లో ఆ నీటిని నింపుకునేవారు. ఒంటెలను కూడా తాగించేవారు. అక్కడే వారికి, ఒంటెల మేతకోసం ఎండిపోయిన ఆకులు అలములు కూడా దొరికేవి. వాటిని ఒంటెలకు కడుపునిండా తినిపించి, అవి మోయగలిగినన్ని మోపులు కూడా కట్టుకొని ప్రయాణం సాగించేవారు.

ఈ విధంగా వారు అనేక నెలలపాటు దారీ, తెన్నూ తెలియక ఎడారిలో తిరిగారు. కాని వారికి దారి చూపించే వ్యక్తి ఒక్కడు కూడా దొరక లేదు. బాటసారులు కూడా ఎవరూ కనిపించలేదు. జనావాస ప్రాంతాలు అంతకన్నా కనిపించలేదు. సస్యశ్యామలమైన ఒయాసిస్సులయితే అసలే కనిపించలేదు. వందల మైళ్ళు ప్రయాణం చేసినా జన సంచారం లేని భయం కరమైన ఎడారి ప్రాంతమే వారికి కనిపించేది. ఈ ఎడారి నుండి బయటపడే మార్గం ఏమిటో తెలియక వారు అయోమయంలో పడిపోయారు.

అసలు తాము ఏ ప్రాంతంలో ప్రయాణం చేస్తున్నారో కూడా వారికి తెలియడం లేదు. దానికి తోడు వెంట తెచ్చుకున్న ఖర్జూరపండ్లు రోజురోజుకు హారతి కర్పూరంలా హరించుకుపోతున్నాయి. ఎంత పొదుపుగా వాడు కుంటున్నా అని ఇంకా కొన్ని రోజులకు మాత్రమే సరిపోతాయి. ఆ తరువాత పరిస్థితి ఏమిటి? ఈ ఆలోచనలతో వారు నిలువెల్లా కంపించిపోయారు.

ఖర్జూరాలు సరిపడినన్ని లేకపోవడం వల్ల వారు మొదటినుంచే తలా పిడికెడు పండ్లు తింటూ అర్ధాకలితో గడుపుతూ వచ్చారు. ఇప్పుడు పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో భయపడిపోయి ఓ నిర్ణయానికి వచ్చారు. కేవలం ప్రాణం నిలపుకోవడానికి, ప్రతి వ్యక్తీ రోజూ ఉదయం ఒక పండు, సాయంత్రం ఒక పండు చొప్పున మాత్రమే తింటూ జీవితం గడపాలని వారు నిర్ణయించు కున్నారు.

ఈ నిర్ణయం ప్రకారం ప్రతీమనిషీ రోజుకు రెండు పండ్లు మాత్రమే తింటూ ప్రయాణం చేయసాగారు. ఇలా రోజుకు రెండంటే రెండు పండ్లు మాత్రమే తిని ఎంతకాలం జీవించగలరు? కాని అంతకన్నా గత్యంతరం లేక పోయింది.

తత్ఫలితంగా వారి శరీరాలు రోజుకు రోజుకు కృశించిపోసాగాయి. కండలు కరిగి ఎముకలు బయటికి వస్తున్నాయి. కడుపులు వీపులకు అతుక్కుపోతున్నాయి. కళ్ళు లోపలకు పీక్కుపోతున్నాయి. అయినా వారు బ్రతుకు మీద ఆశతో ఆకలి బాధను సహిస్తూ మొండిగా ప్రయాణం సాగిస్తూనే ఉన్నారు.

ఇలా కడుపుమాడ్చుకొని ఎంత పొదుపుగా వాడుకున్నా ఫలితం లేకపోయింది. ఆపదలో ఆదుకోవడానికి ఒక్కడూ తారసిల్లలేదు. చివరికి ఆ కొద్ది పండ్లు కూడా అయిపోయాయి. ఎవరి దగ్గరా ఒక్కపండూ మిగల్లేదు. దాంతో వారు తీవ్రంగా ఆందోళన చెందారు.

ఇప్పుడు వాళ్ళ దగ్గర కడుపు నింపుకోవడానికి మంచినీళ్ళు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటితోనే వారు జీవితం గడుపుతూ ప్రయాణం సాగిస్తున్నారు.

కాని మనిషి కేవలం నీళ్ళు మాత్రమే తాగి ఎన్ని రోజులు ప్రాణాన్ని నిలుపుకోగలడు? ఫలితంగా వారు మరింత చిక్కిపోయారు. అస్తిపంజరాల్లా మారిపోయారు. చివరికి నడిచే ఓపిక కూడా లేకుండాపోయింది.

అందరూ ఒంటెల మీద కూర్చొని ప్రయాణం సాగిస్తున్నప్పటికీ ఒక్కొక్క సారి ఆ ఒంటెలమీద కూడా సరిగా కూర్చోలేకపోయేవారు. ఒంటెలు నడుస్తున్నప్పుడు వారి ఎముకల గూళ్ళు కదలిపోయి కళ్ళముందు అంధకారం అలుముకునేది. దాంతో వారు ఒంటెల పగ్గాలు వదలిపెట్టి వాటి మూపురాలపై నిస్సత్తువుగా పడిపోయేవారు. ఒంటెలు మాత్రం ఆగకుండా యథాప్రకారం ముందుకు సాగిపోతుండేవి.

అలా ఒంటెలు నడచి నడచి అలసిపోయి రాత్రివేళ ఎక్కడయినా ఆగి కూర్చోగానే వాళ్ళు తలలు పైకెత్తి కళ్ళు తెరచి చూసేవారు. ఆ తరువాత మెల్లిగా క్రిందికి జారి, ఒంటెకు రెండు మూడు గజాల దూరాన వెళ్ళి ఇసుక మీద సాగిలపడేవారు. ఆ తరువాత కాస్సేపటికే సుఖమెరగని నిద్రముంచుకొచ్చేది. పాపం వారు నకనకలాడుతున్న కడుపులతోనే సూర్యోదయందాకా పడుకునేవారు.

ఉదయం మేల్కొన్న తరువాత వారి ఒంట్లో శక్తిమరింత తగ్గిపోయి నట్లు అనిపించేది. అప్పుడప్పుడు అకస్మాత్తుగా కళ్ళముందు చీకట్లు ఆవరిం చేవి.

ఈ పరిస్థితి చూసి మృత్యువు ఇక తమకు ఎంతో దూరంలో లేదని భావించారు. కాని మృత్యువంటే వారికి కించిత్తయినా భయంలేదు. అసలు మనిషి ఎందుకు మరణిస్తాడు. మరణించిన తరువాత ఎక్కడికి పోతాడు, ఏమవుతాడు అనే విషయాలు వారికి బొత్తిగా తెలియవు. తెలిసినా దాన్ని గురించి వారికి దిగులే లేదు.

వారి దిగులంతా 'తమ శత్రువులపై ప్రతీకారం తీర్చుకోలేకపోతున్నామే' అనే విషయాన్ని గురించే వారిదృష్టిలో బ్రతకడానికి కూడు ఎంత అవసరమో, విరోధి మీద పగసాధించడం కూడా అంతే అవసరం.

ఇంకా చెప్పాలంటే కూటికన్నా ప్రతీకారమే వారికి ముఖ్యం. అందుకే వారు చావుకు చేరువవుతున్నామని భయపడటానికి బదులు తమ నాయకుని ఆత్మశాంతి కోసం శత్రువులపై ప్రతీకారం తీర్చుకోకుండానే చచ్చిపోతున్నామే అని బెంగపడి పోతున్నారు.

శత్రువుల మీద ప్రతీకారం తీర్చుకోవాలంటే మరికొంతకాలం బ్రతకాలి. బ్రతకాలంటే తిండి తినాలి. తిండికోసం వారిప్పుడు దేవతలను ఆశ్రయించారు.

ప్రతి వ్యక్తీ తన తన ఇష్టదైవాన్ని వేడుకోవడం ప్రారంభించాడు.

చాలామంది బిగ్గరగా రోదిస్తూ దేవతలను మొరపెట్టుకున్నారు. లాత్, ఉజ్జా, హుబల్ వగైరా దేవదలందర్నీ దీనాతి దీనంగా ప్రార్థించారు. ఆ దేవతా విగ్రహాలు తమ కళ్ళ ఎదుటే ఉన్నట్లు ఊహించుకొని, వాటి ముందు సాగిల బడి మరీ వేడుకున్నారు. గొంతులు తడారి పోయేదాకా మొరపెట్టుకొని ఎన్నెన్నో మొక్కుబడులు కూడా చేసుకున్నారు.

కాని ఒక్కదేవత కూడా వారి మొరలు ఆలకించలేదు. అయినా ఆ దేవతల మీద వారికున్న భక్తిభావం వీసమెత్తుకూడా తగ్గలేదు. వారు విసుగు చెందకుండా, నిరాశపడకుండా బొంగురుపోయిన గొంతులతో దేవతలను మొరపెట్టుకుంటూనే ఉన్నారు.

అయితే హారిసాకు దేవతల మీద నమ్మకం క్రమంగా సడలిపోసాగింది. అతను వాటిని వేడుకోవడం మానేసి ఆలోచనలో పడిపోయాడు. అతని అంత రాత్మ అతడ్ని నిలదీసింది. మిధ్యా దైవాల మీద అతని భ్రమలు తొలగి పోయాయి.

హారిసా తన అనుచరుల దయనీయ పరిస్థితి చూసి ఖిన్నుడయి పోయాడు. వారి జీవితాలు ప్రమాదంలో పడిపోయాయి. మృత్యువు వారిని అతి వేగంగా తరుముకుంటూ వస్తోంది.

"ఆశ్చర్యంగా ఉందే! ఇంతగా మొరపెట్టుకున్నా మన దేవతలు మనల్ని కనికరించరేమిటీ? మనం ఏమాత్రం లోపం రానీయకుండా ప్రతిరోజూ దేవత లను పూజిస్తూనే ఉన్నాం కదా! ఏ బాధ వచ్చినా వాటినే వేదు కుంటున్నాం. మరి మనల్ని అవి ఎందుకు అనుగ్రహించడం లేదు? ఆకలి బాధనుండి మనల్ని ఎందుకు కాపాడటంలేదు? వాటికి మన మీద ఏమైనా కోపం వచ్చిందా? ఏం అపచారం చేశామని అవి మనకు దూరమయి పోయాయి" అన్నాడు హారిసా ఎంతో బాధపడిపోతూ.

"కోపం రావడానికి కారణం ఏమిటో అర్థం కావడం లేదు. మనం ఈ స్థితిలో కూడా వాటిని పూజిస్తున్నాం. వాటి ముందు సాష్టాంగపడుతున్నాం. అలాంటప్పుడు అవి మనల్ని ఎందుకు వదలిపెట్టాయి? హారిసా! మనం ఇట్లాగే ఆకలితో మాడి చావాల్సిందేనా? ఖహ్‌తాన్ తెగమీద ప్రతీకారం తీర్చు కోలేమా?" అన్నాడు ఓ నడికారు వ్యక్తి ప్రతీకారేచ్ఛ రగల్చిన కడుపుమంటతో.

"ఏమో, నాకేమీ పాలుపోవడం లేదు........ అయినా నాకు తెలీక అడు గుతా, అసలీ విగ్రహాలు దేవతలు కాగల్గుతాయంటావా? నిజంగా ఇవి మన దేవుళ్ళయితే ఈ ఆపద సమయంలో మనల్ని ఎందుకు ఆదుకోవు?" అన్నాడు హారిసా.

"హారిసా! ఏమిటీ ఈ రోజు నువ్వు కొత్తగా మాట్లాడుతున్నావు? ఒకవేళ ఇవి దేవుళ్ళు కాకపోతే ఇంకెవరు మనకు దేవుడు?" అన్నాడు మరొక వ్యక్తి హారిసా కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"నువ్వు హుమైర్ చెప్పినమాటలు వినలేదు కాబోలు."

"ఏం చెప్పాడేమిటీ?"

"మక్కాలో ఎవరో తాను దైవప్రవక్తనని ప్రకటించుకొని, విగ్రహాలు దేవుళ్ళు కాజాలరని, మొత్తం విశ్వాన్ని, సమస్త ప్రాణికోటిని సృష్టించిన వాడే దేవుడని చెబుతున్నాడట. ఆయనే సర్వాధికారి, సర్వశక్తిమంతుడట" అన్నాడు హారిసా.

"ఆశ్చర్యంగా ఉందే! మరి ఆ దేవుడు ఎక్కడున్నాడంట?"

"ఆ సంగతి నాకు తెలియదుగాని, మొత్తం మానవుల కోసం ఎవరో ఒక దేవుడు మాత్రం తప్పకుండా ఉన్నాడని నా మనస్సాక్షి చేప్తోంది" అన్నాడు హారిసా.

"అయితే ఏమంటావు?" మరొకడి ప్రశ్న.

"సోదరులారా! నన్ను క్షమించండి. నాకిప్పుడు ఈ విగ్రహాలపట్ల మొహమెత్తింది. అయినా ఈ విగ్రహాలు మనకు ఏం ఒరగబెట్టాయని?" అన్నాడు హారిసా విగ్రహాలపట్ల తన అసంతృప్తిని వ్యక్తపరుస్తూ.

"హారిసా! ఏమిటీ నీ ధోరణి ఇట్లా మారిపోయింది? నువ్వు మత భ్రష్టుడయిపోయావా ఏమిటీ?" అన్నాడు ఒక వృద్ధుడు హారిసా వైపు వింతగా చూస్తూ.

"లేదు, నేను మత భ్రష్టుడ్ని కాలేదు. కాని విగ్రహాలు దేవుళ్ళు కాజాలరని నా అంతరాత్మ పదేపదే చెప్తోంది. మనం, మన తెగలు పూజిస్తున్నన్ని దేవతలు మరెక్కడా లేవు. ప్రతి తెగకు ఒక దేవత, ప్రతి కులానికి ఒక దేవత, ప్రతి కుటుంబానికి ఒక దేవత...! ఇంత మంది దేవుళ్ళా! అసాధ్యం. దేవుడు ఒక్కడే అయివుంటాడు, ఉండాలి. మొత్తం ప్రపంచాన్ని ఉనికిలోనికి తీసు కొచ్చిన సృష్టికర్తే మనందరి దేవుడు" అన్నాడు హారిసా.

"హారిసా! నువ్వు మమ్మల్ని సందిగ్ధంలో పడేశావు. తరతరాలనుంచి వస్తున్న మన పూర్వీకుల మతం పట్ల లేనిపోని అనుమానాలు రేకెత్తిస్తున్నావు" అన్నాడు వేరొకడు.

"చూశారుగా! మనమంతా ఈ దేవతలను ఎంతగానో మొరపెట్టుకున్నాం. కాని అవి మన మొరల్ని ఆలకించలేదు. మనం ఎంతోభక్తి శ్రద్ధలతో పూజిస్తున్నా ఈ దేవతా విగ్రహాల్లో ఒక్కటీ మనల్ని కరుణించలేదు. కనుక ఇక

ఈ విగ్రహాలను వదలిపెట్టండి. కాస్త ఆ కన్పించని దేవుని ముందు కూడా సాగిలబడి మొరపెట్టుకుందాం, రండి" అన్నాడు హారిసా.

"సరే అదికూడా చేసి చూద్దాం. అందులో తప్పేమీలేదు. ఈనాటి దాకా మనం ఎవ్వరం చూడని దేవుడ్ని వేడుకుందాం, ఆయనయినా మన మొరవిని మన ఆకలి బాధను తీరుస్తాడేమో" అన్నాడు వయస్సులో అందరికన్నా పెద్ద వాడయిన ఒక వృద్ధుడు.

అతని మాటలు వినగానే హారిసాలో నూతన విశ్వాసం పరవళ్ళు తొక్కింది. వెంటనే అతను ఎంతో ఉత్సాహంతో నేలమీద సాష్టాంగపడ్డాడు. అతడ్ని చూసి మిగిలిన వాళ్ళంతా సాష్టాంగపడిపోయారు.

"మమ్మల్ని సృష్టించిన ఓ దేవా! మామీద దయచూపు. ముహమ్మద్ ప్రవక్త (సఅసం) ఆరాధిస్తున్న ఓ దేవా! మమ్మల్ని కనికరించు" అంటూ హారిసా ఏకేశ్వరుణ్ణి వేడుకోవడం ప్రారంభించాడు.

మిగిలిన వాళ్ళు కూడా అతడ్ని అనుకరిస్తూ అదే విధంగా వేడుకోలు మొదలెట్టారు.

"యావత్తు ప్రపంచాన్ని సృష్టించిన మా ప్రభూ! మేము దారి తప్పి ఈ ఎడారిలో కొట్టుమిట్టాడుతున్నాం. మమ్మల్ని ఆదుకో. మాకుదారిచూపు.

ఓ జగద్రక్షకా! ఓ ఆపద్బాంధవా!! మేము ఇంతకాలం నిన్ను మరచి పోయి మిథ్యాదైవాలను పట్టుకొని వ్రేలాడాం, మమ్మల్ని మన్నించు. మేము చీకటి లోయల్లో తచ్చాడుతూ, ఎదురు దెబ్బలు తింటూ ఇప్పుడు నీ దరికి చేరు కున్నాం. మా దురవస్థచూసి మమ్మల్ని కనికరించు.

దేవా! మమ్మల్ని రక్షించు. మేము ఆకలితో చచ్చిపోతున్నాం. మా ప్రభూ! మమ్మల్ని ఆదుకో. మేము కళ్ళు తిరిగి పడిపోతున్నాం. చిక్కిశల్యమయికొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాం.

ఓ దయాసాగరా! మా ఆరాధ్య దైవమా! మమ్మల్ని ఈ విపత్తునుండి కాపాడు. నీకు సదా కృతజ్ఞులమయి ఉంటాం. ఓ మా ప్రభూ! మమ్మల్ని ఆకలి బాధనుండి విముక్తి కలిగిస్తే మేము నీ ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ని విశ్వ

సిస్తాం. ఇకనుంచి కేవలం నిన్నే పూజిస్తూ ఉంటాం. దేవా! మమ్మల్ని కరుణించి, మామీద జాలిచూపు."

హారిసా, అతని అనుచరులు పెట్టిన మొరతో యావత్తు ఎడారి ప్రతిధ్వనించింది. కాస్సేపటికి హారిసా లేచి కూర్చున్నాడు.

"మిత్రులారా! ఈ వేడుకోలుతో నా మనస్సుకు ఒక విధమైన తృప్తి కలిగింది. ముహమ్మద్ మహనీయు (సఅసం)ని దేవుడు మమ్మల్ని తప్పకుండా కనికరిస్తాడని నా అంతరాత్మ ఘోషిస్తోంది. ఆ దయాకరుడు మమ్మల్ని ఆకలితో మాడి చావనివ్వడు. ఆయన తప్పకుండా మమ్మల్ని ఆదుకుంటాడు" అన్నాడు హారిసా ఎంతో నమ్మకంతో.

హారిసా, అతని అనుయాయుల పరిస్థితి చాలా దయనీయంగా మారింది. బ్రతుకుమీద ఆశ లేశమైనా లేకుండా పోయింది. వారు తిండితినక, కనీసం ఖర్జూరపండయినా తినక రెండు వారాలయిపోయింది. దాంతో పూర్తిగా చిక్కిపోయి తోళ్ళ తొడిగిన ఎముకల గూళ్ళుగా తయారయిపోయారు.

అలాంటి పరిస్థితిలో వారు నిజ దైవం వైపుకు మరలి మనసారా ఆయన్ని ప్రార్థించారు: ఎంతో దీనంగా వేడుకున్నారు. మరి ఆ ప్రార్థనను, ఆ వేడుకోలును విశ్వ ప్రభువు స్వీకరిస్తాడా? వారిని క్షుద్బాధనుండి విముక్తి కలిగిస్తాడా??

మిట్టమధ్యాహ్నం వేళ.

సూర్యుడు ఆగ్రహోదగ్రుడయి పుడమిపై నిప్పులు కురిపిస్తున్నాడు. ఇసుక నేల పెనంలా కాలిపోతోంది. వడగాల్పులు చెంపలను పగలగొడ్తున్నాయి.

తీవ్రమైన ఎండ, వడగాల్పుల వల్ల హారిసా అనుచరులు తోటకూర కాడలా డీలాపడిపోయారు.

అందరూ తలలు వంచి ఆశానిరాశల మధ్య ఊగిసలాడుతూ కూర్చున్నారు. చాలా మంది ఇక తమకు చావు తప్పదని భావించారు.

తిండి తినక ఎన్నాళ్ళయిందో గాని దాదాపు అందరూ బాగా చిక్కిపోయి అస్థిపంజరాల్లా మారిపోయారు. ఖాళీ కడుపులు వీపులకు అతుక్కుపోయాయి.

కళ్ళు లోపలికి పీక్కుపోయాయి. దవడలు వెనక్కిపోయి పళ్ళుముందుకు వచ్చాయి.

ఆకలి మంట చాలదన్నట్లు దానికి అదరగొట్టే ఎండకూడా తోడయి వాళ్ళను జీవచ్ఛవాల్లా తయారుచేసింది.

శరీరంలోని సత్తువంతా పోయి చుట్టూ చీకట్లు ఆవరిచినట్లనిపించింది. అనిర్వచనీయమైన మైకమేదో ఆవహించడంతో వారు కూలబడి పోయారు.

చాలాసేపటిదాకా వారు అలాగే ఉండిపోయారు.

ఆ విధంగా ఎంతసేపు పడి ఉన్నారో వారికే తెలియదు. తరువాత వారిలో కొంతమందికి స్పృహ వచ్చింది. వారు కళ్ళలో వత్తులు వేసుకొని దైవ సహాయం కోసం ఆశగా ఆకాశంకేసి చూశారు.

అప్పుడు ఎండ తీవ్రత కొంచెం తగ్గినట్లనిపించింది. వడగాలి కూడా ఒకింత తగ్గుముఖం పట్టింది.

అయితే ప్రచండ వేగంతో వీస్తున్న హోరుగాలిలా ఝుమ్‌ఝుమ్ మంటూ ఎక్కడ్నుంచో ఒక విధమయిన శబ్దం వినపడసాగింది.

ఆ శబ్దం క్రమంగా ఉధృతమయింది. వారు తత్తరపాటుతో ఓసారి చుట్టు కలియజూశారు. అంతే- వారు ఆశ్చర్య చకితులయి పోయారు.

ఆకాశంలో ఒక వైపునుండి బ్రహ్మాండమైన మిడతల దండు ఝుంకారం చేస్తూ పెద్ద సైనిక పటాలంలా తరలివస్తోంది. అనూహ్యమైన ఆ దృశ్యం చూసి హారిసా, అతని అనుచరుల్లో కొత్త ఆశలు చిగురించాయి. వారి కళ్ళల్లో ఆశ్చర్యం, ఆనందం మేళవించి వింత నాట్యం చేయసాగాయి.

హారిసా అయితే ముఖాలు మాడ్చి వేసే మిట్టమధ్యాహ్నం ఎండలో అకస్మాత్తుగా తొలకరి జల్లు కురిసినట్లు ఎంతో సంబరపడిపోయాడు.

"మిత్రులారా! చూడండి. దేవుని సహాయం వచ్చేసింది. ముహమ్మద్ మహనీయుని (సఅసం) దేవుడు మన ఆకలిని తీర్చే ఏర్పాటు చేశాడు. ఇక భయం లేదు. మనం బతికి బయటపడగలం" అన్నాడు అతను సంతోషాతిశయంతో.

ఈ మాటలు వినగానే అందరూ ఉత్సాహంతో లేచినిలబడ్డారు. మైకంతో కూలబడిన మిగిలిన వాళ్ళు కూడా లేచి కూర్చున్నారు.

మిడతలదండు సూర్యుడ్ని కప్పివేస్తూ దగ్గరగా వచ్చేసింది. దాంతో ఎండ ఒక్కసారిగా మటుమాయమపోయి నీడవచ్చింది. కొన్ని క్షణాల్లోనే పరిస్థితి మారిపోయింది. ఎటుచూసినా మిడతల మయమయిపోయింది. వాతావరణం హఠాత్తుగా చల్లబడిపోయింది.

మిడతల దండు దిక్కులు పిక్కటిల్లే ఝుంకారం చేస్తూ ఆకాశంలో పయనిస్తోంది. అందులోనుంచి వేల సంఖ్యలో మిడతలు టపటప నేలమీద రాలిపడుతున్నాయి.

"సోదరులారా! పదండి మిడతలను పట్టుకోండి. వేయించండి. వాటిని తిని దేవునికి కృతజ్ఞతలు తెలుపుకోండి. ఆ "ఇప్పుడు మనం ప్రార్థించిన దేవునికి మనసారా కృతజ్ఞతలు తెలుపుకోండి" అన్నాడు హారిసా.

వెంటనే హారిసా అనుయాయులు ఆవురావురుమంటూ నేలమీద రాలిన మిడుతలపై విరుచుకుపడ్డారు.

మిడతలు ఆకాశం నుండి వడగండ్లలా అసంఖ్యాకంగా వచ్చిపడుతున్నాయి. అందరూ త్వరత్వరగా వీలయినంత ఎక్కువగా మిడతలను పట్టుకొని సంచుల్లో నింపుకోసాగారు.

కొందరు అలా పట్టుకున్న మిడతలను వేయించి తినసాగారు. మరికొందరు వేయించే దాకా ఓపిక పట్టలేక పచ్చివే తినడం మొదలెట్టారు.

పాపం హారిసా అనుచరులు ఎంత ఆకలిగా ఉన్నారో, మిడతలను వడియాల్లా కరుం కరుం నమలడం ప్రారంభించారు.

తీవ్రమయిన ఆకలితో మిడతలు సయితం వడియాలకంటే ఎంతో రుచికరంగా ఉంటాయట. అందువల్ల దొరికిందే సౌభాగ్యమనుకుంటూ వారు మిడతలను కడుపారాతిని క్షుద్బాధ తీర్చుకున్నారు.

అయితే ఉండి ఉండి ఒకేసారి కడుపునిండా మిడతలను తినడం వల్ల వారు మరోసారి మైకంలో పడిపోయారు.

నిజానికది మైకం కాదు, నిద్రమత్తు.

అనేక రోజులు వారు తిండిలేక పస్తులుండవలసి వచ్చింది. కేవలం నీటితో పొట్టపోసుకుంటూ ఆకలితో నకనకలాడిపోయేవారు. దానికి తోడు తీవ్రమయిన ఆకలివల్ల సరిగా నిద్ర కూడా పట్టేదికాదు. ఇప్పుడు కడుపునిండా మిడతలను తినడం వల్ల ఒక్కసారిగా నిద్రమంపు ముంచుకొచ్చింది.

ఆ తరువాత కాస్సేపటికి నిద్ర మత్తు వదలిపోయింది. వారు కళ్ళు తెరచి చూస్తే ఆకాశంలో మిడతల దండు ఝుంకారం చేస్తూ ఇంకా తిరుగుతూనే ఉంది.

మిడతల దండు మొత్తం ఆకాశాన్ని కప్పివేసింది. ఎండ మచ్చుకైనా కనపడడం లేదు. పైనుంచి నిరాఘాటంగా మిడతలు కుప్పలు కుప్పలుగా రాలిపడుతున్నాయి.

వాళ్ళు మళ్ళీ లేచి నేలమీద రాలిపడిన మిడతలను పోగు చేసుకోవడం మొదలెట్టారు.

ఆ తరువాత వాటిని కాలుతున్న ఇసుక నేల మీద పరచి ఎండబెట్టారు.

ఇలా సాయంత్రం దాకా చేశారు. సాయంత్రం వేళ కట్టె పుల్లలను ఏరుకొచ్చి కొన్ని ఎండిన మిడతలను పెనం మీద వేయించుకున్నారు.

ఆ రాత్రి వాటిని హాయిగా తిని పెందలాడే నిద్రపోయారు.

రాత్రి మస్తుగా నిద్రపోయి ఉదయం పెందలాడే మేల్కొన్నారు. కాలకృత్యాలు ముగించుకున్నారు.

అప్పటికి బాలభాస్కరుడు ఉదయించి స్వర్ణ కిరణాలతో వారికి స్వాగతించడం ప్రారంభించాడు. మిడతల దండు ఎప్పుడు వెళ్ళిపోయిందోగాని ఆకాశం నిర్మలంగా ఉంది.

అయితే నేల మీద ఎక్కడ చూసినా మిడతలు కుప్పలు తెప్పలుగా పడివున్నాయి. అవి నేలను పూర్తిగా కప్పివేశాయి.

అది చూసి హారిసా హృదయం విశ్వప్రభువుపట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది.

"సోదరులారా! కనిపించని దేవుడు మనకు చేసిన మేలును చూశారు కదా? మరి ఇప్పటికైనా మీరు ముహమ్మద్ (సఅసం) ఆరాధిస్తున్న దేవుడ్ని విశ్వసిస్తారా?" అన్నాడు హారిసా.

"తప్పకుండా. మేము కనిపించని దేవుడ్ని విశ్వసిస్తున్నాం. ఇకనుంచి ఆయన్నే మేము పూజిస్తాం. విగ్రహాల జోలికి పోనేపోము" అన్నారు హారిసా అనుచరులు ముక్తకంఠంతో.

"సరే పొద్దెక్కుతోంది, పట్టుకున్న మిడతలను నేలమీద పరచి ఎండ బెట్టండి. ఎండిపోయి ఇవి మనకు తింటానికి ఉపయోగపడతాయి" అన్నాడు హారిసా.

అందరూ మిడతలను నేలమీద పరిచారు. సాయంత్రానికల్లా అన్నీ బాగా ఎండిపోయాయి. ఎండిన మిడతలను హారిసా అనుచరులు పెద్ద పెద్ద సంచుల్లో పోసుకొని భద్రపరచుకున్నారు.

తండ్రి సమస్య తీరిపోవడంతో వారు ఎంతో సంతోషపడ్డారు.

ఇక నెలల తరబడి వారికి తిండి బాధ ఉండదు. మోయగలిగినన్ని మిడతల్ని సంచుల్లో నింపుకున్నారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు వేపుకొని హాయిగా తినవచ్చు.

ఎన్నో రోజులనుండి వారు తిండికి మొహం వాచిపోయారు. అమిత మైన ఆకలిబాధతో కృశించి, నీరసించి, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ బ్రతుకుమీద ఆశలు వదులుకున్న స్థితిలో నిజదైవం వారికి సహాయం చేశాడు.

అందువల్ల వారి అంతరంగాలు సహజంగానే సృష్టికర్త, పోషకుడు అయిన నిజదైవం పట్ల కృతజ్ఞతాభావంతో నిండిపోయాయి.

నిరాశా నిశీధిలో మిడతలదండు వారికి ఆశాకిరణంలా పరిణ మించింది.

అరేబియాలో ఈ మిడతలు చెట్లు చేమలులేని మోడువారిన కొండ గుహల్లో ఉంటాయి. అప్పుడప్పుడు అవి ఆహారాన్ని అన్వేషిస్తూ కొండ గుహల నుండి బయలుదేరుతాయి.

ఆకాశంలో అవి ఝుంకారం చేస్తూ దట్టమైన పెద్ద మేఘమాలికలా పయనిస్తుంటే సూర్యుడు దాని మరుగున పడిపోయి నేల నాలుగు చెరగులా చల్లని నీడ ఏర్పడుతుంది.

అవి ఎడారి నేలమీద ఎక్కడయినా వాలితే ఆ ప్రదేశంలోని ఇసుక తిన్నెలన్నిటినీ పూర్తిగా కప్పివేస్తాయి.

ఒకవేళ అవి ఏ ఒయాసిస్సు మీదనో వాలితే మాత్రం అక్కడ సర్వ నాశనం తప్పదు. క్షణాల్లో పచ్చిక, చెట్ల ఆకులు, పండ్లు, పూలు అన్నిటినీ నాకివేస్తాయి. అక్కడిక పచ్చదనమన్నది మచ్చుకైనా కనిపించదు. మిడతల దండు స్వైరవిహారానికి సాక్షీభూతంగా అక్కడ ఆకులుపోయి బోసిపోయిన చెట్ల మొండాలు మాత్రమే మిగిలిఉంటాయి.

ఖర్జూరపు తోటలమీద వాలితే వందలాది ఎకరాల పంట తృటిలో సర్వనాశనమయిపోతుంది. నేల మీద ఒక గడ్డిపరక కూడా మిగలదు.

ఇలాంటి ప్రదేశాల్లో నివసించే ప్రజలు మిడతల దండు మిగిల్చేది విషాదమే.

అదే ఏడారి ప్రాంతాల్లో తిరుగాడే దేశ దిమ్మరులకయితే మిడతల దండు ఒక వరప్రసాదమే. వారు రాలిపడే మిడతలను ఏరుకొని సంచుల్లో భద్ర పరుచుకుంటారు. ఇలా టన్నుల కొద్దీ మిడతలను భద్రపరచుకొని, నెలల తరబడి తింటూ జీవితం గడుపుతారు.

హారిసా అనుయాయులు కూడా పెద్ద ఎత్తున మిడతలను ఏరుకొని సంచుల్లో దాచుకున్నారు.

వారిప్పుడు మిడతలను వేయించుకొని సుష్టుగా తిని రెండు మూడు రోజుల్లోనే మళ్ళీ బలం పుంజుకోగలిగారు. శరీరాల్లో నూతనుత్తేజం వచ్చేసింది. దాంతో వారు అక్కడ్నుంచి మూటాముల్లె సర్దుకొని మళ్ళీ బయలుదేరారు.

వారు అనేక నెలలు ప్రయాణం చేశారు. వందల మైళ్ళు నడిచారు.

వారిది గమ్యంలేని ప్రయాణం. ఎక్కడికి వెళ్తున్నారో వారికే తెలియదు. ఎక్కడైనా జనావాస ప్రాంతం కనిపిస్తుందేమోన్న ఆశతో మాత్రమే వారు దారీ తెన్నూ లేకుండా ప్రయాణం చేస్తున్నారు.

అసలు వారికి భౌగోళిక వివరాలు బొత్తిగా తెలియదు. అంచేత తాము అరేబియాలో ఏ మూలన ఉన్నది కూడా వారికి తెలయదు.

పగటి వెల్తురులో నేలమీది ప్రతి వస్తువు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, జనావాస ప్రాంతం మచ్చుకైనా తారసిల్లక పోవడంతో వారు తికమకపడి ఎటుబడితే అటు నడవసాగారు. చివరికి బాటసారుల బృందాల జాడ కూడా లేదు.

ప్రస్తుతం హారిసా, అతని అనుచరులు ప్రయాణం చేస్తున్న ప్రాంతం ఎంతో ప్రమాదకరమైంది. వారు "మృత్యులోయ" పేరుతో ప్రసిద్ధికెక్కిన భయంకరమైన ఎడారిలో చిక్కుకుపోయారు. ఎటు చూసినా అనేక మైళ్ళ పొడవయిన ఎత్తయిన ఇసుక కొండలే కనిపిస్తుంటాయి.

ఇక్కడ బాటసారులుగాని,. ఒంటెల బిడారాలుగాని ఎప్పుడైనా ప్రయాణం చేసినట్లు మచ్చుకైనా చిహ్నాలు లేవు.

అదీగాక ఇసుక కొండలు ఓ పద్ధతి అంటూ లేకుండా అడ్డదిడ్డంగా చిక్కు చిక్కుగా అల్లుకొని ఉన్నాయి. ఎగుడు దిగుళ్ళు, మిట్ట పల్లాలు దారి గుర్తించలేనంత గజిబిజిగా ఉన్నాయి.

పైగా దృష్టిసారించినంత దూరం ఎత్తయిన ఇసుక మేటలు, ఇసుక తిన్నెలే తప్ప ఒక్క చెట్టుగాని, ఒక్క గడ్డిపరకగాని కనిపించదు. అంతా ఇసుక మయం! దారి అగమ్యగోచరం!

ఇలాంటి భయానక ఎడారి ప్రాంతంలో హారిసా అనుచరులు ప్రయాణం చేస్తున్నారు. అందువల్ల వారు ఎంత తిరిగినా ఓ గమ్యానికి చేరుకోలేక పోతున్నారు. తిరిగి తిరిగి బయలుదేరిన చోటికే వస్తున్నారు.

ఈ పద్మవ్యూహం' నుంచి బయట పడేందుకు వారు చేస్తున్న ఏ ప్రయత్నమూ ఫలించడం లేదు.

పాపం హారిసా అనుచరులు తిరిగి తిరిగి వేశారి పోయారు. నడచి నడచి అలసిపోయారు. అందరికీ పిక్కలు లాగసాగాయి, కాళ్ళు బొబ్బలెక్కాయి.

దారీ తెన్నులేని ఈ ప్రయాణాన్ని ఎంతకాలం సాగించగలరు? వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

వారిపై మరోసారి నిరాశా నిస్పృహలు ఆవరించాయి. హారిసా కూడా ఆందోళన చెందసాగాడు.

"మిత్రులారా! మనం నెలల తరబడి ప్రయాణం సాగించినా ఓ నిర్దిష్ట గమ్యానికి చేరుకోలేక పోయాం. ఈ ఎడారి కొండల చక్రబంధం నుండి బయట పడే మార్గం కనపడటం లేదు. చివరికి ఈ ఎడారిలోయల్లోనే. ఈ ఇసుక తిన్నెల మీదనే మనం సమాధులయి పోయేలా కనిపిస్తోంది పరిస్థితి" అన్నాడు హారిసా నిరాశా భావంతో.

"అట్లాగే అనిపిస్తోంది నాక్కూడా. ఇసుమంటి భయంకరమైన ఎడారి ప్రాంతాన్ని నేనింతవరకు సూడలేదు. అంతా గజిబిజిగా, అయోమయంగా ఉంది" అన్నాడు ఓ వృద్ధుడు.

"కాని మనం అంత మాత్రాన నిరాశ పడాల్సిన పనిలేదు." మరేం చేద్దాం? వేరొకడు అడిగాడు. మనం ఇంతకు ముందు ఆకలి బాధతో విసిగి పోయి కనిపించని దేవుడ్ని ప్రార్థించాము. ఆయన మన మొరలు విని మనకు ఆహారం ఏర్పాటు చేశాడు. మన ప్రాణాలు కాపాడాడు. తెలుసుకదా? ఔనౌను. ఆ దేవుడే మనల్ని కాపాడింది. విగ్రహాల్లో ఒక్కటీ సాయపడలేదు."

"కాబట్టి అటువంటి కనిపించని దేవుడ్ని మళ్ళీ వేడుకోవాల్సిన సమయం వచ్చింది. రండి, మనం మరోసారి ముహమ్మద్ మహనీయ (సఅసం)ని దేవుడ్ని వేడుకుందాం. ఆయనే మనల్ని ఈ మృత్యులోయ నుండి విముక్తి కలిగించేవాడు" అన్నాడు హారిసా.

ఈ మాటలు హారిసా అనుచరుల్లో కొత్త ఆశలను రేకెత్తించాయి. అందరూ సంతోషంతో విశ్వప్రభువును వేడుకోవడానికి ఉపక్రమించారు.

"ఆ..... తప్పకుండా ఆ దేవుణ్ణే వేడుకుందాం. లోగడ ఆయన చేసిన మేలును మనం ఎలా మరచిపోగలం!" అన్నారు అందరూ ముక్తకంఠంతో.

వెంటనే హారిసా సాష్టాంగంలో పడిపోయాడు. అతడ్ని చూసి మిగిలిన వాళ్ళు కూడా సాష్టాంగంలో పడిపోయారు.

"భూమ్యాకాశాలను సృష్టించిన ఓ దేవా! మమ్మల్ని కనికరించు. మాకు సరైన దారి చూపు. జగద్రక్షకా! మేము దారి తప్పి ఈ మృత్యులోయలో చిక్కుబడిపోయాము. మాకు ఇక్కడ్నుంచి విముక్తి కలిగించు. దేవా! మమ్మల్ని కరుణించి ఈ ఆపద నుండి కాపాడు" అంటూ హారిసా ప్రార్థన చేశాడు.

ఆ తరువాత హారిసా, అతని అనుచరులు లేచి నిలబడ్డారు. వేడుకోలు తరువాత వారి ముఖాలలో ఒక విధమైన తృప్తి కనిపించింది. అందరూ నిరాశా చీకటిలో ఆశాకిరణాన్ని చూడటానికి ప్రయత్నిస్తూ ఒంటెలపై కెక్కి మళ్ళీ ప్రయాణం సాగించారు.

అప్పటికి తూర్పు దిక్కున సూర్యుడు ఉదయించి కొంచెం పైకి వచ్చాడు. అతని బంగారు కిరణాలతో ఇసుక నేల మెరిసిపోతుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. చల్లటి పిల్లగాలులు నెమ్మదిగా వీస్తున్నాయి.

హారిసా, అతని అనుచరులు అలా ప్రయాణం చేసి మధ్యాహ్నం వేళకు సువిశాలమైన ఒక మైదానానికి చేరుకున్నారు. అక్కడ దిగి గుడారాలు వేసుకున్నారు. ఆకలిమంటను చల్లార్చుకుని, కాస్సేపు గుడారాల్లో విశ్రాంతి తీసుకోవడానికి మేను వాల్చారు.

కాని సూర్యకిరణాల్లో వాడి, వేడి క్షణక్షణానికి అధికం కాసాగాయి. ఎండ మండిపోతోంది. నేల పెనంలా కాలిపోతోంది. దానికి తోడు మెల్లగా వడగాలి కూడా వీచసాగింది.

హారిసా అనుచరులు ఎండ తీవ్రతకు మరోసారి విలవిల్లాడిపోయారు. గుడారాల్లో తలదాచుకున్నా బయట ఎండలో ఉన్నట్లే అన్పించింది వారికి. ఎండ తీవ్రతకు డేరాలు బాగా వేడెక్కిపోవడంతో లోపలకూడా సెగ వస్తోంది.

అయినా హారిసా అనుచరులకు ఆ సమయంలో ఎలాగో ఓ అలాగు ఆ గుడారాల్లో తలదాచుకోక తప్పలేదు. ఆ విధంగా వారు సూర్యుడు పశ్చిమ దిక్కుకు వాలి, ఎండ తీవ్రత తగ్గుముఖం పట్టేవరకు గుడారాల్లోనే గడిపారు.

ఆ తరువాత వారు లేచి సామాన్లు సర్దుకున్నారు. గుడారాలు పీకి ఒంటెల మీద వేసుకొని మళ్ళీ బయలుదేరారు. కొంచెం దూరం ప్రయాణం

చేసేటప్పటికీ సూర్యాస్తమయం అయ్యింది. వాతావరణం క్రమంగా చల్లబడసాగింది. పగటి వెల్తురు కనుమరుగయి రేజీకట్లు ముసురుకో సాగాయి.

హారిసా అనుచరులు ఆ రోజు రాత్రంతా ప్రయాణం సాగించాలని నిశ్చయించుకున్నారు. అందువల్ల నిశ్చింతగా ప్రయాణం చేస్తున్నారు. కాస్సే పటికి రేజీకట్లను చీల్చివేస్తూ చంద్రుడు ఉదయించాడు.

వారు వెన్నెలలో ప్రయాణం సాగిస్తున్నారు. అర్ధరాత్రి గడిచిపోయింది. నీలాకాశంలో మినుకు మినుకుమనే తారల మధ్య చంద్రుడు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు.

నలువైపులా వెన్నెల పిండారబోసినట్లు వ్యాపించిపోయింది. పండు వెన్నెలకు ఇసుక రేణువులు మెరిసిపోతున్నాయి. నేల శ్వేతపట్టు వస్త్రం పరచి నట్లు ఎటు చూసినా తెల్లగా కనిపిస్తోంది.

ఎత్తయిన ఇసుక తిన్నెలు చంద్రకాంతికి వెండికొండల్లా మెరిసి పోతు న్నాయి. చల్లటి పిల్లతెమ్మెరలు మెల్లిగా వీస్తూ హృదయాలను ఉల్లాస పరుస్తు న్నాయి. ఒంటెలు నిదానంగా తమ సహజ ధోరణిలో నడుస్తున్నాయి. అన్నిటి కంటే ముందు హారిసా ఒంటె నడుస్తోంది. దాని వెనకాల మిగిలిన ఒంటెలు వరుసగా నడుస్తున్నాయి.

అలా నడుస్తూ హారిసా అనుచరులు ఎంతో ఎత్తయిన పొడుగాటి ఓ ఇసుక పర్వత శ్రేణి దగ్గరికి చేరుకున్నారు. ఆ ఇసుక కొండ వారి దారికి అడ్డంగా వచ్చింది. దాంతో ఇక ముందుకు పోవడానికి అవకాశం లేకుండా పోయింది. కుడివైపు కూడా ఎత్తయిన పొడుగాటి ఇసుక కొండలు ఉన్నాయి.

ఈ రెండు ఇసుక పర్వత శ్రేణుల మధ్య కుడివైపు ఓ ఇరుకైన దారి ఉంది. అది పోను పోను మరింత ఇరుకుగా ఉంటుందో లేదా అసలు మూసుకుపోయి దారేలేకుండా పోతుందో తెలియదు. ఎడమవైపు మాత్రం ఎలాంటి ఇసుక తిన్నెలు లేకుండా కనుచూపుమేర విశాలమైన మైదానం ఉంది.

అందువల్ల హారిసా ఒంటె పగ్గాన్ని లాగి ఎడమవైపుకు పోవడానికి ప్రయత్నించాడు. కాని పగ్గాన్ని లాగి ఎడమ వైపు తిప్పడానికి ప్రయత్నించగానే ఒంటె ఆగిపోయింది. ఎంత అదిలించినా ముందుకు పోనని మొరాయించింది. హారిసా పగ్గాన్ని వదులు చేశాడు. వెంటనే ఒంటె కుడివైపుకు మరలి నడవటం మొదలెట్టింది.

"సోదరులారా! నేను ఒంటెను ఎడమవైపుకు నడిపించడానికి ప్రయత్ని స్తుంటే అది కుడివైపుకు నడుస్తోంది. ఏం చేద్దాం? ఒంటెను దాని ఇష్టప్రకారం నడవడానికి వదలిపెట్టమంటారా?" అన్నాడు హారిసా.

"దాని ఇష్టప్రకారమ నడవనియ్. ఇది మనల్ని మృత్యులోయనుండి బయటికి తీస్తుందేమో చూద్దాం" అన్నాడు కొందరు.

అప్పుడు హారిసా ఒంటె పగ్గాన్ని వదులుచేసి దాని ఇష్టప్రకారవే నడవనిచ్చాడు. ఒంటె కుడివైపుకు తిరిగి హుషారుగా నడవసాగింది. అది రెండు ఇసుక కొండల మధ్య ఇరుకు దారి గుండా చకచకా నడుస్తోంది. మిగిలిన ఒంటెలు దానికి వెనకాల నడుస్తున్నాయి.

హారిసా, అతని అనుచరులు ఈ దారి తమను ఎటు తీసుకు వెళ్తుందో నని ఆలోచిస్తూ ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు.

ఒంటెలు నెమరువేసుకుంటూ నడుస్తున్నాయి. తూర్పుదిక్కున వేగు చుక్క శోభయమానంగా ప్రకాశిస్తోంది. వెన్నెలరేడు త్వరత్వరగా గమ్యస్థానం వైపుకు పరుగులు పెడుతున్నాడు. నక్షత్రాలు క్రమక్రమంగా ఒకదాని తర్వాత మరొకటి కనుమరుగయిపోతున్నాయి.

ప్రాక్దిగ్మండలంపై వికసించిన ఉషశ్రీ తన చుట్టుప్రక్కలున్న తారలను తరిమి తరిమి కొడ్తోంది. ఇసుక నేల మరింత తెల్లగా మెరిసిపోతున్నది. కుడి వైపున్న ఇసుక గుట్టల పరంపరం ఒక చోటికి వచ్చి అంతమయిపోయింది. ఒక్కసారిగా కుడివైపు సువిశాలమైన మైదానం వచ్చింది.

అది చూసి హారిసా, అతని అనుచరులు ఆశ్చర్యచకితులయి పోయారు. మరికాస్త ముందుకు నడవగానే వారికి మసకవెల్తురులో ఓ అంద

మైన ఒయాసిస్సు కన్పించింది. దాంతో వారు సంతోషంతో ఎగిరి గంతేశారు. ఒంటెలను అదిలించి గబగబా ముందుకు నడిచారు.

కాస్సేపటికే వారు ఒయాసిస్సు సమీపానికి చేరుకున్నారు.

హారిసా అనుచరులు, వారి ఒంటెలు ఒయాసిస్సులో అడుగు పెట్టాయి. ఒంటెల అలికిడికి నిద్రిస్తున్న వారిలో కొందరు వ్యక్తులు ఉలిక్కిపడి లేచారు. హారిసా అనుచరులు వెంటనే ఒంటెలను ఆపారు.

"ఎవరు మీరు? తొందరగా చెప్పండి" అని ప్రశ్నించాడు హారిసా ఒంటె మీద ఎక్కి కూర్చునే. వారిలో ఒకడు తొట్రుపడి లేచి నిల్చున్నాడు.

"మేము ఖహ్తాన్ తెగవాళ్ళం" అన్నాడు అతను.

ఖహ్తాన్ అనే మాట వినగానే హారిసా, అతని అనుచరుల రక్తం ఒక్క సారిగా వేడెక్కిపోయింది. ప్రతీకారం ప్రజ్వరిల్లింది. పగపెట్రేగిపోయింది. కసి బుసలుకొట్టింది.

హారిసా గబాలున ఒంటె మీది నుంచి కిందికి దూకాడు. వరలోనుంచి ఖడ్గం చర్రున బయటికి లాగాడు. అతని అనుచరులు కూడా కిందికి దూకి ఖడ్గాలు చేతబూనారు.

"ఓరీ దుర్మార్గులారా! ఖహ్తాన్ తెగ క్రూరులు మీరేనా? తుచ్ఛులారా! కాచుకోండి!! మేము బనీ బకర్ తెగవాళ్ళం. గుర్తుందా, అయిదు సంవత్సరాల కిందట మీరు మా గుడారాలపై దాడిచేసి అంతా దోచుకున్నారు. మా వాళ్ళను అనేకమందిని పొట్టనపెట్టుకున్నారు. మిగిలిన స్త్రీలను, పిల్లలను బంధించి తీసికెళ్ళారు. ఇన్నాళ్ళకు మీ మీద పగతీర్చుకునే అవకాశం దొరికింది. ముందుకు రండి, ధైర్యముంటే మమ్మల్ని ఎదుర్కోండి" అన్నాడు హారిసా సింహగర్జన చేస్తూ.

ఈ మాటలు వినగానే ఖహ్తాన్ తెగవాళ్ళకు వణుకు పుట్టుకొచ్చింది. కారణం వారి సంఖ్య చాలా స్వల్పంగా ఉండటమే. అయినా వారు వెంటనే సంబాళించుకుని చేతుల్లో ఖడ్గాలు తీసుకున్నారు.

మరుక్షణం కత్తులు పైకి లేచాయి. భీకర పోరాటం మొదలయింది. హారిసా, అతని అనుయాయులు ప్రతీకారేచ్ఛతో మండిపోతూ ఎడాపెడా

పోరాడుతున్నారు. వైరిపక్షం కూడా సత్తువకొద్దీ వారిని ఢీ కొంటోంది.

హారిసా అనుచరులు శత్రువులను చుట్టుముట్టారు. కరవాలాలు ఖణేల్ ఖణేల్ మంటూ గాలిలో విన్యాసం చేస్తున్నాయి. శరీరాలు తూట్లుపడు న్నాయి. రక్తం కారిపోతోంది. మొదలు నరికిన చెట్లల్లా వైరిపక్షం క్షతగాత్రులు నేలకూలి శవాలుగా మారుతున్నారు.

కాస్సేపటికి ఖహ్‌తాన్ తెగవాళ్ళలో అనేకమంది మృత్యువాత పడ్డారు. మిగిలినవాళ్ళు ఆయుధాలు క్రిందపడవేసి చేతులెత్తారు. యుద్ధం ఆగి పోయింది.

ఆయుధాలు కిందపడేసి లొంగిపోయినా వారిపై దాడి చేయడం అరబ్ సంప్రదాయానికి వ్యతిరేకం. అందువల్ల హారిసా, అతని అనుచరులు వెంటనే యుద్ధం విరమించి, కత్తులు వరల్లోకి నెట్టేశారు.

అయితే హారిసా లొంగిపోయిన శత్రువుల్ని చూసి ఆగ్రహోదగ్రుడయి పోయాడు.

"పిరికిపందల్లారా, ఆడవాళ్ళ మీదయితే కత్తి తిప్పడం వచ్చు. మగాళ్ళ ముందు ఆయుధాలు కిందపడవేస్తున్నారా? ఆడంగి వెధవల్లారా! మీ పౌరుషం ఏమయింది, పోరు మానేశారా? చావుకు భయపడి బానిస బతుకు బతక దలచుకున్నారా? ఛీ!!" అంటూ హారిసా గర్జించాడు.

ఖహ్‌తాన్ తెగ మనుషులు మారు మాట్లాడలేక తలలు వ్రేలాడ వేశారు.

"రోషంలేని ఈ పిరికిపందలను బంధించండి" హారిసా తన అను చరులను ఆజ్ఞాపించాడు.

వెంటనే కొందరు ముందుకు వచ్చి వాళ్ళను తాళ్ళతో కట్టివేశారు. ఈ విధంగా ఆర్గురు వ్యక్తులు లొంగిపోయి ఖైదీలుగా మారిపోయారు. మిగిలిన వాళ్ళు యుద్ధంలో నేలకొరిగి ఊపిరివిడిచారు.

"తెల్లవారుతోంది. మనం రాత్రంతా ప్రయాణం సాగించి అలసి పోయాం. ఇప్పుడిక విశ్రాంతి తీసుకుందాం. ఒంటెలపై నుంచి సామాగ్రి దించి గుడారాలు వేయండి" అన్నాడు హారిసా.

హారిసా అనుచరులు వెంటనే సామాను దించి, చెట్లకింద గుంజలు పాతి గుడారాలు వేశారు. ఒక గుడారంలో ఖైదీలను ఉంచారు. దానిచుట్టూ కొందరు కాపలా ఉన్నారు. మిగిలిన వాళ్ళు ఇతర గుడారాల్లోకి దూరి పడుకున్నారు.

ప్రయాణబడలికవల్ల వెంటనే అందరూ నిద్రలోకి జారుకున్నారు. అలా సాయంత్రందాకా గాఢంగా నిద్రపోయారు.

సూర్యాస్తమయం వేళకు అందరూ మేల్కొన్నారు. కాలకృత్యాలు తీర్చుకుని తిండి ఏర్పాటుకు ఉపక్రమించారు. వెంట తెచ్చుకున్న మిడతలను వేయించి కడుపునిండా భుజించారు. ఖైదీలకు కూడా మిడతల ఆహారం పెట్టారు. ఆ తరువాత హారిసా మిగిలిన శత్రువుల ఆచూకీ తెలుసుకోవడానికి ఖైదీల దగ్గరికి వెళ్ళాడు.

"మేము లేనప్పుడు మా గుడారాలపై దాడిచేసి దోచుకున్న మీ తెగ వాళ్ళు ఎక్కడున్నారు?" అని ప్రశ్నించాడు అతను.

దానికి ఖైదీలు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అందరూ మౌనంగా ఉండిపోయారు. దాంతో హారిసా మండిపడ్డాడు.

"మాకు తెలియదు. మేము దారితప్పి వారినుండి విడిపోయి చాలా రోజులయింది. వారిప్పుడు ఎక్కడ తిరుగుతున్నారో మాకు తెలియదు" అన్నాడు ఒకడు కాస్తంత ధైర్యం చేసి.

ఈ మాటలకు హారిసా మరింత మండిపడ్డాడు.

"పిరికిపందల్లారా! పిరికి తనంతో పాటు ఖహ్‌తాన్ తెగవాళ్ళు ఇప్పుడు అబద్ధాలు చెప్పడానిక్కూడా సిద్ధమయ్యారు" అన్నాడు అతను రెచ్చిపోయి.

ఈ మాటలు వినగానే ఖైదీలకు రోషం వచ్చింది.

"మేము అబద్ధం చెప్పడం లేదు. నిజమే చెప్తున్నాం. మేము యాదృచ్ఛికంగా వారి నుండి విడిపోయి చాలా కాలం అయింది" అన్నారు వారిలో కొందరు.

"ఏమిటా యాదృచ్ఛికం?" అడిగాడు హారిసా ఖైదీలను ఉరిమి చూస్తూ.

"మేమంతా ఒకచోట విడిది చేశాము. గుడారాలు దూరదూరంగా వేసుకున్నాం. ఆ రోజు వెన్నెల రాత్రి, ఆదమరిచి హాయిగా నిద్రపోతున్నాం.

అంతలో మా మనిషి ఒకతను పరుగెత్తుకుంటూ వచ్చి, బనీబకర్ తెగవాళ్ళు వచ్చేస్తున్నారని బిగ్గరగా కేక వేశాడు. మేము భయపడిపోయాం. గబగబా గుడారాలు పీకి ఎవరికి తోచిన దిక్కుకు వారు పారిపోయాం. ఈ గందర గోళంలో వారు ఎటువైపు వెళ్ళారో మాకు తెలియదు" అన్నాడు ఓ ఖైదీ.

అతను చెప్తున్నది నిజమేననిపించింది హారిసాకు. అందువల్ల అతని కోపం చల్లారిపోసాగింది.

"సరే, జమీలా సంగతి మీకేమైనా తెలుసా?"

"ఏ జమీలా? తండ్రి సజీవ సమాధి చేస్తే మీరు వెలికి తీసుకొచ్చిన జమీలా గురించేనా మాట్లాడుతున్నది?

'ఆ.... ఆ జమీలా గురించే" అన్నాడు హారిసా.

"ఆమె ఇప్పుడు అద్భుతమైన అందచందాలతో సౌందర్య దేవతయి పోయింది. ఆమె కలువ నేత్రాలు వందలాది యువకుల్ని పిచ్చివాళ్ళుగా చేసి వేశాయి" అన్నాడు ఆ ఖైదీ.

"నేను ఈ సంగతి చెప్పమని నిన్నడగలేదు. ఆమె అందంగానే ఉండ వచ్చు. కాని...."

"కాస్త అందం ఏమిటి! యావత్తు అందాల యువతుల్ని తలదన్నే అందం ఆమెది. ఆమె కళ్ళలో అద్భుతమైన కాంతిరేఖలు. ఆమె పెదవులపై అరుణోదయపు మెరుపులు. ఆమె చెంపలపై జాలువారే కెంపుల్...."

"ఈ పొగడ్తలు వద్దు. ఆమె జాడ గురించి మాత్రమే అడుగుతున్నా" అన్నాడు హారిసా ఖైదీ మాటలను తుంచివేస్తూ.

"మహాశయా! ఎవరైనా ఆమెను ఒక్కసారి చూస్తేచాలు, ఇక అతను ఆమె అందాన్ని పొగడకుండా ఉండలేడు. ఒక్కసారి పొగడటం మొదలెట్టా డంటే ఇక ఆమె మొత్తం అవయవాల్ని, ఒంపుసొంపుల్ని పూర్తిగా పొగడకుండా వదలిపెట్టలేడు. ఆమె అందం ఇంతా అంతాకాదు. ఆమె నడకలో హొయలు, ఆమె మాటల్లో మకరందం, త్రాచుపాములాంటి ఆమె వాల్జడ, ముత్యాల్లాంటి ఆమె పలువరస, రెచ్చగొట్టే ఆమె చూపులు, మత్తెక్కించే ఆమె వాక్..."

"ఇక ఆపెయ్యి ఈ పనికిమాలిన మాటలు" అన్నాడు హారిసా గర్జిస్తూ.

హారిసా రౌద్రాకారం చూసి ఖైదీ ముఖం చిన్న బుచ్చుకున్నాడు.

"ఆమె ఎంతో అందమైన అమ్మాయే. అందులో ఎలాంటి సందేహం లేదు. కాని ఇంతకూ ఆమె ఎక్కడుంది? ఆ సంగతి చెప్పు తొందరగా."

"మీకిప్పుడు కొంచెం కొంచెం అర్థమయిందనుకుంటా. ఆ అందాల పసిడిబొమ్మ , మీ భార్య, మీ నాయకుని కూతురు రొఖియా- ముగ్గురూ మా నాయకుని దగ్గర ఉన్నారు" అన్నాడు ఖైదీ.

"మీ నాయకుడు ఎక్కడున్నాడు?" హారిసా మళ్ళీ ప్రశ్నించాడు.

"తెలీదు"

"అయితే మీకసలు తెలియదన్నమాట?"

"మాకేకాదు, బహుశా హుబల్ దేవతక్కూడా తెలియదు. మేము ఆ రాత్రే వాళ్ళనుండి విడిపోయాము. సంవత్సరం నుండి వాళ్ళను వెతుక్కుంటూ ఈ ఎడారిలో కొట్టుమిట్టాడుతున్నాం" అన్నాడు ఖైదీ ఎంతో వినయంగా.

"అట్లాగానా? సరే..... మేమే వాళ్ళను వెతికి పట్టుకుంటాం. వాళ్ళ అంతు తేల్చుకునేదాకా మేము ఊరుకోం. కాని మీ సంగతేమిటీ? మిమ్మల్ని మాతోపాటు ఎలా ఉంచగలం?" అన్నాడు హారిసా.

ఈ మాటలు వినగానే ఖైదీలు భయపడిపోయారు. హారిసా తమను చంపదలచుకున్నాడని భావించి కంపించిపోయారు వారు.

"కనికరించండి, మామీద దయజూపండి. మేము ప్రమాణం చేసి చెప్తున్నాం- ఇక ముందు ఎన్నడూ మీ జోలికిరాము. మీకు వ్యతిరేకంగా ఎలాంటి కుట్రలు పన్నము" అన్నారు వారి హారిసాను బ్రతిమాలుతూ.

"ఈరోజు మీకు మా దయాదాక్షిణ్యాలు కావలసివచ్చాయి. కాని మా తెగవాళ్ళ మీద దాడి జరిపి స్త్రీలను, పిల్లలను చావగొడ్తున్నాడు వాళ్ళమీద మీకు కాస్తయినా జాలి కలగలేదా?" అన్నాడు హారిసా ఎత్తిపొడుస్తూ.

"అయ్యా! నిజం చెప్పాలంటే ఆ దాడిలో మేమసలు పాల్గొనలేదు. మేం ఏం పాపం ఎరుగం" అన్నాడు ఓ ఖైదీ.

హారిసా ఆలోచనలో పడిపోయాడు.

"నాయకా! మీరు గట్టి నిర్ణయం తీసుకోవటానికి ముందు మామాట ఒకటి వినండి" అన్నాడు వయసులో పెద్దవాడయిన ఓ ఖైదీ.

"ఏమిటా మాట?" అడిగాడు హారిసా.

"మీ తెగమీద దాడి చేసిన వారిలో మేము లేము. ఇది నిజం, నమ్మండి. మేము మా ప్రాణాలు కాపాడుకోవడానికి అబద్ధం చెప్పడంలేదు. అదీగాక, ఓసారి మా తెగలో కొందరు తుంటరి వెధవలు జమీలాను వేధించ బోతే మేము వాళ్ళను వారించాము. కావాలంటే జమీలా దొరికినప్పుడు ఆమెనే అడగండి. మేము జమీలా పేరు మీద మిమ్మల్ని క్షమాభిక్ష అడుగుతున్నాం. దయచేసి మమ్మల్ని క్షమించి కనికరించండి" అన్నాడా ఖైదీ.

"సరే, మిమ్మల్ని క్షమిస్తున్నాం. కాని ఒక విషయం గుర్తుంచుకోండి. మళ్ళీ ఎప్పుడైనా మీరు మమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నించారా - ఆ రోజు మీ జీవితపు ఆఖరి రోజు అవుతుంది" అన్నాడు హారిసా హెచ్చరిస్తూ.

"మళ్ళీనా? మేము చెంపలు వేసుకుంటున్నాం. ఇక ఎప్పటికీ మిమ్మల్ని మోసగించమని వాగ్దానం చేస్తున్నాం. మోసం చేస్తే మమ్మల్ని వెంటనే హతమార్చే హక్కు మీకుంది" అన్నాడు ఖైదీ.

"సరే, మీరిప్పుడు మా వెంట పదండి" అన్నాడు హారిసా.

వెంటనే హారిసా అనుచరులు గుడారాలు పీకి ఒంటెలపై వేశారు. మూటాముల్లెలు సర్దుకున్నారు. అందరూ ఒంటెల మీద ఎక్కి బయలుదేరారు.

అది వెన్నెల రేయి. పూర్ణ శశాంకుడు దేదీప్యమానంగా వెలిగిపోతూ ఆకాశ విహారం చేస్తున్నాడు. సమగ్ర స్వరూపంతో అందాలు వెదజల్లుతున్న వెన్నెలరేడును చూసి తారామణులు సిగ్గుతో కుంచించుకుపోతున్నారు.

పండు వెన్నెలకు తెల్లటి ఇసుక నేల మరింత తెల్లగా మెరిసిపోతున్నది. ప్రకృతి నుండి వినిపించే అనిర్వచనీయమైన మౌనరాగాలకు ఒంటెలు పరవశిస్తూ ముందుకు సాగిపోతున్నాయి. పగలంతా సూర్యతాపంతో వేడెక్కిపోయిన ఇసుకనేల రాత్రి గడచిన కొద్దీ క్రమేణా చల్లబడుతోంది.

హారిసా, అతని అనుచరులు, ఖహ్తాన్ తెగ ఖైదీలు ఒంటెలపై అంబారీలలో కూర్చొని ప్రయాణం చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు వారు మేల్కొని ఉన్నారు. ఆ తరువాత అందరూ ఒంటెల పగ్గాలు వదులు చేసేసి నిద్రకు ఉపక్రమించారు.

ఒంటెలు ఒకదాని వెనుక మరొకటి వరుసగా తమకు తోచిన దిశగా నడుస్తున్నాయి. తెల్లవారుజాము అవుతుందనగా చంద్రకాంతి మందగించ సాగింది. చిన్నచిన్న నక్షత్రాలు కనుమరుగయిపోసాగాయి.

ఆ తరువాత కాస్సేపటికే తూర్పు దిక్కున ఉదయకాంతి క్రమంగా ప్రత్యక్షమయి చుట్టు పక్కలున్న నక్షత్రాలను తరిమివేసింది.

వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. చల్లటి పిల్లగాలులు మెల్లిగా వీస్తూ శరీరాలను పులకరింపజేస్తున్నాయి.

మారిన ఈ వాతావరణంతో హారిసా అనుచరులకు నిద్రమత్తు వదిలింది. వారు కళ్ళు నులుముకుంటూ ముందు వైపు చూశారు.

హఠాత్తుగా ఎదురుగా ఓ కొండ కనిపించింది. కొండ పక్క కొంచెం దూరంలో జనావాసం కూడా ఉన్నట్లు అనిపించింది వారికి.

వెంటనే వారు ఒంటెల పగ్గాలను లాగిపట్టుకున్నారు. ఒంటెలు ఆగి పోయాయి.

వారు క్షణంపాటు సంభ్రమాశ్చర్యాలతో ముందువైపు చూశారు. ఆ తరువాత ఒంటెల మీద నుంచి కిందికి దిగి నిల్చున్నారు. అప్పుడు కాకతా ళీయంగా వారి చూపులు తాము నిల్చున్న నేలమీద పడ్డాయి.

ఈసారి వారు మరింత ఆశ్చర్యపోయారు. నేల మీద నెత్తుటి మరకలు కనిపించాయి. వారు ఆ మరకలనే తదేకంగా చూడసాగారు.

వారు ఈ ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే ఎదురుగా ఉన్న కొండల మధ్య నుంచి మేకల మంద ఒకటి ప్రత్యక్షమయింది. మేకలు ఒకదాని తర్వాత ఒకటి మైదానంలోకి రాసాగాయి.

కొండల మధ్య నుంచి చివరి మేక బయటికి రాగా దాని వెనుక ఓ అందమైన యువతి కూడా ప్రత్యక్షమయ్యింది. ఆమె చేతిలో ఓ పదునైన ఈటె ఉంది.

హారిసా అనుచరులను చూసి ఆ యువతి ముఖకవళికలు ఏమాత్రం మారలేదు. ఆమె కళ్ళలో ఎలాంటి ఆశ్చర్యం, ఆందోళనలు చోటు చేసుకోలేదు.

అయితే మేకలు మటుకు కొత్తజనాన్ని, కొత్త ఒంటెలను చూసి కాస్తంత బెరుకు బెరుకుగా చూశాయి.

హారిసాకు, అతని అనుచరులకు ఆ ప్రదేశం కొత్తకొత్తగా కన్పించింది. అయితే ఎన్నో సంవత్సరాల తరువాత జనావాస ప్రాంతంలో అడుగు పెడ్తున్నందున వారికి ఎంతో సంతోషం కలిగింది.

హారిసా అది ఏ ప్రదేశమో తెలుసుకోవడానికి ఆ యువతి సమీపానికి వెళ్ళాడు.

"అమ్మాయ్! ఈ ప్రాంతం పేమిటమ్మా?" అడిగాడు అతను. ఇది ఏ ప్రాంతమో మీకు తెలియదా? యువతి ఆశ్చర్యం వెలిబుచ్చుతూ అన్నది.

"తెలియదమ్మా!" అన్నాడు హారిసా.

'బహుశా మీరిక్కడికి మొదటి సారిగా వచ్చారనుకుంటా.'

"అంతేకావచ్చు."

"ఇంతకూ మీరు ఎక్కడ్నుంచి వస్తున్నారు?" ఆ యువతి మళ్ళీ ప్రశ్నించింది.

"మేము ఎక్కడ్నుంచి వస్తున్నామో మాకే తెలియదు" అన్నాడు హారిసా.

"ఏమిటీ, మీరెక్కణ్ణుంచి వస్తున్నారో మీకే తెలియదా? చాలా ఆశ్చర్యంగా ఉందే!! అన్నది యువతి, హారిసాను కొంచెం దూరంలో నిలబడి ఉన్న అతని అనుయాయులను చూస్తూ.

"పాపా! మాకు నిజంగానే తెలియదమ్మా!" చాలా కాలం నుంచి ఎడారిలో దారితప్పి తిరుగుతున్నాం. ఇలా అయిదు సంవత్సరాలు గడచిపోయాయి. చివరికి ఈ రోజు ఈ జనావాస ప్రాంతానికి చేరుకోగలిగాం. చూస్తే ఇక్కడి వాతావరణం అంతా కొత్తకొత్తగా కనిపిస్తోంది మాకు. చెప్పమ్మా! ఈ ప్రాంతాన్ని ఏమంటారు?" అన్నాడు హారిసా ప్రశాంత వదనంతో.

"ఈ ప్రాంతాన్ని బదర్ అంటారు బాబాయ్!" అన్నది ఆ యువతి.

"బదర్....!ఆ...... ఇప్పుడర్థమయింది. ఈ ప్రాంతానికి నేను ఇంతకు ముందు కూడా రెండు మూడుసార్లు వచ్చాను. కాని పాపా! ఇక్కడ ఈ నేల

మీద నెత్తుటి మరకలేమిటమ్మా?'' అన్నాడు హారిసా ఎర్రటి మరకలవైపు చూపిస్తూ.

అవా? అవీ... కొన్నాళ్ళ కిందట ఇక్కడ మక్కా విగ్రహారాధకులకు, మదీనా ముస్లింలకు మధ్య యుద్ధం జరిగింది'' అన్నది యువతి.

"అయితే ఆ యుద్ధంలో ముస్లింలు ఓడిపోయారా?''

"లేదు బాబాయ్! వారు ఓడిపోలేదు. ముస్లింల సంఖ్య తక్కువగా, మక్కా వాళ్ళ సంఖ్య ఎక్కువగా ఉన్నా ముస్లింలే గెలిచారు. మక్కా బహుదైవారాధకుల్లోని గొప్పగొప్ప నాయకులు, ధనికులు ఈ యుద్ధంలో చనిపోయారు.''

"ఆశ్చర్యంగా ఉందే!'' అన్నాడు హారిసా.

"ఆశ్చర్యమేమరి. మొత్తం అరేబియాలో ఈ యుద్ధం పెద్ద సంచలనం సృష్టించింది.''

"మరి మక్కావాసులు ముస్లింల మీద ప్రతీకారం తీర్చుకోలేదా?''

"అబూ సుఫ్యాన్ మదీనా మీద దాడి చేయడానికి వెళ్ళాడని విన్నా. కాని ముస్లింలకు భయపడి పారిపోయాడట!'' అన్నది యువతి.

"ఇది చాలా పిరికితనం''

"ఇలాంటి పిరికితనం మక్కా వాళ్ళలో ఇదివరకెప్పుడూ కనపడలేదు.''

"సరేనమ్మా! నేనికవెళ్తా'' అంటూ హారిసా అక్కడ్నుంచి వెను తిరిగి తన అనుచరుల దగ్గరికి వచ్చాడు.

"సోదరులారా! ఈ ప్రాంతంలో విడిది చేద్దాం. ఈ ప్రాంతం పేరు బదర్. ఇది మక్కా, మదీనాల మధ్య ఉంది. చాలా పేరుపడ్డ ప్రాంతం'' అన్నాడు హారిసా.

బదర్ పేరు వినగానే అతని సహచరులు ఎంతో సంతోషించారు. వెంటనే వారు ఒంటెల మీదున్న సామగ్రిని దించారు. చకచకా గుంజలు పాతి గుడారాలు వేసుకున్నారు. ఆహార పదార్థాలు, ఆయుధాలు, ఇతర సామగ్రి నంతటినీ గుడారాల్లోకి చేర్చారు.

ఆ తరువాత కాలకృత్యాలు ముగించుకోవడానికి తలా ఓవైపు వెళ్ళారు. ఆ యువతి ఓ ఎత్తయిన గుట్ట మీద నిలబడి మేకలను కాస్తూ కొత్త జనాన్ని చూడసాగింది. కాస్సేపటికి సూర్యుడు తన సహస్ర కిరణాలతో తూర్పు దిక్కున తొంగి చూడసాగాడు.

హారిసా అనుచరులు కాలకృత్యాలు ముగించుకొని వంటపనికి ఉపక్ర మించారు. హారిసా తన గుడారానికి కొంచెం దూరంలో కూర్చొని భవిష్యత్ కార్యక్రమాన్ని గురించి ఆలోచించసాగాడు.

బదర్ ప్రాంతం చేరుకోవడంతో హారిసా అనుచరుల కష్టాలు చాలా వరకు తొలగిపోయాయి. అయితే ఒక విషయం ఇంకా మిగిలే ఉంది. అసలు ఆ విషయమే వారిని పట్టి ఎక్కువగా పీడిస్తున్నది.

అదే వారి అంతరంగాల్లో అయిదేళ్ళనుంచి నిరంతరాయంగా మండు తున్న ప్రతీకార జ్వాల. శత్రువుల మీద పగతీర్చుకునేదాకా వారికి శాంతిలేదు.

అందుకే హారిసా ఆ ప్రాంతంలో బసచేసి శత్రువుల జాడ తెలుసు కోవడంలో నిమగ్నుడయిపోయాడు. అటుగా వచ్చే, పోయే ప్రతి బాటసారిని, ప్రతివ్యాపార బృందాన్ని ఖహ్తాన్ తెగ వాళ్ళను గురించి అడుగుతుండేవాడు. కాని ఏ ఒక్కడూ ఆ తెగ గురించి సరైన సమాచారం తెలియజేయలేక పోయాడు.

అయినా హారిసా తన పట్టుదలను సడలించుకోలేదు. అతని హృద యంలో ఖహ్తాన్ తెగ వాళ్ళమీద పగ, ప్రతీకార జ్వాలలు బుసలు కొడ్తున్నాయి.

ఎందుకు బుసలు కొట్టవు? ఆ తెగ తన తెగ వాళ్ళమీద అన్యాయంగా దాడిచేసి సర్వనాశనం చేసింది. ఆ దుర్మార్గులు తన భార్య సాదీని, తన పెంపుడు కూతురు జమీలాను, తన నాయకుని కూతురు రుఖియాను ఇంకా అనేకమంది స్త్రీలను, పిల్లలను ఖైదీలుగా పట్టుకొని తీసుకెళ్ళారు.

ఇలా హారిసా, అతని అనుయాయులు బదర్ ప్రాంతంలో నెలల తరబడి నివసించారు. చివరికి ఖహ్తాన్ తెగవాళ్ళు 'హమ్రుల్ అసద్' అనే ప్రాంతంలో గుడారాలు వేసుకొని ఉంటున్నారని తెలిసింది.

ఈ వార్త తెలిసిన హారిసా అనుచరులు ఎంతో సంబరపడ్డారు. శత్రువుల మీద పగ సాధించడం కంటే మించిన విజయం లేదు వారి దృష్టిలో. అందుకే వారు తమ నాయకుని ఆజ్ఞకోసం తీవ్రంగా నిరీక్షించసాగారు.

మరునాడు సూర్యాస్తమయం తరువాత హారిసా ఆజ్ఞ వచ్చింది. వెంటనే అతని అనుచరులు సామగ్రి సర్దుకొని హమ్రుల్ అసద్‌కు ప్రయాణమయ్యారు.

వీరంతా పగటివేళ ఇసుక తిన్నెల చాటున దాటి విశ్రాంతి తీసుకుంటూ, రాత్రివేళల్లో మాత్రమే ప్రయాణం సాగించేవారు. ఈ విధంగా వారు అనేక రాత్రులు ప్రయాణం చేసి హమ్రుల్ అసద్ సమీపానికి చేరుకున్నారు.

ఖహ్తాన్ తెగవాళ్ళు హారిసా అనుచరుల రాకను పసిగడ్తే వెంటనే వారు అక్కడ్నుంచి వేరే చోటికి పారిపోవచ్చు. అందువల్ల హారిసా, అతని అనుచరులు ఎంతో జాగ్రత్త వహించారు.

హమ్రుల్ అసద్ సమీపానికి చేరుకునేటప్పటికీ సూర్యోదయం ఇంకా కాలేదు. సూర్యోదయానికి ముందే వారు ఎత్తయిన ఇసుక తిన్నెల చాటుకెళ్ళి దాక్కున్నారు. సూర్యాస్తమయం వరకు అక్కడే ఉండిపోయారు.

పూర్తిగా చీకటిపడి తూర్పు దిక్కున చంద్రుడు తారాగణంతో బాగా పైకి వచ్చాడు. అప్పుడు హారిసా అనుచరులు ఇసుక తిన్నెల చాటునుంచి మెల్లిగా బయటికి వచ్చారు. అయితే వారు దూరంగా విస్తరించి ఉన్న ఇసుక మేటలను ఆసరా చేసుకొని మెల్లిమెల్లిగా హమ్రుల్ అసద్ వైపుకు సాగారు.

హమ్రుల్ అసద్ అక్కడ్నుంచి రెండు మూడు మైళ్ళు మాత్రమే ఉంది. అయితే ఇసుక మేటల చాటున నడుస్తున్నందున వారు ఖహ్తాన్ తెగ వాళ్ళకు కన్పించరు.

పగలంతా నిప్పు కణాల్లా కాలిపోయిన ఇసుక రేణువులు ఇప్పుడు పూర్తిగా చల్లబడిపోయాయి. వెన్నెలలో ఇసుక నేల తెల్లదుప్పటి పరచినట్లు మెరిసిపోతోంది. చల్లని వాతావరణంలో హారిసా అనుచరులు ఒంటెల మీద మెల్లిగా ముందుకు సాగిపోతున్నారు.

అర్ధరాత్రి దాటింది. వీరు సాధారణంగా అందరూ నడిచే కాలిబాటన కాకుండా ఇసుక మేటల చాటున గుట్టలు మిట్టలు చుట్టి నడుస్తూ ఉండడం వల్ల అనేక గంటలు ప్రయాణం చేసినా గమ్యస్థానానికి చేరుకోలేకపోయారు.

హారిసా, అతని అనుచరులు చడిచప్పుడు లేకుండా వెన్నెలలో మెల్లిగా సాగిపోతున్నారు.

దారిదాపుల్లో జనసంచారం సూచనలు కూడా లేవు. సర్వత్రా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ఒంటెలు నడుస్తున్న శబ్దం మాత్రమే వినపడుతోంది. వాతావరణం గంభీరంగా ఉంది.

కాస్సేపటికి వారు ఓ ఎత్తయిన ఇసుక కొండ సమీపానికి చేరుకున్నారు. అంతలో వారికి ఎటునుంచో మనిషి దగ్గిన శబ్దం వినవచ్చింది. అది విని వారు ఆశ్చర్యపోయారు.

అందరూ ఓ క్షణం ఆగి అటూ ఇటూ చూశారు. కాని దగ్గర్లో ఎవరూ కనిపించలేదు.

ఆ తరువాత మళ్ళీ దగ్గిన శబ్దం ఏదీ వినపడలేదు. అందువల్లవారు బహుశా తమ చెవులే తమల్ని మోసగించాయని భావించారు.

వాళ్ళు ముందుకుసాగారు. వారి ఒంటెల పంక్తి ఇసుక కొండపక్కగా నడుస్తోంది. మరి కాస్సేపటికీ ఎక్కడ్నుంచో ఓ గావుకేక విన్పించింది. అది ఓ స్త్రీ ఆర్తనాదం.

హారిసా, అతని అనుయాయులు ఉలిక్కిపడ్డారు. ఆశ్చర్యపోతూ అటూ ఇటూ చూశారు. కాని వారికి ఎక్కడా మనిషిజాడే కన్పించలేదు.

ఇసుక కొండ దిగువన భాగాన ఎడమవైపున చాలా దూరంగా మిట్ట పల్లాలు లేని చదునైన ఇసుక మైదానం ఉంది. వెన్నెలలో ప్రతి వస్తువు స్పష్టంగా కనిపిస్తోంది. అందుకని అటువైపున మనుషులెవరూ దాక్కొని ఉండ టానికి ఆస్కారమే లేదు.

హారిసా ఇసుక కొండ వైపుకు ఓసారి అనుమానంగా చూశాడు. అతను ఒంటె వేగాన్ని తగ్గించి వెనుకవస్తున్న కొందరు సహచరుల ఒంటెలను సమీ పించాడు.

"గావు కేక మీక్కూడా వినిపించిందా? లేక నాకు భ్రమేమైనా కలిగిందా?" అన్నాడు అతను.

"భ్రమ కాదూ, ఏంకాదు. నేనూ విన్నాను ఆ కేక. అది ఎవరో స్త్రీ కంఠంలా ఉంది. బహుశా ఆమె ఏదో ఆపదలో చిక్కుకొని ఉంటుంది" అన్నాడు ఓ నడికారు వ్యక్తి.

"నిజమే ఒంటెలను ఆపండి. కిందికి దిగి ఇసుక గుట్ట ఎక్కి చూడండి' అన్నాడు హారిసా.

వెంటనే ఒంటెలు ఆగిపోయాయి. అందరూ ఒంటెల మీద నుంచి కిందికి దూకారు. గబగబా ఈటెలు తీసుకొని ఇసుక గుట్టపైకి తలా ఓ దిక్కుకు పరుగెత్తారు.

హారిసా కూడా కొండవైపుకు పరుగెత్తాడు.

ఇసుక కొండ ఎక్కడం చాలా ప్రమాదంతో కూడిన పని. దానికి ఎంతో మెలకువ, నేర్పు ఉండాలి. ఏమాత్రం ప్రమత్తంగా ఉన్నా కాలికింద ఇసుక జారి, మనిషి అమాంతం కిందికి దొర్లిపడే ప్రమాదం ఉంది.

హారిసా అనుచరులు ఈటెలను ఊతకర్రలుగా ఉపయోగించుకొని కొండెక్కడం ప్రారంభించారు. ఈటెలను ఇసుకలో పాతుకుంటూ వాటి సహాయంతో జాగ్రత్తగా అడుగులు వేస్తూ మెల్లిగా పైకి ఎక్కుతున్నారు.

హారిసా మాత్రం కాస్త వేగంగానే పైకి ఎక్కుతున్నాడు. ఆ విధంగా ఇసుక గుట్ట అంచు వరకు చేరుకున్నాడు. ఇక ముందుకు పోవడానికి అవకాశం లేదు.

అంచుకు ఆవలవైపు ఎగుడు దిగుళ్ళు, లోతయిన నెర్రెలు, గుంటలు ఉన్నాయి. హారిసా అటువైపు దిగడానికి పూనుకున్నాడు.

అతను మెల్లిగా కిందికి దిగసాగాడు. అయితే స్త్రీ ఆర్తనాదం ఎటు నుంచి వచ్చిందో తెలుసుకోవడానికి నలువైపులా దృష్టిసారిస్తూ దిగుతున్నాడు.

కాని క్రింది వైపు గమనించకుండా దిగుతున్నాడు. అందుల్ల నాలుగైదు అడుగులు వేశాడో లేదో దబేలున క్రిందికి జారాడు.

కాళ్ళ కింద ఇసుక జారి క్రిందికి దొర్లుకుంటూ పోయాడు. సంభాళించు కోవడానికి ఎంతగానో ప్రయత్నించాడు. కాని అతని ప్రయత్నాలు ఫలించలేదు.

అలా క్రిందికి దొర్లుతూ పోయి చివరికి ఎవరో ఒక మనిషి తలమీద పడి ఆగిపోయాడు.

అయితే ఆ మనిషి వెంటనే హారిసా కాళ్ళను విదిలించి వేశాడు. దాంతో హారిసా మరి కొంచెం క్రిందికి దొర్లిపడ్డాడు. అక్కడ ఎలాగో సంబా ళించుకొని లేచి నిలబడ్డాడు.

"మూర్ఖుడా! ఎవరు నువ్వు, జారి నా తలమీద పడ్డావు?" అన్నాడు అవతలి వ్యక్తి కోపం పట్టలేక.

"సోదరా! క్షమించాలి. పొరపాటున జారిపడ్డా" అన్నాడు హారిసా ఇసుక దులుపుకుంటూ. "క్షమించాలట క్షమించాలి! చిన్న పిల్లాడివా క్షమించడానికి? సంభా ళించుకోవడం చాతగాపోతే, అసలు అంత ఎత్తుకు ఎందుకు ఎక్కావు?" గర్జిం చాడు ఆ వ్యక్తి ఉద్రేకంతో ఊగిపోతూ.

"పొరపాటయింది."

"మళ్ళీ అదే పాట?" నీ పొరపాటుకు ఫలితం నేను అనుభవించాల్నా? నా తలమీద నీ కాళ్ళు వచ్చిపడి నాకెంత బాధకలిగించాయో తెలుసా?"

"నిజమే. కాని దానివల్ల మీకు దెబ్బ తగల్లేదనుకుంటా" అన్నాడు హారిసా.

"ఉహూ, దెబ్బతగల్లేదు! ఎంతో హాయిగా ఉంది!! నువ్వు ఆకాశం నుండి నా నెత్తిమీద పడ్డావు, కాని నాకు మాత్రం దెబ్బతగల్లేదంటున్నావు. మూర్ఖుడా! అంత ఎత్తునుంచి నేనొచ్చి నీ మీద పడితే నీకెలా ఉంటుంది? దెబ్బ తగులుతుందా, హాయిగా ఉంటుందా చెప్పు" అన్నాడు ఆ వ్యక్తి వళ్ళు మండిపోయి. అంతటితో ఆగకుండా అతను హారిసా మీదికి దూసుకొచ్చి అతని మెడ పట్టుకున్నాడు.

"నేను ఒప్పుకుంటున్నా, నావల్ల పెద్దపొరపాటే జరిగింది. నిజానికి అది పొరపాటు కూడా కాదు. నా కాళ్ళ కింద ఇసుక జారిపోయింది. నేను ఎంత

ప్రయత్నించినా సంబాళించుకోలేక దొర్లివచ్చి నీ మీద పడ్డాను" అన్నాడు హారిసా సంజాయిషీ చెప్పుకుంటూ.

"అయితే మాత్రం? దొర్లి వచ్చి సరాసరి నానెత్తి మీద పడాలని ఎవడు చెప్పాడు నీకు?" అన్నాడు అవతలి వ్యక్తి మరింత మండిపడుతూ.

"అయినా సరిగ్గా గుట్ట కిందే నిలబడమని నీకెవడు చెప్పాడు? మనిషి అనేవాడు ఇలాంటి చోట అసలు నిలబడకూడదు" అన్నాడు హారిసా. ఈసారి ఎదురు తిరిగి మాట్లాడుతూ.

"నువ్వు తప్పు చేసి, పైగా నాకే హితబోధ చేస్తున్నావా? అసలు నువ్వు నన్ను హేళన చేస్తున్నావు. నేనంత వెర్రివాడనుకున్నావా? చూడు నా తడాఖా" అంటూ ఆ వ్యక్తి హారిసా చొక్కా వదిలేసి ఖడ్గం పైకి ఎత్తాడు.

అప్పటిదాకా హారిసా తలవంచి ఉండటం వల్ల అతని ముఖం ఆ వ్యక్తికి సరిగా కనపడలేదు. చొక్కా వదిలిన తరువాత హారిసా తలపైకెత్తగానే వెన్నెలలో అతని ముఖం చూసి ఆ వ్యక్తి ఉలిక్కిపడ్డాడు.

వెంటనే అతను వెనక్కి అడుగు వేస్తూ, "హారిసా! నువ్వా!!" అన్నాడు.

హారిసా కూడా అతడ్ని గుర్తు పట్టాడు.

'అరె! నువ్వా అజల్!! ఇంత రాత్రివేళ ఇక్కడేం చేస్తున్నావు?" అన్నాడు హారిసా ఆశ్చర్యం వెలిబుచ్చుతూ.

"మరేం లేదు హారిసా! నేను విలాస పురుషుణ్ణని నీకు తెలుసుకదా? స్త్రీ వ్యామోహం నన్ను ఒకచోట స్థిమితంగా నిలువనీదు. ఈ మధ్య ఓ అందాల భామ నన్ను పిచ్చివాణ్ణి చేసింది. అనుక్షణం ఆ అమ్మాయే నా కళ్ళలో మెదులుతూ రాత్రిళ్ళలో నాకు నిద్రలేకుండా చేసింది" అన్నాడు ఆ వ్యక్తి.

"అయితే?"

"అయితే లేదు, గియితే లేదు." ఆ సుందరాంగి నా నరనరాలను కాల్చుకు తింటోంది. ఆ వయ్యారి... ఆ మయూరి... ఏమని చెప్పను హారిసా.. కళ్ళు మూసినా,...... కళ్ళు తెరచినా... ఆ సుందరే..."

"ఇంతకూ ఆమెతో నీకున్న సంబంధం ఏమిటి?" హారిసా అసహనంతో అన్నాడు అతని మాటలకు అడ్డు తగులుతూ.

"ఆ సుందరాంగిని నేను ప్రేమించాను. ఆమెతో మాట్లాడాలని, ఆమె పొందు సంపాదించాలని శతవిధాలా ప్రయత్నించాను. కాని నా ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి ఈ రోజు నా అదృష్టం పండింది.

నేను ఎలాగో తంటాలు పడి ఆమెను బంధించి తెచ్చాను. హారిసా! ఆమె ఎంత అందంగా ఉందంటే... ఆ కళ్ళు ... ఆ వళ్ళు... ఆ నడుము..... ఆ నడక.... నువ్వు ఒక్కసారి చూస్తే చాలు - యావత్తు ప్రపంచాన్నే మరిచిపోతావనుకో!" అన్నాడు అజల్.

"ఆమె ఏ తెగకు చెందిన స్త్రీ? పేరేమిటి?" అడిగాడు హారిసా.

"ఆమె ఏ తెగకు చెందిందోగాని, ఖహ్తాన్ తెగవారి ఆధీనంలో ఉంది. పేరు జమీల.

జమీలా పేరు వినగానే హారిసా ఉలిక్కిపడ్డాడు.

"జమీలా?" అన్నాడు అతను వత్తి పలుకుతూ.

"జమీలాయే! ఆమె నీకు తెలిసేమిటి? ఆమె అందచందాలు ఇప్పుడు యావత్తు అరేబియాలో ఖ్యాతిచెందాయి" అన్నాడు అజల్.

"ఆమె ఇప్పుడు ఎక్కడుంది?"

"అదిగో! అక్కడ కట్టిపడేశాను" అంటూ చేత్తో చూపించాడు అజల్.

"హారిసా! ఆమెను ఎలాగైనా లొంగదీసుకోవాలి. పెద్ద మానవతిలా వేషాలు వేస్తోంది. ఎంత చెప్పినా వినకుండా మొండికేసింది. కాస్త నువ్వయినా నచ్చజెప్పు."

హారిసా అతని మాటలు వినిపించుకోకుండా గబగబా అటువైపు నడిచాడు. అజల్ కూడా అతని వెనకాలే వెళ్ళాడు. ఇద్దరూ ఓ గుహలోనికి వెళ్ళారు.

లోపల ఒక యువతి కాళ్ళు చేతులు కట్టివేయబడి ఉంది. హారిసా లోపలికి పోగానే ఆమెకు కట్టిన త్రాళ్ళను ఊడదీసివేశాడు.

"జమీలా లేచి నిలబడింది. వెన్నెలలో ఆమె ముఖం మరింత అందంగా కనిపించసాగింది. హారిసా ఒక్కక్షణం ఆమె వంక చూసి ఆశ్చర్య చకితుడయిపోయాడు.

"జమీలా! నా చిట్టి తల్లీ!! నన్ను గుర్తుపట్టలేదా?" అన్నాడు హారిసా.

జమీలా అతడ్ని పరిశీలనగా చూసింది.

"నువ్వు..... నువ్వు నన్ను పెంచిన తండ్రివి కదూ... నాన్నా!!" అంటూ ఆమె అప్రయత్నంగా హారిసా ఒడిలో వాలిపోయింది.

"అమ్మా! నా బంగారు తల్లీ!! ఎన్ని కష్టాలు పడ్డాయమ్మా నీ మీద" అన్నాడు హారిసా ఆమెను పొదివి పట్టుకొని తల నిమురుతూ.

అజల్ ఆశ్చర్యం, ఆందోళనలతో వాళ్ళిద్దరి వైపు చూడసాగాడు.

"జమీలా! నువ్వు నావోళ్ళే, నా చేతుల్లో పెరిగిన జమీలాయేనా?"

"ఔను నాన్న! నేను మీ చేతుల్లో పెరిగిన జమీలానే. మా నాన్న నన్ను సజీవంగా పాతిపెట్టి పోయినప్పుడు మీరు నన్ను బయటికి తీసి రక్షించారు. మీ ఇంటికి తీసికెళ్ళి పెంచారు. కానీ మీ పెంపుడు కూతుర్ని. దురదృష్టం వెన్నాడుతున్న జమీలాను" అంటూ బావురుమంది జమీలా.

"ఏడ్వకమ్మా! ఏ దుర్మార్గుడు నిన్ను పట్టుకెళ్ళాడు? ఏ రాక్షసుడు నిన్ను వేధించాడు తల్లీ!" అడిగాడు హారిసా.

"ఎవరని చెప్పను. మొదటి నుంచి నా దురదృష్టమే నన్ను వేధిస్తోంది" అన్నది జమీలా కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"బాధపడకమ్మా! దేవుడు మేలు చేస్తే త్వరలోనే మన కష్టాలు దూర మవుతాయి" అన్నాడు హారిసా ఆమెను ఓదారుస్తూ.

"ఖహ్తాన్ తెగలోకి వచ్చాక ఒక్క రోజు కూడా మేము సుఖంగా గడప లేదు. రోజూ తెల్లవారు జామున మొదలుకొని పొద్దుగూకే దాకా బండెడు చాకిరితో వళ్ళు హూనం చేసుకోనిదే మమ్మల్ని విశ్రాంతి తీసుకోనియరు. మా అమ్మ సల్మా అయితే ఈ దుఃఖంతోనే క్రుంగి ముసలిదానయిపోయింది" అన్నది జమీలా తన మనసులోని బాధనంతా వెలిబుచ్చుతూ.

"ఖహ్తాన్ తెగవాళ్ళు మిమ్మల్ని అంత వేధించారా?"

"వాళ్ళు మమ్మల్ని బానిసలకన్నా నికృష్టంగా చూస్తున్నారు. మాచేత మా శక్తికి మించిన పనులు చేయిస్తూ జీవితం మీద విరక్తి కలిగిస్తున్నారు. తొలికోడి కూయకముందే మమ్మల్ని లేపుతారు. అప్పటి నుంచి తెల్లారేదాకా పిండి విసరాల్సి వస్తుంది. సూర్యోదయం నుంచి దూది ఏకే పని అప్పగిస్తారు. మధ్యాహ్నం దాకా దూది ఏకుతూ ఉంటాం. ఆ తరువాత వంట పనులు చేయిస్తారు. సాయంత్రం తాళ్ళు పేనాల్సి వస్తుంది. పొద్దుగూకిన తరువాత మళ్ళీ వంటపనులు చేయాలి."

ఈ విధంగా పొద్దస్తమానం గుక్క తిప్పుకోకుండా ఏదో ఒక పని చేయాల్సి వస్తుంది. వేళకు పని పూర్తి చేయకపోతే, లేదా పనిలో ఏదైనా లోపం కనిపిస్తే కర్రలతో గొడ్లను బాదినట్లు బాత్తారు.

నాన్నా! మేమిక్కడ ఇన్ని కష్టాలు పడుతుంటే మీరెక్కడికి వెళ్ళారు? మమ్మల్ని గురించి ఎందుకు పట్టించుకోలేదు?" అంటూ జమీలా మరోసారి బావురుమంది.

జమీలా పడిన కష్టాలు వినగానే హారిసా కోపంతో ఊగిపోయాడు.

"ఖహ్తాన్ తెగ నీచులారా! ఇప్పుడు మీ మీద ప్రతీకారం తీర్చుకొని గాని వదలిపెట్టను" అంటూ పళ్ళు పటపట నూరాడు.

"అమ్మా! నేను ఓ పెద్ద ఆపదలో చిక్కుకుపోయాను. ప్రాణాంతకమైన ఆపద అది. ఈపాటికి ఎప్పుడో మృత్యువు నోట్లోకి పోయేవాణ్ని. కాని ఆ నీచుల మీద ప్రతీకారం తీర్చుకోవాల్సి ఉంది గనుక దేవుడు నన్ను ప్రాణాపాయం నుండి రక్షించాడు. చెప్పు తల్లీ ఆ దుర్మార్గులు ఎక్కడున్నారు ఇప్పుడు?"

"ఎక్కడున్నారో ఏమో. ఇతడు నన్ను మోసంతో బంధించి తెచ్చాడిక్కడికి" అన్నది జమీలా ఓసారి అటూ ఇటూ చూస్తూ.

జమీలా కన్పించిన సంతోషంలో పడిపోయి హారిసా అజల్ సంగతి మరచిపోయాడు. ఇప్పుడు జమీలా అతని గురించి ప్రస్తావించగానే హారిసా వెనక్కి తిరిగి చూశాడు. కాని అజల్ అక్కడ్నుంచి ఎప్పుడో జారుకున్నాడు.

"వెధవ పారిపోయాడు. పోనీలే తల్లీ! ఖహ్తాన్ తెగ వాళ్ళు ఈ దరిదాపుల్లోనే ఎక్కడో ఉండివుంటారు" అన్నాడు హారిసా.

"ఔను ఇక్కడే ఉండి వుండవచ్చు. ఖహ్తాన్ తెగ మనుషులు నన్ను వెతుకుతున్నారని విన్నా. నన్ను పట్టుకొచ్చిన వాడు చెప్పాడు."

"అసలు వాడు నిన్ను ఎలా పట్టుకొచ్చాడమ్మా?"

"నేను బహిర్భూమికని ఒయాసిస్సు నుండి బయటికి వెళ్ళాను. పొరపాటున నుండి బయటికి వెళ్ళాను. పొరపాటున కొంచెం దూరం వెళ్ళి చిన్న చిన్న గుట్టల మధ్య ఇరుక్కున్నాను. అక్కడ దారి తెలియక వెతుకుతుంటే ఈ మనిషి హఠాత్తుగా వచ్చి నా వెంటపడ్డాడు. నన్ను కాళ్ళు చేతులు కట్టి ఇక్కడకు తీసుకొచ్చాడు" అన్నది జమీలా.

"దుర్మార్గుడు! దొరికితే వీపు చీరేసేవాణ్ణి, పిల్లిలా జారుకున్నాడు పిరికి వెధవ!" అన్నాడు హారిసా.

అంతలో ఎక్కడ్నుంచో ఒంటెల బిడారం వస్తున్న ధ్వని మెల్లిగా వినిపించింది. హారిసా ఉలిక్కిపడ్డాడు. జమీలాను వదలిపెట్టి చెవులు రిక్కించి ఆ ధ్వనిని వినడానికి ప్రయత్నించాడు.

అప్పటికి అర్ధరాత్రి దాటింది. నలు దిశెలా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. చల్లటి పిల్ల గాలులతో వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది.

వెన్నెలరేడు విశ్వరూపం ధరించి ఆకాశం నడిమధ్య విచిత్ర కాంతులు వెదజల్లుతున్నాడు. పండు వెన్నెలలో ఎడారి నేల పూలపాన్పులా మెరిసిపోతోంది.

హారిసా ఒంటెల చప్పుడు విని అవి వస్తున్న వైపుకు చెవియొగ్గి వినసాగాడు. కాస్సేపటికి ఒంటెల గంటల చప్పుడుతో పాటు మనుషుల మాటలు కూడా వినరాసాగాయి. దాంతో హారిసా రక్తం ఉడికిపోయింది.

"ఆ వచ్చేది ఖహ్తాన్ తెగ వాళ్ళే అనుకుంటా. ఇదే మంచి అవకాశం. ఈ రోజు ఆ దుర్మార్గుల మీద ప్రతీకారం తీర్చుకొనిగాని వదలిపెట్టను" అన్నాడు హారిసా పిడికిలి బిగిస్తూ.

"నాన్నా! నువ్వొక్కడివే వాళ్ళను ఎదుర్కుంటావా?" వద్దొద్దు. ఆక్రూర మృగాలతో తలపడ్డానికి నేను మిమమల్ని ఒంటరిగా పోనివ్వను అంటూ జమీలా రెండడుగులు ముందుకువేసి హారిసా చొక్కా పట్టుకుంది.

"భయపడకమ్మా! నేనిక్కడ ఒక్కణ్ణేకాదు, నాతోపాటు చాలామంది ఉన్నారు, తొందరగా పదా చూపిస్తా' అన్నాడు హారిసా ముందుకు దారి తీస్తూ.

"వారెక్కడున్నారు?" అన్నది జమీలా అతని వెంటనడుస్తూ.

"ఇక్కడేనమ్మా! ఈ కొండ ఆవల వైపు ఉన్నారు. తొందరగా నడు. ఆలస్యం అయితే ప్రమాదం."

హారిసా, జమీలా చేయిపట్టుకొని ఒడిబడిగా నడచి కొండ ఆవలవైపుకు చేరుకున్నాడు. అక్కడ అతని తెగ వాళ్ళు అతనికోసం ఎదురుచూస్తూ నిల బడ్డారు.

వారు ఖహ్తాన్ తెగవారి రాకను గమనించినట్లుంది, ఎత్తయిన ఇసుక కొండల చాటున ఒంటెలను దాచి హారిసా కోసం నిలబడి నిరీక్షిస్తున్నారు.

హారిసాను చూడగానే వారిలో నూతనోత్సాహం ఉరకలు వేసింది. హారిసా వెంట వచ్చిన జమీలాను కూడా చూసి వారికి చాలా సంతోషం కలి గింది. ఆమె అందచందాలు వారిని ఆశ్చర్యపరిచాయి,.

హారిసా తన తెగవాళ్ళ దగ్గరికి తిరిగి రాగానే 'ఖహ్తాన్ తెగవాళ్ళు వస్తున్నారు, మీరు కూడా చూశారా?" అని అడిగాడు.

"చూశాం, వాళ్ళను చూశాకే, మేమీ గుట్టల చాటుకు చేరుకొని మీ ఆజ్ఞ కోసం ఎదురు చూస్తున్నాము" అన్నారు కొందరు.

"మనం వాళ్ళని ఎదుర్కోగలమా?" హారిసా అడిగాడు.

"ఎందుకు ఎదుర్కోలేము? ఆ పిరికి పందలు మనకో లెక్కా!" అన్నాడు ఒకడు.

"కాని వాళ్ళు చాలా మంది ఉన్నట్లు కనిపిస్తున్నారు. మన సంఖ్యా బలం చాలా తక్కువగా ఉంది" అనుమానం వ్యక్తపరిచాడు హారిసా.

"మహా అయితే వారు మనకన్నా రెట్టింపు సంఖ్యలో ఉంటారేమో, అంతేగా. కాని మన బలపరాక్రమాలు ఒక్కసారి రుచి చూస్తే చాలు- పిరికి వెధవలు తిరిగి కూడా చూడకుండా పారిపోతారు."

"అయితే పదండి ఒంటెలను వదలిపెట్టి, ఆయుధాలు సిద్ధం చేసు కోండి" అన్నాడు హారిసా.

"కాని ఈ అమ్మాయి సంగతి ....." అన్నాడు మరొకడు జమీలా వైపు చూపిస్తూ.

"ఈ అమ్మాయి నా కూతురు జమీలా. ఇక్కడే ఒంటెల దగ్గర ఉంటుం దిలే" అన్నాడు హారిసా.

"లేదు నాన్నా! నేనూ మీతో పాటు వస్తాను. ఆ పిరికిపందల మీద ప్రతీకారం తీర్చుకోవాలి నేను", అన్నది జమీలా వెంటనే.

"వద్దు తల్లీ! మాతోపాటు రావడానికి నిన్ను నేను అనుమతించలేను. శత్రువులు చాలా మంది ఉన్నారు. మనం కొద్ది మంది ఉన్నాం. యుద్ధ పర్యవ సానం ఎలా ఉంటుందో చెప్పలేము. అందుకు నువ్వు ఒంటెల దగ్గరే ఉండు. దురదృష్టవశాత్తు ఒక వేళ మేము ఓడిపోతే, నువు వెంటనే ఒంటె మీదెక్కి మదీనా వెళ్ళిపో" అన్నాడు హారిసా.

"మదీనా ఎందుకు?" అడిగింది జమీలా.

అక్కడ ముహమ్మద్ (సఅసం) గారని ఓ దైవప్రవక్త ఉన్నారు. ఆయన దగ్గరికెళ్ళి ఆయన బోధించే కొత్త మతాన్ని స్వీకరించు. ఆయన శత్రువుల బారినుండి నిన్ను రక్షిస్తారు" అన్నాడు హారిసా, జమీలాకు నచ్చజెప్పుతూ.

"ఆ మహానుభావుణ్ణి గురించి నేను చాలా విషయాలు విన్నా. ఖహ్తాన్ తెగతో కొంతమంది మక్కా ఖురైషీయులతో కలిసి ఆయన మీద యుద్ధం చేయడానికి మదీన వెళ్ళారట. కాని చిత్తుగా ఓడిపోయి వచ్చారు పిరికి పందలు!" అన్నది జమీలా.

"మేము కష్టాల్లో చిక్కుకున్నప్పుడు ముహమ్మద్ (సఅసం) కొలిచే దేవుడే నమ్మూ మమ్మల్ని కాపాడింది. సరేనమ్మా! మేము వెళ్తాం. నువ్విక్కడే ఒంటెల దగ్గర జాగ్రత్తగా ఉండు" అంటూ హారిసా ఖడ్గం తీసుకుని బయలు దేరాడు.

హారిసా వెనకాలే అతని అనుచరులు కత్తులు, కటారులు తీసుకొని ప్రతికారేచ్ఛతో యుద్ధానికి బయలుదేరారు.

జమీలా ఒంటెల దగ్గర ఒంటరిగా నిలబడింది హారిసా, అతని అనుచరులు వెళ్తున్న వైపు చూస్తూ.

హారిసా, అతని అనుచరులు కొంచెం దూరం వెళ్ళి దారి పక్కన ఓ మరుగు ప్రదేశంలో మాటువేసి కూర్చున్నారు. ఆ దారినే ఖహ్తాన్ తెగ ఒంటెల బిడారం వచ్చేస్తోంది.

నిండు యవ్వనంతో మిసమిసలాడుతున్న చలువరేడు జిలుగు వెలుగులు విరజిమ్ముతూ పడమటి తిన్నెల వైపుకు పరుగులు పెడుతున్నాడు. మంద గమనంతో మలయమారుతం మందహాసం చేస్తోంది.

ఖహ్తాన్ తెగ ఒంటెలు ఒకదాని వెనుక మరొకటి వరుసగా నడుస్తూ వస్తున్నాయి. కొందరు ఒంటెల మీద కూర్చున్నారు. మరికొందరు ఒంటె ముకు తాళ్ళు పట్టుకుని కూనిరాగాలు తీస్తూ ముందు నడుస్తున్నారు.

వారు ఇసుక కొండ పక్కగా నడుస్తూ కాస్సేపటికీ హారిసా అనుచరులు పొంచి కూర్చున్న చోటికి వచ్చారు. అంతే.

హఠాత్తుగా హారిసా, అతని అనుచరులు మరుగునుంచి మెరుపు తీగల్లా చర్రున బయటికి వచ్చారు.

"ఖహ్తాన్ పిరికిపందలారా! ఆగండి, బకర్ తెగ యోధుల్ని ఎదుర్కోడానికి సిద్ధంకండి" అంటూ హారిసా సింహగర్జన చేశాడు దిక్కులు పిక్కటిల్లేలా.

ఈ పలుకులు వినగానే ఖహ్తాన్ తెగ వాళ్ళు ఒక్కసారిగా భయపడి పోయాను. వారు వెంటనే ఒంటెలను ఆపి అయోమయంగా చూడసాగారు.

హారిసా వెంటనే ఖడ్గం పైకెత్తి ఒంటెమీద కూర్చున్న ఓ శత్రువు మెడ మీద కూర్చున్న ఓ శత్రువు మెడమీద బలంగా ఒక్క వేటు వేశాడు. తృటిలో అతని తల శరీరం నుంచి వేరయి దూరంగా వెళ్ళిపడింది.

ఆ వెను వెంటనే శత్రువర్గం కొంచెం సంబాళించుకుని సామూహిక దాడి ప్రారంభించింది. దానికి ముందే దాడికి సిద్ధమయివున్న హారిసా అను

చరులు శరవేగంతో శత్రువుల మీద విజృంభించారు. తీవ్రమైన ప్రతీకార వాంఛతో హోరాహోరిగా పోరాడుతున్నారు.

హారిసా సంగతి చెప్పనవసరం లేదు. అతను ఆకలిగొన్న బెబ్బులిలా ద్విగుణీకృత ఉత్సాహంతో శత్రువర్గం మీద విరుచుకుపడి ఊచకోత కోయడం ప్రారంభించాడు.

ఖహ్తాన్ తెగవాళ్ళు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ఈ హఠాత్పరిణామం నుంచి ఆలస్యంగా తేరుకొని యుద్ధం ప్రారంభించడం వల్ల ప్రత్యర్థి వర్గం ధాటికి నిలువలేకపోతున్నారు. వారు ఒక్కొక్కరుగా వ్రేళ్ళు తెగిన చెట్టు మొండేల్లా పడిపోతున్నారు.

కాస్సేపటిలో ఆ తెగలోని పురుషులంతా నేలకొరికి శవాలుగా మారి పోయారు. నేలంతా రక్తసిక్తమయింది. యుద్ధం ముగిసింది. హారిసా అను చరులు శత్రువర్గం స్త్రీలను ఒంటెల మీద నుంచి క్రిందికి దించారు. వారు ఏడ్పులు పెడబొబ్బలు పెట్టసాగారు.

శత్రువర్గంలో ఖైదీలుగా తీసుకుపోబడిన సల్మా, రుఖియాలు కూడా ఉన్నారు. సల్మా, హారిసాను చూడగానే అన్నా! అంటూ పరుగెత్తుకొచ్చి అతడ్ని చుట్టుకుంది.

"విచారించకు సల్మా! ఇక మనం కష్టాలనుంచి గట్టెక్కినట్లే. శత్రు పీడ విరగడయిపోయింది" అన్నాడు హారిసా ఆమె తల నిమురుతూ.

"అన్నా! నా జమీలా ఏది? నా ముద్దుల కూతురు ఎక్కడుంది?" అన్నది సల్మా ఆందోళనగా నలు వైపులా పరికించి చూస్తూ.

"కంగారు పడకమ్మా! జమీలా క్షేమంగా ఉంది. ఇక్కడే, ఈ కొండ పక్కన మన ఒంటెల దగ్గర ఉంది" అన్నాడు హారిసా ఆమెకు ధైర్యం చెబుతూ.

దాంతో సల్మా మనస్సు కుదుట పడింది. జమీలా క్షేమంగా ఉందని తెలియగానే రుఖియా ముఖం కూడా సంతోషంతో కలువపువ్వులా విప్పారింది.

"ఇక పదండి. స్త్రీలందరినీ ఒంటెలమీద ఎక్కించి నడవండి" అన్నాడు హారిసా.

వెంటనే హారిసా అనుచరులు స్త్రీలందరినీ ఒంటెలమీద ఎక్కించారు. ఆ తరువాత అందరూ కొండ ఆవల వైపు నడిచి, ఒంటెల వద్ద తమ కోసం ఎదురు చూస్తున్న జమీలా దగ్గరికి చేరుకున్నారు.

జమీలా, సల్మాను చూడగానే అమ్మా! అంటూ ఒక్క ఉదుటన వచ్చి ఆమె ఒడిలో వాలిపోయింది.

ఆ తరువాత అందరూ తమ తమ సన్నిహితులను కలుసుకొని ఆనంద భరితులయ్యారు.

ఓ సుదీర్ఘకాలం ఎడబాటుకు లోనయినా వారంతా తిరిగి కలుసుకో గలిగారు. అన్నా-చెల్లెళ్ళు, ఆలుమగలు, తల్లీ-కొడుకులు, తండ్రీ కూతుళ్ళు ఎట్టకేలకు పరస్పరం కలుసుకొని సంతోషంతో పొంగిపోయారు.

ఆ రాత్రి అందరూ ప్రశాంతంగా నిద్రపోయారు.

మరునాడు సూర్యోదయానికి ముందుగానే మేల్కొన్నారు. కాల కృత్యాలు తీర్చుకున్నారు. సామానంతా మూటలు కట్టి ఒంటెల మీద రెండు వైపులా వ్రేలాడ దీశారు.

హారిసా ఆజ్ఞ ప్రకారం స్త్రీలందర్నీ ఒంటెలమీద ఎక్కించారు. ప్రయాణం మళ్ళీ ప్రారంభమయింది. పురుషులు కాలినడకన బయలుదేరారు.

బాలభాస్కరుడు పుడమితల్లి కడుపు చీల్చుకు వస్తున్నాడా అన్నట్లు, ఆకాశంలో అక్కడక్కడ కొనఊపిరితో మినుకు మినుకు మంటున్న నక్షత్రాలు కూడా పిక్కబలం కొద్దీ పారిపోతున్నాయి.

సూర్య కిరణ ప్రభావానికి శీతకరుడు రంగువెలసి బోసిపోయి సిగ్గుతో ఓ స్వేత మేఘం చాటుకుపోయాడు.

మసక చీకట్లు మటుమాయ మయిపోతుంటే, ఉషోదయ కాంతులు క్షణక్షణానికి ఉధృతమయి పోతున్నాయి. పాలివెల్లిలాంటి ఇసుక మైదానంలో ఎడారి ఓడలు నిదానంగా ముందుకు సాగుతున్నాయి.

హారిసా, అతని అనుచరులు చీకటి నుంచి వెలుగు వైపునకు ప్రయాణం సాగించారు. అనేక సంవత్సరాలు అజ్ఞానాంధకారంలో కొట్టు మిట్టాడి అష్టకష్టాలుపడి, అనుభవం ద్వారా పొందిన వాస్తవిక దృక్పథంతో అసత్యాన్ని పారద్రోలి సత్యం దిశగా పయనిస్తున్నారు.

వారు నిజంగా ఇప్పుడు జ్ఞాన జ్యోతి వైపుకు నడుస్తున్నారు. మదీనా నగరంలో వెలిసన విశ్వజ్యోతి వైపుకు తరలిపోతున్నారు. మదిలో మొలచిన ఆధ్యాత్మిక చైతన్యం వారిని మదీనా మహనీయుని వైపుకు తీసికెళ్తోంది.

అదిగో మదీనా! అల్లదిగో మదినా!! అదే మానవాళికి మహోజ్వల సందశమిస్తున్న మదీనా!!!

మదిలో మమతలు నింపే మదీనా వచ్చింది!

ముహమ్మద్ (స) పాద ధూళితో పావనమైన మదీనా వచ్చేసింది!!

మబ్బు తెరలనుంచి మెల్లగా బయటకాస్తున్న పున్నమి చంద్రుడిలా, ఖర్జూరపు తోటల చాటునుంచి మదీనా తొంగి తొంగి చూడసాగింది.

దాంతో ఒంటెలు హుషారుగా నడవడం మొదలెట్టాయి. హారిసా, అతని అనుచరులు అంతకంటే హుషారుగా మదీనా వైపు చూస్తూ సంతోషంతో పొంగిపోసాగారు. ఆ తరువాత కాస్సేపటికి వారు మదీనా పట్టణంలో ప్రవేశించారు. మండిపోతున్న ఇసుకగుట్టలలో నుంచి ఒక్కసారిగా స్వర్గవనంలో అడుగు పెట్టినట్లు అనుభూతికలిగింది. అనేక సంవత్సరాలపాటు జన సంచారం లేని ఎడారిమైదానాల్లో తిరిగిన హారిసా అనుచరులకు పట్టణ వాతావరణం వింతగా కన్పించింది.

హారిసా మదీనాని గతంలో ఓసారి చూసి ఉన్నాడు. కాని ఆనాటి వాతావరణం వేరు. ఈనాటి వాతావరణం వేరు. పట్టణం ఇప్పుడు హారిసాకు కొత్త కళాకాంతులు వెదజల్లుతున్నట్లు అన్పించింది. ప్రజలకట్టుబాట్లు, ఆచార వ్యవహారాల్లో ఏదో కొత్తదనం కన్పించసాగింది.

విడిది చేసే విషయంలో హారిసా, అతని అనుచరులు వీధిన పోయే కొందరిని సంప్రదించి నేరుగా 'ప్రవక్త మస్జిద్' వైపుకు దారితీశారు. మస్జిద్‌కి, సమీపంలో ఉండే ఓ ఖాళీ స్థలంలో ఆగి, ఒంటెలపై నుంచి సామగ్రిని దించి వేశారు. చకచకా గుంజలుపాతి గుడారాలువేసుకున్నారు.

ఇప్పుడు వారికి బయటెక్కడెక్కడో తిరిగితిరిగి వేసారిపోయి సొంతింటికి చేరుకున్నట్లు ఎంతో మనోస్థిమితం కలిగింది. ఆ తరువాత హారిసా ఇస్లాం గురించి, ముస్లింలను గురించి మంచి చెడ్డలను తెలుసుకోవడానికి బయలు దేరాడు.

అతను కొందరు ముస్లింలను కలుసుకొని ఇస్లాంను గురించి విచారించాడు; కొందరు బహుదైవారాధకుల్ని కలుసుకొని ముస్లింల గుణగణాలను గురించి అడిగితెలుసుకున్నాడు. ఈ విచారణలో అతనికి ఎన్నో కొత్త విషయాలు తెలిశాయి.

మొత్తంమీద ఇస్లాంకు మించిన గొప్ప ధర్మంలేదని, ముస్లింల కంటే శ్రేష్ఠులయిన ప్రజలులేరని హారిసా అర్థం చేసుకున్నాడు. వెంటనే అతను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహివసల్లం) సన్నిధికి వెళ్ళి ఇస్లాం స్వీకరించాడు.

అతనితోపాటు అతని అనుచరులు కూడా ఇస్లాం స్వీకరించారు. వారి అధీనంలో ఉన్న యుద్ధఖైదీలు కూడా ఇస్లాం స్వీకరించారు. ఇస్లాం స్వీకరణతో పాటు ఖైదీలకు స్వేచ్ఛ కూడా లభించింది.

అది చూసి దైవప్రవక్త అనుయాయులు సంతోషాతిశయంతో 'అల్లాహు అక్బర్' అంటూ నినదించారు. సర్వత్రా హర్షం వ్యక్తమయింది. దైవప్రవక్త (సఅసం) దివ్యమోము కలువ పువ్వులా విప్పారింది.

హారిసా, అతని అనుచరులు దుర్భర కష్టాల నుంచి తమను ఏ దైవం గట్టెంకించాడో ఆ దైవం పంపిన ధర్మాన్ని స్వీకరించిన పరమానంద భరితులయిపోయారు. ఆ తరువాత హారిసా తన అనుచరుల బాధామయ గాధను వినిపించాడు.

ముఖ్యంగా జమీలా విషాద వృత్తాంతాన్ని తమమీద ఖహ్తాన్ తెగ జరిపిన పాశవికదాడిని, ఎడారి ఎండల్లో మాడి ఆకలితో అలమటించిన సంఘటనల్ని, మృత్యులోయ చిక్కుని అష్టకష్టాలు పడిన వైనాన్ని గురించి అతను పూసగుచ్చినట్లు చెప్పాడు. వారి దీనగాథ విని ముస్లింలు ఎంతో విచారం వెలిబుచ్చారు. వారిమీద అమితమైన సానుభూతి వ్యక్తపరిచారు.

మదీనాలో ఇస్లాం రోజురోజుకు బలంపుంజుకోసాగింది. మదీనా చుట్టుపక్కలనుంచి అనేక మంది వచ్చి నూతన ధర్మాన్ని స్వీకరిస్తున్నారు. మహాప్రవక్త (సఅసం) మధురవాక్కులు విని ముస్లింలు ఉత్తేజితులవుతున్నారు. ఒక రోజు ఆయన ఉపన్యాసమిస్తూ, హజ్ కోసం మక్కాబయలుదేరడానికి సిద్ధంకండని ఆదేశించారు.

వెంటనే ముస్లింలు ఎంతో ఆనందోత్సాహాలతో ప్రయాణసన్నాహాలు ఆరంభించారు. హారిసా కూడా హజ్ సన్నాహాలు ప్రారంభించాడు. అతని వెంట జమీలా, సల్మాలు కూడా మక్కా బయలు దేరడానికి సిద్ధమయ్యారు.

హిజ్రీ ఏడు జీఖాదా నెలలో దైవప్రవక్త (సఅసం) హజ్ చేయడానికి మదీనా నుంచి బయలుదేరారు. ఆయన వెంట దాదాపు బయలుదేరారు. ఆయన వెంట దాదాపు రెండువేల మంది ముస్లింలు ఉన్నారు. వారిలో స్త్రీలు, పిల్లలు కూడా ఉన్నారు. సల్మా, జమీలా, రుఖియాలు కూడా ఉన్నారు.

ముస్లింలు అమితమైన ఉత్సాహంతో, ఎంతో ఠీవీతో హజ్ కోసం బయలుదేరారు. వారివెంట ఖుర్బానీ ఒంటెలు కూడా ఉన్నాయి. పురుషు లంతా ఆయుధాలు ధరించి ఉన్నారు.

రెండు మైళ్ళ పొడుగుతో ముందుకు సాగిపోతున్న ఈ అపూర్వ యాత్రా బృందాన్ని చూసి దారిలో బహుదైవారాధకులు ఆశ్చర్య చకితులయి చూడ సాగారు.

ముస్లింల ఠీవి, దర్పం చూసివారిలో కొందరికి గుబులుపుట్టింది. త్వర లోనే ఈ 'తుఫాను' యావత్తు అరేబియాను ముంచెత్తుతుందని వారు కలవర పడ్డారు. మరికొందరు ముస్లింల విజయాలు, అధికారదర్పం చూసివారికి ఆతిధ్యమివ్వడానికి కూడా ముందుకు వచ్చారు.

యాత్రాబృందం సుదీర్ఘ ప్రయాణం చేసి మక్కాపట్టణానికి సమీపం లోని జుహ్ఫాన్ ప్రాంతానికి చేరుకొని విడిది చేసింది. అప్పుడు మక్కా నుంచి బహుదైవారాధకుల ప్రతినిధిగా ముకరజ్ దైవప్రవక్త (స)ను కలుసుకోవడానికి వచ్చాడు.

అతను ముస్లింలు సాయుధలయి రావడం చూసి ఒకింత ఆందోళన చెందాడు. అయితే ఆందోళనను పైకి వ్యక్తం చేయకుండా "మీరు హజ్ చేసే ఉద్దేశ్యంతో వచ్చారుకదా మరి ఆయుధాలు ఎందుకు?" అని అడిగాడు. "ఎందుకంటే మీరు ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారేమోనని మా అనుమానం" అన్నారు దైవప్రవక్త (స) "మమ్మల్ని నమ్మండి. మేము ఒప్పందాన్ని ఉల్లం ఘించము."

"అయితే మీరు నిశ్చింతగా ఉండండి. ఈ ఆయుధాలు మీకెలాంటి నష్టాన్ని కలిగించవు. మేము రక్తపాతాన్ని ఎన్నటికీ కోరము. కాని అనివార్య పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసం ఆయుధాలు పట్టవలసి వస్తుంది. కనుక భయ పడనవసరంలేదని మీరు బహు దైవారాధకులతో చెప్పెయ్యండి. మేము ముస్లింలము. ముస్లింలు ఎన్నటికీ ఒప్పందాలను ఉల్లంఘించలేరు" అంటూ దైవప్రవక్త (సఅసం) అతనికి అభయమిచ్చారు.

ఈ మాటలు విని ముకరజ్ మక్కా తిరిగి వెళ్ళిపోయాడు. ఆ తరువాత దైవప్రవక్త (సఅసం) హజ్ దీక్ష (ఇహ్రాం) బూని మక్కా బయలుదేరవలసిందిగా తన అనుచరులను ఆజ్ఞాపించారు. దాంతో ముస్లిములందరూ దీక్షబూని ఒంటెలు గుర్రాలమీద అక్కడ్నుంచి బయలుదేరారు.

యాత్రాబృందం మక్కా పట్టణంలో ప్రవేశించింది. ఎంతో అట్టహాసంతో పట్టణ వీధులగుండా నడుస్తున్న ఆ యాత్రాబృందాన్ని చూసి బహుదైవారాధ కులు అదిరిపోయారు. అనేకమంది స్త్రీలు, పురుషులు, పిల్లలు ఇళ్ళ వాకిట్లలో నిలబడి, మిద్దెలపైకెక్కి బిత్తరచూపులతో చూడసాగారు.

ముస్లింలు కాబాగృహానికి చేరుకున్నారు. అక్కడ ప్రవక్త ఆదేశంతో అందరూ ఒకే విధమైన కుట్టులేని ప్రత్యేక అంగవస్త్రాలను మెడమీదనుంచి చంకల మీదికి లాగికట్టుకున్నారు. తరువాత ఎంతో ఉత్సాహంతో, అమితమైన భక్తిశ్రద్ధలతో కాబా ప్రదక్షిణ చేశారు.

ప్రదక్షిణ తరువాత హజ్రత్ బిలాల్ (రజి) అజాన్ ఇచ్చారు. దిక్కులు పెక్కుటిల్లే ఈ అజాన్ పలుకులు విని బహుదైవారాధకుల గుండెల్లో గుర్రాలు పరుగెత్తాయి. తరువాత దైవప్రవక్త (సఅసం) నాయకత్వంలో ముస్లింలు నమాజ్ చేశారు.

ఈ విధంగా ముస్లింలు హజ్ ఆచారాలన్నిటిని పాటించి ఒప్పందం ప్రకారం వెంటనే ముస్లింలు మక్కా నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ముస్లింలు మక్కా నుంచి వెళ్ళిపోగానే బహుదైవారాధకులు చల్లగా ఊపిరి పీల్చుకున్నారు.

యాత్రాబృందం మదీనాకు తిరిగొచ్చింది. హారిసా, అతని అనుచరులు కూడా మదీనా తిరిగొచ్చి తమ దైనందిన జీవితం గడపసాగారు.

మదీనాలో ఒకవైపు కపటులు, మరొక వైపు యూదులు రకరకాల కుట్రలతో ముస్లింలను చికాగు కలిగిస్తున్నప్పటికీ ముస్లింలలో ఒక విధమైన సంతృప్తి, పరస్పర సోదరభావం చెక్కుచెదరకుండా ఉన్నాయి. అందుకే హారిసాకు అతని అనుచరులకు గత జీవితంకన్నా ప్రస్తుత జీవితమే ఎంతో మనశ్శాంతినిస్తోంది.

జమీలా, ఆమె స్నేహితురాలు రుఖియా నవయౌవ్వనంతో మిసమిస లాడుతున్నారు. యౌవ్వనం వారి అందచందాలను ద్విగుణీకృతం చేసింది. ఈకారణంగా అనేకమంది యువకులు వారిని వివాహమాడేందుకు పోటీపడి ముందుకు రాసాగారు.

అయితే హారిసా తొందరపడి ఎవరికీ మాటివ్వలేదు. జమీలా పెళ్ళి విషయంలో సల్మా అభిమతానికి వ్యతిరేకంగా అతను ఏ పనీ చేయడానికి ఇష్టపడడు. సల్మా కూడా వారిద్దరి పెళ్ళికోసం తొందరపడలేదు.

ఈలోగా మదినాలో పిడుగు లాంటి వార్తవినవచ్చింది.

మక్కాలో ఖురైషీయుల మిత్రపక్షమైన బనూబకర్ తెగ ముస్లింల మిత్రపక్షమైన బనీఖజాఆ తెగపై దాడిచేసి అనేకమందిని ఊచకోత కోసింది.

ఈ రెండు తెగలమధ్య అనేక సంవత్సరాలనుంచి శత్రుత్వం ఉంది. ముస్లింలతో స్నేహ ఒప్పందం చేసుకున్న బనుబకర్ తెగ సంఖ్యాపరంగా ఒనరుల పరంగా కొంచెం బలహీనమయినది. అదీగాక ముస్లింలు ఎక్కడో వందల మైళ్ళ దూరంలోని మదీనాలో ఉంటున్నారు. ఈ కారణంగా బనుబకర్ తెగ శాంతి ఒప్పందాన్ని బాహటంగా ఉల్లంఘించి బనీబజాఆపై దాడి చేసింది.

దౌర్జన్యకారులు బనీఖుజాఅ తెగ నాయకుని ఇంటిపై కూడా దాడి చేసి ఇంట్లోని విలువైన సామగ్రిని లూటీ చేశారు. అప్పుడతను అప్రయత్నంగా "మానవోత్తమా! దైవప్రవక్త! మమ్మల్ని రక్షించండి. మేము మీతో స్నేహ ఒప్పందం చేసుకున్నామన్నా పగతో బనూబకర్ తెగ మామీద విరుచుకు పడింది. మమ్మల్ని ఆదుకోండి" అని అరిచాడు బిగ్గరగా.

అది మదీనాలో ఉన్న దైవప్రవక్త (స)కు వినపడింది. వెంటనే ఆయన లబ్బైక్ (వచ్చేస్తున్నాం) అన్నారు. ఆ తరువాత ఆయన యుద్ధానికి మక్కా

బయలుదేరవలసిందిగా ముస్లింలను ఆదేశించారు. ఈ వార్త అందరికీ తెలిసిపోయింది.

ముస్లింలు యుద్ధ సన్నాహాలు ప్రారంభించారు. రమజాన్ 11వ తేదీన పదివేల మంది యోధులతో కూడిన సేనావాహిని అమితోత్సాహంతో నురుగులు కక్కుతూ మదీనా నుంచి బయలుదేరింది. హారిసా, అతని అనుచరులు కూడా యుద్ధానికి బయలుదేరారు.

ముస్లింలు మక్కా సమీపంలోని జహ్రాన్ ప్రాంతానికి చేరుకుని విడిది చేశారు. ఖురైష్ నాయకుడు అబూసుఫ్యాన్ ముస్లింల సమరోత్సాహం వారి దర్పం, పటాటోపం చూసి ఖంగుతిన్నాడు. ఇక మక్కావాసులకు వినాశం తప్పదని భయపడిపోయాడు.

చివరికి దేవుడు అతనికి 'విశ్వాస' సద్బుద్ధి ప్రసాదించాడు. అతను మన స్ఫూర్తిగా ఇస్లాం స్వీకరించి మక్కా వెళ్ళిపోయాడు. మక్కా ఖురైష్ నాయకులకు ముస్లింల సైనికశక్తిని తెలియజేసి జరగనున్న వినాశాన్ని గురించి హెచ్చరించాడు. కాని ఖురైష్ నాయకులు అతని మాటలు వినకుండా ముస్లింలను ఎదుర్కోవడానికే సిద్ధమయ్యారు. ప్రతీకారంతో కుతకుతలాడుతూ వారు ఆరువేల సైనికులతో మక్కా నుండి బయలుదేరారు.

అటు జహ్రాన్ నుంచి ముస్లిం సైన్యాలు కూడా మక్కా వైపుకు బయలుదేరాయి. హజ్రత్‌ఖాలిద్ (రజి) అయిదు వందల సైనికుల దళంతో యుద్ధ పతాకాన్ని తీసుకొని అందరికీ ముందు ముందుగా నడుస్తున్నారు. ఆయన వెనుక హజ్రత్ ఉమర్ (రజి) హజ్రత్ ఉమర్ వెనుక హజ్రత్ అలి (రజి) అయిదేసి వందల సైనిక దళాలతో నడుస్తున్నారు.

మార్గమధ్యలో ఈ రెండు సైన్యాలు ఢీకొన్నాయి. మరుక్షణంలో యుద్ధ జ్వాలలు ప్రజ్వలిల్లాయి. ఇరుపక్షాల సైనికులు హోరహోరిగా పోరాడసాగారు. అయితే కాస్సేపటికే ఖురైష్ సైన్యాలు ముస్లింల ధాటికి తాళలేక పలాయనం చిత్తగించాయి.

ముస్లింలు విజయోత్సాహంతో మక్కాలో ప్రవేశించారు. కాబా గృహంలో ఉన్న విగ్రహాలన్నిటిని తొలగించి నమాజుచేశారు. బహు దైవారాధకులు ఆయుధాలు విసర్జించి రిక్తహస్తాలతో ముస్లింలకు లొంగిపోయారు.

వారంతా తమకిక ఏం గతిపట్టనున్నదోనని భయపడిపోతూ తలలు వంచి నిల్చున్నారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అవిశ్వాసులను సంబోధిస్తూ వారు తనమీద ముస్లింల మీద జరిపిన దురాగతాలను గుర్తుచేశారు. ఆ తరువాత "మీపట్ల నేనిప్పుడు ఎలా వ్యవహరిస్తానో ఊహించారా?" అని ప్రశ్నించారు.

ఇది విని అవిశ్వాసులు మరింత ఆందోళనచెందారు. ఇక తమకు చావు తప్పదని భావించారు. తమ ముందు మృత్యుదూత తాండవిస్తున్నట్లు వణికి పోసాగారు.

అయితే వారిలో కొందరు పెద్దలు ధైర్యంచేసి "మహా ప్రభో! తమరు మొత్తం ఖురైష్ జాతిలో ఎంతో గౌరవనీయమైన బనూహాషిం తెగకు చెందిన వారు. ఆ తెగలో తమరు అందరికన్నా ఎక్కువ గౌరవనీయులు, ఎంతో ఉదార స్వభావులు, జాలిగుండెకలవారు కనుక తమరి నుండి మేము మంచినే ఆశిస్తున్నాం" అని అన్నారు.

దానికి దైవప్రవక్త (సఅసం) చిరునవ్వుతో "వినండి, యూసుఫ్ అలైహిస్సలాం తన సోదరుల పట్ల ఎలా వ్యవహరించాలో ఈ రోజు నేను కూడా మీపట్ల అలాగే వ్యవహరిస్తున్నాను. మీ అందరికీ స్వేచ్ఛనిస్తున్నాం వెళ్ళండి" అన్నారు.

ఈ మాటలు వినగానే అవిశ్వాసులకు పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లు అన్పించింది. వారు ఎంతో సంతోషించారు. దైవప్రవక్త (సఅసం) పట్ల వారి హృదయాల్లో ఎనలేని గౌరవభావం ఏర్పడింది. వారు ఆయనకు కృతజ్ఞతలు చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

మక్కాపట్టణం ఇప్పుడు ముస్లింల అధీనంలోకి వచ్చింది. వీరిలో పూర్వం మక్కావాసులయిన ముహాజిర్ ముస్లింలు కూడా ఉన్నారు. వారు దైవప్రవక్త (స) అనుమతితో తమ పాత ఇండ్లకు వెళ్ళిపోయారు చూసుకోవ

డానికి. మిగిలిఇన వాళ్ళు దైవప్రవక్తతో సహా శిబిరాలువేసుకొని అందులోనే విడిది చేశారు. హారిసా, అతని అనుచరులు కూడా శిబిరాల్లోనే బస చేశారు.

కొన్నాళ్ళ తరువాత హారిసా మదీనా నుంచి సల్మా, జమీలా, రుఖియా లను కూడా మక్కాకు పిలిపించుకున్నాడు.

సల్మా మదీనా నుంచి మక్కా రాగానే ముందుగా ఆమెకు భర్త ఇల్లు గుర్తొచ్చింది. వెంటనే ఆమె ఆ ఇంటికి వెళ్ళింది. ఇంటి వాతావరణం కొత్త కొత్తగా కప్పించింది. కాస్తంత కళావిహీనంగా కూడా ఉంది.

లోపల ఆమెకు దూరపు బంధువుల ముఖాలు మాత్రమే కన్పించాయి. విచారిస్తే భర్త ఎప్పుడో చనిపోయాడని తెలిసింది. సల్మాకు భర్త పట్ల మాత్రం ప్రేమలేకపోయినా అతని మరణ వార్త విని కొంచెం నొచ్చుకుంది.

జమీలాకు కూడా చిన్ననాటి విషయాలు జ్ఞాపకం వచ్చాయి. ముఖ్యంగా తనను పెళ్ళి కూతురిలా అలంకరించి మేళతాళాలతో ఊరి బయట ఇసుకగుట్టల మధ్యకు తీసికెళ్ళడం, అక్కడ అనేక మంది బాలికలతో పాటు తనను కూడా సజీవంగా పూడ్చిపెట్టడం మొదలైన సంఘటనలు ఆమె హృదయంలో చెరగని మచ్చల్లా ఏర్పడ్డాయి.

అయితే అలాంటి ఘోరమైన అన్యాయాన్ని, దురాచారాలను పూర్తిగా రూపుమాపిన ఇస్లాం ధర్మాన్ని స్వీకరించి అది నిర్మించిన నవసమాజంలో చేరి నందున జమీలా సమస్యకు ఎంతో ఊరటకలిగింది.

కొంతకాలానికి హారిసా ఆమెకు వివాహం చేశాడు. ఆ తరువాత రుఖియా పెళ్ళి కూడా జరిగిపోయింది. నూతన విశ్వాసం, నూతన భాగస్వాము లతో వారి జీవితాల్లో నవ వసంతం వెల్లివిరిసింది. ఎండలకు మాడి ఎండి పోయిన ఒయాసిస్సు పచ్చటి వృక్షాలతో, చల్లటి వీచికలతో యువ హృదయా లను గిలిగింతలు పెట్టసాగింది.

- సమాప్తం -